శ్రీ ర స్తు.

కవిరాజమనోరంజనము

కనుపర్తి అబ్బయామాత్యకవికృతము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1929.

ఆంధ్రగ్రంథములు.

		ప్రతి 1-కి రూ.	అ.
వాసిష్ఠరామాయణము, ద్విపద, తరిగొండ వెంకమ్మది	...	1	4
విక్రమార్కచరిత్ర, జక్కనకవిప్రణీతము	...	1	4
డిటో, కాలికోబైండు	...	1	10
విజయవిలాసము, చేమకూర వేంకటకవికృతము	...	0	8
డిటో కాలికోబైండు	...	0	12
విదురనీతి, సటీక, ఆంధ్రభారతములోనిది	...	0	5
విరాటపర్వము, పద్యకావ్యము, ప్రథమాశ్వాసము	...	0	8
డిటో ,, ద్వితీయాశ్వాసము	...	0	8
డిటో ,, తృతీయాశ్వాసము	...	0	12
వీరభద్రవిజయము, బమ్మెర పోతరాజకృతము	...	0	12
వేంకటాచలమాహాత్మ్యము, తరిగొండ వెంకమ్మది	...	1	0
డిటో కాలికోబైండు	...	1	6
వేమనపద్యములు, చక్కనికూర్పు	...	0	6
డిటో 2728 పద్యములు, కాలికోబైండు	...	1	12
వేమనపద్యములు, 2728 పద్యములు, తాత్పర్యసహితము, ఇందు గ్రంథవిమర్శ, కవిజీవితము మొదలగునవి చేర్పఁబడినవి, చక్కనిక్రొత్తకూర్పు		3	8
వైశ్యపురాణము	...	1	4
శతకంఠరామాయణము, క్రొత్తకూర్పు	...	0	10
శకుంతలాపరిణయము, కృష్ణకవికృతము	...	0	12
శశిరేఖాపరిణయము, అప్పప్పకవికృతము	...	0	12
డిటో కాలికోబైండు	...	1	2
శివలీలావిలాసము, కూచిమంచి తిమ్మకవిప్రణీతము	...	0	6
శృంగారనైషధము, శ్రీనాథకవిది, క్రొత్తకూర్పు	...	1	0
,, కాలికోబైండు	...	1	6

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

శ్రీరస్తు.

కవిరాజమనోరంజనము

కనుపర్తి అబ్బయామాత్యకవికృతము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచేఁ బ్రకటితము.

1929.

Printed by
V. Ramaswamy Sastrulu & Sons,
at the Sri Rama Press,
Madras—1929.

విషయసూచిక.

పీఠిక.

కనుపర్తి అబ్బయామాత్యుఁడు రచించిన గ్రంథములలో రెండే మనకు లభించినవి. ఒకటి అనిరుద్ధచరిత్రము, రెండవది పురూరవశ్చరిత్రమను కవిరాజమనోరంజనము. వీరేశలింగముపంతులువారు కవుల చరిత్రములోఁ గవిరాజమనోరంజనము నిట్లు ప్రశంసించిరి. "వసుచరిత్రమునకుఁ దరువాతఁ గవిరాజమనోరంజనముతోఁ దులతూఁగఁదగిన ప్రబంధము లొకటి రెండుకంటె నెక్కువగా లేవు...బాల్యమునందు రచింపఁబడినదగుటచే అనిరుద్ధచరిత్రము పురూరవశ్చరిత్రమంత ప్రౌఢముగా లేదు. కవి సాహిత్యమునందుమాత్రమే గాక సంగీతమునందును బ్రవీణుఁడైనట్లు కనఁబడుచున్నాఁడు."

వీరేశలింగముపంతులువారీగ్రంథమును మిగులఁ బ్రశంసించుట గ్రంథప్రశస్తికి దృష్టాంతము. అబ్బనామాత్యుఁడు కౌండిన్యసగోత్రుఁడు. ఆఱువేల నియోగిబ్రాహ్మణుఁడు. గుంటూరుమండలములోని కొండవీటికి రెండామడలదూరములోనున్న కనుపర్తి యీతని నివాసస్థలము. నేఁటికిని గవివంశీయు లట వసించుచున్నారు. ఈకవితండ్రి రాయనమంత్రి. తల్లి నరసమాంబ. మంగళగిరి నృసింహస్వామి యీతని యిష్టదైవము. నరకృతికొల్లక యిక్కవి తన రెండుగ్రంథములను దేవాంకితము గావించి ధన్యుఁ డయ్యెను. ఇక్కవి పూర్వులలో బసవప్రధాని "కొండవీటిపుర రాజ్యోర్వీశ్వరులు మంత్రిగాఁ జేపట్టన్" జేరొందెనఁట. అంతియగాదు "కనుపర్తి బుక్కపురి ముఖ్యబహుగ్రామ స్వాస్థ్యానుభవగ్రామణి"యట. కనుపర్తికి మిగులఁ జేరువలో బుక్కపట్టణమున్నది గాన కవి కొండవీటిసీమవాఁడనుట నిస్సంశయము. కవి పూర్వులప్రశంస కాలనిరూపణమునకుఁ దోడ్పడుట లేదు.

వసుచరిత్రమును బూర్తిగ ననుకరించినకతన అబ్బయామాత్యుఁడు వసుచరిత్ర రచనకాలమున కీవలివాఁడనుట స్పష్టము. కవివంశజులలో నిప్పటితరమున సూర్యనారాయణ యనువా రున్నారు.ఈయనవయస్సు 42 సంవత్సరములు. ఆయననుండి పురుషులను దీసికొన్నచో సుబ్బయ్య-శ్రీనివాసరాయఁడు-సుబ్బరాజు-వెంకన్న-పెద్దిరాజు-గ్రంథకర్తయగు అబ్బరాజు వంశవృక్షమువలనఁ గన్పట్టిరి.అనఁగాసూర్యనారాయణగారికిఁ బ్రకృతగ్రంథకర్త ఆఱవతరమువాఁడు. తరమునకుముప్పదియేండ్లవంతున లెక్కించినచో అబ్బయామాత్యుఁ డిప్పటికి నూటయెనుబదియేండ్లక్రిందట క్రీ. శ. 1750 ప్రాంతమున నుండె ననుట స్పష్టము ఇంతకంటె బలవత్తరములగు నాధారములు లభించువఱకు కీనిర్ణయము విశ్వసనీయమని మాతలంపు.

కవిరాజమనోరంజనము రసవత్తరమగు ప్రబంధము. కవి వర్ణనములకుఁ బాటుబడినటులఁ గథాకల్పనమునకుఁ బాటుపడలేదు. "ఆద్యసత్కథల్ వారివిపుట్టురత్నము"లన్నట్లు ఇందలికథాంశము పురాణములనుండి యథావిధముగఁ బ్రబంధములోనికి మాఱినది. ఈమార్పునకు అష్టాదశవర్ణనలు అంత్యనియమపద్యములు చిత్రకవిత మున్నగుకవితాశిల్పములు తోడ్పడినవి. అంతియగాని ప్రధానపాత్రముల నాదర్శప్రాయముగఁ జిత్రించుట,ప్రకరణోచితముగఁ గథనుసృజించుట మున్నగు నూతనవికాసము లీప్రబంధమునఁ గానరావు.మృదుమధురమగు నీకవికవిత స్వతంత్రముగనున్నంతదనుక మనోజ్ఞముగనున్నది. వసుచరిత్రము ననుకరించినతావులలోఁ గొంతకొంత పేలవము కనిపించుచున్నది. ఎట్లయిన నేమి సమకాలికగ్రంథములలో మిన్నయనుట సత్యము. ప్రధానకథాబీజముగొని కాళిదా సిందలికథనే తారుమా రొనరించి విక్రమోర్వశీయమున దనఁ గథాసంస్కారణనైపుణ్యమును బ్రకటించినాఁడు. నాటకములఁ బ్రబంధములుగ మార్చుకాలమున నున్నయిక్కావిఖుందులకు దొరకొనమి సంతాపకరము. అబ్బనామాత్యుని మనోహర

కవిత! నూతనకథాకల్పనకుఁ దోడ్పడిసిన నెంతరమణీయముగ నుండునో గదా!

అబ్బయామాత్యుఁడు పలుతావుల వసుచరిత్రము ననుకరించినాఁడు. కొన్నితావుల వ్యాకరణనియమములఁ గూలఁద్రోసినాఁడు. ఈతని స్వతంత్రరచనము మృదుమధురపదభూయిష్ఠమై తెలుఁగు నుడికారములందలి తీరుతీయముల వెదజల్లుచుండును. శృంగారనైషధములోని కొన్నిపద్యముల కనుకరణము లితనికవితలోఁ గలవు.

సీ. "నిఖిలవిద్యానటీనృత్తరంగస్థలా
యతనాయమానజిహ్వాంచలుండు."

శృంగా-ఆ-1. ప-46.

సీ. "నవకీర్తినర్తకీనాట్యరంగావధీ
కృతచక్రవాళధాత్రీధవుండు."

కవిరా-ఆ-1. ప-87.

చ. "ఇతఁడు దరిద్రుఁడౌ ననుచు నేర్పడ నర్థిలలాటపట్టికన్
శతధృతి వ్రాసినట్టిలిపిజాల మనర్థము గానియట్లుగా
వితరణఖేలనావిభవవిభ్రమనిర్జితకల్పభూరుహుం
డతఁడు దరిద్రతాగుణమునందు దరిద్రుని జేయు నాతనిన్."

శృంగా-ఆ-1. ప-57.

మ. "అయమర్థీజనయంచు యాచకలలాటాంతస్థ్సలిన్ బ్రహ్మనిర్ణయతన్ వ్రాయవహించునట్టి లిపియర్థంబుల్ విశేషాన్వయ
క్రియగా నర్థమవారిగా నొసఁగి యర్థింజేయు వాగీశువ్రాఁ
తయు నాత్మీయవితీర్ణయున్ నిజముగా ధాత్రీశు నేర్పెట్టిదో."

కవిరా-ఆ-1. ప-93.

వసుచరిత్రము ననుకరించినపద్యములనుగూడఁ జూపుట ప్రకృతము కాకపోదని ఒకపద్యమును జూపుచున్నారము.

ఉ. "కొండఁట విల్లు వేదలలకుండలిరాజఁట నారి యమ్మనం
గుండఁట బైటిపల్లియల దున్నినవాఁడఁట యొందు రెండు భ
ర్గుండిది నిండుపౌరుషమొకో యని గెల్వవె ముజ్జగంబు లు
ద్దండత నొక్కఁ తుంటవిలు దాలిచి యంటినగందుతూపులన్."

వసుచరిత్రము.

ఉ. "నారఁట తేఁటి, జోక నలినారఁట, తేరఁట చిల్క సౌరభో
ద్గారఁట, విల్లుపూతనయగారఁట చుట్టము శైత్యపుక్ సదా
చారఁట కమ్మగట్టు పరిచారఁట కోయిల కేతనీభవ
ద్వారఁట యిట్టినీకొదుగువారఁట లోకు లిదేమిచిత్రమో."

కవిరాజమనోరంజనము.

అనుకరణపద్యమున సంధిలోపములు చాలగలవు. గ్రంథవిస్తరభీతిచే నిం దుదాహరింప మానితిమి. కవిరాజమనోరంజనమున, రసవత్తరము లగుఘట్టము లెన్నేని కలవు. మొదటియాశ్వాసములోని రాజనీతులు ఆత్మవిద్యోపదేశము, ప్రత్యేకపఠనీయములు. రెండవయాశ్వాసములోని తారాశశాంకసమాగమము గ సభ్యముగ సంగ్రహరూపముగ నుండి దుర్నీతిని బరిహరించుచున్నది. వసిష్ఠస్తుతి కవికిఁగల యుభయభాషాకవితానైపుణ్యమునకుఁ దార్కాణగా నున్నది. ఇలాకన్య పురుషుఁడగుటయు రాజకుమారుఁడు స్త్రీయగుటయు వీరలు పరస్పరము మోహించుకొనుటయు నిరువురకుఁ దనయుం డుదయించుటయు శివానుగ్రహంబునఁ బూర్వరూపంబులు దాల్చుటయు మిగుల మనోహరముగ రెండవయాశ్వాసమున వర్ణింపఁబడినది. మూఁడవయాశ్వాసము నుండి ప్రధానకథ యగుపురూరవశ్చరిత్ర మారంభమైనది. ఊర్వశీ పురూరవుల సమాగమమునకుఁ గాంక్షించుట, మలయానిలాద్యుపాలంభములు చెలికత్తియల మోదార్పులు మున్నగు కథాభాగములు విశేషభావసమన్వితము లై మనోహరముగ నున్నవి. ఊర్వశీపురూరవుల కీయాశ్వాసమున వలపు మొలకలెత్తినది. సమాగమవిధము నాల్గవయాశ్వాసమునఁగలదు. మైత్రావరుణుల తపోభంగముగావింప నింద్రుపంపున

ఊర్వశి ధరణి కవతరించి శాపతప్తురా లయ్యెను. శాపఫలము భూలోకమున వసించుట. ఊర్వశికిఁ దీర్ఘము స్వార్థము గలసివచ్చినది. తరువాత నీయిరువురికలయిక(సమావేశము) సందర్భశుద్ధిగ సరసముగ రసవత్తరముగఁ గవి చిత్రించినాఁడు. ఈయుభయులప్రేమ నిష్కళంక మైనది. ఏకహృదయముగ నిరువురు వర్తించుచుండిరి. కాని యిరువురు విడిపోవుట కొకసమయము గలదు. ఊర్వశి రెండుపొట్టేళ్లఁ దెచ్చినది. వానిని మృగచోరాద్యాపదలు బొరయనీయక కాపాడుట, వివస్త్రముగఁ దనకుఁ బురూరవుఁడు కనపడకుంట జరుపువఱకు ఊర్వశి వెంట నుండును. ఈనియతికి భంగముకలుగుటయే యెడబాటు. నియమముల కంగీకరించి పురూరవుఁడు ఊర్వశిని బరిగ్రహించి ప్రతిష్ఠానపురము జేరి చిరకాలము కామసౌఖ్యము లనుభవించెను. ఒకదినము తగళ్లఁ జోరులు హరించిరి. వివస్త్రముగ నేగుచున్నపురూరవుని దర్శించుటతో నిరువురిబంధము తెగిపోయెను. ప్రతిజ్ఞాభంగము జ్ఞాపకముజేసి ఊర్వశి స్వర్గలోకమునకుఁ బోయెను. అటనుండి విప్రలంభశృంగారము మనోహరముగ నున్నది. ఈ కథాభాగముల నైదవయాశ్వాసమునఁ గాంచనగును.

ఊర్వశి నిర్గమనానంతరము పురూరవుఁడు వలపువ్రేగునఁ జింతించుచు గంధర్వులఁబ్రార్థింప ఊర్వశివలె అగ్నిస్థాలి యనుకన్యను సృజించి యొసంగుదురు. క్రమముగా నాయమ యూర్వశికాదని పురూరవుఁ డెఱింగి యేకతమునఁ జింతించుచు రెండరణులసేకరించి యొకటి యూర్వశియని మఱియొకటి పురూరవుఁడని పేర్కొని రెంటిని ద్రచ్చుచుండ విష్ణుప్రత్యక్షమై కామితములు ప్రసాదించుటతోఁ గథ యంతమగుచున్నది. కథాంశమునకుఁ గవి సంస్కరణ జరుపక గనిలోనుండితీసిన పుట్టుశిలవలెఁ గథనుంచి వర్ణనముపేర నెన్నేని భూషణము లాశిలకే కూర్చినాఁడు. మూఁడవయాశ్వాసమునుండియే యీప్రబంధమునకుఁ బ్రధానకథ యారంభమగుచున్నది. ఇందలిశృంగారము చాలవఱకు

సభ్యముగఁ బఠనయోగ్యముగ నున్నది. పదునెనిమిదవ శతాబ్దము నాఁటిప్రబంధములలోఁ గవిరాజమనోరంజనమువంటి సర్వాంగసుంద రము రసవత్తరము నగుప్రౌఢకావ్య మింకొకటి లేదను కవి చరిత్ర కారుల వాక్యమునం దెంతయు సత్యము గలదు.

ఆంధ్రభాషయందుఁ గలలక్షణగ్రంథముల నైక్యము కాన రాదు. ఒకరిసిద్ధాంతము నింకొకరు పూర్వపక్షముఁ జేసిరి. ఎవరిత్రోవ వారిది. ఈవిస్తృతలక్షణముల సమన్వయించుట యసాధ్యముగ నుం డెను. ఒక రంగీకరించినసిద్ధాంతము నింకొకలాక్షణికుఁడు పూర్వపక్షము గావించుచునుంటచే నానాఁటికవులకు నిశ్చయసిద్ధాంతములే తోఁచ కుండెను. అందుచేతనే యీతనికవితలో వ్యాకరణలోపము లుండె నని కవిరాజమనోరంజనములోని యీ క్రిందిపద్యమువలన నెఱుంగ నగును.

ఉ. "చెల్లునటంచు నొక్కకవి చేసినలక్షణ మొక్కరీవలన్
జెల్లమిఁజేసి తారొకటె చెప్పఁగ ఛాందసవిస్తరంబు సం
ధిల్లుటఁ గావ్యశంక లవనిం దఱుచయ్యె రసజ్ఞులార నా
యుల్లపుసౌధవీథిఁ గొలువున్న సరస్వతి సత్యవాణి నా
తల్లి యొసంగు పల్కులివి తప్పులు నేయక చిత్తగింపుఁడీ."

కవితాప్రౌఢి కిక్కవి యాంధ్రీస్తనముల నుపమానముగాఁ గైకొనినాఁడు. బహుశః ఇది అఱచాటగు నంధ్రవధూటిచొక్క పుంజనుఁగవను బేర్కొనువిధము గానోపు. ఆంధ్రీస్తనముల కాఠిన్య మును నన్నెచోళుఁడు రాజశేఖరుఁడు బేర్కొనిరి. అదియే కవిభావ మేని కవి శృంగారరసప్రబంధమునకుఁ గ్రొత్తవన్నెలు బచరించుటయే!

రసవత్తరమగు నీ గ్రంథరాజమునుండి దృష్టాంతముగ నీయఁ దగినపద్యములు చాలఁ గలవు. రసికులము దీగ్రంథముంచి వారి నా నందపఱచుటయే యుద్ధృతమునకంటె నుచితమగు పని. రచనాచమ

త్కారమునను గూర్పుబింకమునను అనిరుద్ధచరిత్రముకంటె నీకవిరాజ మనోరంజనము ప్రశంసాపాత్రముగ నున్నది.

చిరకాలముక్రింద చింతామణిముద్రణాలయమున నీగ్రంథము ముద్రితమైనది. అందు ముద్రణస్ఖాలిత్యములు కలవు. ప్రతులు చిక్కుటయే అసాధ్యముగ నుండెను. ఆంధ్రజనాదరపాత్రమగు నీగ్రంథరాజమునకుఁ గలప్రశస్తి గమనించి సర్వాంగసుందరముగ ముద్రించి ఆంధ్రలోకమునకు సమర్పించిన శ్రీ వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారి యత్నము ప్రశంసనీయము.

ఇట్లు, భాషాసేవకులు,

శేషాద్రి రమణకవులు,

శతావధానులు.

ఆంధ్రగ్రంథములు.

	ప్రతి 1-కి రూ.	అ.
శ్రీమదాంధ్ర భాగవతము, పోతనామాత్యప్రణీతము, ఇదివఱకు ముద్రితమైన ప్రతులకన్న అన్నివిధముల బాగుగ నున్నది	5	8
,, అత్యుత్తమప్రతి, రెండుసంపుటములు	7	8
,, 3 సంపుటములు	9	0
శ్రీమదాంధ్రభారతము - పద్యకావ్యము:—అనేక వ్రాతప్రతుల సహాయమున చిరకాలమునుండి సంపూర్ణపరిశ్రమముతోఁ బరిష్కరింపఁబడినది. మేలుకాకితములపై స్ఫుటముగ అచ్చొత్తించి మంచి కాలికోబైండు చేయబడియున్నది.		0
7 సంపుటముల ప్రతి	14	0
3 సంపుటముల ప్రతి	13	0
ఆది, సభాపర్వములుగల సంపుటము	2	0
ఆరణ్యపర్వము	2	0
విరాటోద్యోగపర్వములు	2	0
భీష్మద్రోణపర్వములు	2	0
కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు	2	0
శాంతిపర్వము	2	0
ఆనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములుగల సంపుటము	2	0
ఆదిపంచకము, ఒకటేసంపుటము	5	8
యుద్ధపంచకము, స్త్రీపర్వము	3	12
శాంతిసప్తకము	3	12
ఆదిపర్వముమాత్రము, పెద్దచ్చు	1	8

	ప్రతి 1-కి రూ.	అ.
ఆంధ్రభారత విమర్శనము, మల్లాది సూర్యనారాయణశాస్త్రి	8	8
ఆనందరంగరాట్ఛందము, కాలికో	1	8
ఆంధ్రశ్రీమద్రామాయణము; కావ్యస్మృతితీర్థ: జనమంచి శేషాద్రిశర్మకృతము, 3 సంపుటములు	12	0
డిటో 7 సంపుటములు	14	0
ఆంధ్రలలితోపాఖ్యానము	1	8
ఆంధ్రభాషాభూషణము	0	2
ఆంధ్రభాషార్ణవము, అట్టబైండు	0	12
,, కాలికోబైండు	1	2
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు—టీకానుక్రమణికాసహా	0	12
డిటో కాలికోబైండు	1	0
ఆంధ్రచంద్రాలోకము, సటీక	0	8
కవిసంశయవిచ్ఛేదము, అడిదము సూరకవిది	0	.6
ఉత్తరరామాయణము, కంకంటి పాపరాజప్రణీతము, చక్కని కూర్పు, గిల్టుబైండు	2	0
ఉత్తరహరివంశము, నాచన సోమనాథకృతము	1	8
కవికర్ణరసాయనము, మాంధాతచరిత్ర	1	8
డిటో మేలుప్రతి, కాలికోబైండు	1	14
కళాపూర్ణోదయము, దళసరికాగితములు	2	4
కాశీఖండము, చక్కనిక్రొత్తకూర్పు	1	12
కుచేలోపాఖ్యానము, సటీక, (భాగవతములోనిది)	0	4
డిటో గట్టుప్రభుకృతము	0	6

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.

శా. సీమంతాభరణంబు క్రొన్నెల చెలుల్ శ్రీవాగ్వధూటుల్ ప్రియా
రామశ్రేణి కదంబసుందరతరారణ్యస్థలుల్ కేళికా
ధామంబుల్ రజతాద్రికందరము లౌదార్యంబు భోగాపవ
ర్గామోదాప్తియు నైన హైమవతి భాగ్యస్ఫూర్తి మాకీవుతన్. 5

శా. శ్రీచింతామణి మంత్రదేవత జగత్క్షేమంకరాపాంగవీ
క్షాచంద్రోదయభక్తశేవధి మహాసంగీతసాహిత్యవి
ద్యాచారుస్తనకుంభ శారద మదీయస్వచ్ఛజిహ్వాస్థలిన్
వాచానృత్యము సల్పుగావుతఁ గవిత్వస్ఫూర్తి వర్తిల్లఁగన్. 6

ఉ. పుష్కరదీప్తతుండపరిపూరకలీనసమస్తమైన యా
పుష్కరధిన్ నభస్థలికి పూత్కరణోద్ధతిఁ జిమ్మియచ్చటం
బుష్కరవాహినిం గలయఁబొందొనఁగూర్చిన విఘ్నరాజు ధీ
పుష్కరహేళి మత్కృతికి భూరిజయాభ్యుదయం బొసంగుతన్. 7

క. శ్రీరామాయణకావ్యక,ళారూఢవచోవివేకి నవ్వాల్మీకిన్
భారతభాగవతాదిక,థారచనోల్లాసు వ్యాసుఁ దలఁచి భజింతున్. 8

చ. అనఘుల సంస్కృతాంధ్రకవితాఢ్యులఁ బేర్కొని సన్నుతింతుఁ బెం
పునఁ దగుకాళిదాసు భవభూతిని దండిని బాణునిన్ మయూ
రుని మఱి మాఘు భారవిని రూఢిగ నన్నప భీము నెఱ్ఱమం
త్రిని నలసోము భాస్కరునిఁ దిక్కన బమ్మెర పోతనార్యునిన్. 9

ఉ. ఎవ్వరి కెంతబుద్ధి పరమేశుఁడు దాఁ గృపచేసె నట్టిదై
నివ్వటిలుం గవిత్వరుచి నేరుపు చాలినఁ జాలకుండినన్
నవ్వక వర్తమానకవినాథులు చేకొనరయ్య మత్కృతిన్
బువ్వులు గందకుండ రసముం గొను తేఁటులవంటి నేర్పునన్. 10

ఉ. చెల్లునటంచు నొక్కకవి చేసినలక్షణ మొక్కరివ్వలన్
జెల్లమిఁ జేసి తారొకటి చెప్పఁగ ఛాందసవిస్తరంబు సం
ధిల్లుటఁ గావ్యశంక లవనిం దఱుచయ్యె రసజ్ఞులార నా
యుల్లపుసౌధవీథిఁ గొలువున్న సరస్వతి సత్యవాణి నా
తల్లి యొసంగుపల్కు లివి తప్పులు సేయక చిత్తగింపుఁడీ. (పంచపాది) 11

చ. పలుమఱుఁ దప్పులేవెతకఁ బొల్పడి యుండుటగాక దుష్కవుల్
తెలియఁగఁ జాలుటెట్లు రసదీపకకావ్యకళారహస్యముల్

తలఁపఁ బ్రపూతిహేయకలితవ్రణశోధనవాంఛగాక యాఁ
గలకుఁ బటీరచర్చితసుగంధతనుస్థితి బుద్ధిగల్గునే. 12

అని యిష్టదేవతాప్రార్థనాచరణంబును బూర్వకవీంద్రసంస్మరణంబును నవీనకవిజనా
నుస్మరణంబును గుకవితృణీకరణంబునుం గావించి యొక్కపుణ్యకథారత్నంబు రచి
యించుయత్నంబునం గుతూహలదోహలం బైనచిత్తంబున నిట్లని వితర్కించితి. 13

ప్రాజ్ఞులు ప్రబంధకల్పనాపాటవంబు, గలుగుటకుసత్ఫలంబుగాఁ దలఁచికృతులు
చేయుచుందురు జగదేకనాయకునకు, నచ్యుతున కంకితముగఁ గృతార్థులగుచు. 14

ధాతలకుధాత భువనత్రాతలకున్ దాత శౌరి రక్షకుఁ డఁట యా
దాతలదాత న్విడిచి యి,లాతలనేతల నుతించు లాఘవమేలా. 15

కృపఁ జేసె భువనముల్ కీర్తింప ధ్రువునకుఁ జెలఁగి యొన్నాళ్లకుఁ జెడనిపదవి
యొసఁగె విభీషణాఖ్యునకు నాచంద్రతారార్కంబుగాఁగ లంకాధిపత్య
మిచ్చెఁ గుచేలున కిష్టార్థసిద్ధియా సరిపోల్పరానియైశ్వర్యమహిమ
దత్తంబుచేసె గంధవహాత్మభవునకు వరభవిష్యద్బ్రహ్మవైభవంబు
వాసుదేవుండు బ్రహ్మాండవల్లభుండు, భక్తజనులకు సకలసౌభాగ్యదాత [గలదే.
దాతమాత్రంబె మోక్షప్రదాత యతఁడె, యతని నుతియించుకంటె భాగ్యంబు

చతురుల్ పూర్వకవీంద్రు లన్నిటను నేస్వల్పజ్ఞుఁడన్ స్వామికిన్
హితమో కాదో మదీయకావ్య మని నాకేలా విచారింపన
గ్రతనూజుల్ వ్యవహారకర్తలయినం గానీ కడుంబాలుఁడౌ
సుతునవ్యక్తపుమాట తండ్రి కొదవించుంగాదె యానందమున్. 17

తనుఁ దా మెచ్చుకొనంగ నేటికిఁ గవిత్వప్రౌఢి యాంధ్రీఘన
స్తనకుంభస్ఫురణన్ నవీనమృదుచిత్రశ్రీపదాచ్ఛాదనా
భినవాలంకరణార్థసూచనల సంప్రీతిన్ మనోవీథులం
జొనుపంగల్గిన నింపుతో విని రసజ్ఞుల్ మెచ్చినం జాలదే. 18

ప్రాచీనకవిక్వచిదుప,సూచితకథ సుకవిరచనసొంపున వితతం
బై చిత్తము లలరించుం, బ్రాచురగతిఁ గనకఘటితరత్నము భంగిన్. 19

అట్లుగావున మదీయసరస్వతీవిలాసంబువలన సార్థకనామధేయంబుగాఁ గవిరాజ
మనోరంజనం బనునొక్కసత్ప్రబంధంబు రచియించి మజ్జన్మసాఫల్యంబుగా భగవ
దర్పణంబు గావింతు ననుతలంపున. 20

శ్రీరమణాంకితంబుగ రచింపఁగయోగ్యత గల్గి వీరశృం
గారరసాదిలీలలఁ బ్రగల్భతకున్ బుధు లౌననంగ వి

స్తారము సేయఁగాఁ దగిన సత్కథయెయ్యది గల్గునో యటం
చారయుచుండ మదీయహృదయంబునఁ గోర్కులు నివ్వటిల్లఁగన్. 21

తే. ఉండి యొకనాఁటిరేయి నాయుల్లమునను, మత్ప్రభుండైనయట్టి శ్రీమంగళాద్రి
నిలయు నరసింహు భక్తవత్సలు దలంచి, శయ్యమీఁదను నిదురించుసమయమునను. 22

సీ. శతకోటికందర్పసౌందర్యరేఖావిమోహనంబు ఖగేంద్రవాహనంబు
హారకోటీరకేయూరాదిభూషణస్ఫూర్జితంబు కలంకవర్జితంబు
దరహాసహసితవిస్ఫురితజీవంజీవజీవితంబు సుపర్వసేవితంబు
సంపద్విలాసినీసరసభుజాలతాలింగితంబు కృపాతరంగితంబు

తే. గురుతరానంతకళ్యాణగుణమణీధు, రంధరంబు లసత్కంబుకంధరంబు
విష్ణుదివ్యస్వరూపంబు వేడ్కతోఁ బ్రసన్నమయ్యెను మామకస్వప్నమునను. 23

వ. ఇట్లు మదీయజన్మాంతరసహస్రసంచితతపఃఫలంబునం బ్రసన్నంబైన భగవద్దివ్యమం
గళవిగ్రహంబు సందర్శించి కంచుకీకృతపులకోద్గమశరీరుండనై యానందరసకందళిత
హృదయారవిందుండ నగుచు లేచి సాష్టాంగవందనంబు లాచరించి నిలిచి స్తోత్రం
బులు చేయుచున్న నన్నుం గరుణామృతశీతలకటాక్షంబుల వీక్షించుచు గంభీరమృదు
మధురభాషణంబుల నిట్లని యానతిచ్చె. 24

క. మును పనిరుద్ధచరిత్రం, బనుకృతి రచియించి మంగళాచలపతినై
తనరారు నాకు నంకిత, మొనరించితి వేను బ్రీతి నొందితి నింకన్. 25

శా. మద్భక్తుండు పురూరవుండు మును ధర్మంబొప్పఁ బాలించె నే
తద్భూమండల మేకచక్రముగఁ దద్వార్తల్ పురాణోక్తముల్
తద్భావార్థ మెఱింగి విస్తరము నొందం జేయు మస్మత్ప్రసా
దోద్భూతాద్భుతశేముషీచతురవాగ్యుక్తిం బ్రబంధంబుగన్. 26

వ. తత్ప్రబంధంబు మద్గోపాలనామాంకితంబుగా రచియింపుము మదీయకృష్ణావతారసగు
ణబ్రహ్మోపాస్తిపరులు నాకుం బ్రియతములు గావునఁ దద్రూపంబున నీచే నుపాసి
తుం డై నసీహృదయంబున వివరింతు నని యానతిచ్చి యప్పరమేశ్వరుం డంతర్ధా
నంబుఁ జేసినట్లయిన మేలుకాంచి యాశ్చర్యమిళితప్రమోదమానసుండనై యద్ది
వ్యవిగ్రహంబుఁ దలంచి మ్రొక్కుచుండితి నివ్విధంబున నిష్టదేవతానుగ్రహంబు
వడసినవాఁడనై తత్ప్రబంధంబు రచియింపఁ బూని, కవిసమయసిద్ధతావిచారంబున
మద్వంశక్రమం బెఱిఁగించెద. 27

శ్రీ పేర్మిన్ శశివోలె బ్రహ్మకులవార్ధిం బుట్టి కౌండిన్యగో
త్రాపస్తంబపవిత్రసూత్రకలితుం డై రామసింహాసనా

భ్యోపేతస్ఫుటకొండవీటిపురరాజ్యోర్వీశ్వరుల్ మంత్రిగాఁ
జేపట్టెన్ బసవప్రధానుఁ డిలమించెన్ భాగ్యసంపన్నుఁ డై. 28

క. ఆమంత్రిమణి ప్రకాశన,భోమణి కనుపర్తిబుక్కపురిముఖ్యబహు
గ్రామస్వాస్థ్యానుభవ,గ్రామణి బుధనుతుల సుతులఁగాంచె నలువురన్. 29

వ. తదీయాభిధానసౌగుణ్యక్రమంబు. 30

తే. అమరమంత్రి గుణంబుల నమరమంత్రి, ముమ్మహీమవేల్పు ప్రభనొప్పుముమ్మఘనుఁడు
పెద్ద నానాచమత్కృతిఁ బెద్దనార్యుఁ, డెల్లసచివుండు సంస్తుత్యుఁ డెల్లసభల. 31

ఉ. అం దసమానకీర్తియుతుఁ డైతగుముమ్మనమంత్రిమౌళికిన్
నందనుఁ డై జనించె సుజనస్తవనీయుఁడు నిమ్మనాథుఁ డిం
పొందుసమస్తసంపదల నున్నతిఁగాంచెను గొండమాంబ రా
కేందునిభాస్యఁ గూర్మిహృదయేశ్వరిఁగా భరియించె వేడుకన్. 32

క. ఆనిమ్మమంత్రివరునకు, సూనుండై యబ్బనార్యచూడామణి పెం
పూన జనియించెఁ గొండాం,బానిరుపమగర్భశుక్తిమౌక్తిక మగుచున్. 33

చ. సుగుణకదంబ మెల్ల నొకచోటనె కాఁపురమున్నయట్లుగా
నగునని వేయునోళ్లఁ గొనియాడుచు భూజను లెంచ ధన్యుఁ డై
తగుకనుపర్తియబ్బనకు దత్ప్రియసాధ్వికి లచ్చమాంబకుం
బొగడిక కెక్కి రిద్దఱు సుపుత్రులు రాయన నిమ్మనాహ్వయుల్. 34

ఉ. వేయనవచ్చుఁ గాక సుఖ వే యనపాయవదాన్యవైభవం
బాయనవద్యబుద్ధి తగునాయనకే యనఁ గీర్తిచంద్రికల్
గాయ నయస్వగీతికలు గాయనశీలురు పాడ నొప్పు మా
రాయనమంత్రి మేలు బళిరా యన సూరిజనాభినంద్యుఁ డై. 35

క. ఆరాయనార్యమణికి వ,ధూరత్నము నరసమాంబ దొరయన్ సుగుణ
శ్రీరమణీయత ననసూ,యారుంధతు లనఁ బతివ్రతాభరణం బై. 36

తే. అట్టిదంపతులకు నన్వయాభివృద్ధి, యొదవఁ బుత్రుల విరువుర ముదయమైతి
మగ్రజుండు యోగానందుఁ డనఘచరితుఁ, డబ్బయామాత్యుఁ డంద్రుమదాహ్వయంబు.

క. శ్రీమంగళగిరినరసిం,హామేయకృపావిజృంభితాద్భుతకవితా
శ్రీమంతుఁడ గానకళా, ధీమంతుఁడ దేవతాస్తుతివ్రతపరుఁడన్. 38

వ. ఈదృశుండ నగునాచేతన్ గ్రథితం బగు నేతత్ప్రబంధంబున కధీశ్వరుం డయిన
శ్రీరాజగోపాలప్రభుండు. 39

సీ. యదువంశజలధిరాకామృతభానుండు భానుండు యోగిహృత్పద్మములకుఁ
త్రైలోక్యహితరాసకేళీసనాథుండు నాథుండు బ్రహ్మాండయూథములకు
నిజకథామృతధౌతవృజినజంబాలుండు బాలుండు నందగోపాలసతికిఁ
గృతవైణవికగానగీతప్రబంధుండు బంధుండు వల్లవీప్రాణములకుఁ
తే. గోమలశ్యామలామ్ముగ్గ్రామలామ,రప్రకాండకాండాసనరాజమాన
సాంద్రచంద్రకనవచంద్రకేంద్రబర్హ, శేఖరుఁడు కృష్ణగోపాలశేఖరుండు. 40

సీ. వసుదేవసూనుఁడయ్యు సనాతనుఁడు నవనీతచోరకుఁడయ్యు నిస్పృహుండు
కాముకుఁడయ్యు నస్ఖలితవటుండు నృశంసహింసకుఁడయ్యు సర్వసముఁడు
సంసారియయ్యు నిస్సంగుండు ద్వారకావాసుఁ డయ్యును జగద్వ్యాపకుండు
మాయావియయ్యు నిర్మలమానసుండు కార్యప్రవర్తకుఁడయ్యు నఖిలసాక్షి
తే. రాజగోపాలలీలావిరాజమాన, దేహభృద్బ్రహ్మతత్త్వంబుఁ దెలిసిపొగడ
వేయుమోములు గలకాద్రవేయలోక,సార్వభౌమునకైన వశంబుగాదు. 41

సీ. వాసుదేవఖ్యాతివర్తిల్లె నెవ్వాఁడు భవనుచే మూర్తివైభవముచేత
నఘవిఖండలలీల నమరారెనెవ్వాఁడు శక్తిచేఁ జరణాంబుశక్తిచేత
గాళిందిఁగడిసి పేడ్కలుసల్పె నెవ్వాఁడు రతులచే వనకేళిరతులచేత
గీతామృతవ్యాప్తిఁ గీల్కొల్పె నెవ్వాఁడు నయముచేఁ దత్త్వనిర్ణయముచేత
తే. దెలిపె నెవ్వాఁడు కంసమాంసలమతంగ, ఘూహననధాటిచేఁ దనపురుషసింహ
మూర్తివిస్ఫూర్తి యసమానకీర్తి యతఁడు, సంహృతార్తార్తి యాభీరచక్రవర్తి. 42

షష్ఠ్యంతములు.

క. ఈదృక్ప్రాకారసారగు, ణోదారున కాశ్రితవ్రజోభయసుఖదా
నోదారున కవనీభృ,ద్భుదారున కమృతజలధిభూదారునకున్. 43

క. మండితగుణపండితహృద,ఖండితవిజ్ఞానహంసకాసారునకుఁ
గుండలరుగ్మండలభృ, ద్గండలసద్దరహసనసుధాసారునకున్. 44

క. బంధురతరరవమురళీ, గాంధర్వసుధాస్రవంతికాలహరీసం
బంధోదితప్రవాళ, స్కంధస్థాణునకు భజదజస్థాణునకున్. 45

క. వరఖద్యుమణికి సాష్టా, త్తరశతషోడశసహస్రతరుణీయుగప
త్స్ఫురతోచితబహుతనుభా,సురదక్షిణనాయకైకచూడామణికిన్. 46

క. విజరాజకకుబధీశ, వ్రజరాజతనగపమృగ్యపదునకు వీణా
ద్విజరాజద్విజరాజ, ద్విజరాజముఖాచ్ఛకీర్తివిభవపదునకున్. 47

క. పరగోపీగోపితస,త్పరిమళహయ్యంగవీనపాటచ్చరతా
స్ఫురితునకుఁ రాధాకుచ,భరితునకుఁ దురితహరణపటుచరితునకున్. 48

క. రాసక్రీడానటనవి,లాసవశీకృతనభస్స్థలస్థాస్వప్స
స్త్రీసముదయహృదయునకుఁ,వ్యాసాదిమునీంద్రవర్ణితాభ్యుదయునకున్. 49

క. శుంభదవష్టంభభుజా,స్తంభాగ్రహతాచ్ఛపేటశంబాహతి సం
రంభహతకంసభూభృ,త్కుంభితగోత్రునకు భరితగురుగోత్రునకున్. 50

క. గోగోచరబలవిక్రమ, గోగోచరతాహృతాకగోపాలునకుఁ
గోగోనియమితనానా, గోగోపాలునకు రాజగోపాలునకున్. 51

ప్రథమాశ్వాసము.

వ. నాయొనర్పంబూనిన కవిరాజమనోరంజనం బనుపురూరవశ్చరిత్రంబునకుం గథా
ప్రకారం బెట్టిదనిన సకలమునివరేణ్యశరణ్యం బగునైమిశారణ్యంబునం బుణ్యకథా
శ్రవణోల్లాసవికాసనుఖులు శౌనకప్రముఖులు సమస్తపురాణవాణీమణిస్యందన
సంచారకరణప్రవీణసూతుం డగుసూతునివలన నుపసూచితం బగుపురూరవశ్చక్రవర్తి
చరిత్రంబు విని సవిస్తరంబుగాఁ దెలుపవలయునని యడిగిన నక్కథకుం డిట్లని
తెలుపం దొడంగె. 52

ప్రతిష్ఠానపురవర్ణనము.

సీ. వరణాగ్రమణిరాగభరణాంచదుదయాస్తమయహంసశుభ్రాంశుమండలంబు
బహుళసౌధావళీప్రతిబింబభాగపూర్వార్జునస్వర్దీర్ఘికామృతంబు
నీలనభోవాదనిశ్చయాపాదకాగరుధూపధూమరేఖాస్థిరంబు
ప్రతిపదాలిప్తజంబాలకస్తూరికాప్రకటితస్వగుణగోత్రాస్థలంబు
తే. ఘటితకుట్టిమపటుహీరకాంతికౌము, దీవిధూతతమఃపటలావిధూద
యత్రియామోత్కరంబు విచిత్రవిభవ,సురుచిరంబు ప్రతిష్ఠానపురవరంబు. 53

సీ. పణ్యస్థలములెల్లఁ బద్మాకరములు పద్మాకరతతులు మహావనంబు
లావనంబులు వినోదాగంబు లావినోదాగము ల్గోపురాగ్రాంచితములు
గోపురాగ్రంబులు గురుసభావళులు సభావళుల్ దైవాలయములు చూడ
దైవాలయంబులు ధామస్థితు ల్మఱి ధామస్థితు ల్కడుధర్ములరయ
తే. ధర్ములతిభద్రకరులు తద్భద్రకరుల, యూథముల నెన్నఁగాఁ బ్రమదోత్కరంబు
లచటఁ బ్రమదోత్కరములు ప్రభాసమాన, లనఁ బ్రభాసమానం బగు నప్పురంబు. 54

చ. నయగుణరత్నసంయుతి వనప్రకటోన్నతి రాజమండలో
దయపరిజృంభమాణత సుధామహితస్థితి శ్రీవిలాససం
శ్రయత నసంతభోగవిలసత్పురుషోత్తమయుక్తి వర్ణితం
బయి కలశాంబురాశిగతి నన్నగరంబు గరంబు చెల్వగున్. 55

తే. రాజమార్గంబు నక్షత్రరాజితోడ, నంతరిక్షంబున మెఱుంగు కొంతయనఁగ
రాజమార్గంబు నక్షత్రరాజియగుచు, నగరమధ్యంబునందు నున్నతి వహించు. 56

శా. క్రీడాశైలదరీపరిస్ఫుటవితర్ద్ధిస్థాపితాంచత్తషా
రాడశ్మచ్ఛటలం గరంచు విలసద్రాకానిశాభాసమా
నోడువ్రాతపసాంద్రచంద్రికతదీయోదప్రపూరంబు జా
లై డిగ్గు న్సెలయేఱులై పురివిహర్త్రాహ్లాదముం జేయుచున్. 57

సీ. చక్రవాళధరాధరక్రియాచాతురిఁ గొంకు దేఱినపాణిపంకజమున
మహనీయజలధినిర్మాణకేళీలీల వడఁకు దేఱినకరవారిజమునఁ
గలధౌతకాంచనాచలశృంగరచనచే నళుకు దేఱినహస్తజలరుహమునఁ
నలచైత్రరథనందనారామకల్పన నారి తేఱినశయాంభోరుహమునఁ
తే. గనకగర్భుండు నిర్మించెఁ గనకఘనక, లావిలాసతనసమానమై వెలుంగు
వరపరణఖేయహర్మ్యోపవనచయంబు, లప్పురంబున భువనంబు లభినుతింప. 58

తే. సర్వతోభద్రరేఖాప్రశస్తివలన, భాసురంబైనయట్టియప్పట్టణంబు
సర్వతోభద్రరేఖాప్రశస్తివలన, భాసురంబైన జ్యౌతిషప్రతిభఁ గాంచె. 59

క. పుటభేదనపటుకేతన, పటసంచలదంచలముల భాసిలుఘటిత
స్ఫుటముక్తామణిరేఖా, మటిమం దారాగణము విభావరివేళన్. 60

మ. పురనానామణిహర్మ్యదేశచరదంభోజాంబకాస్యాచ్ఛసుం
దరత లూనిచిన కన్నులన్ నిహితతద్ద్వారస్థలాదర్శ వి
స్ఫురితాత్మప్రతిబింబము ల్గని సుమీ పూర్ణప్రభాపూర్ణిమా
హరిణాంకుండు వివర్ణుఁడై యరిగి కార్శ్యంబందు నంతంతకున్. 61

తే. అలమృగాంకుండు వాతాయనాంతరములఁ, దూఱిపోవుచుఁ జరియించు కారణమున
లీలఁ బురహర్మ్యములు చంద్రశాలలయ్యెఁ, దత్సుధాసేచనమున సౌధంబు లయ్యె.62

సీ. గగనగంగాతరంగములఁ దోఁగినచల్లగాలి ఘర్మాంబుశీకరము లణఁప
నమృతంబు చిలుకు శీతాంశుబింబమరీచు లాయాసఖేదంబు నపనయింపఁ
బరువమై చెలువొందు పారిజాతప్రసూనచయంబు పరిమళానంద మొసఁగ
వీణారవంబుతో వీతెంచుకిన్నరీజనగానములు చెవుల్పల్లసేయఁ
తే. జొక్కి నిదురింపుదురు గాఢసురతజనిత, మోహబంధానుగుణనిజబాహుబంధ
విరచనైకీభవత్పరస్పరశరీరు, లగుచు దంపతు లప్పురహర్మ్యములను. 63

తే. కమలబంధుండు మధ్యాహ్నకాలమునను, దామహోశ్వరుఁ డైనచందంబుఁ దెలుపు
రజతకుధరాధరావతారప్రకార, హీరసౌధాగ్రసీమలఁ జేరి పురిని. 64

తే. మీనకర్కటమకరసంస్థాన మగుచు, సొరిదిఁ బ్రతిబింబమిషమున సూర్యచంద్ర
తారకాదులు తనయందుఁ జేరియుండ, గగనమును బోలియొప్పు నన్నగరిపరిఖ. 65

క. పరిసరపరిఖాసలిలాం, తరమున వెసఁజొచ్చి మర్త్యదర్శనకాంక్షా
పరతఁ బఱతెంచి యీఁదుచు, శరములపైఁ దేలుదురు రసాతలభోగుల్. 66

సీ. లలితచందనలేపకలితసుందరవధీసోపానముల జంగఁజాఁపియెక్క-
ఘనతారహారసుస్తనభారగిరినితంబములపై జీరుకుబండలాడు
నసమానవీటికారసమానితాధరామృతదీర్ఘికలనుఁ జేయీఁతలీఁదు
హేలారచితపుష్పమాలారచితకేశభృంగమల్లములతోఁ బెనఁగులాడు
తే. సురతనాట్యకళాంశుకీకరణకామ, కమలజాతావసరతీవ్రగాఢకేళి
భవపరిశ్రమలాలసపౌరయువతి, జాలతనుసీమల సమీరబాలకుండు. 67

చ. చనునెడ దక్షిణాయనమిషంబునఁ గొన్నిదినంబు లుత్తరా
యణమునఁ గొన్నినాళ్లు గగనాంతరసీమ మెలంగుచుం బురిం
గనఁబడు చోద్యముల్గలయఁ గన్గొనుచుండుదు రెల్లకాలముం
ఘనమగుదర్శనేచ్ఛలను గైరవిణీనలినీమనోహరుల్. 68

సీ. ప్రాకారమమరేంద్రలోకాంత మన్నచో హర్మ్యజాలోన్నతు లడుగనేల
ధామంబులెల్ల రత్నమయంబు లన్నచో నొడలిసొమ్ములవింత లడుగనేల
ప్రతివీథియు సుగంధరససిక్తమన్నచో నంగరాగములమే లడుగనేల
త్యాగంబులర్థికత్యధికంబు లన్నచో నైశ్వర్యవిభవంబు లడుగనేల
తే. శుకపికాదులు సరసవచోవిలాస, కృతపురాణప్రసంగమోదితజనాళు
లన్నచో విద్వదధికార మడుగనేల, జగదలంకార మైనయన్నగరమునను. 69

సీ. అశ్రాంతనియతిఁ బద్మాసనస్థితు లౌట భాషాప్రియోదారభావు లగుట
సత్యప్రవర్తనశ్లాఘ్యత వెలయుట నామ్నాయమతి చతురాస్యు లగుట
విబుధాగ్రగణ్యతావిస్ఫూర్తిఁ గాంచుట సన్ముఖాంభోరుహజనితు లగుట
హంసేశహరిహితోద్యద్గతి మెలఁగుట సౌమనోధర్మాగ్రజన్ము లగుట
ఆ. నలహిరణ్యగర్భు నపరావతారంబు, లగుట కింతసంశయంబు గలుగ
దప్పురంబులోన నొప్పారుచున్నట్టి, భూమిసురులమహిమ పొగడవశమె. 70

సీ. పౌరుషంబుకొలంత పౌరవిరోధంబుఁ గలుగ దీరాజశేఖరులయందుఁ
బక్షపాతంబు స్వభావకాఠిన్యంబు పొరయ దీగోత్రాధివరులయందుఁ
నొరుదండనిలిచి యేయుట వైరిధాటికి విముఖమా టెఱుఁగమీవిజయులందు
సత్కులామిత్రత శాత్రుపుఁదలచూప నిచ్చుటఁ జూడమీయినులయందు

తే. ననుచు జనులెంచ మఱియుఁ గళ్యాణగృహని,వాసులై నిత్యధర్మవిలాసులై య
నంతరాయభోగిష్ఠులై యమితవాహ,వంతులై బాహుజులు ప్రవర్తింతు రచట. 71

మ. తమకుం జాలినవర్తకం బతనిచేతం గామినో శంఖప
ద్మమహాపద్మము లర్థపున్ విడిచి ప్రేమం దత్పురీవైశ్యస
త్తములం జేరెననంగ శంఖములు పద్మంబు ల్మహాపద్మముల్
ప్రమితార్థంబులవృద్ధిఁబొంది సిరులన్ భాసిల్లుఁ దద్గేహముల్. 72

ఉ. అద్రులు ధైర్యవైభవసమగ్రత బ్రాహ్మణసేవచే సదా
భద్రులు బాహుశక్తిబలభద్రులు రుద్రముకుందభక్తిని
ర్నిద్రులు సత్కృపాగుణసమృద్ధిసముద్రులు చారుకీర్తిస
క్షుద్రులు శూద్రు లొప్పుదురు చూడఁ బురిన్ సుకృతైకముద్రులై. 73

ఉ. హైమమనోజ్ఞమైనపురిహర్మ్యచయంబున మర్త్యదంపతుల్
ప్రేమలతోడఁ గూడి విహరించుచు నింపుగ షడ్జమధ్యమ
గ్రామముల న్వినోదగతి గానము సేయఁగ నాలకించుచున్
వేమఱు మెచ్చుచుందు రతివింతగఁ గిన్నరదంపతుల్దివిన్. 74

క. పురిగోపురాగ్రసింహా, పరిగతమధ్యాహ్నసమయభానుఁడు వాలుచున్
నిరతముఁ బ్రపూర్ణదీధితి, నరయన్ స్వక్షేత్రవాస మని తలఁచియొకో. 75

క. సాలంబులకొమ్ములు సుర, సాలంబుల నంటుకొనఁగ సారికిఁ బురిలో
సారంబులకొమ్ములుసుర, సాలంబుల నంటుకొనుఁ బ్రశస్తస్ఫూర్తిన్. 76

చ. అతనునిములుకులో చిగురుటాకులొ కుందనపున్ సలాకలో
రతనపుతేటలో తొగలరాయలచాయలనిగ్గులో తటి
ల్లతికలొ పువ్వుగుత్తులొ విలాసరసంబునఁబోసినట్టియా
ప్రతిమలొ వీరనంగ బురిఁ బంకజగంధులు వొల్తు రెంతయున్. 77

సీ. పొలఁతులపలుపకొప్పులుచూచి నిజశాంబరీతమోనిర్మాణరీతి మఱచి
తరుణీకటాక్షపాతచమత్కృతులు చూచి శరసంప్రయోగవైఖరులు మాని
వనితలమధురనిస్వనకంఠములు చూచి విజయశంఖములపై వేడ్క సడలి
నీలవేణులముద్దుసెమ్మొగంబులు చూచి యలమృగాంకునిసహాయంబు వదలి
తే. యలఁతఁదీఱుచుకొనుఁ గుసుమాయుధుండు, రతికుచాభోగశయననిద్రాసుషుప్తిఁ
బురుషుల జయించుకార్య ముప్పురివిలాస, వతులచే నాట నిర్విచారతఁ జెలంగి. 78

సీ. ఆడనేర్తురు మనోహరలీల నృత్యనృత్తంబులు భరతవిద్యానిరూఢిఁ
బాడనేర్తురు రాగపరిమితస్వరసుభావ్యాప్తిచే దారువు లంకురింపఁ

జూడనేర్తురు యతీశులకైన భ్రమపుట్ట దశవిధవీక్షావధానములను
గూడనేర్తురు సొంపుగులుక నైంద్రజాలికఫణిపాశముఖరతిబంధములను
తే. సరససౌందర్యవిద్యాప్రసంగగరిమ, రసికనికరకటాక్షపరంపరావి
కాసకుసుమమాలికాస్వలంకరణపాత్ర, లైనపాత్రలు తత్పురియందుఁ గలరు. 79
సీ. కారుక్రొమ్ముఁ జికురాంధకారంబులోఁబడి వెలువడుసీమంతవీథులందుఁ
బైకొన్నదృగ్బాణ పంజరంబులఁ జిక్కి కదచుని మేషావకాశములను
మొనయెక్కుడగుగుబ్బచనుకొండలెక్కి గాసిలి డిగ్గు హారని శ్రేణికలను
గనరాని యవలగ్నగగనాంతమునఁ బ్రాకి వ్రాలుఁ గాంచీచక్రవాళమునను
తే. ఖురసమాగతపాంథప్రభూతకుసుమ, శరవికారవిలోలలోచనదృగంచ
లములుఘంటాపథచరద్విలాసలసిత, వారకన్యావలోకనావసరములను. 80
సీ. వెలకుఁ జూపవు పొన్నవిరి యంతగోప్యమా యదియరంటులలోయ నయ్యోఁజుమ్ము
కప్పుకోనేల బంగారమా పువుబంతు లవిసువర్ణలతోదయములు సుమ్ము
మూసిపెట్టెదు మల్లెమొగ్గ లింతబ్రమా యవిసుధారాశిచేరువ విసుమ్ము
దాఁచుకొంటివి యరుదా నల్లఁగలువపే రదియగాఢ సరోవహనము సుమ్మ
తే. టంచు ముసిముసినగవు లన్యోన్యవచన, మంజులవ్యంగ్య చాతురీవ్యంజకములు
గా విటులకమ్ముదురు విరులక్కముక్కైక, జీవికలు పుష్పలావిక ల్సెలగి పురిని. 81
చ. అరదములన్ సృజించి కమలాసనుఁ డుర్వికిఁద్రోయ రత్నని
ర్భరమునఁ గొన్ని తత్పురినిప్రాలినఁ జుల్కనివెల్ల గాడ్పుచేఁ
దిరుగుచు మింటఁ జిక్కె నవి దేవవిమానములయ్యె వాని పెం
పరయఁగఁ దత్సమానములయైన విమానములందుఁ గల్గునే. 82
మ. జగతీధ్రంబులు దేవపాపగత సంచారంబులై నిశ్చలం
బగు వృత్తిం దపమాచరించి తతఘంటారావనిర్భీకయా
నగుణోదగ్రతవిగ్రహాంతరము లెన్నం దాల్చుటం గల్గెనో
నగసంబంధగతాదివృద్ధి యనఁగా నాగంబు లొప్పుంబురిన్. 83
చ. అరివిజయప్రతాపఘనయానమహీభృదుపాశ్రయంబులం
బరఁగినవాటఁ గైటభవిభంజనజంభమదాపహారకుం
జరరిపువిక్రమానుగుణసారతఁజొప్పడు నప్పురీహరుల్
హరులను నామధేయములు సార్థకమై యనువొందునట్లుగన్. 84
క. వాసవవాసవదీప్తిన, వాసిని వాసిని జయించునయ్యాయుధముల్
కేసరికే సరివత్తురు, భాసురభాసురవు లచటిభటు లుద్వృత్తిన్. 85

వ. వెండియు నప్పాటభేదనప్రకాండం బఖండతాండవపాండిత్యవికస్వరశిఖండశిఖండి
మదోత్సాహకృదాఖండలకోదండమండితకాండమండలాయమాన విచిత్రచిత్రధ్వజ
పటపటలకిమ్మీరశోభామిళదభ్రభ్రమదదభ్రశుభ్రేతరవిభ్రాజితధూపధూమరేఖాబహు
ళంబునుభరతసంగీతరత్నాకరకళావీణాప్రవీణవాణినీశ్రేణివివిధవిధనాట్యవిజృంభణచ
లదరుణచరణరణదతులటులాకోటిచాటుకింకిణీకలితతాళతత్కారపల్లవనితంబతలము
ఖరేచితమకరావిద్ధవక్రదండపక్షోర్ధ్వమండలీప్రముఖకరకమలవిక్షేపజనితకంకణఝు
ణఝుణత్కారకనకరశనాగుణ కీలితఘుంటికాఘనఘనత్కారమార్దళికశయాహ
తమృదంగాభంగధిమిధిమితాగారసమ్మిశ్రసాంద్రస్వన ఘుమఘుమితనాట్యశాలాజా
లఖేలనంబును ప్రభుసేవాసమాగతసంకీర్ణకర్ణాట లాటవరాటకాంభోజ కాశ్మీరకుకురు
కురుగాంధారసౌవీరసౌరాష్ట్ర మగధమద్రమాళవ నేపాళబంగాళకళింగద్రావిడకేరళ
గూర్జరప్రముఖనానాదేశవసుంధరావరాన్యోన్యసంఘర్షణసముద్భూతశుంభచ్ఛాతకుం
భభూషావిశేషరజఃపుంజసికతావిరాజమానరాజమార్గంబును గృతకసిలోచ్చయనిచ
యసముత్తుంగశృంగస్థాపితదీపితహీరవారాంబరచుంబికాంతికదంబాడంబరనిష్కళం
కితశంబరభవనికురంబవిరోధిబింబంబును మహామహోన్నతహాటకహర్మ్యసమూహ
శిరోగేహదేహళీప్రముఖగృహాంగణస్థగితరోహిణీకాంతకాంతోపలదృశ్యమాన నిజ
ప్రతిబింబవిలోకనసంజనితాన్యవాహసందోహమోహసముత్సాహ హేతుహేషా
విశేషఘోషబంధురసముల్లంఘనోద్ధత కబంధజబాంధవసైంధవాహంకార హరణ
హుంకారతోత్రతాండవఝళత్కార ధీరగరుడాగ్రజంబును సంతతవసంతసౌభా
గ్యసంపదుదయదుద్యానవాటికాచ్ఛటాభ్రంకషవివిధవిధశాఖి శాఖోపశాఖాశిఖరసు
ఖాసీనశుకశారికానికరమధుమధురవచనరచనాచమత్కారసరసకథాప్రసంగసంశ్ర
వణకుతూహలస్తంభితవిమానగమనపరిసరచరత్ఖచరజంపతినిచయంబునునై వనీభూష
ణంబయ్యును నవనీభూషణంబై వారణదానధారాప్రవాహబంధురంబయ్యు నవా
రణదానధారాప్రవాహబంధురంబై శేషాలంకారమహాస్థానమండపసహస్రశోభితం
బయ్యును నశేషాలంకారమహాస్థానమండపసహస్రశోభితంబై విప్రచయామోదకృ
ద్వైభవరాజద్రాఘిష్టంబయ్యును నవిప్రచయామోదకృద్వైభవరాజద్రాఘిష్టంబై స్వ
ర్గలోకంబునుంబోలె విబుధసమన్వితంబై సుమేరునగంబునుంబోలె గల్యాణనిల
యంబై సుధాసముద్రంబునుఁబోలె లక్ష్మీసముదయస్థానంబై శృంగారవనంబునుం
బోలెఁ దరుణీపురుషసౌమనస్యరమ్యంబై యలకాపురంబునుంబోలెఁ బుణ్యజనవిరా
జితంబై పాతాళభువనంబునుంబోలె ననేకభోగివిలసితంబై శరత్కాలంబునుం
బోలె నపరూపితపంకంబై కమలాకరంబునుంబోలెఁ గవినివహావర్ణనీయంబై సంపద
లకుఁ గొటారును, సారస్వతంబునకు నునికిపట్టును బుణ్యంబునకుఁ దావలంబును

బురుషార్థంబులకుం బుట్టినిల్లును నగుచు ధరాపురంధ్రీకమనీయకరకమలకలితకనత్క-
నకమణికటకంబై యొప్పునక్కటకంబున కధీశ్వరుండు. 86

పురూరవునిసౌందర్యాదులు.

సీ. పటుభుజాస్తంభాగ్రఘటితవిశ్వంభరాభరలాఘవితమహాఫణిఫణుండు
నవకీర్తినర్తకీనాట్యరంగావధీకృతచక్రవాళధాత్రీధరుండు
సంతతౌదార్యసిద్ధాంతార్థపూర్వపక్షీభవత్కల్పకప్రాభవుండు
బిరుదాంకరచితగంభీరగీతప్రసంగాలాపసంజీవనాంతకుండు
తే. నిశితనిరుపమనిజకరనీరజాత,నిహితనిస్త్రింశనిర్భిన్ననిష్ఠురారి
పలలనైవేద్యతృప్తశుంభత్ప్రతాప,ఘోరతరభైరవుండు పురూరవుండు. 87
మ. అతఁ డుద్దండబలప్రకాండభుజదండాఖండకోదండదం
డతమఃఖండనమండలప్రభవకాండవ్యాప్తధాగద్ధగీ
తతకాండౌఘమయూఖమాతృహయవేదండాదిమద్భండనో
ద్యతచండాహితమండలేంద్రమదనీహారుం డుదారుం డిలన్. 88
గీ. ఆనృపాలునియసమసాయకతఁ జూచి,వానిసుమహితకార్ముకత్వంబుఁ జూచి
మనుజు లవ్విభుజోకకుమారుఁ బోల్తు,రతనిసౌందర్యమును శౌర్య మట్టిదగుట. 89
చ. అతిశయసంపదల్ గులుకునందపుఁజూపు నిదర్శనంబుగా
నతనివిశాలనేత్రములయందు వసింపఁగఁబోలు లక్ష్మి త
చ్చతురతకోడియున్నజలజంబులయందలి యునిక్కమాని ని
ర్జితులధనంబు లెల్ల జయసిద్ధులఁ జేరుట యుక్తమేకదా. 90
ఉ. శారదవేళయందు సరసంబగుపున్నమనాఁటిరేయి ని
ర్ణీరదరాజితాభ్రమున రెండవయామమునిండుచున్నచోఁ
జారుకళాభిరాముఁడగుచంద్రుఁ డొకించుక సాటివచ్చు దు
ర్వారకళంకదోషము తొలంగుటఁ గల్గినరాజుమోముతోన్. 91
శా. ఆరాజేంద్రునిచెక్కుటద్దములపై వ్యాపించులీలాదర
స్మేరజ్యోత్స్న జపాప్రసూనవిలసజ్జిహ్వాగ్రసింహాసన
ప్రారూఢస్థితిఁబోల్చు శారదమనోజ్ఞాకారశోభాసుధా
పూరం బుద్గతమైనచందమున నొప్పున్ లోచనానందమై. 92
సీ. అకలంకలావణ్యతాఖండసుందరతనువిలాసంబునఁ దనరుకొఱకు
నలపార్వతీపతియమృతాంశుమయమైన కడకంటిచూపులు వడయుకొఱకు
నన్నివేళలయందు నధికవైభవసమన్వితుఁడై జగంబుల వెలయుకొఱకు

జంభాంతకాదినిర్జరబృందమాననీయప్రాభవంబున నలరుకొఱకుఁ
తే. ఇంద్రమదనవసంతనాసత్యులైక, మర్త్యమున నేకరూపమై మహి జనించి
నటులు సౌందర్యగరిమచే నతిశయిల్లుఁ,జారుమూర్తి పురూరవశ్చక్రవర్తి. 93

ఉ. ఆనరనాథుఁ జూచిన లతాంగులడెందపుఁగుందనం బయో
గానలకీలలం గరఁచి యందుఁ దదీయమనోహరాకృతిం
బూని దృఢంబుగాఁగ నిలుపన్ వలపుంబడియచ్చుచేత నా
నాసె వినోదము ల్సుమశరాసనకాంచనకారికృత్యముల్. 94

క. ఆనృపతిఁ దలంచినచం,ద్రాననలకు సాత్త్వికోదయం బగు లక్ష్మీ
జానికళోదితుఁ డట త,ద్ధ్యానంబున సాత్త్వికోదయం బగుటరుదే. 95

మ. తమప్రాణేశులు గారవింపఁగ నెలంతల్ నిండుకౌఁగిళ్ల నం
దముగా నుండియు నప్పురూరవుని సౌందర్యంబు భావింతు రు
ష్ణము దీర్ఘంబును గంపితంబు నగునిశ్వాసంబు వాటిల్ల భ
ర్తృమనశ్శంకగతాపరాధపునరుక్తిం బాయగాఁ జేయుచున్. 96

సీ. కొలువు సేయఁగవచ్చుకొదమసాయపువారసుందరు ల్నృపుసొంపు చూచిచూచి
యాత్మసాక్షాత్కారమైయున్న యతనికిఁ దమయౌవనంబులు దక్కనిచ్చి
పరిరంభణాదులైనరహస్యచేష్టల నతఁడు క్రీడించినయట్లు దలఁచి
భ్రాంతితో సత్యానుభవబుద్ధిఁగైకొని యానందపారవశ్యంబు నొంది
తే. మగుడఁ దెలివొంది యతని నెమ్మొగము చూడ,సిగ్గుపడుచుందు రేమనిచెప్పవచ్చు
నట్టివలపుల నాఱడిఁబెట్టుచున్న,చెఱకువిలుకానికైతవచేష్టితములు. 97

మ. అయ మర్థిజన యంచు యాచకలలాటాంతస్థలిన్ బ్రహ్మని
ర్ణయతన్ వ్రాయవహించునట్టి లిపియర్థంబున్ విశేషాన్వయ
క్రియగా నర్థమవారిగా నొసఁగి యర్థింజేయు వాగీశుప్రాఁ
తయు నాత్మీయవితీర్ణియు న్నిజముగా ధాత్రీశు నేర్పెట్టిదో. 98

సీ. బిరుదాంకపటజాతమరుదాహతిని విగ్రహములకు నిస్సత్త్వమావహిల్ల
భూరిసేనాసముద్ధూతధూళీవ్యాప్తి గాఢాంధకారంబు గ్రమ్ముకొనఁగ
భేరీగభీరభాంకారనాదార్భటీపటిమచే గుండియల్ బగ్గుమనఁగ
శాతహేతిచ్ఛటాచ్ఛవిస్ఫూర్తిచే మిగులుగన్నులు మిఱుమిట్లుఁగొనఁగ
తే. సాలభంజికలనుబోలి శత్రుకోటి, ప్రాపితస్తంభులగుచు దూరములయంద
రిచ్చపడుదురు విజయధురీణుఁడైన, యప్పురూరవుధాటి కేమనఁగవచ్చు. 99

శా. ఆరాజేంద్రకులావతంస మొకనాఁ డత్యంతసంప్రీతినా
నారత్నప్రకరప్రకీర్ణసముదీర్ణస్వర్ణవాతాయనో
దారస్తంభవిటంకకుడ్యపటలోద్యద్వేదిగోపానసీ
ద్వారస్ఫారకవాటశోభితసభాస్థానాంతరస్థాయి యై. 100

సీ. చరణాబ్జనఖకాంతిచంద్రిక ల్నతభూపముకుటాగ్రమణులపై ముసుఁగువార
గణుతింపరానిచక్కఁదనంబు ప్రేక్షకవీక్షణంబులకును విందులొసఁగ
గంభీరమధురవాక్యచమత్కృతు ల్సభాసదులకుఁ గర్ణరంజన మొనర్ప
సానుగ్రహములైన యవలోకనము లర్థికోటి కిష్టార్థము ల్గురియుచుండ
తే. విగ్రహచ్ఛాయకాంచనవిమలమకుట, వలయముఖభూషణములకు వన్నెలొసఁగ
చిత్రకంఠీరవాసనాసీనుఁ డగుచుఁ జెలఁగి కొలువుండె నారాజశేఖరుండు. 101

తే. సత్ప్రసంగంబుదనర నార్జవముఁగలిగి, కడఁగి తగుచోటులను గురుకవిబుధాదు
లుండ సింహాసనస్థుఁడై యుండె నినుఁడు, ధారణీప్రజ కానందకారియగుచు. 102

సీ. వింజామరంబుల విసరుపూఁబోఁడుల కంకణఝుణఝుణత్కారరవము
మురువుగా సుతిఁగూడి మొరయించువైణికవల్లకీసిక్వణక్వణరవంబు
కడుసొంపుగానాడు కర్ణాటనాటికాకనకమంజీరఘల్లురవంబు
ప్రణతపార్థివశిరస్స్రగ్గంధలోలతఁ దిరుగుతుమ్మెదలఝుంకరణరవము
తే. మిళితమగుచు సుధారసగళిత మగుచు, లలిత మగుచు మనోరథఫలిత మగుచు 103
నాదినాదం బపూర్వమోహనవిలాస, మహిమఁ జెన్నొందెఁ దత్సభామండపమున.

సీ. సింధునాయకుదండఁ జేరె జీవనముఁ గల్గుట చాలునని మత్స్యకువలయేశుఁ
డలవత్సనరపతి యాభీరభూమిపాలకుసమీపమున నిల్కడ వహించె
నాడంబరస్ఫూర్తి నమరుచున్న నిషాదనాథునిఁ జేరె గాంధారవిభుఁడు
కెలనఁ గుంతలరాజు బలమధ్యమునఁ జొచ్చి వసియించె బాహ్లికవల్లభుండు
తే. మఱియుఁ దక్కినన్నృపతు లేమాడ్కిఁ దమకుఁ, దగినవారలతోఁగూడి తగిలి నిలిచి
రధిపుఁ బొడఁగనుఖండాంతరాధిపతుల, సందడికి నోడియెప్పుడో సమయమనుచు. 104

వ. ఆసమయంబున. 105

పురూరవునియొద్దికి నారదుఁడు వచ్చుట.

సీ. లాంఛనంబు సముజ్జ్వలభుజాంతరస్థితిమహతిరూపంబున రహివహింప
నమృతంబు విష్ణునామాక్షరమధురగాంధర్వరూపంబునఁ దరఁగలెత్తఁ
జంద్రిక ల్ధళధళాచ్ఛశ్వేతశారీరకాంతిరూపంబునఁ గ్రమ్మికొనఁగఁ
జల్లఁదనంబు శశ్వత్కృపారసపూర్ణదృష్టిరూపంబునఁ దేటపడఁగ

కుసుమఁడైన పురూరవక్ష్మాతలేంద్రుఁ, జూడ నేతెంచుచంద్రునిజాడ దోఁప
నరుగుదెంచె నభోమార్గయానమునను, నారదుఁడు మూర్తిజితశరన్నారదుండు. 106

తే. స్వాంతములు పల్లవించెను సత్కదంబ, ములకుఁ బంకజాతమ్ముల పొంక మెడలె
భువనము శుభోదయస్ఫూర్తిఁ బొలుపుమిగిలె, నారదాగమమున కది నైజమకద.

వ. ఇవ్విధంబున. 108

ఉ. వచ్చినఁ జూచి లేచి పరివారముతో నెదురేగి యవ్విభుం
డచ్చపుభక్తి మ్రొక్కి కనకాసనసుస్థితుఁజేసి ప్రాంజలిన్
మెచ్చొదవింపఁగా వినయమేదురమంజులవాక్యవైభవం
బెచ్చ ననేకభంగుల మునీంద్రుఁడు దీవనలిచ్చి వెండియున్. 109

క. కుశలంబె మీకు హితులకుఁ, గుశలమె కుశలంబె బంధుకోటికి నెల్లం
గుశలమె భృత్యశ్రేణికిఁ, గుశలంబె ధరిత్రిప్రజలకు న్మనుజేంద్రా. 110

వ. అనిపలికిన నాసంయమీంద్రచంద్రునితోఁ జంద్రవంశతిలకుండు వినయ
సంభ్రమమాధురీధురీణవచనంబుల నల్లన నిట్లనియె. 111

క. మీకారుణ్యమువలనను, మాకందఱకు న్శుభంబు మౌనీశ్వర మీ
రాకవలన మద్భాగ్యము, లోకస్తుతమయ్యె జగతిలోపల నింకన్. 112

తే. వినుతమోగుణహర్తవై వెలయునీవు, మిత్రరూపంబుతో వచ్చి మేలొసంగ
నిపుడుగద యబ్జకులమున కెలమియగుట, చక్రవర్తిత్వమికఁ గదా స్పష్టమగుట. 113

క. అని పలుకునన్నరేంద్రుని, వినయోక్తుల కలరి మౌనివిభుఁడు తదీయా
ననమునఁ గారుణ్యరసం, బెనయఁ గటాక్షములు నిగుడ నిట్లని పలికెన్. 114

సీ. ఉత్తమాన్వయమున నుదయంబునొందుట సరిలేనిసౌందర్యశాలి యగుట
యఱువదినాల్గువిద్యలఁ బ్రవీణుండౌట పటుబాహుశౌర్యసంపన్నుఁ డగుట
ధరణిచక్రాచలాంతంబుగా నేలుట నిగ్రహానుగ్రహనిపుణుఁ డగుట
వేదశాస్త్రోక్తసద్విధు లాచరించుట యౌదార్యగుణముచే నధికుఁడగుట

తే. హరిహరబ్రాహ్మణార్చనానిరతుఁ డగుట, యాత్మవిదుఁడౌట యొక్కనియందుఁగలవె
పుణ్యనిధివైన నీయందె పొసఁగె నిన్ని, సద్గుణములు పురూరవస్సార్వభౌమ. 115

క. స్తుత్యుం డమరులకైనను, నిత్యోన్నతుఁ డైనధారుణీపతి "రాజా
ప్రత్యక్షదైవత" మ్మన, సత్యవ్రత పూర్వవచనసంగతి వినవే. 116

వ. అనిపలికి వెండియు నమ్మహానుభావుం డమ్మానవపతితో రాజనీతిప్రసంగంబున
నిట్లనియె. 117

నారదుఁడు పురూరవునకు రాజనీతి చెప్పుట.

చ. మతియుతు బుద్ధిశాలిఁ బరమర్మవిభేదనదక్షు సత్కులా
చతురుని శాంతునిన్ సమరసాహసుఁ గార్యవిచారకౌశలుం
బతిహితశీలు షడ్గుణవిభాసురు భృత్యజనప్రజామనో
హితనిజవర్తను న్వసుమతీశుఁడు మంత్రిగఁ జేయఁగాఁదగున్. 118

క. తా నెంతయధికుఁడైనం, గానీ మనుజేశ్వరుండు కార్యాకార్య
జ్ఞానము నిజప్రధానుల,తో నాలోచించి యుక్తితో నెఱుఁగఁదగున్. 119

క. సప్తాంగరక్షణంబును, సప్తోపాయను లొనర్చుసామర్థ్యంబున్
సప్తవ్యసనవిరక్తియు,సప్తద్వీపేంద్రరాజసద్ధర్మంబుల్. 120

సీ. న్యాయంబు దప్పనినడవడితోడను బెంపుగాఁ బ్రజలఁ బాలింపవలయు
నుచితవ్యయంబు సేయుచు నర్థసంపద లొక్కఁదవగాకుండంగఁ గూర్పవలయు
శౌర్యోజ్జ్వలములైన చతురంగబలముల నెంతయు విరివిగా నేలవలయు
సమయంబు బలము విచారించి పైకొని పరరాజ్యమాక్రమింపంగవలయు
తే. నేమఱుటలేక గడిదుర్గసీమలందు, నాప్తులును గార్యఖడ్గప్రయత్నపరులు
నయినవారలఁ దగినసైన్యములతోడ, నునుపవలయును దనపేర్మి యొరులుపొగడ. 121

క. తనరాజ్య మొరులరాజ్యం, బనవలవదు బుద్ధికుశలు లగుచారులఁ బం
చి నిఖిలవార్తలు నిచ్చలు, వినుటొప్పును భూవిభుండు విశ్రుతమతియై. 122

క. బలవంతులతోఁ బగయును, బలవద్బాంధవులతోడి పగయును ధరలోఁ
బలువురతోఁ బగయును మఱి, బలభేదికినైనఁ దెచ్చుభంగముఁ దలపన్. 123

క. చెలిమియ యుచితం బెంతయుఁ, బలవంతునితోడ నతఁడుపగవాఁడైనం
జలియింప కంతకంటెను, బలవంతుని చెలిమివడసి పగ యీఁగఁదగున్. 124

చ. నిజభుజశక్తినైనఁ దననేర్పునఁ దంత్ర మొనర్చియైన న
క్కజముగ వారిపైఁ బలముఁగల్గినవారలఁ గూర్చియైన వై
రిజనవినాశనంబు నొనరింపక జాడ్యముచేత నున్న భూ
భుజుని ప్రభుత్వ మెల్ల నదిపొంతమహీజముగాదె భూవరా. 125

క. విశ్వాసపరుల నెఱిఁగి న, రేశ్వరుఁ డధికారమిచ్చు టెంతయు నుచితం
బైశ్వర్యయుతులు గాఁగ న,విశ్వాసులఁ జేయఁదగదు విమలవిచారా. 126

తే. కరుణ తనకెంతగలిగిన కనకవస్తు, వాహనాదులు చాల నీవలయుఁగాని
భూతలేశ్వరుఁ డెంతయాప్తులకునైన, నాజ్ఞఁ ద్రోవంగ నిచ్చుట యనుచితంబు. 127

చ. కలిమి కొలంది ఠీవి గమకంబు కొలందిఁ బ్రవర్తనంబు దో
ర్బలముకొలందిఁ బూన్కి యనురక్తికొలంది సమాదరంబు మే
లొలయు కొలంది యత్నము నియోగికొలంది నిఖారవిూఁగియుం
దెలివికొలంది మాటయు నుతింపఁగ యోగ్యతఁ దెచ్చు నేతకున్. 128

శా. సర్వజ్ఞత్వముఁ గల్గి కీర్తిలతికాజాలంబు చక్రాద్రిపైఁ
బర్వన్నిశ్చలధర్మమార్గమున సప్తద్వీపసామ్రాజ్యము
న్నిర్వైరస్థితి నేలు నీకుఁ దలప న్నీతిప్రకారంబు లో
యుర్వీనాథ! నిసర్గసిద్ధములు గానోపు న్విచారించినన్. 129

వ. అనిమతియు బ్రసంగోచితంబు లగువిశేషభాషణంబుల నభినందించు మునిపుంగవుం
గనుంగొని వినయనమ్రవదనకమలుం డగుచు మహీవల్లభుం డిట్లనియె. 130

ఉ. ఎందఱు రాజు లీయవని నేలినవా రిఁక నేలనున్నవా
రెందఱు లెక్కసేయఁ దరమే పరమేష్ఠికి నైన నట్లనే
నందఱిలోన నొక్కరుఁడనై ధరయేలుట యెంతప్రాభవం
బిందుల కింత పెద్దగ మునీశ్వర నన్గొనియాడ నేటికిన్. 131

ఉ. దేహము వాయుసంచలితదీపిక పుత్రకళత్రమిత్రసం
దోహము స్వప్నకాలమునఁ దోఁచెడిసందడి రాజ్యభోగస
న్నాహముఁ జంత్రపుంబ్రతిమ నాట్యము సంపద యింద్రజాల మీ
యైహికసౌఖ్య మేమిసుఖమంచుఁ దలంచెదనయ్య నారదా. 132

సీ. కామరోగాదిదుష్కరశత్రువర్గప్రతాపప్రధానసాధనము ధనము
జన్మపరంపరాసంపాదితానేకఘనకర్మజాలవర్ధనము ధనము
కైవల్యసంప్రాప్తికారణవైరాగ్యధర్మమార్గావరోధనము ధనము
సకలావగుణపుంజసంశ్రయాశారూపదారుణనిగళబంధనము ధనము
తే. గలిగి గర్వంబు దొట్టి దుఃఖంబు మదికిఁ, బెనుచు నజ్ఞానపావకేంధనము ధనము
స్వప్నలబ్ధపదార్థంబు చందమునను, దలఁచి జూడంగ వట్టిదంధనము ధనము. 133

ఉ. చక్కెరపూఁతపూసిన విషంబులు భామలవాక్యవైఖరుల్
చక్కఁగ వెన్న మెత్తినసిలల్ విరిబోఁడులచిత్తము ల్మఱు
ల్చెక్కినసంకెలల్ సతులచేష్టలు కొమ్మలనమ్మవచ్చు నే
యక్కట మేఁకవన్నెపులు లంగన లెన్నిట నెన్నిచూచినన్. 134

క. చన్నులు మాంసపుముద్దలు, గన్నులు దుర్జలముఁ బుసులుగా జెడితోరటల్
వెన్నులు నెముకలపాతర, లన్నుల నిటు తెలిసి వలచు టవివేకమె కా. 135

తే. మూత్రపతనస్థలం బపవిత్రమనుచుఁ, ద్రొక్కరా నేలఁగనిరోసి తొలఁగుచుందు
రట్టిమూత్రపుగాలువ యైనదోలి, యోని దానికిరోయ దీయుల్లమహహ. 136

చ. కొడుకులు గల్గుదాఁక నొక కొన్ని దినంబులు చింత నందనుల్
వొడమిన నాయువున్ బలము బుద్ధియు విద్యయుఁ జాలఁగల్గఁగా
నుడుగనిచింతఁ గల్గి తనునోలిభజింపనిచింత తండ్రికె
ప్పుడు గడుచింతసేయుదురు పుత్రులు శత్రులుగాక మిత్రులే. 137

వ. మునీంద్రా! పుత్రదారధనాదిసంగరహితులై విషయసుఖంబులం బరిత్యజించి యరణ్యగిరిగుహాంతరప్రముఖవివిక్తప్రదేశంబులం గందమూలఫలంబు లాహారంబులు సేయుచు మోక్షసామ్రాజ్యపట్టాభిషిక్తు లగుమహానుభావుల జీవనంబు పావనం బని తోఁచుచున్నయది రాగద్వేషమూలంబైన యీతుచ్ఛసామ్రాజ్యం బెంతపూజ్యంబు సార్వభౌమత్వాభిమానంబున నవిద్యామగ్నులమైన మావంటివారలకు సంసారపారావారంబు తరించునుపాయం బెట్లు గలుగు నానతి మ్మని మోక్షాపేక్షం బ్రార్థించినం బార్థివోత్తమువాక్యంబు లాకర్ణించి హర్షోత్కర్షమానసుండై నీప్రశ్నం బింతయొప్పునే యిట్టివైరాగ్యంబు బహుజన్మసుకృతసంచితతపఃప్రభావంబువలనం గాక సంభవించునే యని వికసితవదనారవిందుండై యత్తపోధనసత్తముండు నృపోత్తమున కి ట్లనియె. 133

నారదుం డాత్మవిద్యోపదేశము చేయుట.

తే. అడిగితివి వేదశాస్త్రసారాంశమైన, యట్టిపరమరహస్యంబు నవనినాథ
యడుగుదురుగాని ధర్మకామార్థఫణితు, లడుగ రెవ్వరు నీభంగి నాత్మవిద్య. 139

శా. అజ్ఞానంబునఁ దోఁచుసంసరణదుఃఖావాప్తి యజ్ఞాన మా
త్మజ్ఞానంబున నాశనంబగు దదాత్మజ్ఞాన మయ్యీశ్వరా
నుజ్ఞం గాని ఘటింప దీశ్వరుఁడు సంతోషించు వేదోక్తమా
స్వాజ్ఞ న్వర్తిలుధర్మము న్నరుఁడు కర్తై సేయు సద్వృత్తికిన్. 140

ఉ. కావునఁ గర్మనిష్ఠ గతకల్మషుఁడైన ముముక్షుఁ డయ్యవి
ద్యావరణంబు వాసి సముదంచితబోధమునొందుబోధలీ
లావిభవంబుచేత సకలంబును బ్రహ్మముగా నెఱుంగు ద
ద్భావము నిశ్చలంబయిన బ్రహ్మముఁ దానగు నిర్విశేషతన్. 141

వ. నరేంద్రా! యద్వితీయంబును, నపరిచ్ఛిన్నంబును, నాద్యంతరహితంబును, సచ్చిదానందస్వరూపంబును నయి శుద్ధచైతన్యంబైన బ్రహ్మం బొక్కటియె వెలుంగుచుండు; నట్టిబ్రహ్మంబునందు నధ్యస్తయై, యనాదియై, మిథ్యాభూతయై, తచ్ఛక్తియై, త్రిగుణాత్మకయై, నిర్వచనీయయై, కలుగందోఁచుమూలప్రకృతి యవస్తువయ్యును దదాశ్రయత్వదద్విషయత్వబలంబునం జేసి వస్తువుంబోలి ప్రకాశించుచు నాత్మసత్తాస్ఫూర్తులవలనస్ఫురద్రూపంబై యావరణవిక్షేపరూపంబులు దాల్చియుండునట్టిప్రకృతి సాత్త్వికగుణప్రకాశంబువలన మాయయనంబడు; నమ్మాయయందుఁ బ్రతిఫలితంబగు చైతన్యంబును మాయాధిష్ఠానచైతన్యంబును నమ్మాయయుంగూడి కారణోపాధికుండైన యీశ్వరుండై సర్వజ్ఞత్వసర్వేశకత్వసర్వనియంతృత్వసర్వేశ్వరత్వాదిధర్మంబులుగలిగియుండు; నయ్యీశ్వరుండు తమోగుణప్రకాశిని యగుమాయనీక్షించినఁదత్సంకల్పవశంబున శుక్తియందు రజతాధ్యారోపంబును, రజ్జువునందు సర్పాధ్యారోపంబును, స్థాణువునందుఁ బురుషాధ్యారోపంబును దోఁచుకైవడి భ్రాంతికల్పితంబులై మహదహంకారంబులును, శబ్దస్పర్శరూపరసగంధసమేతంబులై, త్రిగుణాత్మకంబులై గగనపవనాగ్నిజలభూతత్త్వంబులును క్రమంబున సంభవించె నవి సూక్ష్మభూతంబు లనంబడు నాభూతంబులు పంచీకృతంబులై యన్యోన్యభాగమేళనంబున స్థూలభూతంబు లయ్యె నాస్థూలభూతంబులవలన స్థూలశరీరంబును, సూక్ష్మభూతంబులవలన సూక్ష్మశరీరంబును, మాయవలనఁ గారణశరీరంబు నయ్యె; నిట్లు సమష్ట్యుపాధులైన యేతత్త్రయంబున నీశ్వరుండు క్రమంబున విరాట్టును, హిరణ్యగర్భుండును, నహంకృతుండును, ననుసంజ్ఞలనొప్పుచు, నవాంతరసృష్టిస్థితిప్రళయనిమిత్తంబున రజస్సత్త్వతమోగుణావలంబనంబున, బ్రహ్మవిష్ణురుద్రరూపంబులఁ గ్రీడించుచుండు నిది సమష్ట్యుపాధికుండైన యీశ్వరుని ప్రకారంబు, ఇంకవ్యష్ట్యుపాధికుండైన జీవుని ప్రకారంబు వినుము, ప్రకృతిరజస్సత్త్వతమోగుణప్రకాశంబువలన నవిద్యయనంబడు నయ్యవిద్యారూపంబైన యంతఃకరణంబునందుఁ బ్రతిఫలితంబైన చైతన్యంబును నంతఃకరణాధిష్ఠానచైతన్యంబును నయ్యంతఃకరణంబునంగూడి జీవుం డనుసంజ్ఞఁగలిగి యయవిద్యావశతం గార్యోపాధికుండై స్వరూపవిస్మృతినొంది కించల్ జ్ఞుండై యుండునట్టిజీవునికి స్థూలభూతజన్యంబై స్థూలశరీరంబును సూక్ష్మభూతజన్యంబై జ్ఞానేంద్రియకర్మేంద్రియ పంచప్రాణమనోబుద్ధిరూపంబైన సూక్ష్మదేహంబును నవిద్యారూపంబైన కారణదేహంబునుం గలిగియుండు నందు విశ్వతైజసప్రాజ్ఞులనుసంజ్ఞల జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థల

యందు స్థూలప్రవిక్తానందభోగంబు లనుభవించుచు జీవుం డహంకారయుక్తుండై కర్తృత్వభోక్తృత్వాదిధర్మంబులు తనయందునారోపించుకొను నయ్యవివేకంబువలన నభిమానంబును నభిమానంబువలన రాగద్వేషాదులును రాగద్వేషాదులవలనఁ గర్మంబులును గర్మంబువలన దేహంబును, దేహంబువలన సుఖదుఃఖంబులును, బ్రాప్తంబు లగుచుండు నందునొకానొకపురుషుండు పురాకృతసుకృతవిశేషంబున బహుజన్మంబులలో నొక్కంట సంసారనివర్తనంబునకు నుద్యోగియగు నట్టివాఁడు సత్సంగతివలన సన్మార్గవర్తియై పాపంబులంబాసి జ్ఞాననిష్ఠుండగు జ్ఞాననిష్ఠవలనఁ జిన్మాత్రవ్యతిరిక్తం బయినవస్తువెద్దియుం గలుగఁ దనియును గలిగిన యట్లుతోఁచుచున్న సకలజగంబును నెండమావులుబలంబులై తోఁచినకైవడి మనోవిభ్రాంతికల్పితంబు లనియుం దెలిసి కార్యకారణోపాధులు మిథ్య యగుటం జేసి యీశ్వరత్వజీవత్వంబు లసత్యంబని ఘటపటోపాధ్యభావంబునం దదంతర్గతాకాశంబును మహాకాశంబును నేకంబైనయట్లనుస్యూతంబయిన యాత్మయొక్కటి యను నిశ్చయంబున బ్రహ్మైక్యానుభవంబునం దన్మయుండై యుండు నతండు జీవన్ముక్తుండై, ప్రారబ్ధక్షయానంతరంబున విదేహకైవల్యప్రాప్తుం డగు నని వెండియు నిట్లనియె. 142

శా. నామంబు ల్మఱి రూపము ల్క్రియలు నానాభంగులం దోఁచు ని
ద్రామోహంబున స్వప్నమున్వలె నవిద్యం జేసి సత్యంబుగా
దేమిన్ జ్ఞానికిఁ దోఁచినట్లయిన బ్రహ్మీభూతమై యుండు నో
భూమీశోత్తమ చిన్మయంబు సకలంబు న్వేఱులే దింతయున్. 143

క. చిత్తనియెను సాగరమునఁ, జిత్తం బనువాయువశత సృష్టితరంగో
త్పత్తి యగుఁ జిత్తమడఁగిన, నత్తఱి జగమడఁగు ముక్తియన నదియకదా. 144

క. ఏలాపలుచదువులు బ్రహ్మలోకనసుఖము తనకు ననుభవమగునా
కీలెఱుఁగుట మేలెఱుఁగుట, భూలోకసురేంద్ర సూక్ష్మబుద్ధిం గనుమా. 145

క. ఆరూఢుఁడు ముక్తినగా, నారూఢుం డారురుక్షుఁ డారోహణకా
ర్యారంభపరుఁడు గావున, నారెంటికిఁ గలదె భేద మధికారముల౯. 146

తే. కామి కర్తయుఁగాక సత్కర్మములు శి, వార్పణంబులు సేయుచు నారురుక్షుఁ
డరయ నారూఢుఁ డగునుగాలాంతరమున, నతని కెద్దియుఁ గర్తవ్య మపుడులేదు.

ఈ. మాటలు వేయునేల నొకమర్మము సెప్పెద మోక్షదాతవై
పాటిలు విష్ణుశంకరుల భక్తి దృఢంబుగఁ గల్గెనేని నా

నాఁటికి వానికన్ని సుగుణమ్ములు దామె ఘటింప ముక్తుఁడౌ
బూటకపున్విచారములఁ బోవఁగ నేమిఫలంబు భూవరా. 148

క. సుగుణంబెఱిఁగి భజించిన, నగు నిర్గుణసిద్ధి సిద్ధుఁడగు నాతనికిన్
జగమెల్లను బ్రహ్మమయం, బుగఁదోఁచును సర్వకాలమును నొక్కగతిన్. 149

సీ. బయల సంరంభిలోపల నసంరంభియై కార్యతంత్రంబులు గడపెనేని
సఫలప్రయత్నంబు విఫలప్రయత్నంబు దనకుఁ దుల్యంబుగాఁ దలఁచెనేని
ననివార్యమై కర్మమునవచ్చుసుఖము వర్జించినయట్లు భోగించెనేని
సౌఖ్యంబు దుఃఖంబు సంప్రాప్తమైనచో నుబ్బుసుక్కులు లేకయుండెనేని
తే. జీవపరమేశ్వరైక్యసచ్చిత్సుఖాను, భూతి నిస్సంశయాత్ముఁడై పొలిచెనేని
నతఁడు ప్రారబ్ధమున వ్యవహారియైన, ముక్తిసామ్రాజ్యపట్టాభిషిక్తుఁ డగును. 150

చ. వనమున నున్న నేమి గృహవాసము చేసిన నేమి యాత్మభా
వనయు నసంగవృత్తి యరివర్గజయంబును గల్గియుండినన్
వనమున నున్న నేమి గృహవాసము చేసిన నేమి యాత్మభా
వనయు నసంగవృత్తి యరివర్గజయంబును లేకయుండినన్. 151

క. దేహము తాఁగాననిజ, మూహింపఁగ నేర్చినట్టి యుత్తమునకుఁ ద
ద్దేహమునకైన బాంధవ, దేహంబులు మిథ్యలనుచుఁ దెలియంబడవే. 152

సీ. పుత్రమిత్రకళత్రమైత్రివర్తిల్లు వసిష్ఠసంయమి బ్రహ్మనిష్ఠ వినమె
కర్మఠుండై రాజధర్మమూనిచరించు జనకుని విజ్ఞానచర్య వినమె
వాణిజ్యవృత్తి జీవనుఁడైన యలతులాధారుని పూర్ణబోధంబు వినమె
కటికిగాయకముచేఁ గాలంబుఁగడపు ధర్మవ్యాధు విజ్ఞానమహిమ వినమె
తే. వారిప్రారబ్ధమున నుండవలసి జ్ఞాను, లెట్టివ్యవహారముల నున్న నేమి కొదవ
జ్ఞానవైరాగ్యనిశ్చలానందపూర్ణు, లైనవారు జీవన్ముక్తులగుట నిజము. 153

క. ఏయాశ్రమమున నుండిన, నాయాచారములు నడప కాశ్రమసుఖతృ
ష్ణాయత్తమతిని వంచకుఁ, డైయే నిష్కర్మి ననుట నర్థముగాదే. 154

ఉ. కర్మము బంధకంబని సుకర్మము మాని సుఖంబుగోరి దు
ష్కర్మము సేయుచు న్బుధులు కాదనిన న్విన కాత్మకున్న వే
కర్మములంచుఁ దాఁజెడుటగా కొకకొందఱజ్ఞాననిష్ఠుం
గర్మఫలాప్తికిం జెఱుచుఁ గాపురుషుం డుపదేష్టనంచు ని
ష్కర్మికి నాస్థలేదుభయకర్మములు స్వవిధిచే ఘటించినన్. 155

శా. జ్ఞానారూఢుఁడు బాహ్యచేష్టల మనస్సంకల్పుఁడై చేయునే
మైనం బాకృతునట్లు వానిఁ గని తానాచేష్టలే చేయఁగాఁ
బోనల్పజ్ఞుఁడు వంచనన్మదిఁ దలంపు ల్మాన కారూఢుఁడ
న్నేనంచున్ ఫలమేమి చేష్టల మది న్నిశ్చింత లేకుండినన్. 156

ఆ. మనసుచల్లఁబడక మాట లెన్నాఁడిన, ముక్తిగాదు వాదశక్తిగాని
మనసె కారణంబు మఱిబంధమునకు మో, క్షమునకనుచుఁ దెలుపు చదువువినమె.

క. జ్ఞాతృజ్ఞానజ్ఞేయము, లేతెఱఁగునవేఱు దోఁప కేకంబుగ న
ద్వైతాత్మత వెలుఁగు ప్రపం, చాతీతుం డెవ్వఁ డతఁడె యారూఢుఁడిలన్. 158

క. ఇది నగర మిది యరణ్యం, బిది సౌఖ్యం బిదియసౌఖ్య మీతఁడు పురుషుం
డిది సతి యనితోఁపద యె, య్యది చూచిన బ్రహ్మమయము యారూఢునకున్.

తే. సంగములు సర్వమును గల్గి సంగికాఁడు, భోగములు సర్వమును జెంది భోక్తగాఁడు
కార్యములు సర్వములుచేసి కర్తగాఁడు, విగతసంకల్పుఁ డగుబ్రహ్మవేత్త యధిప.

ఆ. ఇచ్ఛలేనియోగి కింద్రియంబులు కర్మ, వశతచే స్వభావవర్తనముల
మెలఁగుచున్ననేమి యిలఁబుణ్యపాపంబు, లంట వతఁ డకర్తయగుటఁజేసి. 161

తే. నిర్విషయచిత్తుఁ డగుబ్రహ్మనిష్ఠునకును, దనుసుఖంబులు ప్రారబ్ధమునఘటించు
నంతియేకాని యవి వానినంటకుండు, గమలపత్రాగ్రమున జలకణికవోలె. 162

తే. శయ్యనుండియుఁ బెక్కుదేశములవెంటఁ, దిరుగఁ గలగాంచుచున్ననిద్రితునిభంగి
సచ్చిదానందుఁ డయ్యుఁ దా జననమరణ, బాధలనుబొందిన ట్లుంట భ్రాంతిగాదె.

క. కలలోన నఱుకులాడినఁ,గలవే గాయములు మేలుకాంచిన వెనుకం
దెలియక మునుపటిసంస్కృతి, కలఁకలువిజ్ఞాని కేల గలుగందోఁచున్. 164

క. ఆయెఱుక దొరకు కొఱకుఁ గ,దా యోగజపాదినిష్ఠ లాయెఱుక దృఢం
బైయున్నతఁ డేక్రియలం, జేయఁడు లోకోపకృతికిఁ జేసిన జేయున్. 165

మ. తొలిజన్మంబున నైన నిప్పుడయినన్ దుష్కర్మనిర్మూలనం
బిల బ్రహ్మార్పణసత్క్రియామహిమచే నెంతేధృతిం జేసి ని
ర్మలు,డైనన్ శ్రవణంబు తన్మననముద్రాసన్నిధిధ్యాసలున్
సులభంబౌ శ్రవణాదు లబ్బక చలించుం దామసత్యాగతన్. 166

క. ఈమేనను సత్కర్మము, లేమియుఁ జెందకయె చెందు నిద్ధజ్ఞానం
బామునుపటిభవమున ని,ష్కామసుకర్మాప్తి విగతకల్మషుఁడైనన్. 167

ఉ. చేయఁడు సత్క్రియల్బయలఁ జేసినయట్లు సుఖించు లోపలం
జేయును గార్యముల్ బయలఁ జేయనియట్లు సుఖించు లోపలం
జేయఁడు కృత్యమంచు మఱి చేసె నకృత్యమటంచు నెంచ రా
జేయెడ బ్రహ్మవిద్య తుదకెక్కినయట్టిమహానుభావునిన్. 168

చ. అమితములై ఘటించు విషయానుభవంబుల భోగి యయ్యు ను
త్తముఁడగుయోగి బ్రహ్మమయి తన్మది రంజిలుచుండు గీతనృ
త్యములను దాళమానవశుఁడయ్యు శిరస్థితపూర్ణకుంభమున్
సమధికయుక్తి నిల్పికొనఁ జాలిననాట్యధురీణుకైవడిన్. 169

గీ. తలఁచినఁ దలంపకున్న నిత్యప్రబోధ, పూర్ణుఁడగు తాను దాఁగాకపోవు టెట్టు
తెలియఁగఁ దగుగుఱి తనకంటె నెద్దిలేక, యెఱుక మఱపులు సమమైన యెఱుకయెఱుక.

వ. అని పలికి వెండియు నిట్లనియె. 171

ఉ. కోరకు మేపదార్థమును గోరినవచ్చునె రానివస్తువుల్
గోరకయున్న రావె తనకున్ లభియింపఁగ నున్నయర్థముల్
గోరినరానిచోఁ గలిగికోల్పడుచో వెతగాన సజ్జనుల్
గోర రనాస్థఁ బ్రాప్తములు గొందురు కుందరు వస్తుహానికిన్. 172

శా. ప్రారబ్ధంబగు మేన నే యనుభవం బౌచుండఁ దత్సాక్షివై
యారూఢస్థితి సర్వమున్ మఱచి సర్వావస్థలం జిత్సుధా
ధారాపానసుఖాప్తి సర్వగతశుద్ధబ్రహ్మమేనంచు శం
కారాహిత్యము మానుమీ యదియ మోక్షప్రాప్తి భూవల్లభా! 173

సీ. ఆసక్తిలేకయత్నాయత్నత ఘటించు ననిషిద్ధసుఖముల ననుభవింపు
ప్రారబ్ధవశత నాపత్సంపదలు వచ్చు వగపుబ్బును మదిఁ దగులనీకు
కర్తవుగాక లౌక్యములు శాస్త్రీయంబులైనట్టియుచితకార్యములు సేయు
మాత్మనిశ్శంకత నద్వైతివై తేలి కృత్రిమద్వైతతఁ గ్రీడసలుపు

తే. పోడమునజ్ఞానమున నది వోవఁబోవ, నఖిలసంసారమును మిథ్యయని యెఱుంగు
సచ్చిదానంద మిదియవస్థాత్రయైక, సాక్షి నీవౌటఁ దెలియుము మోక్షమిదియ.

తే. సకలమును జిన్మయముగ దృశ్యములు మదిక, దృశ్యములుగాఁ దలంచి నిస్పృహతఁ
వర్తివై దైవగతి నేలవలయు రాష్ట్ర, మేలు మనహంకృతిని శంకయేల నీకు. [గార్య

చ. అని మునిపుంగవుండు నిగమాంతరహస్యసమగ్రవాగ్రసా
యనము కృపామతిన్ మిహిరాన్వయుకర్ణపుటంబులందు నిం

చిన బహుజన్మభాగ్యమునఁ జేసి యవిద్యఁ దొలంగి సత్యమై
యనుభవమయ్యె నాత్మఁ జిదహంబను సంస్కృతి సుస్థిరంబుగన్. 176

వ. ఇట్లు పరమజ్ఞానసంపన్నుం డయిన యమ్మహామునీంద్రు నుపదేశంబున నానృపాల శేఖరుం డఖండసంపత్పరిపూర్ణుం డై యానందంబున నతనికి సాష్టాంగవందనంబులు చేసి యనేకవిధంబులఁ బ్రస్తుతించె. నారదుండును నతనిమనీషావిశేషంబునకు సంతోషించుచు బహుభంగుల నాశీర్వదించి వీడ్కొని స్వర్గగమనోన్ముఖుఁడయ్యె నప్పురూరవుండును యథేచ్ఛాప్రవర్తనంబున సుఖస్థితుండయ్యె నంట నారదుండు చనిచని. 177

నారదుఁడు నాకమున కేఁగుట.

శా. కాంచె న్మౌనివరుండు ముందట నభోగంగాతరంగచ్ఛటా
చంచచ్చంచలచంచరీకచయసంచారంబు భూసంచయా
కించిద్బంధురగంధబాంధవమరుత్ఖేలాగవాక్షావళీ
ప్రాంచత్సౌధచరప్రియాన్వితసుపర్వానీకమున్ నాకమున్. 178

సీ. వివిధదానాధ్వరోత్సవపుణ్యపరిపాకఫలభోగదేశ మేపట్టణంబు
తావలంబై యొప్పు నేవీడు కల్పపాదపకామధేనుచింతామణులకు
భువనత్రయాధిపత్యవిభూతి నొప్పు సుత్రామున కేప్రోలు రాజధాని
గరుడగంధర్వకిన్నరసిద్ధచారణాహీంద్రాదిసేవితం బేపురంబు

తే. సకలసౌభాగ్యలక్ష్మీప్రశస్తినగ్ర, మగుచు నేపుటభేదనం బమరుచుండు
నట్టియమరావతిని గాంచి యంతరంగ,మునఁ బ్రమోదంబునొందె నమ్మునివరుండు.

క. ఆదిత్యమండలస్థితి, చే దీపితమైన దివము చెలువునఁ దగి య
య్యాదిత్యమండలస్థితి, చే దీపితమైన దివము చెలు వమరంగన్. 180

వ. కని తదీయవిశేషంబు లగ్గించుచు నట చని. 181

సీ. ఒకచోటఁ బ్రకటహాటకసముద్యద్దీప్తిపుంజ మాతపపరిస్ఫూర్తి చూప
నొకచోటఁ బద్మరాగోపలప్రభలు సంధ్యారాగవిభ్రమం బావహింప
నొకచోట వజ్రమౌక్తికధాళధళ్యవినిర్మలరుచులు వెన్నెలలుగాయ
నొకచోట హరినీలనికరవిస్ఫుటనైల్యకాంతులు చీఁకటుల్ గ్రమ్మఁ జేయ

తే. మిశ్రబహువిధమణిగణామితమరీచి, జాల మొకచోటఁ గిమ్మీరలీల నింప
వైభవశ్రీసమున్నతి వర్ణనీయ, మగుసుధర్మాభిధానసభాంతరమున. 182

మ. ఘనచింతామణిభద్రపీఠమున రంగల్లీల నాసీనుఁడై
వినతాశేషసుపర్వసంఘమకుటావిర్భూతదీప్తుల్ప్రదా
బ్జనఖశ్రీల భజింప భూషణమణిచ్ఛాయ ల్వెలుంగన్ శచీ
స్తనకుంభద్వయగంధసారయుతముక్తామాలికోరస్కుఁ డై. 183

ఉ. ముందొకవేళ యందు సురముఖ్యుఁడు పద్మములందు డాఁగినాఁ
డందుకు నాఁటిచెల్మిని సహస్రదళంబులఁ బాయలేక మైఁ
బొందొనఁగూడ నుంచుకొనఁబోలుఁ జుమీయన వేయికన్నులున్
సుందరమై వెలుంగఁ గడుశోభిలుచున్న నిలింపవల్లభున్. 184

మ. కలితాష్టాపదరత్నకంకణఝణత్కారప్రయుక్తాప్సరో
లలనాహస్తసరోజచామరమరాళవ్రాతసంజాతకో
మలవాతప్రకటాంగరాగవిలసన్మందారమాలాసము
జ్జ్వలసౌరభ్యవిశేషహృష్టసభికస్వాంతున్ శచీకాంతునిన్. 135

క. కనుఁగొని తత్ప్రత్యుత్థాననమస్కారంబులను మనంబలరఁగ దీ
వనలిచ్చి యమ్మునీంద్రుం, డనుపమకనకాసనస్థుఁడయియున్న యెడన్. 186

క. చారణవిద్యాధరగరు,డోరగగంధర్వముఖ్యు లుచితస్థితులం
జేరి వినయంబుతో జం,భారాతిం గొలిచియుండి రాసభలోనన్. 187

వ. అప్పుడు. 188

మ. పదవిన్యాసవిలోలనూపురకదంబస్వానముల్ ఘల్లనన్
మదదంతావళరాజయానములతో మాణిక్యహారావళుల్
కుదురుంజన్నులపై వెలుంగ సుమనఃకోదండపాండిత్యసం
పదఁ బెంపొందిన యూర్వశీముఖ నిలింపస్థానవేశ్యామణుల్. 189

సీ. సోమపానపవిత్రసుముఖులుగాక యీయధరబింబామృతం బానఁగలరె
వైరిహేతివిశీర్ణవక్షులుగాక యీపాలిండ్లఁ గౌఁగిటఁ బట్టఁగలరె
బహుదానవిఖ్యాతబాహులుగాక యీనిద్దంపుఁజెక్కిళ్లు నివురఁగలరె
ఘనతపోవ్రతకృశగాత్రులుగాక యీయుత్సంగశయ్యల నుండఁగలరె
తే. యనుచుఁ గనుచూపులకు వింత బెనుచు ప్రేమ, ననుచుమనములసుర లెంచుకొనుచు నుండ
మదనదైవతమోహనమంత్రశక్తు, లనఁగ నచ్చర లేతెంచి రపుడు సభకు. 190

తే. వచ్చి పురుహూతునకు మ్రొక్కి వరమృదంగ, వాద్యరవహృద్యతాళానవద్యనాట్య
విద్య చోద్యంబుగాఁగఁ బ్రవిస్తరించి, పడఁతులొనరించి రప్పుడు భరతఫణితి. 191

సీ. చెలఁగుమద్దెలమ్రోఁత జిలుగురాణింపంగఁ బదపద్మముల లయప్రాప్తిచూపి
లయధృతమధ్యవిలంబము ల్రహిఁ దాళశారీరమున గీతసరణి నెరపి
గీతమాధుర్యవాగ్విభవంబు బయలుగా నాశయముల నర్థాభినయ మొనర్చి
యర్థాభినయమున కందంబుగా లోచనంబుల రసపోషణంబుచేసి
తే. రసము శృంగారవీరాదిరమ్యగతుల, జూపఱుల డెందములు నిండి సొరిది వెల్లి
విరిసి ముఖపంకజంబుల విశ్రమింప, నాట్యమాడిరి మగువ లానందమొదవ. 192

చ. దదిగణతెయ్యటంచు సముదంచితమర్దళతాళమానసం
పద జతగూడ నబ్బిరుదుపాత్రలు చేయుఁకళాంజిక ల్ప్రిమో
దదమగుచుండెఁ బో తళుకుతళ్కుతళుక్కనుచు న్వెలుంగునం
బుదనినదార్భటీసహితభూరిళటిల్లలికాసమంబులై. 193

సీ. వేదశాస్త్రపురాణవిద్యాప్రసంగము ల్చేరిమహర్షులు చేయుచుండ
బలపాకజంభనిర్దళనాదివిజయము ల్విద్యాధరేంద్రులు వినుతిసేయఁ
గడఁగి షడ్జర్షభగాంధారముఖరవఫణితి గంధర్వులు పాటవాడఁ
గుండలీప్రేరణీదండలాసకముఖ్యనృత్యంబు లచ్చర ల్నెఱపుచుండఁ
తే. జెలఁగి త్రిభువనరాజ్యలక్ష్మీవిరాజ, మాన వైభవలీలాసమానగరిమ
నిట్లు గొలువున్న యవ్విభు ధేశ్వరుండు, పలికె నారదమునిఁ జూచి ప్రస్ఫుటముగ.

శా. ఏలోకంబున సంచరించితిరి మీరేయేవిశేషస్థలం
బాలోకించితిరి రే ప్రసంగమున మీకచ్చోట నిన్నాళ్లుఁదాఁ
గాలక్షేపము చెల్లె సంశ్రవణముం గావింపు శ్రోతవ్యవా
ర్తాలాలిత్యవచస్సుధారససుధాధారాపూర్తి నోనారదా! 195

వ. అనిన నమ్మహేంద్రునకు మునీంద్రుం డిట్లనియె. 196

మ. జగదాధారకుఁ డచ్యుతుం డెచట నర్చారూపబాహుళ్యతం
దగు నానావిధపుణ్యవాహినులచేతం బొల్చు నెచ్చోట వెం
పగుసత్కర్మధనంబుఁ గూర్పఁగ నుపాయం బేస్థలం బన్నిటం
బొగడొందు న్భువియందు నుత్తమము జంబూద్వీప మూహింపఁగన్. 197

వ. అందు. 198

సీ. శ్రీపురుషోత్తమక్షేత్రసువ్యక్తస్వభావు జగన్నాథదేవుఁ గొలిచి
మంగళాచలమహామండపాభ్యంతరవర్తి శ్రీనరసింహమూర్తిఁ జూచి

శేషధాత్రీధరశిఖరసౌధాగ్రవిహారివి వేంకటశౌరిఁ గాంచి
కాంచీకనకగోపురాంచితగృహదీప్తశుభతేజు వరదరాజును భజించి
తే. వరకవేరసుతోభయవాహినీత, రంగరంగత్ప్రదేశవిరాజమాన
శేషపర్యంకనిద్రావిశేషణాభి,రాముఁ డగురంగధాము దర్శనము చేసి. 199

క. కాశియుఁ గేదారంబును, శ్రీశైలముఁ గాళహస్తి చిద్గగనము రా
మేశక్షేత్రము మొదలగు, దేశంబుల శంభుఁ గొలిచితిం గడుభక్తిన్. 200

వ. మఱియుం దక్షిణ శైవవైష్ణవక్షేత్రంబుల సంచరించి గంగాయమునాసరస్వతీ నర్మదాగోదావరికృష్ణవేణికావేరిప్రముఖపుణ్యతీర్థంబుల నవగాహనంబుచేసిపునఃపున రాచరితైతద్విశిష్టప్రయోజనుండ నగుచుఁ దదానందంబు సదానందంబు గావింపఁ గొన్నిదినంబు లచ్చట నుండితి వర్తమానకాలమున నమ్మధ్యలోకము సకలకళ్యాణ గుణాభిరామంబై లోకాంతరములకంటె నాహ్లాదకరంబై యున్నయది తద్విశేషం బాకర్ణింపుము. 201

శా. లోకాలోకనగావృతం బగుధరాలోకంబు బాలించుదా
నీకాలంబున సర్వధర్మములు భూయిష్ఠంబులై చెల్లఁగా
నేకచ్ఛత్రముగాఁ బురూరవుఁడు రాజేంద్రుండు సౌందర్యరే
ఖాకందర్పుఁడు కీర్తివిక్రమగుణాకల్పుండు లేఖర్షభా! 202

సీ. ప్రతిదేశమును భోగభాగ్యసంపత్ప్రజాసంపూర్ణవిభవమై పెంపుమీఱుఁ
బ్రతిదేవతావాస మతులితనిత్యోత్సవాడంబరంబుల నతిశయిల్లుఁ
బ్రత్యగ్రహారంబు భాసురాధ్యయనయజ్ఞాతిసంశోభితం బై వెలుంగు
బ్రత్యయనంబును బహుళాన్నసత్రప్రపావళిసాంద్రమై యలరుచుండు
తే. జనులు వర్ణాశ్రమాచారసరణి లేశ, మైనఁదప్పక సుకృతాత్ములై మెలంగ
సకలధర్మంబులును బ్రవిస్తరము లయ్యె, నప్పురూరవుం డేలురాజ్యంబునందు. 203

ఉ. అందఱు విష్ణుభక్తులు దయాపరు లందఱు నందఱున్ సదా
నందమనస్కు లందఱు జనస్తవనీయచరిత్రులైనవా
రందఱు భోగభాగ్యయుతు లందఱు కల్మషదూరు లందఱున్
సుందరమూర్తు లెవ్వరినిఁ జూచిన నాన్నృపుఁ డేలుమేదినిన్. 204

శా. ఆసౌందర్యము నామృదూక్తివిభవం బాసాదరాలోకనం
బాసారస్యము నాచమత్కృతియు నాయౌదార్య మావైభవం

బాసామర్థ్యముఁ గల్గునే గతభవిష్యద్వర్తమానంబులం 205
దోసంక్రందన! యప్పురూరవునియట్లూహింప నెవ్వారికిన్.

తే. సరసకరుఁడు సులక్షణచారుమూర్తి, భాన్వితుండు కళాకలాపాంచితుండు
కువలయాప్తుండు నుగ్రాంబకవిలసనుఁడు, నయ్యె నారాజు విష్ణుపదాశ్రయమున.

తే. అతని నెమ్మోము పూర్ణసుధాంశుబింబ, మగుట సత్యంబు గాకున్న నగుట యెట్లు
వికచభావంబు నవరసవిభ్రమాభి, రామరామాంబికేందీవరంబులకును. 207

సీ. పుండరీకదళాంతములయందు నందంబుగాఁ బద్మరాగరాగంబు నిలిపి
సమదవేదండతుండములందుఁ దీరుగా నిగనిగమను జిగి నెలవుకొలిపి
కుందనంపుఁబసిండియందుఁ దా ఘనసారసారసౌరభవిశేషంబు నించి
యరుణపల్లవములయందుఁ బద్మాంకుశకులిశాదిభాగ్యరేఖలు రచించి
తే. చేసెఁగావలె నలవాగ్విలాసినీశుఁ, డాకనుంగవ యాచేతు లాశరీర
మాపదంబులు గాకున్న నాన్నృపాల, తిలకునంగకముల కింతచెలువుఁ గలదె? 208

ఉ. కొందఱియందుఁ గొన్ని మఱికొందఱియం దొకకొన్ని గాని పెం
పొందుసమస్తసద్గుణము లొక్కనియందు ఘటించి యుండఁగా
నెందు నెఱుంగ మెవ్వరి సురేశ్వర! విష్ణుకళాప్తి నుద్భవం
బొందిన యప్పురూరవుని నొక్కనిఁదక్కఁగ మేదినీస్థలిన్. 209

చ. అన విని వజ్రపాణి వినయంబున నారదమౌనిఁ జూచి యి
ట్లనియెఁ బురూరవక్షితితలాధిపుసద్గుణవర్ణనంబు సౌ
మ్మనమున కింపొనర్చె బుధమాన్య! సవిస్తరభంగిఁ దెల్పుమ
య్యనఘుఁడు విష్ణుభక్తుఁడు గదా విననొప్పుఁ దదీయవృత్తమున్. 210

క. ఎవ్వాఁడు హరిభక్తిపరుం, డెవ్వాఁడు సూనృతవచస్కుఁ డెవ్వాఁడు సుజనుం
డెవ్వాఁడు బహుజనపోషకుఁ, డవ్విమలునిచరిత మెన్న నగు వినఁగఁదగున్. 211

తే. అనినఁ దత్పూర్వవృత్తాంత మన్నగారి, తోడ నమ్ముని వివరింపఁ దొడఁగె నప్పు
డమరగంధర్వవిద్యాధరాప్సరఃక, దంబకములకుఁ గర్ణామృతంబుగాఁగ. 212

క. నారదనారదజోక్తిక, ధారాగ్రహణప్రయత్నతత్పరలీలా
సారంగీభూతశ్రుతులై రప్పుడు లేఖు లెల్ల నాసభలోనన్. 213

అని పలికినం బ్రహృష్టమానసులై తత్కథాప్రకారం బెఱింగింపు మని మహర్షులు
రోమహర్షణతనూభవు నడుగుటయును. 214

మ. ప్రణవాగారవిహార హారకలితోరశ్శోభితాకార కా
రణజాభీరకుమార మారహానుతప్రాంచత్కథావార వా
రణదక్షోదర భార భారతహితప్రజ్ఞావచస్సార సా
రణముఖ్యాప్తవిచార చారణసురారాధ్యాంఘ్రిపంకేరుహా. 215

క. నిటలతటఘటితకరపుట, జటివియదటపటలవరణచరణనికటవి
స్ఫుటమకుటకటగహాటక, పటకటితలదళితశకటపటుకపటవిటా. 216

మాలినీ. నతశశధరజూటా నాగభుక్పత్రిఘోటా
జితసమదనిశాటా శ్రీశ్రితోరఃకవాటా
ధృతతిలకలలాటా దివ్యతేజఃకిరీటా
తతచరణకృపీటా దైవసౌభాగ్యకూటా. 217

గద్యము. ఇది శ్రీమంగళాచలనృసింహకృపాప్రసాదసంప్రాప్తవిద్యావైభవ కనుపర్తి
రాయనమంత్రితనూభవ సుజనహితకృత్య నిత్య యబ్బయామాత్యప్రణీతం బైన
కవిరాజమనోరంజనం బనుమహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము.

ద్వితీయాశ్వాసము.



శ్రీభోజసుతాచారుకు
చాభోగవిలగ్నతారహారాంకితవ
క్షోభాగభోగమోక్ష
శ్రీభూరికటాక్షలీల శ్రీగోపాలా. 1

వ. అవధరింపుము సమస్తసద్గుణసాంద్రులగుశౌనకాదిమునీంద్రులకుసామోదహృదయజల
జాతుండై సూతుం డిట్లనియె నట్లమ్మునిచంద్రుండు సురేంద్రున కిట్లనియె. 2

చంద్రునివృత్తాంతము.

సీ. మదనసంహారుజటామకుటాగ్రసీమ నుద్దీపితంబైన వజ్రోపలంబు
బృందారకులకుఁ దృప్తిగ విందులిడుసుధారసపూరితాక్షయరజతపాత్ర
యలఘుపుష్కరపుష్కరాకరాంతర్విహారప్రౌఢిఁ జెలువొందురాజహంస
మబ్జగర్భాండగేహమున నుత్కృష్టకాంతి వెలుంగుకర్పూరదీపకళిక
తే. దక్షకన్యామనోజసంతాపభరము, నెయ్యమునఁజల్లఁజేయుపన్నీటికొలకు
శౌరిడాకంటివెలిదమ్మి తోరమైన, చలువచాయలగుంపు నిశాకరుండు. 3

క. చదువఁగవచ్చు బృహస్పతి, సదనమున కనారతంబు సౌందర్యగుణా
స్పదనిజరూపవిలాసము, హృదయంబులఁ జూపఱులకు నింపొదవింపన్. 4

మ. తళుకుంజెక్కులరత్నకుండలసముద్యత్కాంతి రంజిల్ల ను
జ్జ్వలముక్తామణిమాలికావళులు వక్షస్సీమఁ బొల్పార ని
ర్మలసౌరభ్యపటీరచర్చ సుకుమారంబైన నెమ్మేనఁ బెం
పలరన్ వచ్చుసుధాంశుఁజూచి గురుఁ డత్యానందముం బొందుచున్. 5

వ. విద్యోపదేశంబు సేయుచుండె నాసమయంబున. 6

తే. ఆగురుదార రూపరేఖాత్యుదార, చారుకుచభార శృంగారతారహార
సుగుణవిస్తార పదనఖసురుచివిజిత,తార మోహిని యపరావతార తార. 7

క. జీవునకు జీవమై తగు, జీవనజాతాక్షి బంధుజీవాధర దా
జీవంజీవంబునకును, జీవన మగుచంద్రకళవిశేషము దోఁపన్. 8

ఉ. చంద్రరజంబు సైకతముఁ జల్లుచుఁ గాముశరాళిఁ బూర్ణిమా
చంద్రుని సానఁబట్టి దిగజాతిన రాపొడి దివ్యవాసనా
సాంద్రసురప్రసూనరససారమున న్మిళితంబుచేసి ని
స్తంద్రతఁజేసెఁ గావలయుఁ దారబయోజభవుండు నేర్పునన్. 9

సీ. సారంగమదహారి సంపన్నతవహించు ఘనసారసచ్ఛాయఁ గడురహించు
సారంగమదహారి సంపన్నతవహించు ఘనసారసచ్ఛాయఁ గడురహించు
సారంగమదహారి సంపన్నతవహించు ఘనసారసచ్ఛాయఁ గడురహించు
సారంగమవహారి సంపన్నతవహించు ఘనసారసచ్ఛాయఁ గడురహించు
తే. బాలికామణి తనుమధ్య నీలచికుర, చారుదీర్ఘవిలోచన సరసహాసన
తరుణమోహనమూర్తి సౌందర్యవదన, నవ్యసౌరభసురుచిరనఖరలీల. 10

మ. అలులం గొప్పునెపంబునన్ మృదువచోవ్యాజంబున న్ముద్దుఁజి
లుకల నెత్తావుల సింగిణిన్ బొమల యాకారంబునం బూవుము
లుకల దృగ్భావమునన్ వహించి జిగి చెక్కుందోయి నక్రాంకరే
ఖలతో నొప్పులతాంగిమూర్తి విలసత్కందర్పశాస్త్రస్థితిన్. 11

క. ఆయిందువదన సుమన, స్సాయకశారీరవిభవజయసౌందర్య
శ్రీయుక్తమూర్తి రజనీ, నాయకు వీక్షించె వికచనయనోత్పలయై. 12

సీ. పలుచనిచూపునఁ బరిపాటిగాఁ జూచు నల్లొప్పుఁ జూపునఁ నదటిచూచు
నరగంటిచూపున నలసరీతిని జూచు మఱుపెట్టుచూపున మరలిచూచు
నొడలెల్లఁజూపుగాఁ గడునబ్రపడి చూచు సొగయు నొయ్యారంపుఁజూడ్కిఁ జూచు
భయమింతలేక తప్పనిచూపు చేఁ జూచుఁ జూచి చూడనియట్టిచూడ్కిఁ జూచు
తే. సొలపువలపునఁ దిలకించు చూడ్కిఁ జూచు, నాటుజూపున మరులుకొనంగఁ జూచు
దార తారామనోహరు దశవిభావ, లోకనంబుల మోహవిలోల యగుచు. 13

ఉ. చక్కనిమోము చూచి సరసంపుఁగనుంగవఁ జూచి నిద్దపుం
జెక్కులు చూచి కెంపువగఁ జెల్వగు వాతెఱచూచి కాంతిఁ బెం
పెక్కినమేనుఁ జూచి గురునింతి మనోహరగాత్రి తార యా
చుక్కలఱేనికిన్ వలచి సొక్కి మనోభవబాణభిన్నయై. 14

సీ. లేనిప్రయోజనం బైనఁగల్పించుక పలుమాఱుఁ దత్సమీపమునఁ దిరుగు
వలరాజుచిల్కుములుకులవంటిచూపుల ననువుగా మర్మము లంటఁజూచు
నుచితక్రమంబునఁ గుచకచాద్యవయవసౌభాగ్యములు ప్రకాశంబు చేయు
సమయమైనప్పుడు సారస్యముగ నర్మగర్భంబులైన వాక్యములు పలుకు
తే. నతఁడు తనమోము చూచినయపుడు దీన, వదనయై సోష్ణదీర్ఘనిశ్వాసవశతఁ
దనమనోవ్యథ యతనిచిత్తమున కెఱుక, పఱుచు నాకాంత విరహవిభ్రాంత యగుచు.
తే. ప్రాణహానిఁ దలంపరు పాప మనుచు, నెంచ రపకీర్తి యని చూడ రిందుముఖులు
వలపుగలచోట నెట్లైనఁ గలయఁజూతు, రెంతసాహసు లహహ సీమంతవతులు. 16
తే అనుదినము నిట్లు హావభావాదిచేష్టి, తముల మోహింపఁగాఁ జేసెఁ దార విధునిఁ
బురుషుమన సెంత దృఢమైనఁ బువ్వుఁబోఁడి, వికృతి పైకొన్న సెగపొంత వెన్న గాదె.
వ. ఇవ్విధంబున. 18
సీ. హరినీలములమించి యరిలీల వెలయించి వేణి సుశ్రోణియు వింతదనర
విరి నిరాకృతిఁ జేసి కరికరాకృతిడాసి యొడలును దొడలును నొప్పుమీఱ
నగజాతములఁ గేరి మృగపోతములమీఱి చన్నులుఁ గన్నులుఁ జెన్నుమిగుల
వరకుందములఁ బోలి యరవిందముల నేలి రదములుఁ బదములు రహివహింప
తే. గురుని భవనంబునందు సుందరి మనోజ, విమలఘంటారవాయతవిమలకనక
చరణమంజీరపుంజసింజాని నాద, యగుచు నిట్లు మెలంగఁ బద్మాహితుండు. 19
క. పాపపరాఙ్ముఖతామతి, దీపాంకుర, మన్నెలంతదీర్ఘశ్వసితా
టోపమరుద్గతి నడఁగినఁ, బ్రాపిత మోహాంధకారబంధురుఁ డయ్యెన్. 20
సీ. లలనానితంబమండలముపై నుత్పలవళములు రచియింపఁ దలఁచుఁగాని
తరుణికెమ్మోవిమీఁదఁ బ్రవాళమణిసొంపు గులుకఁగా ఘటియింపఁ దలఁచుఁగాని
జలజాక్షికుచకుంభములమీఁదఁ శశకప్లుతంబు దా నొనరింపఁ దలఁచుఁగాని
మృగరాజమధ్య నెమ్మేను లతావేష్టితంబునఁ బెనగొనఁ దలఁచుఁగాని
తే. తలఁపఁడెప్పుడు గురువనితాసమాగ, మాగతాత్యుష్ణదురితదవానలంబు
దుస్సహం బని కటకటా తొగలఱేఁడు, కలుగదు గదా వివేకంబు కాముకులకు. 21
సీ. తా సుధానిధియయ్యుఁ దరుణికెమ్మోవిసుధారసంబునకు నోరూరుచుండుఁ
దాఁ జంద్రికాసాంద్రతనుఁడయ్యుఁ గుసుమకోమలిదరస్మితచంద్రికలకుఁ జొక్కుఁ
దాఁ గళానిధియయ్యుఁ దరళాయతాక్షికళావిశేషమున కుల్లాసమొందుఁ
దా మృగాంకమనోజ్ఞతనుఁడయ్యు నలివేణిలోచనమృగదీప్తిఁ జూచి సొగయుఁ

తే. నహహా యీయద్భుతమున కేమనఁగవచ్చు, సకలజనరంజనుండైన చంద్రునకును
జంద్రుఁడై చాల హృదయరంజనమొనర్చె, సుందరీమణివదనారవింద మపుడు. 22

తే. తనకలిమిలేములను సర్వజనులకుభయ, పర్వములఁ దెల్పుశశికి నప్పద్మనయన
యభిముఖంబైనఁ బున్నమయగుచుఁదోఁచు, ననభిముఖమైన నమావసయగుచుఁదోఁచు.

ఉ. జక్కవలిక్కవ న్ఘనకుచస్తబకంబుల పేరఁ జీఁకటుల్
చక్కనికొప్పు పేర జలజంబులు కన్నుల పేర నెచ్చెలిం
దక్కక యాశ్రయించి పరితాపపరంపరపాలుఁ జేసె నా
చుక్కలఱేనిఁ దీర్చుకొనఁ జూచి సుమీ తమపూర్వవైరముల్. 24

తే. ఆసుధాధామునకు విదాహంబుగొలుపు, నాహిమాంశునిఁ బరితాపమందఁ జేయు
నాకళానిధిఁ ద్రోచు మోహాంధకార, మున నొరుల నెంత చేయఁడు మనసిజుండు. 25

చ. చదువు వివేకమూలమని సద్గురుసన్నిధి వేదశాస్త్రముల్
చదువఁగవచ్చినట్టి యలచంద్రునకుం గురుపత్నిఁ బొందు క
ష్టదశ ఘటింపఁ జేసె నకటా యిఁక నేమనవచ్చు దైవముఁ
మదినిది పుణ్యమా నని యొనర్పఁగఁ బాపము వచ్చుటే మొకో. 26

వ. అని జనం బెంచుచుండఁ జంద్రుండు. 27

క. దోషాకరుండుఁ దారా, శ్లేషసుఖాన్వితుఁడుఁ గాన శీతాంశుఁడు దా
దోషాకరుండుఁ దారా, శ్లేషసుఖాన్వితుఁడు నయ్యె సితగజగమనా. 28

సీ. బొమ ముడివెట్టుమాత్రమె కాని ప్రియుఁడు పొలిం డ్లొత్తిపట్టుట కిచ్చగించుఁ
గసరుమాత్రమె కాని కాంతుఁ డాయము లెత్తివెసఁ బల్కుట కపేక్షవీనులొగ్గ
కొంగుపైనిడుకోఁ బెనంగుమాత్రమె కాని విటుఁడు గోప్యములు జూచుటకుఁ గోరు
సీత్కృతు ల్వెడవెడఁ జేయుమాత్రమె కాని పతిమోవినొక్కు సంగతికి నలరు

తే. సొలయుమాత్రమె కాని నెచ్చెలిమి కాఁడు, కఠినరతిసల్పుటకు సముత్కంఠ దాల్చుఁ
బులకహర్షాశ్రుసుఖజలోద్భూతగరిమఁ, దనవలపు జారునకుఁ దెల్పఁ దరుణియపుడు. 30

వ. ఇత్తెఱంగున.

క. అన్యోన్యమోహవిభ్రమ, సన్యస్తవివేకులగుచు శశలాంఛనుఁడుం
గన్యామణియును గోర్కులు, ధన్యతనొందంగఁ గలసి తమి చిగురొత్తన్. 31

ఉ. కొన్నిదినంబు లిక్కరణి గోప్యముగా విహరించుచుండి య
య్యన్నుపయిం బ్రియంబు హృదయంబున నగ్గలమైనఁ జంద్రుఁ డిం

తి న్నిజమందిరంబునకుఁ దెచ్చుక నిర్భయకేలిలోలుఁడై
యున్నయెడన్ బృహస్పతి వియోగవిచారవిషాదమగ్నుఁడై. 32

సీ. సకియకౌనుఁ దలంచి సన్మార్గ మనుగాని యింతిదుర్మార్గత యెంచఁడయ్యెఁ
జెలువచన్గవఁ దలంచి సువృత్తమనుఁగాని తరుణికువృత్తంబుఁ దలఁపఁడయ్యె
నతివమోముఁ దలంచి యకలంక మనుఁగాని తెఱవకలంకంబుఁ దెలియఁడయ్యె
సుదతినవ్వుఁ దలంచి శుచియనుఁగాని యవ్వెలఁదుకయశుచిభావింపఁడయ్యె

తే. గురునివంటిమహాత్ముఁ డిక్కరణిఁ దరుణి, చక్కఁదనమే గుణంబుగ సంస్మరించుఁ
గాని వ్యభిచారదోషంబుఁ గాంచఁడయ్యె, నజ్ఞుఁ డనఁ బ్రాజ్ఞుఁడన నెవ్వఁడవనినింక. 33

తే. అమృతమయుఁడౌటశశి పవిత్రాంగుఁడనియొ, ఘనమహిమ దారదోషంబుదలఁగుననియొ
యమర గురుఁడింతివిడువ లేఁడయ్యెఁగాక, పెనిమిటికి నేల కడలుత్రొక్కినలతాంగి. 34

వ. ఇవ్విధంబున. 35

క. ఏపొద్దు ఖేదమున సం, తాపించుచునుండె నతఁడు ధరలో భార్యా
రూపవతీ శత్రువని క, దా పెద్దలు పల్కరేల తప్పు నటంచున్. 36

ఆ. సుదతి వ్రతముచెడిన సుఖము దక్కఁగవలె, నన్నమాటఁ దలంచుకొన్నదేమొ
కాఁపురంబు చేసెఁ గలికి ముచ్చటఁదీఱ, మగనివిడిచి తేరమగనియింట. 37

వ. అంత. 38

మ. రతిబంధప్రతిబంధకం బురుపరీరంభక్రియాస్తంభనం
బతిహేలామణితాంతరాయము నిజప్రాణేశకేళీజిదా
యతమీనధ్వజయుద్ధతంత్రపటుతాహంకారశంకాంకురం
బతులస్ఫూర్తి నెసంగె గర్భము నవవ్యాకోచపద్మాక్షికిన్. 39

ఉ. వీడని ప్రేమలం గలియు వేఁకటి ప్రేఁగుట లంతికూటముల్
వేడుకకు న్వినోదమొదవింపఁగ నయ్యుపనాథుతో హిత
క్రీడ మెలంగుచుండ నరిగె న్నవమాసము లంతమీఁద న
చ్చేడియ గాంచె నందను నశేషవిశేషగుణాంబుధిన్ బుధున్. 40

వ. అబ్బాలకుండు సుధాధాముధామంబునం బెరుఁగుచుండ నపుడు. 41

తే. చంద్రునకు బుద్ధిచెప్పి వాచస్పతికిని, దారనిప్పించితిరి గాదె మీరు మరల
నింతవృత్తాంతమును నీవు నెఱుఁగుదైన, సరణిఁ బలుకంగవలసెఁ బ్రసంగవశత. 42

క. ఈరీతిఁ దారకును గమ, లారికి జన్మించినట్టి యాబుధునకు శృం
గారవతి కిలాకన్యకు, సారమతి పురూరవుండు సంభవమయ్యెన్. 43

వ. తత్ప్రకారంబు వివరించెద నాకర్ణింపుము. 44

బుధుని చరిత్రము.

తే. జలజబాంధవవంశవిస్తారకుండు, మహితకీర్తి వైవస్వతమనువు సకల
ధారుణీమండలాధిపత్యమునఁ దనరు, చుండి సంతానకాంక్షచే నొక్కనాఁడు. 45

ఉ. రాజితరత్నకాంచనతురంగమతంగజధేనుదాసదా
సీజనదివ్యమందిరవిచిత్రదుకూలవిలాసభాసురాం
భోజముఖీముఖోజ్జ్వలవిభూతి నెసంగుట నిష్ఫలంబుగా
దే జగతిం దనూభవవిహీనత నొందినయట్టివానికిన్. 46

చ. తొకతొకమాటలు న్నొసలఁదుం పెసలాడెడు నుంగరంపు వెం
డ్రుకలును మద్దికాయలు గడుంగదులాడగ ముద్దుగారు పొం
దికజిగిపాలబుగ్గలను దేలికచూపులఁ గోమలంపుటం
గకములు గల్గి యింపొదవుఁగా సుతుబాల్యము తండ్రి కెంతయున్. 47

సీ. కాంతాకుచద్వయీకాఠిన్యసంపద వెలితియయ్యును వేడ్కవిస్తరిల్లు
వినుతాంగియవలగ్నతనుతావిలాసంబు కొదవయయ్యు ముదంబుకొనలుసాగుఁ
గలకంఠకంఠిచెక్కులనిండుతేటలు పలుచనయ్యును గుతూహల మెసంగు
మృగనేత్ర తనులత జిగిబిగిసొగసుతక్కువయయ్యుఁ బ్రమదంబు కొమరుమిగులు

తే. యౌవనోన్మాదజనితచేష్టావికార, కలితలలితవతీరతికౌశలంబు
పెంపుదలఁగియుఘటియించునింపుమిగులఁ, బురుషునకుఁ బుత్రలాభంబె పరమహితము.

క. అనితలఁచి కులగురుం డగు, ననుపమగుణనిధి వసిష్ఠుఁ బ్రార్థించి యతం
డనుమతిసేయఁగఁ బుత్రునిఁ, గనుటకునై యధ్వరంబుఁ గావించెఁ దగన్. 49

సీ. సవనక్రియోచితసకలవస్తుసమృద్ధిఁ గావించి భువనవిఖ్యాతదాన
మహిమఁ జెల్లుచు నుండి మంత్రతంత్రకలాపపరిశుద్ధి నమరు విప్రవ్రజంబు
గూర్చి దీప్తానలకుండంబులోపల హోమంబు చేయుచు నున్న వేళ
నమ్మనుభామిని యైన శ్రద్ధాదేవి కూఁతురుగలుగంగఁ గోర్కె వొడమ

తే. హోత నధ్వర్యుఁ బ్రార్థించి యువిద గలుగఁ, జేయుఁ డనియె నిజేశువంచించి యపుడు
బుద్ధిహీనలు సతులని పుడమిలోన, జనులు పల్కెడుమాట నిశ్చయముగాఁగ. 50

క. ఆతలిరుఁబోఁడి కోరిన, రీతిని సంకల్పవైపరీత్య మొనర్చినన్
హోత పెడచేతఁ బుట్టెను, నాతి యిలాకన్య యనఁగ నవమోహినియై. 51

చ. పొడమినయింతిఁ జూచి వగఁబొందుచు భానుతనూజుఁ డక్కటా
కొడుకుదయించు నంచు మదిఁగోరి మఖంబొనరించుచున్నచోఁ
దడఁబడి యాఁడుబిడ్డ యుదితంబగుటెట్లొకొ దైవయత్నమున్
గడవవశంబె మానుషికకార్యము నిష్ఫల మెన్నిచూచినన్. 52

మ. అని చింతించి వసిష్ఠుఁ జేరఁజని సమ్యగ్భక్తితో మ్రొక్కి యి
ట్లని యోన్ సూనృతవాక్యశీలు రగు మీయాజ్ఞన్ మఖంబేను బు
త్రుని వాంఛించి యొనర్చుచున్నయెడ నేదోషంబునం జేసి యో
జననంబందెఁ గొమార్తె యోర్తు హృదయోత్సాహంబు భంగంబుగన్. 53

తే. కులము వర్థిల్లుఁ దల్లిదండ్రులకు సుఖము, కలుగు నిహపరములయందు గణనవచ్చు
బంధువులలోన సత్పుత్రు బడయు టొప్పుఁ, గాక ఫలమేమి కూఁతును గనుటవలన.

చ. అనవుడు సంయమిప్రవరుఁ డవ్విధమంతయు యోగదృష్టిచే
మనమునఁ గాంచి హంసకులమండనుతో భవదీయపత్ని గో
రిన నొనరించెహోత విపరీతవిధంబున హోమమంత్ర మం
గనజనియింప నిట్టియవకార్యము చేసిరి బుద్ధిహీనులై. 55

క. దైవాధీనము లోకము, దైవమధీనంబు మంత్రతంత్రములకు భూ
దేవాధీనము మంత్రము, కావున సంకల్పవిషమగతి నిట్లయ్యెన్. 56

క. ఐనం దగిన ప్రయత్నం, బేనొనరించెద విచారమేటికి నిజభ
క్తానందకరుఁడు పరమదయానిధి విష్ణుండు గలుగ ననఘచరిత్రా. 57

తే. అనుచు నారాజశేఖరు ననునయించి, యతఁడు నియమవ్రతంబుతో నఖిలభువన
కర్తఁ బరమాత్ము నాశ్రితకల్పతరువు, విష్ణునారాధనముచేసి విమలభక్తి. 58

వ. ఇట్లని వినుతించె. 59

వసిష్ఠుఁడు విష్ణుని స్తుతించుట.

పంచచామరములు:—

1. తరణ్యుదగ్రదీప్తిమత్సుదర్శనం సుదర్శనం
సరాగచారుమాధురీరసాధరం రసాధరం
పరాప్తతాచరన్మనోభవచ్ఛిదం భవచ్ఛిదం
హరిం వ్యతీతపద్మగర్భజామితం భజామి తమ్. 60

2. కరస్ఫురద్దరస్వరప్రకంపమానదిక్తటం
ధరాధరాధరాస్థితప్రధానకూర్మరూపకం

చరాచరాకరా తతప్రశస్తకుక్షిశోభితం
నిరంతరం దురంతశక్తినిస్తులం ప్రభుం భజే. 61

3. చలత్ప్రదీప్తకుండలం లసత్కపోలమండలం
కలావిలాసమోహనం ఖగప్రకాండవాహనం
మిళిందసుందరాలకం యమిప్రతానపాలకం
బలారివైరిమర్దనం ప్రభావయే జనార్దనమ్. 62

4. ఉమాసమానవాక్యసన్నుతోరుదివ్యనామకం
సమానమాధురీధురీణ సంస్కృతాంధ్రవర్ణితం
క్షమాసమాదృతాపరాధజాలక న్నిజాశ్రితం
రమాసమాగమప్రియాంతరంగ మచ్యుతం భజే. 63

5. రణత్తరంగమాలికాస్ఫురత్తరంగిణీద్వయ
త్ఫణామణిచ్ఛటాఘృణిప్రభాసమానభూమిభృ
ద్ఫణీంద్రభోగతల్పభాగభాక్ఛయానదివ్యభూ
షణప్రకాశవిగ్రహం భజామి సాధ్వనుగ్రహమ్. 64

వ. అని. 65

క. ఈరీతినవ్వసిష్ఠుఁడు, సారమతిం బంచపంచచామరవృత్తో
దారస్తుతి గావించిన, నారాయణమూర్తి శ్రితజనప్రియుఁ డగుటన్. 66

సీ. పదివేలసూర్యబింబము లొక్కప్రోవైనకరణి నుత్కృష్టప్రకాశ మెసఁగ
శృంగారరసము మూర్తీభవించినలీల ఘనలీల సుందరాంగము వెలుంగ
నిందుషోడశకళలేకోత్తరాభివృద్ధి నెసంగె నన మోము తెలివిమీఱ
సౌదామినీలతాచ్ఛవినిచ్చలంబైన వపువున జాళువావలువ మెఱయఁ

తే. బాంచజన్యసుదర్శనప్రముఖదివ్య, సాధనంబులు మరకతస్తంభవిజయ
బాహువులఁబూనిపతగేంద్రవాహుఁడగుచు, నాదినారాయణుండు ప్రత్యక్షమయ్యె.

ఉ. ఆహరిమందహాసవదనామృతదీధితి బింబదర్శనో
త్సాహతఁ బొంగు హర్షరససారసముద్రపయస్తరంగసం
దోహమున న్జనించి పయిఁదోఁచిన బుద్బుదపుంజమో యనన్
దేహమునిండె నంచితగతిం బులకాంకురపాళి మౌనికిన్. 68

వ. అప్పుడు. 69

శా. ఆనందాశ్రులు కన్నులం దొరుఁగ సాష్టాంగంబుగా మ్రొక్కి వా
చానైపుణ్య మెలర్పఁగా నుపనిషత్సారస్తుతుల్ చేసి యిం
పూనం బల్కె వివస్వదాత్మజుఁడు పుత్త్రోత్పాదనార్థంబు య
జ్ఞానుష్ఠాన మొనర్పఁ గూఁతు రుదయంబయ్యె న్వికల్పంబుగన్. 70

క. మనువునకుఁ బుత్త్రదానం, బనుగ్రహింపంగవలయు నని ప్రార్థింపన్
విని యక్కూఁతురుకొడుకౌ,నని యానతియొసఁగి యరిగె నంతర్హితుఁడై. 71

వ. అప్పుడు. 72

ఇలాకన్య పురుషుఁ డగుట.

సీ. కొదమలేళ్ళకు సిగ్గుగొలుపువాల్గన్నులు తరుణారుణాబ్జసుందరము లయ్యెఁ
గరికుంభకుచమనోహరమైన యురము నిర్మలకాంచనకవాటరమ్య మయ్యె
మవ్వంపుఁదీఁగెల నవ్వు చేతులు మత్తమాతంగశుండా సమంబు లయ్యె
మధుమాస పికరవమధురకంఠము మేఘగంభీరనిస్వనకలిత మయ్యెఁ

తే. బొదవులజ్జాభయంబుల నొదుఁగుమనసు, ధైర్యశౌర్యనిరంకుశత్వము వహించె
నయ్యిలాకన్యకును నీశ్వరాజ్ఞవలన ప్రాప్తమయ్యెను పౌరుషభావ మపుడు. 73

తే. కోమలశ్మశ్రురేఖాభిరామమైన, యక్కుమారునివదన మాహ్లాద మొసఁగె
సకలజనలోచనోత్పలషండమునకు, లక్ష్మియుతపూర్ణశశిమండలంబు కరణి. 74

శా. దాసత్వంబుతొలంగి మండలపతిత్వం బబినం బ్రాపితో
ల్లాసోత్కర్షతఁ బొంగుమానవునిలీలన్ భామినీరూప స
న్న్యాసంబై పురుషత్వ మబ్బినఁ బ్రభుత్వాహంకృతిం బొల్చు శో
భాసౌందర్యవిచిత్రుఁ బుత్త్రుఁ గని సాఫల్యాత్మసంకల్పుఁడై. 75

వ. వైవస్వతుండు వసిష్ఠానుమతంబున నక్కుమారునకు సుద్యుమ్నుం డని నామనం
బిడి విద్యాపారంగతుం గావించె నంత. 76

చ. కరితురగాధిరోహణము కార్ముకబాణకృపాణచక్రతో
మరముసలాదిసాధనసమాజపరిశ్రమమున్ వసుంధరా
భరణరణప్రవీణత యుపాయచతుష్కనిరూఢి యాదిగాఁ
బరిచితమయ్యె సర్వము నృపాలకుమారునకుం గ్రమంబునన్. 77

. అంతట నొకనాఁ డాత్మ, కాంతతనూభవుఁడు వేఁటకాండ్రును దానుం
గాంతారభాగములకుం, బంతంబున వేఁటఁబోవఁ బయనం బయ్యెన్. 78

ఉ. రంగమరంగ వెన్నెల తరంగములై తనుకాంతి నిగ్గులే
రంగ జవంబుచే జితకురంగమనంగ నభంగ భేరికా
రంగదురుస్వనంబు దనరంగ గుణోన్నతి నశ్వశాస్త్రపా
రంగతహృద్యమౌ నొకతురంగము భూషితచాతురంగముఙ్. 79

ఉ. కనకఖలీనముం బసిమి గ్రమ్మెడు పచ్చలహేమపట్టముఙ్
ఘనమగుజాతికెంపులచొకాటపుబల్లము మౌక్తికావళిం
దనరెడుకంఠమాలిక లుదంచితవజ్రమయావతంస మిం
పొనర నలంకరించి తనయొద్దకుఁ దెచ్చిన నెక్కె నశ్వమున్. 80

తే. బొమిడికంబులు వెట్టి జోళ్లమరఁ దాల్చి, చల్లడంబులు దొడిగి కాసలుబిగించి
జముదళంబులు చెక్కి బల్లెములు పూని, వెడలిరప్పుడు పెక్కండ్రు వేటకాండ్రు.

చ. దెసమొలవేల్పుసాహిణపుతేజులు పోమకగేహరక్షకుల్
విసువనికమ్మకట్టు మఱి వింతజనంబుల బీసుగొల్పుక
క్కసమగురక్కసుల్ వనమృగంబులపాలిటి మృత్యురూపముల్
వెసఁ జనుదెంచె నత్తఱిని వేటకు గాటపుసారమేయముల్. 82

సీ. అల దుర్గ మెక్కిరింతల వెక్కిరింతలాడెడురీతి నాలుకల్ వెడలఁజాఁచు
నిట్టిగుట్టపురౌతు నెక్కసక్కెములాడుగతి వాలవిక్షేపకలనఁ దాల్చుఁ
దొడరి కొండలనెత్తి యడవఁబూనెడుమాడ్కిఁ బదరి చివ్వనఁ బూర్వపదములెత్తు
గర్జితంబులసారె భర్జించుకైవడి మొఱగునార్భటముగా మోరలెత్తు

తే. బలిమికలిమిని జనముసంపదను దిట్ట, తనము పెంపున దారుణధ్వనిసిరూఢి
జాగిలంబులు మృగయు లచ్చంపుఁబసిఁడి,పట్టెడలఁ బట్టివెడలించునట్టియెడను. 83

సీ. ధరనల్పులకుఁ బ్రభుత్వంబు వచ్చిన మనుష్యులవికారపుఁజూడ్కిఁ జూచినట్లు
పల్లవుల్ తుదిలేమిపడి యింటిచాయరా మొగిలంజెతల్లులు మూల్గినట్లు
పరదేశి యతిలోభపరునియింటికిఁబోవఁ దెగికోఁలివలెను గద్దించినట్లు
వంతువాసికిహీనవైశ్యులు దమలోన నేకంబుగాఁ గలపించినట్లు [తఱిమి

తే. తెరలి యొరుఁడొక్కటి నిరూక్షదృష్టిఁజూచు, గొఱగొఱనుమూల్గుగద్దించుఁ దఱిమి
కవిసి కలహించు భౌకృతికలకలముగ, జాగిలమ్ములు రోషభీషణములగుచు. 84

తే. బెబ్బులి తుపాకి సుడిగాలి పిడుగుతునుక, భూతనాథుని గవిసిపోతు పోతురాజు
గండగొడ్డలి దొంగలమిండగీఁడు, మొదలుగాఁ బేరుగల పేపులుదుటనడచె. 85

వ. ఇట్లు చనిచని. 86

క. ఒకగహనము జనసంచా,రకగహనము నగురుధూమరచితసురభిదా
వకదహనము సింహకుటుం,బకవహనముఁ గనిరి వారు పటుతరలీలన్. 87

క. కనిచేరంబోవుచు న, జ్జననాథకుమారుతోడ సమయోచితవా
క్యనయప్రసంగములచే, ననుమోదం బొదవ లుబ్ధకావళి పలికెన్. 88

క. కొద్దిమెకాలకుఁ బోదా, పెద్దపులిం గఱచి చంపుఁ బిఱుగువలెను బై
నుద్దవిడి దుమికి యిదిమా, గద్దరిజాగిలము దీనిఁగనుఁగొనుము నృపా. 89

క. ఇదిగాలివేసి మెకమే, పొదలోపల నెంతదూరమున నున్నను దా
వెదకి పసివట్టి పోవుచు, గొదగొని పోనీకపట్టుకొని చంపుఁజుమీ. 90

క. దాడిమెయి దీనివెంబడిఁ, గూడం బెఱజాగిలములకుం దరమే యీ
జోడంగివేపిముందర, లేడియుఁగీడియు జనంగ లేదడుగైనన్. 91

వ. అని మఱియు బహువిధముల మృగవ్యక్రీడానుగుణభాషణములు పలుకుచుండ
నప్పుడు. 92

తే. వనమృగంబుల పొలకువ గనుటఁ దెలిపె, వేటకాండ్రకుఁ గుర్కురవితతియపుడు
పట్టఁబట్టంగ నిలువక బలిమినిగ్గు, లాడి యెగురుచుఁ దమకించుజాడవలన. 93

మ. మృగయుల్ పట్టెడలూడ్చినన్ భషకముల్ మృత్యుప్రయోగోజ్జ్వలా
శుగసంఘాతముకైవడిన్ వనమృగస్తోమంబుపై వాయువే
గగతిన్ ఱివ్వునఁ దూఁగి పైనఱికె వీఁకన్ విస్ఫుటీభూతవ
క్త్రగుహాద్వారకనత్కరాళఖరదంష్ట్రాగ్రాహకోత్సాహతన్. 94

తే. పర్వతమువంటియొకకొమ్ముపందిమీఁద, నుఱికి యొకజాగిలము చెవియొడిసిపట్టి
యదియుఁ దనచాయఁ దిరుగఁ దానట్లతిరిగె, లంకెవెట్టినకైవడి శంకలేక. 95

తే. తోఱె నలపందినలపాది తూలిపడఁగ, నొక్కబలువేపి యదియట్టు లుండనిమ్ము
పులిపులిని దప్పకుండంగఁ బులిపులిగను, దఱిమె నొకజాగిలం బడియరుదుగాదె. 96

చ. తిరుగుము పోకు సీయనుచుఁ దెంపునఁ బల్కినవానిమీఁద సూ
కరము గిఱుక్కున న్మరలె గ్రక్కునవాఁడును బందిపోటుచే
నఱిముఱిఁ గ్రుమ్మిపట్టె నెదనట్లును నిల్వక నిక్కి పైకిరా
నరుదుగఁ జేర్చెనొక్కశిల యాఁపున బల్లెపుఁగఱ్ఱ వాఁడిలన్. 97

ఉ. స్రుక్కక దిండుగా వలువచుట్టినవామకరంబు నోటికిం
గ్రక్కున నిచ్చి పైనెగురఁగా నలబెబ్బులి తెల్లచంకలో

నక్కడిచేకటారి పరుఁజంటఁగ నుక్కనఁ గ్రమ్మి గుండియల్
వ్రక్కలువాపి త్రోఁచి పడవైచె నొకం డతఁ డెట్టిశూరుఁడో! 98

తే. ఒక్కవిలుకానిగాఢప్రయోగమునను, దానికుంభప్రగుప్తముక్తాఫలములు
మార్గణావలిపాలయ్యె మార్గణాళి, పాలుసేయక దాని సొమ్మేల దాఁచు. 99

క. ఈరీతి మృగవ్యవ్యస,నారంభము మానసముల నంతంతకు వి
స్తారముగ వేఁటలాడిరు,దారగతిన్ వేటకాండ్రు తద్విపినమునన్. 100

శా. ఆసుద్యుమ్నకుమారవర్గాళియును నట్లావేళ మిత్రాళితో
నాసక్తిన్ మృగయావినోదమున ఘోరారణ్యభాగంబులం
దా సంచారము సేయుచుం గరికిరీంద్రవ్యాఘ్రసింహాదినా
నాసత్త్వంబుల నుగ్రబాణనిహతిన్ నాశంబు నొందించుచున్. 101

మ. ఖరధారాశరభగ్నసింహశరభోగ్రవ్యాఘ్రకీలాలవీ
తరజఃపుంజవనావలిన్ శకలితోద్యద్భద్రదంతావళో
త్కరకుంభోదయమౌక్తికావళులు రంగద్రంగవల్ల్యాకృతిం
గరమొప్పన్ మృగయావినోదపరుఁడై గాంధర్వయానోద్ధతిన్. 102

వ. చనిచని ముందట. 103

సీ. దుర్గంబులై యుండు భర్గవిష్ణుపితామహాపురంబు లేశిఖరత్రయమునను
సెలయేఱులై యుండు నలసుధాంధస్సింధుజలపూర మేశిలోచ్చయముమీఁద
గహనంబులై యుండుఁ గల్పకసంతానహరిచందనాదు లేయద్రియందు
గండోపలంబులై యుండు మాణిక్యవైడూర్యాదిమణు లేయహార్యసీమ
తే. నట్టిమేరుమహీంధ్రంబు నహరహప్ర,దక్షిణప్రచరద్గ్రహతారకాక
దంబకప్రతిబింబవిడంబి తన్ని,తంబబింబపరిస్ఫురితంబుఁ గాంచి. 104

చ. అమరులకెల్ల నిల్లు త్రిపురాంతకుచేనిలసిల్లువిల్లు లో
కములకుఁ బట్టుగొమ్మ మణికాంచనసంపదతావలమ్ము గ్రా
వములకుఁ జక్రవర్తి భగవత్కళత్రు తగుపుణ్యమూర్తి యీ
సమధికవర్ణనీయగుణచారువు మేరువటంచు నెంచుచున్. 105

వ. తదీయవైభవంబున కద్భుతంబందుచుం జనిచని తత్పర్వతోపకంఠంబునందు. 106

సీ. సురసాలసురసాలసురసాలఖేలంబు కాంచనకాంచనాభ్యంచితంబు
కేసరకేసరకేసరాస్తోకంబు ఘనసారఘనసారకదళియుతము

వంజులవంజులవంజులప్రథితంబు పాటలిపాటలీపరివృతంబు
మధురసామధురసామధురసారస్యంబు ఫలపూరఫలపూరబంధురంబు
తే. దంతశఠదంతశఠవిచిత్రస్థలంబు, వీరతరువీరతరువారచారుతరము
వరసరశ్చయపూర్ణీభవత్సుధార, సారసకుమారవనము కుమారవనము. 107

ఉ. కాంచి దృగంచలంబులు వికస్వరభాస్వరపుష్పపల్లవా
భ్యంచితసాలజాలములపై నెగఁబ్రాఁకఁగ నెమ్మదిం బ్రహ
ర్షించుచు నమ్మహోపవనసీమఁ జరింపఁదలంచి మించి రా
ణించు నిబద్ధరత్నధరణీసరణింబటులీలఁ బోవుచున్. 108

ఉ. ఏవనమైన దీనిసరియే గుఱియే మఱియెంచ నెంతయున్
బావన మంచితప్రసవబంధురగంధమిళిచ్ఛరత్కన
త్పావన మాశ్రితాన్యభృతబంభరకీరకపోత భోగిభు
క్పావన మీవనం బిది విహర్తకు జీవనమై యెసంగదే. 109

సీ. దేవవల్లభనామధేయప్రసిద్ధినో యైరావతంబుపై నందగించె
బహులశాఖాంచితబ్రహ్మణ్యమగుటనో యొనరఁ గాయత్రీప్రయుక్తమయ్యెఁ
గౌశికాభిఖ్యతగలుగుటనో శ్రేష్ఠసుమనోగణికఁగూడి సొంపుమీఱె
హైమవతీసంజ్ఞ నమరుటనో మాధవీకృతసాంగత్యవృత్తి నెనసె
తే. సానుగణ్యంబులైన సమాగమముల, నలరె నిబ్భంగి నేతద్వనాగమంబు
లనుచుఁ జనుచుండి నిజవయస్యాళితోడఁ, బలికె నిట్లని మఱియు నృపాలసుతుఁడు.

తే. స్యందనంబులు పున్నాగబృందములును, మావులును వీరతరు లగణ్యములు గలిగి
నలినమిత్రప్రకరముల కలవిగాక, తనరె వనసీమ యిది రాజధానిపోలె. 111

తే. కుసుమమయ్యెనె వీనికిఁ గుసుమమహహ, యీరసంబయ్యెనే వీని కీరసంబు
కాంచనము కాంచనమ్ముగా నెంచుకొనవు, తలఁపమధుపంబులకు నెట్లు తెలివికలుగు.

క. కనుఁగొనుఁడు లతాంగీకృత, వినయాశ్లేషములఁ బొదలు విటపులు తగదే
కనుఁగొనఁగ లతాంగీకృత, వినయాశ్లేషములఁ బొదలువిటపులనవనిన్. 113

ఉ. పొంకములై యెసంగె వనభూమిఁ గనుంగొనుఁ డూర్మికావళీ
కంకణభూషితంబులు వికస్వరహల్లకరాగరమ్యముల్,
పంకజయుక్తముల్ సుకరభాంచితముల్ దరచక్రమత్స్యరే
ఖాంచితముల్ వినోదకమలాకరముల్ కమలాకరంబులై. 114

సీ. జటియయ్యుఁ గొమ్మలసంపర్కమొనరించె శాబరిసన్నిధిఁ జదువుకొనెనొ
గురుజాతియయ్యుఁ జేకొనియెను విటాప్తి నిగమశర్మునిఁ జూచి నేర్చుకొనెనొ
బ్రాహ్మణియయ్యుఁ దాఁ బల్లవాలితఁ దాల్చె నహల్యను దలఁచుకొనెనొ
తరుణియయ్యును బ్రవృద్ధప్రియసుమనస్క యయ్యె సుకన్యలా గియ్యకొనెనొ
తే. యగమ మయ్యును బహుపాదమయ్యె నిట్లు, శిఖరివర్యమతం బభ్యసించెనొక్క
యనుచుఁ దత్తద్ద్రుమాళి సహాయులకును, జూపెఁ జతురోక్తు లాడుచు భూపసుతుఁడు.
సీ. కలకంఠములకంఠములఁ గుంఠదుత్కంఠ నొనరించు పంచమస్వనము నిగుడ
సమరందసుమబృందగమిళిందముల మందగతి నెసంగించు ఝుంకరణ మొనర
గోరవంకలిరువంక మరువంకములశంకఁ బఠియించుగతి మ్రోయుపలుకు లెసఁగ
శుకకులాధికవిలాసకకలారవకలాపోక్తులు సరససంయుక్తి నెఱయఁ
తే. గులుకుపలుకుల మెలఁకువ నలరుకలరవముల రవములు చెలఁగంగ నెమిలిగములు
విమలగతిఁ గూయు నినదము లమర నివ్వనంబు చెలువొందు నానందనాదమయత.
క. అని తనియనికోరిక నవ్వనిఁ గొనియాడి నిజమిత్రవర్గంబులఁ దో
డ్కొని జనితనితాంతముదాప్తిని జనియె నిరంకుశోద్ధతి న్వనసీమన్. 117
వ. ఇట్లతండు వనక్రీడావ్యసనంబున నచ్చటిమహిమ దెలియక యవ్వనంబు సొచ్చె
నాస్థలమాహాత్మ్యం బాకర్ణింపుము. 118

రాజకుమారుఁడు ఈశ్వరశాపమున సుందరియగుట.

మ. ప్రమదారత్నము సర్వమంగళకళాప్రావీణ్య కన్యాళితోఁ
బ్రమదం బార భజింపఁగాఁ బ్రమథవర్గస్వామి దూరీకృత
ప్రమదాంధద్విపదైత్యబాహుబలసంరంభుండు శంభుండు త
త్ప్రమదారామమునం దృతీయపురుషార్థక్రీడలన్ లోలుఁడై. 119
ఉ. ఆటలపాటల న్సుముఖుఁడై చరియించుటఁ జేసి యెవ్వ ర
చ్చోటికిఁ బోవ రాస్థలము చొచ్చినయంత నె యీశ్వరాజ్ఞచే
ఘోటికయయ్యె ఘోటకము కూడి చరించుచునున్న మానవుల్
జోటికలైరి తాను నొకసుందరి యయ్యె మహాద్భుతంబుగన్. 120
సీ. సారంగముల నట్లు చంపినపాపంబు తప్పునె కన్నులఁ గప్పుకొనక
సామజంబుల నట్లు సమయఁజూచినకర్మ మడఁగునె నడుముల నంటుకొనక
గురుమెకంబుల నట్లు కూర్చినగీడు దాఁ దొలఁగునె శిరసుల దొట్టుకొనక
పంచాస్యముల నట్లు త్రుంచినదోషంబు పోవునే నడుములఁ బాపుకొనక

తే. యకట ! వనవాసులై దేశయాత్ర నడపు, గొనుమృగంబుల మృగయావ్యసనత హింస
చేసిన యఘంబు పొందె జేఁజేతననఁగ, నధమమగునాఁడువగ వారి కమరెనపుడు.

సీ. శ్మశ్రుకళంకదోషంబు నిశ్శేషమై ముఖచంద్రబింబము ముద్దుగులుక
వరవీరరసరజోభరణంబు హరణమై నేత్రాబ్జధవళిమ నివ్వటిల్ల
నుష్ణీషపేటికాయుక్తి విముక్తియై కచనీలమణిగణకాంతి దనర
జ్యాకిణాంకమిళిందసహితంబు రహితమై కరహల్లికచ్ఛాయ గడలుకొనగఁ

తే. బటుతనుత్రాణశుక్త్యపవారణము న, వారణంబై శరీరలావణ్యమూర్తి
కద్యుతి వెలుంగఁబురుషలక్షణము లెడలి, యకుమారుండు నవమోహనాంగి యయ్యె.

శిఖరిణీవృత్తము:—

ఇలాకాంతాకారం బెడలి మును దానెట్టు లటుల
య్యిలాకాంతాకారం బెనసి తదుపాంతేందుగురుమే
ఖలాకాంతారాంతర్గతకిణికిణిక్వాణమణిమే
ఖలాకాంతారిప్రాకటజఘనభారప్రచలయై. 123

వ. మెలంగుచుండి. 124

తే. రాకుమారుండు రూపెందిరాకుమారుఁ, డాకుమారవనంబునం దాకుమారి
కాకృతి ధరించుటకు హేతు వాకుమార, జనకునాజ్ఞోక్తి కలదది వినుము తెలియ.

మ. నవలావణ్యవిలాసమూర్తి పరమానందస్వభావుండు కై
రవిణీబాంధవశేఖరుండు హరుఁ డార్యాయుక్తుఁడై యకుమా
రవనాంతంబున నొక్కనాఁడు ప్రియమారన్ రుద్రలీలావతీ
నివహంబుల్ గొలువన్ వినోదవిహృతి న్నెయ్యంబు సంధిల్లఁగన్. 126

సీ. చలువతాదొనల గొజ్జఁగిపూఁబొదల మంచుదొరుఁగు నాపన్నీట దోఁగితోఁగి
పరువుగా ముదిరిన పండ్లగుత్తుల మొత్తముల దాకపందిళ్ళ మూఁగిమూఁగి
గుజ్జుమావుల నల్లుకొని ప్రేలునుదీఁగ తూఁగుటుయ్యాలల నూఁగి యూఁగి
యింపుసొంపాదవించు నెలతేఁటిగమిపాట లెసఁగుపూఁబొదరిండ్ల నీఁగియీఁగి

తే. పరపుఁబుప్పొళ్ళ నడుగుఁదామరల చిన్నె, లేరుపడ మెట్టి సురపొన్న చాయ చలువ
లీను నీడలజాడల నేగియేగి, చెలఁగి చెలులును జెలువుండు మెలఁగి రెలమి. 127

శా. ఈచందంబునఁ గొంత సేపు ప్రమదం బేపార లీలావిహా
రౌచిత్యంబుల సంచరించి విటపోద్యత్పారిజాతావృత

ప్రాచుర్యామృతసారపుష్కరిణికాప్రాంతాయతోదార శో
భాచంద్రోపలవేదికాస్థలిఁ బ్రభల్ భాసిల్ల నాసీనుఁడై. 128

చ. దరహసితామృతంబు ముఖతామరసంబు నలంకరింప నా
హరుఁడు ముదంబున న్వనవిహారపరిశ్రమలాలసాంగి న
గ్గిరిసుతఁ గాంచి కేలితమిఁ గేల్కొనుచున్న యెఱింగి నెచ్చెలుల్
సరసగతిం దొలంగి కనుచాటుగుచాటుల నుండ నయ్యెడన్. 129

తే. అంబుజాననఁ గౌఁగిటనలమియలమి, యిష్టకేలీసుఖంబుల నెనసితనిసి
యంకపీఠంబు పై నుంచి యలపుసొలపుఁ, దీఱ లాలించిపలికె సుస్థిరుఁడు హరుఁడు.

చ. అడుగులు మూడఁ గెంజిగురుటాకులు చేతులు లేఁతతీఁగె లె
క్కడుజిగి చన్నుదోయిపువుగుత్తులు మోవిరసంబు పక్వమై
వడుచుఫలద్రవంబు ప్రియవల్లభ చక్కనికొమ్మ వాట ని
న్నెడయక యిన్నిరూపముల నివ్వనదేవత యాశ్రయించెనో. 131

తే. తరుణి నానీలకంఠాభిధానమునకుఁ, దోఁచె నర్థాంతరము పరితోషసరణి
సాంద్రసీమంతభూషాసురేంద్రచాప, సహితయుష్మత్కచాబ్దదర్శనమువలన. 132

సీ. మృగశాబకంబు హస్తగతంబు సేయుట సుదతి నీకన్నులుచూచికాదె
యరచందమామను శిరసుపైఁ దాల్చుట వెలఁది నీనుదురు భావించికాదె
గగనంబు కేశసంగతము గావించుట చెలువ నీకౌను లక్షించికాదె
భుజగంబులను హారములుగా ధరించుట కలికి నీకీల్జడఁ గాంచికాదె
తే. కొమ్మ నీయంగముల పోల్కి కొంతకొంత, కలిగియుండుటఁ బ్రియమయ్యెఁ గాకమాకు
వీని భరియించుటకు నిచ్చకైనఁ గలదె, కారణము పూర్ణచంద్రసంకాశవదన. 133

చ. కలికి శిరీషపుష్పములకంటెను మిక్కిలికోమలంబులై
యలరు భవన్మనోహరతరాంగకము ల్గనుఁజూచి యేగతిన్
దెలియఁగవచ్చుఁ గొండకుజనించినదానవటంచు నీదుని
శ్చలపటుకర్కతోన్నతకుచద్వయిఁ దెల్పఁగఁగాక కోమలీ. 134

చ. అనపుడు లేఁతనవ్వు జిగి యందపుఁజెక్కిలిదోయి కుందనం
బునకు మెఱుంగువెట్ట గొనబుంబచరింపుల సిగ్గుఁ బ్రేమయుం
బెనఁగొని వాలుఁగన్నుఁగవ బిత్తరిచూపుల నాదరింప మో
హనమధురోక్తి నుత్తరములాడుచునుండె భవాని శంభుతోన్. 135

వ. ఆసమయంబున. 136

శా. కౌండిన్యాత్రివసిష్ఠగౌతమమతంగవ్యాసజాబాలిమా
ర్కండేయచ్యవనౌర్వకణ్వభృగుభారద్వాజకుంభీజను
శ్శాండిల్యాదిమహామునీంద్రు లెలమిన్ సందీపితానేకమా
ర్తాండస్ఫూర్తితతేజు నయ్యభవు సందర్శించునాసక్తితోన్. 137

తే. వచ్చి ప్రమదవనస్థలిఁ జొచ్చి యనతి,దూరమునఁ గాంచి రమ్మునీంద్రులు రహస్య
కేలి ననురాగరసవార్ధి నోలలాడు, తమిఁ జెలంగెడు నాదిమదంపతులను. 138

వ. అప్పుడు. 139

ఉ. వారలరాకఁ గన్గొని వివస్త్రశరీరిణిగానఁ గ్రక్కునం
జీర ధరించె శైలసుత సిగ్గున మన్మథచంద్రహాసమొ
య్యారముగా నొరంజొనిపినట్లయి యచ్చపలాలతాంగి శృం
గారరసంబు ప్రాణవిభుకన్నులచూడ్కికి విందుసేయఁగన్. 140

వ. అవ్విధం బవలోకించి. 141

క. మునివరులు సమయ మెఱుఁగక, చనుదెంచితిమనుచు మఱలి చని రపుడ రయం
బున నరనారాయణులుం, గనుఁగొను వేడుకల బదరికావనమునకున్. 142

ఉ. అత్తఱి నమ్మునుల్ నిజరహస్యవిహారముఁ గాంచిరంచు న
య్యుత్తమనాయకాతిలక ముల్లమునం గడులజ్జనొంది మో
మెత్తక యున్న శూలి హృదయేశ్వరిచిత్త మెఱింగి పల్కెనో
మత్తమరాళయాన వినుమా యనుమానమువాయఁ జేసెదన్. 143

మ. తరుణీ నీకును నాకు నెంతయు వినోదక్రీడకున్ వేడ్క నే
యిరహస్యస్థల మిక్కమారవన మన్యుల్ చొచ్చిరాఁగూడ దే
పురుషుల్వచ్చినఁ బౌరుషం బెడలి యంభోజాతపత్రాక్షు తా
దురు నేఁడాదిగ నంచుఁ బల్కె భువనస్తుత్యుండు శర్వాణితోన్. 144

వ. తత్కారణంబునం జేసి సుద్యుమ్నుండు విద్యుల్లతాంగి యై విస్మయవిషాదవిహ్వల
మతిం దిరుగుచు. 145

క. కామినియై తానిక్కఱ,గామిని నేమని జనంబుఁ గాంతు నని వనీ
భూమిని జరియించె నిలా,భామినియై వనరమాస్వభావత దోఁపన్. 146

. పల్లవితపాదపంబుల ఫలితభూజ,ములను బుష్పితతరువుల ముద్దుగుమ్మ
పికవిలాసినికైవడి శుకవధూటి,పోల్కి మధుకరరమణిసొంపునఁ జరించె. 147

క. ఈరీతిఁ దిరిగి తిరిగి ప్రయోరుహనళినేత్ర దైవయోగమువలనన్
దారాతారారమణకుమారుం డగుబుధునియాశ్రమంబునఁ జేరెన్. 148

ఉ. చేరిమనోజసుందరవిశేషతనూవిభవాభిరాముఁ గే
యూరకిరీటకుండలముఖోజ్జ్వలదివ్యవిభూషణాఢ్యలం
కారు సమందహాసముఖకాంతివినిర్జితపూర్ణిమాతమీ
చారుకళావిధు న్వినతసర్వబుధున్ బుధుఁ గాంచి ప్రేమతోన్. 149

వ. ఇట్లని వితర్కించె. 150

స్త్రీయైన సుద్యుమ్నుఁడు బుధుని మోహించుట.

సీ. అలివేణులకు మనోహరముగాదే వీనికెందమ్మిచాయలకేలుదోయి
కీరవాణులకు నోరూరింపదే వీని మాధురీకలితబింబాధరంబు
మదచకోరాక్షుల కెదఁ బ్రేమగొల్పదే వీనిపూర్ణేందుబింబాననంబు
వరకోకకుచలకు వలపుపుట్టింపదే వీనిమార్తాండతేజోనిరూఢి
తే. యహహ వీనివసంతమోహనవిలాస, మేలతాంగుల నలరింప దెంచిచూడ
ననుచు రాగరసార్ద్రాంతరంగ యగుచు, సుదతి కనుఱెప్పవెట్టక చూచె నతని. 151

ఉ. ఆయరవిందరాగరుచిరాధర నాహరినీలవేణి నా
శ్రీయుతమౌక్తికద్యుతివిశేషదరస్మిత నానవప్రవా
ళాయతపాణిపాదయుగ నావరహీరనఖాళిఁ గాంచి యా
హా యిది రత్నరాశి వనితాకృతిదాల్చి మెలంగెడుం జుమీ. 152

వ. అని తలంచుచు నసామ్యసౌమ్యసద్గుణరమ్యుం డగునాసౌమ్యుండు మదనప్రదర
విదళితహృదయుం డై యమ్మనవతిం గదియవచ్చి యి ట్లనియె. 153

మ. నవలావణ్యవిలాసమోహినివి చానా నీవు గంధర్వకాం
తవో విద్యాధరభామవో విహగసౌందర్యాంగివో సాధ్యక
న్యవో సిద్ధాంగనవో భుజంగసతివో యక్షాంబుజాతాయతా
క్షివో గీర్వాణవధూటివో తెలుపుమా చిత్తంబు రంజిల్లఁగన్. 154

చ. పరభృతపఙ్క్తి నీయధరపల్లవలబ్ధిగుఁ దుష్టిబెల్ భవ
త్స్వరసముఖాంబుజాప్తియును సంగతిఁగోరి వనంబులం దప
శ్చరణలు చేసి సుస్వరముఁ జక్కనిమాపులు నై మెలంగెడున్
బురుషులు నిన్నుఁజూచి మరుభల్లికికిఁ జిక్కరె నీకుఁ దక్కరే. 155

తే. వనిత నీవాలుగన్నులు వలుదకొప్పు, మందగమనంబు సారంగమహిమఁ గాంచుఁ
గలికి నీమోముఁ జక్కనికరయుగంబు, మఱి గళంబును నబ్జసంపదవహించు. 156

సీ. తెఱవ నీవు కటాక్షదృష్టిఁ జూచినఁ గాముకాండముల్ తృణమునఁ గట్టరాదె
నాతి నీవించుక నవ్వినఁ బూర్వచంద్రికల జాడ్యంబు నొందింపరాదె
భామ నీవు ప్రియోక్తిఁ బలికినఁ జిలుకలఁ బట్టిబందిగములఁ బెట్టరాదె
లోలాక్షి నీవు కెంగేలు పైఁజేర్చినఁ జిగురాకులఁ జలింపఁజేయరాదె

తే. లేమ నీదయ నామీఁద లేమినింత, వెతలపాల్పడవలసెను వీనిచేతఁ
గాక నీప్రాపు గలిగినఁ గడఁగి వీనిఁ, బట్టిపల్లార్తుఁగాదె నీపాదమాన. 157

సీ. రాజబింబాస్య యీరాజకీరములకు నీముద్దుమాటలు నేర్పుకొఱకొ
యిందీవరాలక యీపూవులకు నెల్ల నీమేనితావులు నింపుకొఱకొ
నవమోహనాంగి యీనెమలిగుంపులకు నీతిన్ననినడుపులు దిద్దుకొఱకొ
వామాక్షి యీపల్లవములకు నీమోవితళుకుఁ గెంజాయఁ బైకొలుపుకొఱకొ

తే. కాక యివ్వనసీమ నిట్లేకతంబ, యేకతంబునఁ దిరిగెదవే యొయ్యారి
నన్ను ధన్యునిఁ జేయుయత్నంబు దక్కఁ, గలదె కలవాణి యొండొకకారణంబు.

శా. నాసాగంధఫలీపరాఙ్ముఖగతి న్నాతీ భవత్కేశభృం
గీసంఘం బిరుపాయలై వెనుకకుం గేడించి యచ్చోట గుం
పై పొంపొందినభంగి సుందరతరంబై చాఱుసీమంతరే
ఖాసంయుక్తిని గీలుగంటు సిగ శృంగారంబు రాజిల్లెడున్. 159

సీ. భామినీమణి బెండువడనిసింగిణులు నీకనుబొమ్మ లైక్షవకార్ముకునకు
జలజాక్షి యక్షయశరములు నీకటాక్షపరంపరలు పంచసాయకునకుఁ
గలికిచాయలు వోనిఖడ్గముల్ నీకేలుదోయి ప్రవాళకౌక్షేయకునకు
నెలఁత మనోగతి మెలఁగువాహములు నీకులుకుఁబల్కులు కీరఘోటకునకుఁ

తే. దనకుఁ దగ నివి జాడ్యంబు లుడుచు మొదలి, సాధనంబులు పూర్వపక్షములు చేసి
యతివ నీయంగకములు సిద్ధాంతములుగఁ, గైకొనియెఁజుమ్ము మరుఁడులోకముల గెలువ.

సీ. కురియదే కలువక్రొవ్విరివాన జోరున నీవు వీక్షించిన నీరజాక్షి
నిండదే పండువెన్నెలతేట చల్లఁగా నీవింతనవ్విన నీలవేణి
మొరయదే పంచమస్వరలీల ఘుమ్మన నీవుమాటాడిన నిరుపమాంగి
పొలయదే గమ్మన మలయజామోదంబు నీయూర్పుసోఁకిన నిమ్ననాభి

తే. మదనచంద్రవనప్రియమలయపవన, నిగ్రహంబులు తలఁప ననుగ్రహంబు
లౌఁగదా నీకృపాప్రసాదాప్తి నిట్టి, రూపముల రాజహంసానురూపగమన. 161

తే. కలిమి కొండంతకలిగియుఁ గతినరీతి, నర్థికిని మేలుచూపక యకట బయటి
గమకముల నాసకొల్పెడుఁ గలికి నీదు, చన్నుఁగవ లోభిదొరల దీచంద మనఁగ. 162

మ. ఎలనాఁగా, మదనాగ్ని వేఁగెడు నయో యీమేను, గుత్తంపుఁగ్రొం
జిలుఁగుంబట్టుచొకాటపుంబ్రవికలోఁ జెల్వై సెగద్దేరు, నీ
బలుపుంజన్గవనొత్తి పట్టఁగదె నాపై నుష్ణముష్ణేన శీ
తలమంచున్ బుధకోటి పల్కుగతి సంతాపంబు చల్లాఱఁగన్. 163

శా. నిన్నుం జూచినవేళనుండి తరుణీ నీరూపరేఖావిలా
సౌన్నత్యంబులు నామదిం దగిలి మోహభ్రాంతిపాలైతిఁ జం
చన్నీలోత్పలబాణవృష్టిని రణఝ్ఝుంకారటంకారసం
పన్నాభంగురభృంగమౌర్వి నటియింపం గమ్మవిల్వంచి ముం
చె న్నించె న్నిజశాంబరీతమము రాజీవధ్వజుం డియ్యెడన్. 164

క. బాలిక శకలితశశిబిం,బాలిక శుకశారికాదికాంగజసేనా
కోలాహలంబు చెవులకు, హాలాహల మగుచు మిగుల నలయించెఁగదే. 165

క. అని యిట్లు పలుకుశశినం,దను మోమున కతివ కులుకుతళుకుబెళుకువా
ల్గనుఁగొనల సిగ్గుఁ బ్రేమయుఁ, బెనసినచూపుల నివాళు లిడుచుం బలికెన్. 166

తే. రాజనందన జితరతిరాజరాజ, రాజనందన విను మేను రాజకన్య
నీశ్వరానుగ్రహంబున నివ్విధమున, సంచరించెద నివ్వనస్థలులయందు. 167

సీ. స్వాభావ్యమందహాసచ్ఛలంబునఁ బూర్ణహరిణాంకు నవ్వు నీయాననంబు
నైసర్గికాంతారుణవ్యాజమునఁ దమ్మిగములపైఁ గినియు నీకన్నుదోయి
సహజోర్ధ్వరేఖామిషమునఁ గెంజిగురులపై ధ్వజంబెత్తు నీపదయుగంబు
నిజభూషణధ్వనినెపమునఁ గరికరనికరంబు నదలించు నీభుజంబు

తే. లిట్టినీచక్కఁదనము పూర్ణేందుబింబ,వదనలకు సాత్త్వికోదయాస్పదము కాదె
కమలభవురచనాచమత్కారమునకు, నరయఁ గూలంకషముగాదె యలఘుచరిత.

చ. మదనవిలాసినీనిరుపమానమనోహరమూర్తిఁ జూచి, నా
హృదయము, చంద్రకాంతమణి యిందుకరాప్తిఁ గరంగునట్లు, స
మ్మదరసపూరమయ్యె, ననుమానము సేయక యేలుకొమ్ము, పెం
పొదవఁ గవుంగిలించి, చిగురొత్తినకోర్కులకున్ ఫలంబుగన్. 169

చ. అని వనితాలలామయు నిజాభిమతానుగుణంబుగాఁగఁ బ
ల్కిన పలుకుల్సుధారసములీల శ్రుతిద్వితయంబు నిండి నె
మ్మనమున సంప్రకాశమగు మన్మథతాపము చల్లచేయ న
వ్వనరుహనేత్రఁ జేరి రతివాంఛలు లోపలఁ జౌకళింపఁగన్. 170

క. భృంగీసంగీతస్వన,మాంగళ్యసుగంధకుసుమమంజరులు బయల్
పొంగుమరందము నెపమున, శృంగారరసంబు గ్రమ్మరిలుపొదరింటన్. 171

మ. వనితం గౌఁగిటఁజేర్చి బింబఫలనవ్యంబైన కెమ్మోవి ప
ల్లానల నొక్కుచుఁ జెక్కుటద్దము లొగిన్ముద్దాడుచు న్మోహన
స్తనకుంభంబుల నెమ్మెనల్ పుణుకుచున్ సంభోగచాతుర్యశీ
లనుఁడై సల్పె రతిప్రసంగము మహోల్లాసంబుసంధిల్లఁగన్. 172

క. ఆయింతిమదనుపాళెము, నాయతమతి గొల్లగొనఁగ నతనుం డబలుం
డై యొదిఁగె వగరుదోఁచఁగ, నాయఁడు పొంచుండు ననుట నైజముగాఁగన్. 173

చ. కటకట వెన్నవంటికలకంఠిమనం బొకరాయి చేసి మి
క్కుట మగుచన్నుదోయిపయికొంగయినంబతినంటనీక య
ట్టిటుఁ బెనఁగించుకాళ్ళతన మెక్కుడఁబోయెనొ కాని సిగ్గుతా
గిటగిటమంచుఁ గొమ్మకనుఁగ్రేవలఁ జేరెఁ దుది న్విభుండు ము
చ్చట తమిరేఁచి లోఁబఱిచి జవ్వనమెల్లను జూఱలాడఁగన్. 174

సీ. సొగసుఁ బల్మానగంటు చుఱు కెఱుంగఁగరాని పెదవులయమృతంపుఁబిల్పుసొక్కు
తారహారముల యొత్తడ మెఱుంగఁగరాని పరిరంభముల ప్రేమపరవశంబు
గిలిగింత యక్కుబెక్కు లెఱుంగఁగారాని మర్మసంస్పర్శనామందసుఖము
సిగ్గుపోకడమాట యెగ్గెఱుంగగరాని తమిహెచ్చరింపువాక్యములముంపు
తే. ముదుఱుఁదమకంపుఁగలయిక నొదవునలయి,కల నెఱుంగఁగరాని యగ్గలపుఁగళల
యుబ్బు నుబ్బువినోదమై యొనరె నపుడు, సమరతిక్రీడ రమణికి రమణునకును. 175

తే. ఇవ్విధంబున జవ్వని నవ్వనింబ్ర, గాఢమోహార్తిఁ గొన్నాళ్లు కలసిమెలసి
మకరకేతనపూజ్యసామ్రాజ్యపదవి, కెలమి మూర్ధాభిషిక్తుఁడై యేలుచుండె. 176

తే. అతనికన్యాసమాగమస్థితి తదీయ, మిథునవర్తనమునుఁ బెంపు మిగిలియుండె
బుధునికన్యాసమాగమమిథునవర్తనములు పెంపువహించుట నైజమకద. 177

వ. ఆసమయంబున. 178

క. ముక్తామణిభరణాంచిత,శుక్తిప్రతిమాన మగుచు సుదతీమణికిన్
నక్తంకరజాతకళా, యుక్తంబై గర్భమమరె నుజ్జ్వలలీలన్. 179

క. చెక్కులతెలుపును జిగిచను, ముక్కులనలుపును నపాంగములఁ దేలికతా
దృక్కులసోలపును నెడనెడ, వాక్కులయలపును ఘటిల్లె వనితామణికిన్. 180

ఉ. కేలితమిం జెలంగి తమకించి నిజోద్ధతిఁజూపఁజూచు న
వ్వేళఁ బ్రశాంతుఁజేయు నరవిందనిభాననకుంచితాంచిత
భ్రూలతికావిలాసమునఁ బొల్పుకనుంగవ మోడ్పుతోడ గ
ర్భాలసజాతశీత్కృతిరవాననపద్మము ప్రాణనాయకున్. 181

ఉ. రావె కృశోదరీ యనుచుఁ రాగదవే తనుమధ్యయంచు హే
లావతు లెక్కసెక్కెమగులాగునఁ బల్క శిరంబువాంచు ల
జ్జావశమందహాసవిలసన్ముఖియై జఠరావలగ్నభా
గావహవిస్తరంబు తెలియం గను భంగి లతాంగి యయ్యెడన్. 182

సీ. దృఢసంపదల కింకఁ దిరుగుఁబాటనియొ స్తనంబులముఖములు నల్లనయ్యె
జిగిబిగి పరిపాటి యగు నింకననియో తనూలత చంచలానూపమయ్యెఁ
గళపెంపు మట్టుగాఁ గలదింక ననియొ ముఖాబ్జంబు వెలవెల్లనై యెసంగెఁ
గ్రొవ్వాఁడితనమింకఁ గొలఁదియా ననియొ దృగంచలం బలసావికాసమయ్యె
తే. నెపుడుఁబతిప్రక్కఁబాయనియెలమికలిమి,యెడ నెడలఁగానిలభియింపఁదింకననియొ
యంతరంగంబు మిగుల జాడ్యంబునొందె, సతికి గర్భంబువర్ధిల్లు సమయమునను. 183

వ. అంత. 184

క. నవమాసానంతరమున, నవమోహనగాత్రి గాంచె నందను రాకా
ధవళకరుం బ్రథమదిశా,కువలయదళనేత్ర గాంచుకొమ రమరంగన్. 185

శా. సూచించెం బరమోచ్చభాగవిహరత్సువ్యక్తవర్గోత్తమ
ప్రాచుర్యోచితదృక్సమేతశుభదారంభగ్రహానుగ్రహం
బాచక్రాచలధారుణీవలయరాజ్యశ్రీయుతైశ్వర్యవి
ద్యాచాతుర్యగుణాదిభావిఫలముల్ తజ్జన్మకాలంబునన్. 186

మ. గణనాతీతవిశేషలీలఁ గురిసెన్ గంధర్వగీర్వాణచా
రణవిద్యాధరదంపతిప్రకరనిర్యత్పుష్పవర్షప్రక
ర్షణమబ్బాలకుఁ డుద్భవింపఁగ సమస్తక్షోణిరక్షావిచ
క్షణదీక్షారచితాభిషేకదివిషద్గంగాంబుధారాకృతిన్. 187

ఉ. తత్సమయంబునం బుధుఁ డుదారముదావహచిత్తవృత్తిఁ బు
త్రోత్సవకృత్యముల్ నడపె యోగిజనంబు లితం డఖండసం

పక్షము పేతలీల నయపద్ధతి నేలఁగలం డనేకసం
వత్సరము లుసుధాంశుకులవర్ధనుఁడై జనలోక మంతయున్. 188

క. అనినిర్ణయించి మిక్కిలి, యనురాగముతోడ మంగళాశాసన మిం
పొనరఁగ జేసి పురూ,రవుఁ డనియభిధానం బొనర్చి రబ్బాలునకున్. 189

సీ. పాలుబ్బు బిగువుగుబ్బల నెమ్మొనలకిని పసపంటుపయ్యెదపై నటింపఁ
గాయంపుముద్దల కారంపుఁదావు లాస్యనిసర్గవాసన నలమికొనఁగ
నడుమునడిటముగా వడిఁజుట్టికట్టిన బంగారుమైజారుకొంగు దనర
నుల్లిపూసలపేరు హారుమంజిముత్యాలకుతికంటు దాపునఁ గొమరుమిగులఁ
తే. బ్రసవసమయపరిశ్రాంతి బడలియున్న, యంగకమ్ముల నొకవింతయంద మెసఁగ
జూడఁ దగియుండె నప్పుడాసుదతియందు, లాలితంబైన బాలెంతరాలితనము. 190

సీ. అర్థక్షణంబైన నంతరాయములేని కౌఁగిలి యత్నసంఘటిత మయ్యెఁ
గుచపీడనంబు చేకోలఁదిసారెకుఁ జేయు మమతహస్తస్పర్శమాత్ర మయ్యెఁ
గపురవిద్యపుఁదావి గ్రమ్ముచుంబనలబ్ధి కటువస్తుపరిమళకలితమయ్యె
ఘటచక్రపుంభావనటనలఁ జూపునేర్పులకు జొక్కుటలపరూపమయ్యె
తే. నతనిహృదయంబు పూర్వహర్షానుభవతఁ, బొదలె బాలెంతరాలిసంభోగకేళి
నలవియె యెంచఁ బ్రసవితానంతరద్వి,తీయమాససమాగమాధిక్యసుఖము. 191

క. ఈకరణి మఱియుఁగొన్నా, ళ్లాకరభనిభోరుఁ గూడి యతిశయసమ్మో
దాకరవిహారగతుల సు,ధాకరనందనుఁడు మెలఁగుతత్సమయమునన్. 192

చ. ప్రతిదినవర్ధమానసితపక్షకళానిధికైవడిం బ్రవ
ర్తితరమణీయశైశవశరీరవిరాజితుఁడై విభూషణ
ద్యుతి యతిచిత్రమై వెలుఁగుచుండ జగజ్జనలోచనోత్సవ
స్థితిఁ దనరెంబురూరవుఁ డశేషవిశేషగుణాభిరాముఁడై. 193

వ. అంత. 194

క. తనయాకృతి వితతామో,దనిదానంబయ్యె నపుడు తరుణీమణికిం
దనయాకృతి వితతామోద,నిదానంబయ్యె నది యథార్థముగాదే. 195

చ. కతిపయివాసరంబు లరుగన్ భ్రమరాలక యొక్కనాఁడు క
ల్పితమగునాత్మవర్తనము చిత్తమునం దలపోసి రోసి దుః
ఖిత యగుచుం దలంచె మదిఁ గేవలయోగసమాధినిష్ఠ నూ
ర్జితకరుణాదిసద్గుణగరిష్ఠు వరిష్ఠు వసిష్ఠు నయ్యెడన్. 196

తే. తలఁచినప్పుడ వచ్చెభక్తప్రసన్న,పరమకరుణారసార్ద్రస్వభావుఁ డగుట
నమ్మునీంద్రుండు నిజవిగ్రహప్రదీప్తి, విపినదేశంబు నెంతయు వెలుఁగఁజేయ. 197

క. ఆగతి నాగతుఁ డగున,య్యోగిశిఖామణిపదాబ్జయుగళంబునకున్
సౌగుణ్యగతిఁ బ్రణామము, లాగజగామిని యొనర్చి యవనతముఖి యై. 198

మ. తనవృత్తాంతము విన్నవించి పురుషత్వప్రాప్తికై వేఁడినన్
మునినాథాగ్రణి యూరడించి గిరిరాణ్మూర్ధన్యకన్యానిగూ
హనరోమాంచితసవ్యభాగు భుజగేంద్రాకల్పు సంకల్పసం
జననవ్యాళవిహంగపుంగవు శివున్సద్భక్తి భావించుచున్. 199

శా. చిద్రూపంబు నివాతదీపకళికాశ్రీలక్ష్యమై లోన న
క్షుద్రస్ఫూర్తి వెలుంగ వర్జితనిమేషోన్మేషమై దృష్టిభా
స్వద్రూఢిన్ బయ లందగింపఁ గరణస్వస్థాత్ముఁ డై శాంభవీ
ముద్రాముద్రితలీల నిష్టసలిపె న్ముఖ్యప్రకారంబునన్. 200

క. యతియతినియతికి గిరిజా,సతిపతి మతి సంతసించి సాగుణ్యనిజా
కృతిశ్రుతితతినుతిపాత్ర,స్థితి ధృతియుతి దర్శితంబుచేసె న్మునికిన్. 201

సీ. మస్తకస్ఫూర్జితామరధునీవిధుకళల్ వ్యోమకేశత్వంబు నొనరఁజేయ
మహితధాతృకపాలమాలికాబాహుళ్య మాద్యంతరాహిత్యమభినయింప
భయభక్తులను మేలుపడియున్న జగదంబ స్వాధీనమాయాత్వసాక్షిణిగను
గొలిచి వచ్చెడిభక్తకోటి సారూప్యంబు కైవల్యదాతృత్వగరిమఁ దెలుప

తే. సహజమందస్మితరసప్రసన్నవదన, రుచిసదానందభావంబు రూఢిపఱుప
నపుడు ప్రత్యక్షమయ్యె బ్రహ్మర్షిలోక,తల్లజునకుఁ ద్రిలోకబాంధవుఁడు శివుఁడు.

చ. ప్రమథగణంబుతో భుజగభాస్వరహారకదంబకంబుతో
నమరధునీతరంగలు తనాత్తజటాపటలంబుతోఁ దురం
గమితవృషేంద్రచంక్రమణకల్పనతోఁ గనుపట్టుపార్వతీ
రమణుని గాంచి హర్షజలరాశిపరిప్లవదంతరంగుఁ డై. 203

వ. సాష్టాంగదండప్రణామంబు లాచరించి యిట్లని స్తుతియించె. 204

లయగ్రాహి:—

అంగజభుజంగమవిహంగప తురంగకర భృంగినుతమంగళతరంగపటుశృంగా
ఘాంగభటపుంగవతురంగమ మతంగజళతాంగ చతురంగబలరంగదరిభంగా

భంగురపతంగశశిసంగతరథాంగ సదపాంగ శుభలింగ గిరిశృంగగృహ గంగా
తుంగతరభంగచయసంగమవరాంగ హృదయంగమ మతంగమశిచంగసుమభృంగా.

లయవిభాతి:—

భుజగకరవలయ వరరజతగిరినిలయ పదసృజితభరతలయ రణవిజయ భుజదండా
ఋజుసరసహాసన లసదజినకృతవసన ముఖవిజితశశిఁసన రచితజలభవజాండా
త్రిజగదనుభరణ సురభజితమృదుచరణ మదగజదనుజహరణ సరసిజనయనకాండా
ప్రజవవృషగమన ఘనవృజినచయదమన కృతసుజనభయశమన ధృతరజనికరఖండా.

చ. అనుచు ననేకభంగుల నయం బెనయం బెనఁగొన్న భక్తిచే
వినుతులుసేయుమౌనిఁ గని విశ్వగురుండు హరుండు సుందరా
ననదరహాసచంద్రికలు నైజకటాక్షదయాసుధారసం
బున కనురూపమై మదికపూర్వముదం బొదవింప నిట్లనున్. 207

శా. నీసంకల్ప మెఱుంగుదు న్వినుము మౌనిశ్రేష్ఠ హేలావతీ
త్వాసంగాకృతి నున్నరాసుతుని బుంస్త్వాకారసంప్రాప్తికై
యాసక్తి న్నముఁగోరి వేఁడెదు మదీయాజ్ఞోక్తియట్లుంటఁ గా
దా సుద్యుమ్నుఁడు పౌరుషంబెడలి కాంతారూప మయ్యెన్వనిన్. 208

ఉ. మావచనం బమోఘ మదిమాన్పట గల్గదు నీయెడం బ్రస
న్నావహమయ్యె మాహృదయ మట్లగుటన్ భవదిష్టసిద్ధియుం
గావలసె న్మునీంద్ర యటుగావునఁ దానుభయార్థసాధకం
బై వెలయంగ వేఱొకయుపాయ మొనర్చెద నేర్పు పెంపునన్. 209

క. పురుషుండై యొకమాసము, ధరణీసామ్రాజ్యభారదక్షత నుండుం
దరుణీమణియై మాసాం, తరమున వర్తించు నిట్లు తప్పక నడచున్. 210

వ. అని ఇవ్విధంబున. 211

క. మగరూపు నాఁడురూపును, సుగుణస్థితిదాల్చుహరుఁడు సుద్యుమ్నునకున్
మగరూపు నాఁడురూపును, దగనొసఁగె వసిష్ఠవందితపదాంబుజుఁడై. 212

శా. అంతర్ధానము నొందె నంతఁ బరమేశానుజ్ఞచే నయ్యిలా
కాంతారూపము పౌరుషాకృతి వెలుంగంజూచి చిత్తంబునన్
వింతంబొందుచు నున్నసౌమ్యునకుఁ దద్వృత్తాంతముం దెల్పి ని
శ్చింతుంజేసి యరుంధతీవిభుఁడు దాక్షిణ్యంబు సంధిల్లఁగన్. 213

వ. రూపరేఖాజితప్రద్యుమ్నుం డగుసుద్యుమ్నుని నిజవదనచంద్రచంద్రికావికసిత జగజ్జననయనకైరవుం బురూరవుం దోడుకొని ప్రతిష్ఠానపురంబున కరుగుదెంచు చుండె నవ్వార్త చారులవలన వినినవాఁడై వైవస్వతవసుంధరావల్లభుం డుల్లాసంబున నుల్లంబు పల్లవింపఁ బురంబు శృంగారింపం బరిచారకుల నియోగించిన వారును సంభ్రమంబున నానావిధశృంగారరచనల నపూర్వవిలాసంబుగా నగరం బలంకరించి రప్పుడు. 214

సీ. పొసఁగుపన్నీటిపాల్పున జొబ్బిలనివీథి పచ్చకస్తురి నల్కఁబడనియరుగు
వెడఁదముత్యముల మ్రుగ్గిడనిముంగిలి కల్పసూనతోరణలబ్ధి లేనివాకి
లాటపాటలయింపు లమరనిసభ మహోత్సవముసేయని దేవతాగృహంబు
నగరుధూపపుఁదావు లతిశయింపనిచోటు శేషవస్తువుల రాజిలనివిపణి
తే. నూతనాలంకృతులను మనోజ్ఞరూప, వైభవులుగాని పురుషుండు వనజముఖియు
వెదకినను గానఁబడుటగల్లదు తదీయ, నగరశృంగారరచన లెన్నఁగఁదరంబె. 215

చ. అరయ నిసర్గసుందరతరావయవోజ్జ్వల యైనపాటలా
ధర కుసుమాంబరాభరణధారిణియై మిగులన్వెలుంగు న
ట్లురుతరనిత్యవైభవసమున్నతమయ్యెఁ బురంబు నవ్యమై
కరము రహించెఁ దత్సమయకల్పిత మైనయలంకృతంబులన్. 216

వ. ఇవ్విధంబున. 217

మ. నగరాలంకృతి లోచనంబులకు నానందం బొనర్పంగ న
జ్జగతీనాథుఁ డమాత్యభూసురసుహృత్సంయుక్తుఁడై యాభిము
ఖ్యగతిం బోయి యరుంధతీరమణుపాదాంభోరుహద్వంద్వముం
దగఁ బూజించె నిజోత్తమాంగమకుటోద్యద్రత్నకాంతిచ్ఛటన్. 218

వ. అప్పుడు. 219

మ. ఎలమిం బొంది మునీంద్రశేఖరుఁడు రాజేంద్రుం గృపాబుద్ధి సం
ధిల భద్రాణి భవంతు తే యని తగన్ దీవించి తత్పుత్రపౌ
త్రుల సుద్యుమ్నపురూరవస్సులను సంతోషస్థితిం జూపి సా
గిలి మ్రొక్కించిన నానృపాలుఁ డనురక్తిం గౌఁగిటం జేర్చుచున్. 220

ఉ. హర్షవికాసమానహృదయాంబుజుఁ డయ్యె ననంతరంబ బ్ర
హ్మర్షిసమేతు లందఱు సమగ్రశతాంగము లెక్కి వైభవో

త్కర్షతచేఁ బురంబునకుఁ గ్రమ్మర వచ్చిరి పౌరమానసా
కర్షణకృత్ప్రసన్నముఖకైరవిణీప్రియబింబరమ్యులై. 221

ఉ. లాజలు చల్లిరప్పుడు విలాసవతుల్ శరదభ్రశుభ్రవి
భ్రాజితసౌధయూధములపైఁ దగనెక్కి మృణాలనాళలీ
లాజయహస్తకీలితచలద్వలయక్వణనిక్వణంబు లిం
పై జతగూడి మ్రోయుచు జనాళికి వీనులవిందొనర్పఁగన్. 222

మ. నవరత్నోజ్జ్వలచంద్రశాలలు విమానంబుల్ తదగ్రాధిరో
హవరారోహలు దేవకన్యలు తదీయాంచత్కరాంభోరుహ
స్రవదుత్కర్షసుగంధబంధురసుమవ్రాతంబు మందారపు
ష్పవితానంబును గాఁగఁదోఁచె గణుతింపఁ బ్రేక్షకశ్రేణికిన్. 223

క. ఈవిధమున నధిపతిపై, నావేణుమృదంగశంఖనాదంబులు డం
బై వందిమాగధస్తుతి, రావంబులఁగూడి చెలఁగ రాజితలీలన్. 224

తే. కలితపురరాజమార్గశృంగారమునకు, నందమొసఁగెడు రాకడ నరుగుదెంచె
నారచితహాటకద్యుతిహాసితరుచిర, తరుణనిజధామ మగునిజధామమునకు. 225

ఉ. వచ్చి కృతోపచారహితవర్తనలన్ గురుచిత్తవృత్తికి
న్మెచ్చొదవంగఁ జేసి కడునెయ్యమున న్నిజపుత్రపౌత్రులన్
హెచ్చగు సౌఖ్యసంపదల నెంతయుఁ బ్రీతులఁజేసి భూవిభుం
డొచ్చెములేనివేడుకల నుల్లము రంజిల నుండె నయ్యెడన్. 226

సీ. ఏకాంతమున మానవేంద్రుతోడ వసిష్ఠసంయమీంద్రుఁడు సవిస్తరముగాఁగ
సుద్యుమ్నుఁ డలకుమారోద్యానవనమున విహరింపఁబోవుట విశ్వవిభుని
పార్వకనియతిచే భామినీరూపంబు సంప్రాప్తమగుట నక్షత్రవిభుని
నందనుతోఁ బొందొనర్చుట తద్గర్భమునఁ బురూరవుఁడు సంజనితుఁ డగుట
తే. యతనిపురుషత్వమునకుఁ దానంబికేశుఁ, గొలువ మగరూపమై నెలనెల నెలంత
యగుచుఁ గ్రమముననుండు నిట్లనుచు వరము, హరుఁ డొసంగుట తెలిపి యిట్లనియె [మఱియు.
మ. నరనాథోత్తమ యప్పురూరవుఁడు శ్రీనారాయణాంశోదితుం
డరయం బూర్ణయశఃప్రతాపనిధియై యష్టాదశద్వీపభా
స్వరసామ్రాజ్యరమానులబ్ధమహదైశ్వర్యంబుచే నొప్పెడున్
ధరలో నైందవరాజవంశవిలసత్కల్పద్రుమాంకూరమై. 228

వ. అని యక్కుమారకుం బిలిపించి తనసమీపంబున నాసీనుం జేసి సాముద్రికచిహ్నంబు
లుపలక్షించి యిట్లనియె. 229

సీ. రత్నగర్భకు వీనిరాజితాజానుబాహాస్తంభసీమ నిత్యాశ్రయంబు
వాగ్వధూటికి వీనివ్యాకోచహల్లకనవ్యజిహ్వాగ్రంబు నాట్యశాల
చింతామణికి వీనిప్రాంతరక్తవిశాలసుందరాక్షులు కేళిమందిరములు
స్వర్ణవేదికి వీనిభవ్యరేఖాశ్రయశయకుశేశయపాళి జన్మభూమి
తే. సకలసౌభాగ్యలక్షణస్వచ్ఛమైన, వీనివక్షమైను లక్ష్మికి విడిదిపట్టు
వీనిసద్గుణసంపూర్ణవిమలహృదయ, నలినకర్ణిక సింహాసనంబు హరికి. 230

శా. నానాద్వీపనృపాలమౌళి నవరత్నస్నిగ్ధకోటీరశో
భానీరాజితరాజితంబు లగునీపాదంబులందు న్నవ
శ్రీనిత్యధ్వజవజ్రశంఖహలరాజీవాదితద్రక్తరే
ఖానీకంబు కుమారశేఖరుభవిష్యద్భాగ్యముం దెల్పెడున్. 231

చ. ఇతఁ డుదయించువేళ నమరేంద్రగురుప్రముఖగ్రహంబు లా
తతకళల న్వెలుంగుహిమధాముని(జూచుచునుంటఁ జేసి ని
ర్జితరిపుఁడై ధరాస్థలమశేషము నేలెడు సార్వభౌముఁడై
యతులితకీర్తినొప్పెడు మహావిభవంబునఁ బెక్కువర్షముల్. 232

క. అని పలికిన విని తనమన, మునఁ బెనఁగొను మోదమునను మునిపతితో న
మ్మనుజపతి యనియె వినయం, బెనయ న్మృదువచనరచన యింపొదవింపన్. 233

తే. శిష్యవాత్సల్యమున మీరు చేసినట్టి, యత్నమునఁ జేసి యీడేఱె నన్నిపనులు
నిట్టిశ్రేయస్కరములకు హేతుకంబు, మీయనుగ్రహమహిమగాదె యమీంద్ర.

వ. అని మఱియు నిట్లనియె. 235

క. మీయుపదేశంబున నితఁ, డాయతమతి సకలవిద్యలందు ధురీణుం
డై యొప్పు నట్లు సదయో, పాయత నొనరింపవలయు నభ్యాసనంబున్. 236

క. అని ప్రార్థించిన మంచిది, యని రాజకుమారకునకు సాంగంబుగ న
మ్మునిశేఖరుఁ డుపదేశం, బొనరించె సమస్తవిద్య లంద్యత్ప్రీతిన్. 237

మ. అమర న్నేతకు ఋగ్యజుస్సులును సామాథర్వణంబు ల్నిరు
క్తము ఛందంబును జ్యోతిషంబు మఱి శిక్షా కల్పముల్ శబ్దశా
స్త్రము మీమాంసపురాణసంహితలు ధర్మన్యాయశాస్త్రంబు లా
దిమవిద్యల్ పదునాలుగుం జతురుపాధిప్రౌఢి నభ్యస్తమై. 238

చ. సకృదుపదేశమాత్రమున సద్గురుసన్నిధిఁ బ్రాగధీతవి
ద్యకరణి నప్పగించునె కదా మఱి యెన్నఁటికైన విస్మృతం
బొకయెడనైన లేదు చతురుత్తరషష్టికళాకలాపసా
ధకుఁడయి యొప్పెఁ దద్గ్రహణధారణశక్తి వచింప శక్యమే. 239

మ. హరిహస్తిప్రముఖావరోహణము దివ్యాస్త్రప్రయోగోపసం
హరణప్రౌఢి గదాదిసాధనఘనాభ్యాసంబు సారస్వతా
కరవాగ్వృత్తి యుపాయసప్తకచమత్కారంబు షాడ్గుణ్యవి
స్ఫురణం బాదిగ నన్నిటం జతురుఁడై శోభిల్లె నుద్యన్మతిన్. 240

చ. సకలగుణప్రవీణత రసజ్ఞశిఖామణి యైనరాకు మా
రకుహృదయాంబుజం బనితరప్రతిపాదకవిష్ణుభక్తి నై
ష్ఠికయుతమయ్యె మేలిమిపసిండికి నవ్యవికాసపారిజా
తకుసుమగంధ మబ్బినవిధంబున నాతనిభాగ్య మెట్టిదో. 241

వ. మఱియు నప్పరమయోగిపరివృఢుం డతనికి నఖిల జగత్సంచారసామర్థ్యంబును నసాధారణపరాక్రమంబును నక్షీణభుజావష్టంభంబును నక్షయతూణీరంబులును నభేద్యకవచంబునునవధ్యరథ్యాదిసమృద్ధరథంబును నణిమాద్యష్టసిద్ధులును మొదలుగాఁగల విశేషంబులు ప్రసాదించి మఱియు నతిరహస్యంబులైనమణిమంత్రసిద్ధక్రియాకలాపంబు లెఱింగించి నిజాశ్రమంబునకుం బోవం దలంచి తనకుఁ గృతప్రణాము లైన వైవస్వతసుద్యుమ్నులసబహుమానంబుగా నాదరించి యనంతరంబ. 242

క. తనపాదములకు వందన, మొనరించిన సంతసంబు నొందుచు సుఖివై
మను మను మని మనువుననుఁగు, మనుమని దీవించి యరిగె మౌని నిజేచ్ఛన్. 243

క. అనిన విని శౌనకాదులు, వినయంబున సూతుఁ గని సవిస్మయభంగి౯
వినిపింపు మనంతరకథ, యనుచు సముత్సుకమనస్కులై యడుగుటయున్. 244

శా. రక్షోశిక్షణదక్ష దక్షిణభుజాగ్రక్షిప్తకాక్షేయకా
మోక్షాపేక్షకరక్షణాక్షయకృపామోఘేక్షణాలక్షణా
వీక్షాలక్ష్యసులక్షణావయవద్రాక్షేక్షుద్రవాక్షేపకా
ర్యక్షుద్రోక్తిచయక్షమారమణ అక్షాధ్యక్షపక్షిధ్వజా. 245

భద్రాకుచమకరీదళ, ముద్రాంకితచారువక్ష మోక్షాధ్యక్షా
భద్రాకరకారుణ్యస, ముద్రా రుద్రాభినంద్య మునిజనవంద్యా. 246

భుజంగప్రయాతము:—

ధరాజాసురాహ్యగ్రధాటీవిరాజా, విరాజాదరప్రాప్తవిద్యావరాజా
పరాజాఖ్యవేదక్షపాపర్వరాజా, వరాజాఢ్యభాబాంధవస్వర్ధరాజా. 247

గద్య. ఇది శ్రీమంగళాచల నృసింహకృపాప్రసాదసంప్రాప్త విద్యావైభవ కనుపర్తి రాయనమంత్రితనూభవసుజనహితకృత్యనిత్య అబ్బయామాత్యప్రణీతం బైనకవిరాజ మనోరంజనం బనుమహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము. 248

తృతీయాశ్వాసము.

శ్రీ రుచిరపాంచజన్యజ
సారఘుమంఘుమనినాదచకితాహితగం
భీరగుణస్ఫారవర
స్మేరసుధాంచితకపోల శ్రీగోపాలా! 1

వ. అవధరింపుము సమస్తసద్గుణసాంద్రు లగుశౌనకాదిమునీంద్రులకు సామోదహృదయ
జలజాతుండై సూతుం డిట్లనియె. 2

క. అంతట వైవస్వతభూ,కాంతుఁడు సుద్యుమ్ను రాజుఁగావించినఁ దా
నెంతయు నీతి నిలాస్థల, మంతయుఁ బాలించెఁ బ్రజకు నానందముగాన్. 3

క. రాజై యొకనెల యొకనెల, రాజాననయై ప్రకాశరాహస్యములన్
రాజద్గతి మెలఁగుచును ధ,రాజనపరిపాలనంబు రహిఁ గావించెన్. 4

వ. ఇవ్విధంబున. 5

పురూరవుని రాజ్యాభిషేకము.

మ. ప్రకటఖ్యాతి సమస్తభూవలయముం బాలించి సంప్రాప్తవా
ర్థకుఁడై భోగములెల్ల మాని దృఢవైరాగ్యంబునన్ రాజ్యభా
రకునిం గాఁగఁ బురూరవు న్నిలిపి నైర్మల్యాంతరంగంబుతో
నొకపుణ్యాశ్రమసీమ ముక్తికొఱకై యుండెం దపోనిష్ఠచేన్. 6

వ. ఇట్లు పురూరవుండు రాజ్యాభిషిక్తుం డై. 7

సీ. అచలధర్మోజ్జ్వలుఁ డగుటకుఁ దనపుణ్యాజనవరమిత్రత సాక్షిగాఁగ
భువనప్రజావనప్రవణుఁడౌటకుఁ దనశక్తిత్రయస్ఫూర్తి సంగతముగఁ
గళ్యాణలక్షణాకారుఁడౌటకుఁ దనభూభృద్విభుత్వంబు పూనికసేయ
విబుధలోకామోదవిభవదుఁ డగుటకుఁ దనసౌమనస్యమత్యనుగుణముగ

తే. రాజరూపంబు దాల్చినరాజమౌళి, యనఁగ రాజీవబాంధవుఁ డనఁగ మేరు
శైలమనఁ బారిజాతభూజాత మనఁగ, భూతిరుచిధైర్యవితరణస్ఫురణఁ దనరె. 8

క. యుగపద్వ్యాపకశశభృ, జ్జగదంబకబింబితప్రశస్త యశస్తు
త్యగురుప్రతాపదీపిత, గగనధరాభాగుఁ డగుచు గడునొప్పారెన్. 9

చ. అలనృపుధర్మపద్ధతి సమస్తజనుల్ ధనవంతు లౌటఁ గా
ల్నిలుపఁగఁ జోటులేక భువి లేములు లేమలబల్పిఱుందుల
న్నెలచనుగట్లసందులను నెన్నడుసీమల నీఁగె భానుమం
డలరుచిఁ దూలి గొందుల నడంగిన చీఁకటికైవడిం దగన్. 10

ఉ. ఆకుముదప్రియాన్వయునవాభ్యుదయంబున వర్ధమానలీ
లాకృతి నొప్పెఁ గీర్తులు మహార్ణవమస్తకలంఘనోద్ధతిన్.
దాకొని చక్రపర్వతనితంబములం దదధీనభూమియుం
దాఁక నగుంజుమీ యని నిదానము ముందుగఁ దెల్పుకైవడిన్. 11

తే. ఇవ్విధంబున సామ్రాజ్యమేలుచుండి, నిజభుజాబలవిస్ఫూర్తి నృపులకెల్ల
దెలియ దృష్టాంతమొనరింప దిగ్విజయము, సేయనూహించియారాజశేఖరుండు. 12

క. అజహదహమహమికాపటు,భుజభుజంగమవిహంగపుంగవధాటీ
నిజదండయాత్రవిజయ,ధ్వజపటకృతగగనచిత్ర దనరంగ దలెన్. 13

సీ. గంభీరవేదివిఖ్యాతిచేఁ దనరిసన్నాహ్యంబులైనదంతావళములు
పంకింప శస్త్రనిపాతధీరంబులై వఱలునాజానేయవాహములును
నప్రతిహతసకలావయవంబులై యమరు హిరణ్మయస్యందనములు
సాంయుగీనప్రశస్తతఁ బెంపుమీఱిన శుష్మాతిశయభీష్మసుభటచయము

తే. గమనధాటీచలద్ధరాకటకఘటద, పూర్వభరభరణశ్రాంతభుజగకమఠ
శైలదిగ్దంతుఁడై యేగెఁజటులపటహ, ఘూర్ణితధ్వని దిశలు గగ్గోలుపడఁగ. 14

పురూరవుని జైత్రయాత్ర.

శా. ఆసన్నాహము చూడనొప్పెఁ బ్రకటాహంకార ఘోరద్విష
త్త్రాసోత్పాదకపాంచధారవిచలత్కంఖాణసంఘాతరిం
ఖాసంఘట్టితగహ్వరీజనితరంగద్ధూళిపాళిచ్ఛలో
ద్భాసాధీశమహామహోదహనశుంభద్ధూమరేఖాంకమై. 15

తే. అమ్మహీశ్వరు విజయయాత్రాధ్వసీమ, నవనిచతురంగపదహతి నవనియయ్యె
రణితభేరీధణంధణంధణరవంబు, వినినయంతనె విమతులు విమతులైరి. 16

శా. ప్రస్థానాహతదుందుభిధ్వనులఁ గంపంబంద నవ్వేళ న
స్వస్థాకారములయ్యె భూమి నచలవ్రాతంబు సంబంధ ని
త్యస్థానం బగుటన్ క్షమాపతి తదీయాకారసంప్రాపితా
వస్థం బొందెఁ జలంబు నక్షమయు నైవర్తింపఁ దన్నామముల్. 17

ఉ. భంగముఁ జెంది సింధుపతి పాఱె నుతించెను మాగధుండు కా
ళింగుఁడు మానమెల్ల వదలెన్ వనవాసము చేసె మత్స్యుఁ డా
త్తాంగబలంబు లేమి బెగడందె విదేహుఁడు కుంతలుండు దా
నింగితమెంచి చిక్కువడియెన్ నరనాయకు మేటిధాటికిన్ 18

మ. సమరోగ్రుం డగునానృపాలు నెదుటన్ సంగ్రామజిద్వీరసే
నమహాబాహుపరంతపాదు లభిమానత్యాగులై యప్రకా
శముగా నుండిరి పేరుపెద్దఱికముల్ చర్చింప ఖద్యోతనా
మముల న్దాల్చు మెఱుంగుకీటముల సామాన్యంబు పాటింపఁగన్. 19

వ. అప్పుడు. 20

క. శకభూవిభుఁ డవ్విజయము, నకు నోర్వక కురుకరూశనరనాథసహా
యకుఁడై చతురంగబల, ప్రకటపదాహతుల ధరణిభాగము గదలన్. 21

వ. చుట్టుముట్టి బెట్టిదం బగుధైర్యంబునం బొదివె నప్పుడు. 22

ఉ. బెబ్బులిమీఁదటం గవియుఁ పెన్వృభమంబులభంగి దోఁపఁ గా
నబ్బలుయోధుపైఁ గదిసి యార్పులు నింగిఁ జెలంగ నానృపుల్
నిబ్బరపుంజలంబున వినిష్ఠురబాణపరంపరార్పులా
గుబ్బుగఁ బ్రజ్వరిల్లఁ బయికొన్నబలం బెడతాఁకె నయ్యెడన్. 23

క. పరశుముసలాసిముద్గర, శరపట్టిస భిండివాలచక్రగదాతో
మరకుంతశక్తిశూల,క్షురికాదుల నుభయబలము శూరతఁ బోరెన్. 24

వ. ఇట్లుభయసైన్యంబును భయశూన్యంబై యన్యోన్యజిగీషాపరతం దాఁకి పోరు నెడఁ బురూరవుబలంబు చలంబున విజృంభించి మించి వజ్రివజ్రాయుధంబుధార బారికిం దప్పియొప్పిన వసుంధరాధరంబులవిధంబుం గైకొని దుర్దాంతదంతఘట్టనల నుద్దండశుండాదండప్రహతుల నహితుల నహితుల నిహతులంగావింపుచు నాధోరణ రణక్రీడాసముత్సాహపోషకపున్యకారణంబు లగువారణంబులును, అష్టావధానధు రాహూతబాహు స్తంభశుంభన్నిశిత నిస్త్రింశధారాపాతలక్ష్యంబులకు విమోఘు సంపాదకంబులైన ధావనవల్గనవేష్టనాదిగతివిశేషంబులఁ బ్రలిభటచతురంగ భంగ

పాటవంబునకు సంవర్తసమయసముద్రతరంగంబులైనతురంగంబులును, భుజావష్టంభసమధికస్థైర్యనిరవధికరథికనికరధనుర్ముక్తనిశితవిశిఖాశనిజన్మదేశంబులై రిపుమండలంబు గుండియ లవియించు నేమీనిర్ఘోషస్తనితంబు చెలంగ నారచితమణిఘృణివిద్యుదుద్యద్విపులాద్యుస్థలచరచ్ఛగిదంబులై తోఁచు నరదంబులును లేళ్లఫిందుపై నుఱుకు నుద్దండపుండరీకంబులవీఁక ధాకసేయుచు నిజప్రతాపదహనజ్వాలాజాలంబుల పోలిక భగభగాయమానంబులై వెలుంగు నలుగులంగలుగు కఠోరకుఠార కఠార కుంతప్రభృతిసాధనంబులసాదనమెఱవడి నురువడిం బరవళ్లు ద్రొక్కుచుఁ బెక్కు చందంబుల విరోధివరూథినిం బొదవడంగించు విక్రమారభటు లగువీరభటులును, వీక్షమాణగీర్వాణశిరఃకంపసంపాదక ధాటీ నిరాఘాటభుజాటోపపాటవంబున నాక్రమించిన నయ్యుద్ధతికిం బ్రతిఘటింపంజాలక పరాభూతంబులై వెఱచి పఱచు నిజసైన్యంబులం గలయంగనుంగొని శకనృపాలుండు రోషరక్తాంబకుండై యంబకంబు లాకాశంబు నిరవకాశంబుగా నిండుకొన గండుమిగిలి కోదండపాండిత్యంబు నెలపుచు నిజబలంబులం బురికొల్పికొని కడంగిసంగరంబభంగురభంగి నొనర్ప నప్పు డయ్యిరువాఁగున వికృతాకారంబులైపడిన గజవాజిభటకళేబరంబులును శకలీకృతంబులయి కూలినరథంబులును, ప్రవాహంబులయిపాఱురక్తంబులును, రాసులయిన మాంసంబులును ప్రోవులయిన ప్రేవులును, శిథిలంబులయినకిరీటకుండలప్రముఖభూషణంబులును, వ్యాకీర్ణంబులైన ఛత్రచామరంబులును, భగ్నంబులైన నానావిధసాధనంబులునుం గలిగి చూడ బీభత్సరసప్రదానంబై బహుపలలఖాదనకుతూహలప్రమత్తభూతబేతాళకోలాహలంబు భూనభోంతరాళంబు నిండుకొనం బ్రచండబై యబ్భండనంబు త్రిలోకభీకరం బైయుండె నప్పుడు. 25

మ. ప్రకటాహంకృతిఁ బోరు వైరిబలముల్ భగ్నంబులై పాఱఁగా
శకలీభూతదిశేభకర్ణకుహరజ్యాటంక్రియాఘోరకా
ర్ముకుఁడై బాణదవాగ్ని పైకొలుపుచుం గ్రోధంబుతో వచ్చుచం
ద్రకులాధీశ్వరు డాకకున్నిలిచి ధైర్యస్ఫూర్తి వర్తిల్లఁగన్. 26

క. శకభూపతి నిశితాంబక,నికరంబులు పైనిగుడ్వ నిష్ఠురభల్ల
ప్రకరములఁ ద్రుంచి నొంచెం, బ్రకటపరాక్రముఁడు చంద్రపౌత్రుం డతనిన్. 27

ప. ఇవ్విధంబున మఱియును. 28

చ. రణ మొనరించి రంబరచరత్సురచారణనిర్నిమేషవీ
క్షణవిభవాంతరాయకృదఖండమహాబిలభాగభాగవా

రణనిబిడీకృతప్రదరరాజిధగద్ధగదీప్తిపుంజులై
రణదురుశింజినీపటుతరధ్వని దిక్కులు వ్రక్కలింపఁగన్. 29

చ. ఇటువలెఁ గొంతప్రొద్దు తనయిచ్చకు నించుక మెచ్చురాఁగఁ బ్ర
స్ఫుటధృతిఁ బోరుచున్న శకభూపతి గర్వమణంగఁ జేసి యొ
క్కట హయసూతకేతురథఖండనకేళి యొనర్చి పేర్చి యి
ట్టటు జుణఁగంగనియ్యక బుధాత్మజుఁ డాతనిఁ బోడియోధులన్. 30

తే. పట్టుకొని యవ్విభుండు కృపాళుఁడగుట, నిగ్రహింపక వారి ననుగ్రహించి
యస్మదాజ్ఞానువర్తులై న్యాయసరణి, నేలుఁడని రాజ్యభారంబు లిచ్చి మఱియు. 31

మ. భువనఖ్యాతిఁ బురూరవఃప్రభుఁడు జంబూద్వీపనామంబునన్
లవణార్ణోధిచతుర్దిశావధికలీలం బొల్చుభూమండలిన్
నవఖండంబులఁ గల్గురాజులు నిజాజ్ఞావర్తులై కానుకల్
వివిధార్థంబు లొసంగఁ గైకొనుచు దోర్వీర్యం బవార్యంబుగన్. 32

చ. తనకు వసిష్ఠమౌని విదితంబుగఁ దెల్పినమంత్రశక్తి సై
న్యనికరయుక్తుఁడై గగనయానత నంబుధు లుత్తరించి కై
కొనియెను దీవు లెల్ల నిజఘోరజరాఘువిభూతిధైర్యులై
తను శరణంబు వేఁడుకొను తద్ధరణీశుల నాదరించుచున్. 33

సీ. లక్షయోజనములు లవణాంబురాశి లక్షద్వయం బైక్షవసాగరంబు
చర్చింప నాల్గులక్షలు సురాజలధి లక్షాష్టకం బాజ్యమహార్ణవంబు
పదియాఱులక్షలు పరఁగ దధ్యుదధి ముప్పదిరెండులక్షలు పాలకడలి
యిలఁ జతుష్షష్టిలక్షలు శుద్ధజలవార్ధి యిట్టివిశాలాబ్ధు లేడుగడచి
తే. కొనియెఁ దన్మధ్యముల నట్టికొలఁది దగుర,సాస్థలిని జాంబవప్లక్షశాల్మలములు
వరకుశక్రౌంచశాకపుష్కరము లనఁగ, నొప్పుమీఱిన దీవు లాఱొక్కటియును. 34

శా. చక్రాకారధరాధరేంద్రము జయస్తంభాకృతిం బొల్చు ది
క్చక్రాంతస్థలిఁ దన్నృపాలకజగచ్చతుశ్శతాంగస్ఫుర
చ్చక్రానాహతసంభ్రమభ్రమణచంచద్ధాటికావ్యాప్తభూ
చక్రావధ్యుపసూచకం బగుచు విశ్వఖ్యాతి సంధిల్లఁగన్. 35

వ. ఇత్తెఱంగున. 36

శా. నానాద్వీపనృపార్పితాంచదుపధానైర్మల్యమాణిక్యము
క్తానీలాదివినూత్నరత్నవరసౌందర్యాంగనాదివ్యభూ

పానవ్యాంబరముఖ్యసంపదలతోఁ సంప్రీతుఁడై క్రమ్మఱం
దా నేతెంచె నృపాలుఁ డాత్మపురి కుద్యద్వైభవోపేతుఁ డై. 37

సీ. తనకీర్తికర్పూరమునకు బ్రహ్మాండకటాహంబు దగుకరాటంబు గాఁగ
దనభుజాకర్బురస్తంభంబునకు ధరాసతి ఘటన్మరకతప్రతిమ గాఁగ
దనబాహుశౌర్యభేతాళుసాదనకుఁ జక్రక్ష్మాధరము సాము గరిడిగాఁగఁ
దనసద్విలాసకందర్పమూర్తికి జనస్వాంతముల్ కేళిగేహములుగాఁగఁ
తే. దనకథామృతసరసికి ఘనకవీంద్ర,వదనభారతి రాయంచవనితగాఁగ
నమ్మహామహుఁ డద్వితీయాతపత్రుఁ, డై జగం బేలుచున్నవాఁ డమరవర్య. 38

క. అని యనిమిషసభ నృపసో,ముని నునిపలితచ్చరిత్రముం దెలుపుచుఁ జే
ర్కొని కొనియాడఁ దదుక్తులు, విని వినిభృతహర్షులైరి విబుధేంద్రాదుల్. 39

తే. అతనిసద్గుణవర్ణనం బాలకింప, నింపు చిగురొత్తె రంభకు హేమ కరఁగె
నల మదాలస చొక్కె నాహారిణి చకిత, యయ్యె శశిరేఖ తలఁప రసార్ద్రయయ్యె.

సీ. అమ్మహారాజువృత్తాంత మాసక్తితోఁ జెవియొగ్గి వినని రాజీవగంధి
విని వానిభువనమోహనవిలాసస్ఫూర్తి సారె భావింపనిచంద్రవదన
భావించి యతనిసంపర్కంబునకుఁ జాల ముచ్చటపడని నమ్మోహనాంగి
ముచ్చటపడి చిత్తమున వెన్నవలెఁ గరంగుచుఁ దన్మయత గీల్కొనని రమణి
తే. తన్మయత చేత నార్ద్రకందర్పగేహ, యగుచుఁ జెలివొంది యసురుసు రనని వనిత
గానఁబడదయ్యె సురగణికాజనంబు,లో నొకర్తైనఁ దత్సభాస్థానమునను. 41

తే. పూనె ఘర్మాంబుకళికలు మేన మేన, చిత్రరేఖాకృతి వహించెఁ జిత్రరేఖ
మనసిజవరూథినికి వరూథిని చలించె, నిందుమతి వేఁడుకొనెఁ గామునిందుమతిని. 42

ఉ. కిన్నరరాజనందనునికిం దెగనమ్మినసొమ్ములై తదం
చన్నఖకోరకాంకముల శాసనరేఖలు దాల్చు గుత్తపుం
జన్ను లొగిం గగుర్పొడిచె జల్లున రంభకు దారరూపసం
పన్నత నొప్పు నత్రిసుతపౌత్త్రు చరిత్రము విన్నమాత్రలోన్. 43

వ. అప్పుడు. 44

ఉ. కెంపుమొగంపుఁబచ్చతురికీ నుఱికింపుచు ఝంకరింపు చే
నింపొదవించు నారిబిగియింపుచు వాచవి పెంపునింపుము
వ్వంపుల కైదువుం దిగిచి పంపుచుఁ బూవుల యంపసోన వ
ర్షింపుచు జాలిమాలి గొనఁజేసె మరుం డమరీకదంబమున్. 4

ఉ. కామునిబాణముల్ నిరవకాశముగా సురకామినీమన
స్సీమలఁ బర్వుచున్ గటికచీఁకటి గ్రమ్మఁగఁజేసెఁ దచ్ఛర
స్తోమ మసంఖ్యమై మదికిఁ దోఁచఁగ నారతిజాని కయ్యెడుం
డేమి దలంచి చేసెనో సుమీ మును పంచశరాభిధానమున్. 46

వ. అట్టియెడ. 47

సీ. ఆతనిబింబాధరం బందనిమ్రానిపండని విచారించె మదాలసాఖ్య
యతని చేసోఁకు సయ్యాట లేటావలిగిలిగింత లని వితర్కించె రంభ
యతనితాంబూలగంధాస్యాప్తి యేనుఁగుమీఁదిసున్నం బని మేన యెంచె
నతనికృపారసామృతవృష్టి పెదగంగయుదక మంచు ఘృతాచి మదిఁ దలంచె
తే. జనమనోరమ ధ్యానమాలినిఁ గళావతియుఁ దిలోత్తమ పూర్వచిత్తియుఁ బ్రమోహి
మొదలుగా నింతులకుఁ జింతయొదవె నతని, చిత్తమదిగట్టుచాటునిక్షేప మనుచు. 48

క. ఆవిభుసర్వోత్కర్షత, భావింపఁ దదాప్తి దుర్లభంబని తచ్ఛం
కావిర్భవదురునిశ్వస,నావధికప్రేమ లైరి యమరలతాంగుల్. 49

వ. వారిలోన. 50

సీ. పుట్టినయి ల్లేప్రపూర్ణేందుముఖికిని నారాయణస్వామియూరుసీమ
నాట్యవేదార్థంబునకు నేకళావతి లాస్యనిరూఢి కూలంకషంబు
ప్రథమబహూకారపాత్రలలోన నేయింతిహరిహరాజేంద్రసభలఁ
గారణం బేహంసగమనరూప మరుంధతీమనోహరు పునర్దేహలబ్ధి
తే. కట్టి యూర్వసి భువనమోహనవిలాస, నిజకటాక్షపరంపరావిజితకుసుమ
ధన్వచార్వసిసౌమ్యనందనకథాసు,ధార్ణవాంతర్నిమగ్నాంతరంగ యగుచు. 51

ఉ. అన్నరనాథు చక్కఁదన మాధరణీశ్వరుభోగభాగ్యసం
పన్నత యమ్మహామహునిప్రాజ్ఞత యవ్విభుధైర్యవిక్రమా
భ్యున్నతి దేవమౌని సరసోక్తులఁ గర్ణరసాయనంబుగా
విన్నదియాదిగాఁగ నళివేణికిఁ గన్నులఁగట్టినట్ల య్యె. 52

ఊర్వసి పురూరవుని విరాళిగొనుట.

క. అతనివిలాసగుణాదులు, మతిదలఁచుచు మోహజలధిమగ్నతచేఁ ద
ద్గతమానసయై వేలుపు,లతకూన వియోగవిప్రలంభము నొందెన్. 53

తే. కలికిడెందంపుబాదున మొలచి కొనలు,సాఁగి సంకల్పలతలు సంజాతపులక
ఘర్మజలబిందుమిషమునఁ గానిపించెఁ, బల్లవితకోరకితలక్ష్మి బయలుమెఱసి. 54

వ. తదనంతరంబ. 55

మ. సరసానుగ్రహలోచనాంచలవిలాసభ్రూలతాసంజ్ఞ చే
స్వరధిష్ఠాత యొసంగుదివ్యపటభూషాపూర్వకానుజ్ఞ సుం
దరి తాఁ గైకొని మందహాసముఖచంద్రజ్యోత్స్నికాభృత్కుచాం
తరయై యాఁదలవాంచి మ్రొక్కి యరిగెం దచ్చింతతో నింటికిన్. 56

తే. కొలువు చాలించి శుద్ధాంతనిలయమునకు, నరిగె వజ్రి యథేచ్ఛావిహారపరత
నేగె నారదమునివరుం డెల్లసురలుఁ జని, వసించిరి నిజనివాసములయందు. 57

శా. ఆచందంబున నూర్వసీరమణి యాత్మావాసముం జేరి రా
కాచంద్రాతపధాళధళ్యరుచిరంగత్తుంగసౌధాగ్రలీ
లాచిత్రాంతరదివ్యహంసమృదుతూలస్నిగ్ధశయ్యారి బ్రచిం
తాచేతోగతిఁ బవ్వళించి నృపుచందం బాత్మ భావింపుచున్. 58

వ. ఇట్లని తలంచె. 59

ఉ. ఏటికిఁ జెప్పెఁ దాపసి నరేంద్రుని పెంపు సురేంద్రుతోడ నే
నేటికి వింటిఁ దద్గుణములెల్లఁ బరాకొకయింతలేక నా
కేటికిఁ బుట్టె వానిపయి నెంతట నంకెకురాని ప్రేమ న
న్నేటికి నప్పగించెఁ గుసుమేషుని బారికి దైవ మక్కటా! 60

క. నాకం బెక్కడ ధరణీ,లోకం బెక్కడ దలంపులో ముచ్చటయ
య్యేకచ్ఛత్రాధీశ్వరు, దూఁకొను టదినాకు నెట్లు దొరకెడునకటా! 61

ఉ. ఎన్నఁడు చూడఁగల్గెడినొ యిందుకులాగ్రణిముద్దుమోము నా
కన్నులు చల్లఁగా నతనిఁ గౌఁగిటఁ జేర్చి సుఖాప్తిఁ జొక్కు భా
గ్యోన్నతి కల్గునో కలుగదో పల పెంతట నేమి సేయఁగా
నున్నదొ దైవయోగ మెటు లున్నదొ దీని కుపాయ మెద్దియో. 62

మ. కలుగుంగా యలరాజశేఖరునఖాగ్రస్పర్శతం బొంగుచున్
గిలిగింతల్ గొనుగుబ్బచన్మొన లెదం గీలించి నిండారుఁగౌఁ
గిలిగా నాతమి దీర నొక్కి చిగురుంగెంజాయనున్మోవి జొ
బ్బిలు తాంబూలసుగంధసీధువు ముదాప్తిం గ్రోలుచుం జొక్కఁగన్. 63

ఉ. అవ్విభుచిత్తముం గరఁగునట్లుగ వేళయెఱింగి మద్విధం
బెవ్వరు విన్నవించెద రదేల గ్రహించు నతండు చూపులన్
నవ్వులమాటలన్ విలసనంబులఁ జక్కఁ బెనంగఁజాలు మే
ల్జవ్వను లుందు రందు రతిసౌఖ్యవిమోహితుఁ జేయకుందురే. 6

మ. మదినంతంతకు నగ్గలించుబలుప్రేమం దాళరా దేమి సే
యుదు నేయత్నముచేత వశ్యుఁ డగు నాయుర్వీశుఁ డేనోము నో
ముదు నేదైవము వేఁడుకొందు నిఁక నీమోహాబ్ధికిన్ మేర యె
య్యది నాకెవ్వరు ప్రాణబంధులు మదీయాసక్తి యీడేర్పఁగన్. 65

వ. అని చింతింపుచు. 66

ఉ. రేచితబాహ్యవృత్తిఁ గడు రేచకపూరకకుంభకక్రియా
సూచన నూర్పులన్నిడివిచొప్పడ వల్లభురూప మాత్మలోఁ
జూచుచుఁ దత్కథామధువచోజపశీలత నుండెఁ బువ్వునా
రాచగురూపదేశమున రాజనిభాస్య తదేకనిష్ఠతోన్. 67

వ. అప్పుడు. 68

చ. చిలుకలు తేరు మేల్ చెఱకుసింగిణి వాసనగుపవపూవుట
మ్ములపొది వాఁడిచెంగలువమొగ్గకటారి మీఁటారితేఁటికో
యిల గొరవంకపౌఁజు లెగనెత్తినపొంకపుమీనుడాలు పెం
పలర రతిప్రియుండు దివిజాంగన కుద్ధతి చూపె నయ్యెడన్. 69

క. చెఱకువిలుకాఁడు కోమలి, యిఱుకుంజనుదోయినడిమియెద గుఱియిడి తాఁ
గఱకువిరిములుకు లేసెం, జుఱుకునఁ దనచేతిమేటిసూటికిన్ ధాటిన్. 70

క. మనసిజుశరమంటెను జెలి, చనుగొండలనడుమ నదియె శర గిరియోగం
బనిపించెఁ జెమటవానలు, పెనఁగొనునిట్టూర్పుగాడ్పు బిసబిస విసరన్. 71

మ. జళిపించుంజిగురుంబిరంగి గదుమున్ ఘాత్కారధీరధ్వనుల్
చెలఁగం బచ్చనిజెక్కజీన్పులుఁగు తేజిన్ హెచ్చరించున్ హళా
హళిగాఁ దుమ్మెదమూకలన్ విజయశీలాహంకృతిన్ హుంకృతుల్
సలుపుం గుండియ జల్లనన్ గలువనేజారౌతు హేమాంగిపైన్. 72

సీ. నళినలోచనకుఁ బున్నమచందమామ లేయెండలు వేసంగియెండ లయ్యెఁ
గాంతకుఁ గలకంఠకంఠపంచమకుహూకారంబు గర్జావికార మయ్యె
విమలేందుముఖికి నవీనమైనకురంగనాభి యచ్చపువత్సనాభి యయ్యె
నరుణాధరకుఁ జందనాచలాగతగంధవాహంబు గరళప్రవాహ మయ్యె
తే. లలనకు రసాలశాఖాచలప్రవాళ,పాళి జాజ్వల్యమానదీపాళి యయ్యె
ముద్దుగుమ్మకు నీచందమునఁ బ్రమోద,కరము లెల్ల మనోవ్యథాకరము లయ్యె. 73

ఉ. ఆరుచిరాంగికి న్మధుకరాళి శిలీముఖపఙ్క్తియయ్యెఁ బ
న్నీరు శరౌఘమయ్యెఁ దరుణీమణికిన్ మలయానిలంబు నిం

బారుణకోమలాధరకు నాశుగమయ్యె ఖగంబులయ్యె శృం
గారవతీలలామకుఁ బికంబులు మన్మథసాధనంబులై. 74

ఉ. పాడదు చల్లఁగా జిలుఁగుఁబాట విపంచివహించి యెప్పుడుం
జూడదు కూర్మినెచ్చెలుల సోఁగకనుంగవఁ జెప్పలెత్తి మా
టాడదు పంజరాంతరశుకావళి సారెకుఁ బేరుకోఁగ లో
పీడదు చింత వంత యలివేణి మనోభవబాణఖిన్నయై. 75

ఉ. పువ్వులు మానెఁ దావిమెయిపూఁతలు మానె సఖీజనంబుతో
నవ్వులు మానె గీరవచనప్రతిభాషలు మానె మానెఁ దా
నెవ్వియు నింపుగాక సుఖహేతువులెల్ల మనోజబాధ నా
జవ్వని దుఃఖితే మనసి సర్వమసహ్యమనంగ లేదొకో. 76

సీ. ఇంకఁబాఱె శరన్మృగాంకబింబాస్యవాతెఱ నూరునమృతంపుఁదేటకొలను
వసివాళ్లువాడె జీవంజీవలోచనతారుణ్యలీలాశరీరలతిక
కసుగందె నవలీలఁ గైరవకుంతలపొంకపుఁజనుదోయి పువ్వుగుత్తు
లలతనొందెను బల్లవారుణపాణి మోహనయాన మేఘనాదానులాసి

తే. తాపతపనుం డుదగ్రప్రతాపపటుత, వెలుఁగ నిట్టూర్పుగాడ్పు లావిర్భవించెఁ
బ్రబలమై మందువేసంగి పట్టపగటి, వేళయై తోఁచెఁ గొమ్మకు విరహభరము. 77

తే. చిఱువిషఁపుఁగూతఁ గోయిల చెవులఁజిలుక, జిలుక పగవారిచుట్టమై చెదరఁబలుకఁ
బలుకులువయిూటెదారిదానలఁచెనలుక; నలుకనొందెను జెలిబాష్పజలము లొలుక. 78

క. ఈచందంబున విరహం, బాచందనగంధి కంతకంతకు నధికం
బై చేయునవస్థాగతి, చూచి సఖీజనులు వగచుచుం దమలోనన్. 79

ఉ. ఎక్కడనుండివచ్చెఁ బరువెత్తుచుఁ గొంటుతపస్వి వచ్చెఁ బో
యిక్కరణిన్ విరాళిసివమెత్త వినోదపుసుద్దులెల్లఁ దా
నిక్కడ నేల చెప్పె కతలే వెతలయ్యెఁ గదా పురూరవుం
డెక్కడ యీలతాంగివలపెక్కడ దూరవిచార మక్కటా! 80

చ. కలకలనవ్వుకోమలిమొగంబు వికాసమువీడెఁ బొన్నపూ
వలపులమేను దీఁగె వసివాడె సుధామధురద్రవంబుజొ
బ్బిలునమోవి యెండె జిగిబెళుకుకనుంగవ నీరునిండె గు
బ్బలు శ్రమవారిఁ దోఁగె మది భావజుకాఁకల వేఁగె నక్కటా! 81

మ. అకటా యీవెత చూడనే వశముగా దమ్మయ్య కందర్పసా
యకజాలానలకీలఁ గీల్కొను విదాహవ్యాప్తి నెట్లోర్చు నీ

సుకుమారాంగి యటంచు జాలిపడు నాసుభ్రూసమాజంబునం
దోకప్రౌఢాంగన కూర్మిఁ జేరి పలికెన్ యోషిల్లలామంబుతోన్. 84
సీ. వలపించుటే కాని వలచి దక్కవుగదా కుసుమబాణునికైనఁ గోమలాంగి
యోరకంటినె కాని తేఱిచూడవుగదా యలకళానిధినైన నలసగమన
వినయంబులే కాని చనువు వేడవుగదా దేవేంద్రునైన నిందీవరాక్షి
బయటిమాటలె కాని భావమియ్యవుకదా రాజరాజునకైన రాజవదన
తే. చక్కఁదనముఁ గళావిశేషంబు విభవ,మును సిరియు నేకమూర్తి దాల్చినపురూర
వునిగుణమ్ములు గుణము లయ్యెనె లతాంగి, మఱఁ దురులుకొల్ప నీమనోమర్మములకు.
సీ. కిన్నరస్వరలీల గేరునీగానవిద్యామాధురికి వీను లప్పగించి
అవిరఁ బిక్కటములై కవబోల్చునీదుగుబ్బలకు భావంబులు పాలుపఱిచి
మైసోఁకు నీగీతపదరసవ్యంజకోజ్జ్వలదృష్టి కాస్యముల్ వశమొనర్చి
యపరంజిపసిఁడిచాయల నీరుమైమెఱుంగులకుఁ గన్గవలు దక్కోలుచేసి
తే. రక్తిఁ గడుఁజొక్కి చిత్తరుప్రతిమ లగుచు, నుండుదురుగాదె యింద్రాదు లోలతాంగి
కామతూర్యాయమానఘల్లరవాంఘ్రి,వలయవై నీవు నాట్యంబు సలుపునపుడు.
మ. సురవిద్యాధరసిద్ధసాధ్యఖగరక్షోయక్షగంధర్వఖే
చరనాగేంద్రకుమారవైభవవిలాసశ్రీల నింతైన రా
గరసంబందని నీదుచిత్తశశభృత్కాంతోపలం బీగతిం
గరఁగంజేసెనె రాజచంద్రుగుణరాకాచంద్రికల్ కోమలీ. 85
సీ. ఉత్తుంగకుచకోకయుగళంబు దాఁకొన వదనేందుబింబంబు వ్రాల్చకమ్మ
చారులోచనసరోజంబులఁ జికురంపుటిరులు పైకొన జాఱనీకుమమ్మ
యధరంపులేఁజిగురాకుపై నుస్సున నెమ్మోము సెగగాడ్పు నించకమ్మ
తళుకొత్తు చెక్కుటద్దములపైఁ గన్నీటిచినుకులు రాలంగఁ జేయకమ్మ
తే. రమ్యలావణ్యమౌక్తికరత్నరాశి, కలఘువిరహాగ్నిశిఖలు పైకొలుపకమ్మ
యువిద నీవిట్టు చేసిన నొకటికొకటి, వికటమయ్యెడు ధైర్యంబు విడువకమ్మ. 86
శా. ధీరోదాత్తవు మాటనేర్పరివి బుద్ధిం బెద్ద వత్యంతగం
భీరస్వాంతపు దేవభోగవనితాబృందమ్ములో నెంతయుం
లేరానాయకురాల వెంచఁదగు నీపెం పన్నిటం బ్రౌఢవై
యీరీతి న్వగనొంద నీకుఁ దగునా యిందీవరాభాలకా. 87
సీ. నెఱపుచున్నది జక్కిణీలయల్ హాయలుగా శశిరేఖ నాటకశాలలోనఁ
జూపుచున్నది జోగిణీపంతు రంతుగా రంభ నాట్యగృహాంతరంబునందు

నాడుచున్నది కేళికాళిఁ గోలాటంబు మంజుఘోషిణి లాస్యమందిరమునఁ
జలుపుచున్నది ప్రౌఢజాడల గౌరవపంజియల తిలోత్తమ నృత్యనిలయసీమ
తే. నాటపాటల సభలోన సాటిచెలులు, మించుమెప్పించుకొన నభ్యసించువగలు
వింటివా తెల్పుచున్నది వెలఁదివితతి, మర్దళధ్వని తత్తత్క్రమంబు లెల్ల. 88

శా. నీసౌందర్యము నీవయోవిభవముల్ నీనృత్యగీతాదివి
ద్యాసంపత్తియుఁ జూచి యూర్వశి యసూయల్ సేయు రంభాములు
ల్లాసంబందఁగ నేల యిట్లు విరహగ్లానిం గృశింపంగఁ జిం
తాసంతాపము మానవే చెలి మదిన్ ధైర్యంబు గీల్కొల్పవే. 89

వ. అని యివ్విధంబున. 90

క. అనునయ మొనరింపుచు సఖి, యనునయభాషలను జింతయాగక యాచ
క్కనిచెలువ పరితపించుట, కని చెలులు విచారహతఁ గటకటపడుచున్. 91

వ. తమలో నిట్లనిరి. 92

సీ. కొమ్మచేతులు చూచి కుత్తుకబంటితో నున్నదిగాదె పయోజవనము
విమలాంగిమాటలు విని పండ్లుగొఱుకుచు నున్నదిగాదె కీరోత్కరంబు
వనితచూపుదలంచి వైషమ్యగతి నున్నయదిగాదె మదనసాయకసమాజ
మతివయానము గాంచి యప్రియస్థితి నున్న యదిగాదె మఱిరాజహంసకులము
తే. చలము సాధించ నిప్పుడే సమయమనుచు, విప్రలంభభరంబున విహ్వలించు
వెలఁదినలయించుచున్నది విషమసంధిఁ, గీడొనర్చుట హీనుల జాడగాదె. 93

ఉ. తాపముచేతఁ జిక్కి వనితామణి జాఱిన చక్కనొత్తఁగా
నోపదు పయ్యెదన్ మగువ లొయ్యన గుబ్బలు గప్పరమ్ము జో
డై పొలుపారు జక్కవలయాకృతి నున్నవి శీతభానుఁ డా
శాపరిపూర్ణచంద్రికమిషంబునఁ జాలవిషంబు గ్రక్కెడున్. 94

ఉ. ఏమి యుపాయమమ్మ యిఁక నిందులకో చెలికత్తెలార కాం
తామణిగాత్రహేమముదితం బగుఘర్మజలచ్ఛలంబునన్
గాముశరాగ్నికీలలను గ్రాఁగి కరంగి తొరంగెఁ జూడరే
యేమఱనేల చేయఁదగు నీయెడలన్ శిశిరోపచారముల్. 95

వ. అని పలుకుచు. 96

తే. ఉపవనచ్ఛాయ సంతానముసుపు ననెడు, భ్రాంతిఁ బొందింపఁ జెలులనిర్బంధమునను
రమణి నెమ్మది నుత్సాహరహిత యయ్యు, నంచితోద్యానసీమకు నరుగఁదలఁచి. 97

సీ. సఖులమాటలకు వేసట నొందుచును శయ్యపై లేచి యఱుదుగాఁ బయిఁటఁజేర్చి
చెదరినకురులొక్కచేఁబట్టి సొగసు చా లని కొప్పు వలసి యొల్లమిని దుఱిమి
బరువంచు ముత్యాలుసరములు దివిచి చెంగట నున్నయింతిదోయిటను వైచి
వలదంచు గిలుకుపావా లవ్వలికిఁద్రోచి యలఁతిపాదుక లంఘ్రులందుఁ దొడిగి
తే. యనుఁగుసెచ్చెలి భుజము కరావలంబి, తంబుగా నూఁది కనకసౌధంబు డిగ్గి
యలపుసొలపున నసురుసురనుచు మంద, మందగతి నేగె వనమున కిందువదన. 98

క. ఆరామలతాగృహమున, కారామ లతిప్రయత్నలై యరిగి రొగిం
దా రామలయజగంధిం, దారామలరుచినఖాళిఁ దగఁ దోడ్కొనుచున్. 99

వ. అందు. 100

సీ. రాజీవరాజీవరాజిరాజితములై కెలఁకుల కొలఁకులు దొలఁకుచోట
ఘనసారఘనసారఖను లైనఖనటచ్ఛదచ్ఛటాకదళికాతరుల క్రేవ
సంతానసంతానసంతతాతాంతత శృంగారపాదపశ్రేణినడుమ
మాధుర్యమాధుర్యమధురసఫలగుచ్ఛవల్లులపందిటిచల్లనీడ
తే. శీతకరశీతకరశిలాంచితవితర్ది, సీమ సీమంతవతులు లేఁజిగురుశయ్య
నమర నమరకళావతివిధివసింపఁ, జేసి చేసిరి సముచితశిశిరవిధులు. 101

సీ. క్రొత్తగాఁ గురిసిన గొజ్జంగివిరిమంచు నీరు నెమ్మేనిపై నించినించి
పరువైన యనఁటికంబముల జాఱినయట్టి చంద్రరజంబు పైఁజల్లిచల్లి
శశికాంతపాత్రలఁ జలువటారు సుగంధ మవయవంబుల నిండ నలఁదియలఁది
పూఁదేనెవడియు నంబుజనాళహారంబు లురవుగా నుఱమున నుంచియుంచి
తే. సరసనవ్యలామజ్జక జాలతాళ, వృంతములఁ జల్లగాడ్పు రావిసరివిసరి
యూర్వశికిఁ బ్రాణసఖులు శైత్యోదయతకుఁ, జేసిరుపచారములు నేర్పుచేతనపుడు.

క. ఏలాలవంగనవసుమ, నోలామజ్జకసుగంధనుతకర్పూర
శ్రీలలితమాధురీజల, మాలేమకుఁ గ్రోలనిచ్చి రతివలు మఱియున్. 103

సీ. కలికిచన్నులమీఁద గర్పూరమిడుచు జంబీరఫలభ్రాంతి బెదరెనొకతె
పికవాణికురుల సంపెఁగదండచుట్టుచుఁ జంచరీకభ్రాంతి జడిసెనొకతె
యింతి కన్నులయందు హిమజలంబునుపుచు వికచాంబుజభ్రాంతి వెఱచెనొకతె
చెలిమోవిమధురాంబువు లొసంగుచును మధుసారపూరభ్రాంతి జంకెనొకతె
తే. యతివకుపచార మపచారమయ్యె ననుచుఁ, దావ మెచ్చుటకులికి సద్వస్తుఘటన
మానరుపమేయముల నుపమానములుగ, భ్రమసి ముగ్ధసఖుల్ తదంగములయందు.

క. పలుమఱు చల్లనిమందుల్, చెలిపైఁ జల్లియును లోపలికి నొసఁగియుఁ దా
మలసిరి గాని విలాసిని, యలయిక దీర్పంగఁజాలరైరి లతాంగుల్. 105

తే. పూర్ణచంద్రోదయం బన్నఁ బొక్కిపడును, దరుణి కుసుమాకరంబన్నఁ దల్లడిల్లు
భూపతి యశైత్యకారిగాఁ బొగడికొనుచు, వనిత తనుసామ్య మెఱుఁగ నెవ్వరివశంబు.

తే. మాటిమాటికిఁ దొరఁగు చెమ్మటల మేటి, బోటి బిగువాటి చనుఁగవ సూటిదనరె
నీటువాటిల్లు నెలయేటి నీటితోడ, సాటిమీఱు నగద్వయిసాటి యగుచు. 107

ఉ. కప్పురపుక్ రజంబునఁ బొగల్ బలియించి సురంటిగాడ్పు చేఁ
బుప్పొడులక్ రవుల్కొలిపి పుష్పతతిం గమలించి గంధపుక్
లప్పలు పొంగులెత్తి పొరలం దెరలించి యలంచె నంగజుం
డప్పటి మందులెల్ల విరహాగ్నికి విందులు చేసికోమలిన్. 108

వ. మఱియును. 109

సీ. నిగమఘోటలలాట నేత్రానలజ్వాలఁ గాక దేఱిన కాముకాండములును
రాహూగ్రహోగ్రదంష్ట్రావిషగ్రాహియై కఱకెక్కిన శశాంకకౌముదియును
ఘోరాస్యభుజగభూత్కారాప్తి మెలఁగి నిశ్శంకఁ బైకొనుసమీరాంకురములు
దుస్సహవాసంబుతో గడిదేరిన కలకంఠములకు హుంకారరవము

తే. మచ్చరించినకైవడి మఱియుమఱియు, హృదయసంతాప మొదవింపనిందువదన
దౌర్వఁ జాలక వగనొందుచునికిఁ జూచి, చెలులు చింతాసమాక్రాంతచిత్త లగుచు.

తే. కువలయాక్షులు కేతకీకుసుమగర్భ, దళముపై నవ్యహిమజలమిళితమైన
హరిణమదపంకమున వ్రాసిరపుడ లేఖ్య, తనువిశేషు ప్రసూనేషు వినుతలేఖు. 111

చ. వలపలిచేత భూశరము వామకరంబునఁ బచ్చవిల్లు కో
పులను వసంతకైరవవిధుల్ వెనుకక్ మలయానిలుండు ముం
గల వరశారికాశుకపికభ్రమరాళి వెలుంగఁగాఁ జెలుల్
వలపులరాజువైభవము వ్రాసిరి గేదఁగిపువ్వు రేకునన్. 112

ఆ. వ్రాసి యెదుటనిలిపి వనితలు దివ్యవస్తువులు దెచ్చి యపుడు షోడశోప
చారములను బూజ సలుపుచు జగదేక, వీరు మారు నిట్లు వేఁడుకొనిరి. 113

సీ. పుట్టినాఁడవుగదా భువనైకసామ్రాజ్యదక్షుతా యాదిమదంపతులకుఁ
బట్టినాఁడవుగదా బ్రహ్మేశ్వరాదులనైనఁగలంచు బాణాసనంబుఁ
గట్టినాఁడవుగదా కఠినవైరాగ్యసంస్తంభవిధ్యకు బిరుదధ్వజంబు
చుట్టినాఁడవుగదా శుభ్రయశోలతాంకురములజాండకోటరమునిండ

తే. వర్ణనీయు మిందీవరవర్ణనీయు, మందమహిమాతిశయమహీబృందముఖ్య
ముఖ్యులకు నాజవంజవసౌఖ్యదాన, చణనిరంకుశానుగ్రహసదన మదన. 114

ఉ. హల్లకపాణి నీశరశరాసనచిహ్నము లక్షులందు భ్రూ
వల్లికలన్ వహించుకొని వర్తిలుచున్ మణితచ్ఛలంబున
న్నెల్లనయోగ్యవేళలను నీతిరుమంత్రముఁ బల్కు మాచెలిం
జల్లనిచూపు చూడు సుమసాయక నిల్పు మతాభిమానమున్. 115

వ. అని ప్రార్థించుచు నించువిలుతునివలన నించుకైన ననుగ్రహంబు లేమి లేమ పరితాపాతిశయం బవలోకించి కించిన్మధ్యలు వేసటపడుచు నప్పడుచుఁదనంబుల పెద్ద నుద్దేశించి యి ట్లనిరి. 116

మన్మథోపాలంభనము.

తే. కుసుమసాయకశృంగారరసశరీర, శాలిపగునీకు మనసు పాషాణమయము
సద్గుణములేని దదియేటిచక్కఁదనము, కటాకటా తేనెపూసిన కత్తిగాదె. 117

ఉ. నారఁట తేఁటి జోకనలినారఁట తేరఁట చిల్క సౌరభో
ద్గారఁట విల్లు పూతనయగారఁట చుట్టము శైత్యపుర్ సదా
చారఁట కమ్మ గట్టుపరిచారఁట కోయిల కేతసీభవ
ద్వారఁట యిట్టినీ కొదుగువారఁట లోకు లదేమిచిత్రమో. 118

తే. మారణోపాయమర్మకర్మములయందు, నీనృశంసత చూచికా నిర్ణయించె
సార్థకముగాఁగఁ బంకరుహాసనుండు, మకరకేతన నీపేరు మారుఁ డనుచు. 119

క. అసమాశుగ నీచాపము, కుసుమం బని పెద్దలనుట కుత్సితసుమమం
చుసుమీ కాకుండిన నే, కుసుమంబులు నరుల మన్నిగొనునీరీతిన్. 120

క. ఎట్టుజనించితి వకటా, కట్టిఁడి వగునీవు మదన కరుణానిధులై
నట్టి తలిదండ్రులకు సుధ, పుట్టినజలరాశి విషము పుట్టినరీతిన్. 121

సీ. కుటిలోగ్రనిటలదృష్ట్యోగ్రాగ్ని నీకు నిర్బంధపంచత్వంబు ప్రాప్త మగుట
యాకారహీనుఁడవై యుండియును గాలిచందాన లోకసంచారివగుట
వేళఁగాచుకొని యావేశించియింతులఁ బురుషులఁ బీడపాల్పఱచుచుంట
నీవుసోఁకిన నెంత నీతిశాలికినైనఁ బుణ్యాపాపవివేకబుద్ధి చెడుట
యెంచిచూచిన భూతమ వీవుమదన, సంశయములేదు శివుఁడు మోక్షప్రదాత
యతనిచేఁ ద్రుంగియును ముక్తినందలేక, గ్రహమవైతివి విరహులకర్మవశత. 122

వ. అని మఱియుఁ బెక్కుచందంబులఁ గందర్పు నిందించి యిందిందిరాలక యిందీవర
పాలకుం డగునిందు నుద్దేశించి యి ట్లనిరి. 123

చంద్రోపాలంభనము.

సీ. శ్రీసహజోన్నతిఁ జెలువొందుటయె కాక శ్రీసహజోన్నతిఁ జెలువుఁగంటి
సత్కళానిధివై ప్రశస్తిఁ గాంచుటె గాక సత్కళానిధివై ప్రశస్తిఁ గంటి
కువలయహితవృత్తిఁ గొమరు మీఱుటె గాక కువలయహితవృత్తిఁ గొమరుఁగంటి
హరిణలక్ష్మాఖ్యత నందియుండుటె గాక హరిణ లక్ష్మాఖ్యత నంద గంటి
తే. కదిసి విషమాంబకుని కాప్తగరిమఁగనుటె, గాక విషమాంబకుని కాప్తగరిమఁగంటి
తనరె నీవింత నీవింతఘనుఁడ వయ్యుఁ, జందమా మాచెలినలంచఁ జందమామ. 124
తే. అమృతకరుఁ డను పేరు నీ కాదియంద, హీనుఁడై యొప్పననుచు వాగీశుఁ డనుట
కర్థ మెవ్వరుఁ దెలియలేరైరి కాని, యరయ విరహులపాలిటి కదియనిజము. 125
క. ఇట్టందురు మట్టందురు, వెట్టులు నీలోనినలుపు విషరాశి సుమా
జుట్టుకొని నిన్ను రాహువు, గట్టున మఱి త్రేన్పకున్నె కాకున్న శశీ. 126
సీ. తినలేక వెడలఁగ్రక్కిన రాహు వెఱుఁగు నీయంగంబు విషమాట యమృతమాట
బడలి ఖిన్నతనొందు పద్మిని యెఱుఁగు నీచాయ వేండ్రంబాట చల్లనాట
నిలువున నీఱైన నెల ఱా లెఱుంగు నీకరము నిష్ఠురమాట సరసమాట
కవఁబాసి పొగులు జక్కవపత్తు లెఱుఁగు నీచర్య దారుణమాట సౌమ్యమాట
తే. యాలిఁ గోల్పడ్డనీయుపాధ్యాయుఁ డెఱుగు, నీవు దుర్ణీతి వగుట సునీతి వగుట
యెఱుఁగ రన్యులు నీమర్మ మెఱుఁగకునికి, జనులు నిన్నుఁ గూరగ్రహమనరు చంద్ర.
చ. చతురులమంచుఁ బండితులు సారెకు నీమెయికందుఁ జూచి క
ల్పితవచనంబులన్ మఱుఁగువెట్టి శశంబు మృగంబు లాంఛన
స్థితి యనిపల్కుచుందురు శశీ పటురౌద్రుఁడు వీరభద్రుఁడు
ద్ధతి నినుగుండియల్ కమలఁదన్నినచోట నదేమిపాపమో. 128
తే. కైరవాప్తకళంకంబు పేర విషము, లోనఁ బూర్ణించియుండఁ బైపైని చంద్ర
కలు వెలింగించెదవు కుత్తుకను విషంబు, నాలుకను బెల్లమును గాదె పాలసునకు. 129
క. తమ్ములు కుముదప్రియ నీ, తమ్ములు నీయనుజనివసితమ్ములు శరజా
తమ్ములు నీయల్లుని కహి, తమ్ములుగాఁ జూడు వనుచితమ్ములు నడకల్. 130

శా. చూడంజాలక మిత్రబాంధవులవిజ్ఞోడై చనం జేయవో
క్రీడంగూడి మెలంగుసత్పరిచరశ్రేణిం బ్రభ ల్గుంచవో
తోడంబుట్టవునింటిపైఁ దెగవా నిక్ దోషాకరుం డంట కీ
డాడల్ సాధ్వులు నేతిబీరపసవోచంద్రాదినామార్థముల్. 131

సీ. గ్రాహాది సత్త్వభీకరమహార్ణవగర్భబాడబజ్వాలనసంపర్కవృద్ధి
త్రిజగద్భయంకరోత్కృష్టహాలాహలవిషహుతాశనసహావిర్భవంబు
భావసంభవభంగఫాలభాగాక్ష్యవలాంతికతమవరాంగాశ్రయంబు
పురజయక్షణరథికరణగోధరఫణిశ్వసనాగ్నినైకటచక్రతాప్తి

తే. మొదలుగాఁ గ్రూరసాంగత్యములను బెంపుఁ, గనిన నీకెక్కుడిది మంచితనముచంద్ర
గడుసు వెన్నెలచిచ్చుల నుడుకఁజేసి, కనికరములేక యేఁచెదు కమలముఖుల. 132

తే. అనపరాధ నవధ్య నీయబల నింత, యేఁచెదవు చంద్ర యీయుసురేలపోవు
నష్టకళ మిత్రునింట హైన్యముననుండ, నీకు సంప్రాప్తమగుఁగాక నెలకునెలకు. 133

వ. అని యనేకప్రకారంబుల నిశాకరు నిరాకరించి చంచలాక్షులు దక్షిణదిగాగమన విశేషంబున శైత్యమాంద్యసౌరభ్యంబులం బసమీఱు సమీరు నుపలక్షించి యి ట్లనిరి. 134

మలయానిలోపాలంభనము.

సీ. దండభృత్కింకరోద్దండహుంకరణకోలాహలంబుల లోపలను మెలంగి
యౌర్వసంతప్తయామ్యదిశాసముద్రకల్లోలజాలంబుల నోలలాడి
మలయశైలపటీరనిలయజిహ్మగఘోరవిషవక్త్రబిలముల విహృతిసలిపి
దర్దురప్రముఖపద్ధత్యవ్యటవ్యాశ్రయాశుతో సంబంధ మాచరించి

తే. వచ్చెదవు నీదుదుర్మార్గవర్తనంబు, తెలియ నీయవు బాహ్యశీతలమువలన
వంచకుఁడ వెట్లు నినునమ్మవచ్చు ననిల, యతివినయమెల్ల దూర్తత యనుటనిజము.

చ. సరసులసంగతిక్ మెలఁగు సౌమ్యుఁడనక్ మృదువర్తనంబుచే
నరయ ననుంగుఁజుట్టము క్రియక్ భువి నంతట నల్లిబిల్లివై
తిరుగుదువంచు నిన్ను వలితెమ్మెర ప్రాణముగాఁగఁజూచు సుం
దరి నలయించె దిట్లనువుదప్పినవేళఁ గుమిత్రులీదృశుల్. 136

తే. చల్లకాఁకల ననుకూలశాత్రవమునఁ, గోరి విరహులప్రాణముల్ గొందు వనిల
నిను జగత్ప్రాణుఁ డనిపల్క మనసుగొల్ప, దంటివేసిఁ బ్రభంజనుఁ డందుమిఁకను.

ఉ. వేసవిమంట లుప్పతిల వీఁచు నిసున్ మలయాద్రిగంధపున్
వాసనలన్ సరోవనజవాసనలన్ జిలిబూన భావనల్
చేసెను వేళవెజ్జు భువి జీవులకై యటులయ్యుఁ బోక నీ
దోసము బెట్టుచిచ్చువలెఁ దోఁచు వియోగులకున్ సమీరణా. 138

తే. వాతవిధ్వంసనరసాఖ్యవఱలుసౌష,ధంబు నాగేంద్రమనుమంత్రితంబుఁ జేసి
వలయు నీపైఁ బ్రయోగింప మలయపవన, మందుమంత్రంబులనుగాని మట్టుపడవు.

వ. అని యిత్తెఱంగునఁ బవమానునవమానవచనంబులంబోనాడి పాంథశ్రవణబాధా
కరణనిజనినాదకలకలంబు లగుకోకిలంబుల నుద్దేశించి ముద్దియ లిట్లనిరి. 140

కోకిలాద్యుపాలంభనము.

శా. ఇన్నాళ్లుం గడులొంగియుండుదురు మా హేమాంగిమాధుర్యసం
పన్నంబైన యెలుంగుసొంపునకు నీపట్లన్ వియోగవ్యథా
ఖిన్నం గర్ణకఠోరనాదముల స్రుక్కింపంగ న్యాయంబె మీ
రెన్నం గోవెలలార సద్విజులకుం బీద్రోహముల్ చెల్లునే. 141

శా. ఆహా కోవెల మీకు మాధవుఁడు భాగ్యం బిచ్చుటల్ పాంథపీ
డాహంకారతకా ప్రవాళచయముక్తాచంద్రసానల్పలీ
లాహారంబులఁ బూనఁ గొమ్మల మనోల్లాసంబునం జేరఁ గే
ళీహన్ మావులఁ జెక్కఁగాక భువి లోకేశుల్ విజాత్యున్నతుల్. 142

వ. అని వనప్రియంబుల నప్రియంబులు పలికి చెలికత్తియలు పలుకుములుకులంగలి
కిపీసుల కులుకుపుట్టించు చిలుకలం గనుంగొని. 143

చ. కర మనురక్తిఁ గొమ్మకరకంజమునం దిడి మీకుఁ బాలుఁ జ
క్కెరలును బెట్టి పెంచి పలికింపుచు మాటలు నేర్పినందు కా
విరసపుఁ గూఁతలన్ మిగుల వేదనగొల్పెద రింతి కియ్యెడన్
గురువుకు బొమ్మవెట్టితిరి క్రూరవిచారమ కీరవారమా. 144

ఆ. రక్తముఖులు కావరపువిజాతులు కుజా, త్యాశ్రయములు మీర లగుటఁ జపల
వృత్తి నోటఁగాయవేయక వదరుచుఁ, గలఁచెదరు లతాంగిఁ జిలుకలార. 145

వ. అని యిట్లు కీరంబులం దూఱఁబలికి యళినికరంబులంజూచి యిట్లనిరి. 146

చ. నిలిచినచోట నిల్వక వనిం జలచిత్తముతో భ్రమింపుచుం
జెలఁగి యెలుంగుచేఁ జెవులు చిందఱవందఱనొందఁగూయుచున్

మలినశరీరులై మిగుల మత్తతనుండఁగఁ దేఁటులార పె
ద్దలు మధుపంబు లుందురుగదా మిము దుర్గుణమిట్టిదే కదా. 147

క. రణసీమ నెట్లు నిలుతురో, గణుతింపఁగఁ దేఁటులార కామునివింటక్
క్షణచిత్తులు మీరతఁడే, గుణమువిచారించి మిమ్ము గుణముంజేసెన్. 148

క. అలికుంతల మీనామము, వెలయం దలమోచి యున్నవిశ్వాస మయో
తలపున నుంచక పలుకూఁ, తలచే నీగతి నలంచఁదగునే తరుణిన్. 149

వ. అని యివ్విధంబున. 150

తే. ఇందుముఖు లిందుకందర్పమందగంధ, వాహశుకపికభృంగసందోహముఖ్య
శత్రుపక్షంబు నిందించి సకియభయము, దీఱ నూఱడఁబల్కి రుదారఫణితి. 151

ఊర్వశిని సఖు లూఱడించుట.

సీ. సంపెంగకైదువ సవరించుమరునితో హర్షించనేర్చునే యళికులంబు
రామనామోక్తిచే రంజిల్లుచిలుకలఁ గూడివర్తించునే కోకిలములు
హరుని నెమ్మేనఁ బాయక యున్నకుముదాప్తు నాప్తుఁగాఁ జూచునే యసమబాణుఁ
డాదిత్యబింబోదయముగోరుతమ్ముల హితులుగాఁ దలఁచునే హిమకరుండు

తే. వారివారికి నన్యోన్యవైరవృత్తి, గలుగుటకు నిట్లు హేతువుల్ గలుగుటెల్ల
శత్రుపక్షంబునకు నపజయకరంబు, గాన నీకేల వెఱపింపఁ గమలనయన. 152

ఆ. కాముఁ డనఁగ నెంత గండుఁగోయిల యెంత, సోముఁ డెంత గాలి నేమ మెంత
భీము రాము గాముఁ బాముఁ బ్రార్థించిన, భామ వారిగర్వభంగ మగును. 153

వ. అని యివ్విధంబున నాజవ్వని నూఱడింపుచుండి రయ్యవసరంబున. 154

సీ. బదరికావనభూమిఁ బరమాత్ముఁడైన నారాయణదేవుని నాశ్రయించి
వర్తించుఁ ద్రైలోక్యవర్తి నామమున నొక్కశుకోత్తమంబు త్రికాలవేది
సత్యలోకంబున శారదారమణి ముంజేతిపైనుండు రాచిలుకతోడి
బాంధవంబునఁ జేసి పడఁతియుఁ దానుఁ దత్సందర్శనార్థంబు చనుచునుండి

తే. యమరపురిమీఁదుగాఁ బోవునపుడు నయన, గోచరం బగునూర్వశీకోమలాంగి
తోఁటసౌకర్యమునకు సంతోషమంది, యింతతడ వింద నిలుతమే యింతియనుచు 155

ఉ. పల్లవపుష్పగుచ్ఛఫలబంధురమైనరసాలశాఖపైఁ
జల్లఁదనంపుసొంపు వెదచల్లెడు కొమ్మకుఁగొమ్మతోడఁదా
నల్లనఁ జేరి నిల్చి తదుపాంతసరోవనశీతవాతపో
తోల్లసనాప్తికై యెఱక లొయ్యన విచ్చుచు సొక్కి మెచ్చుచున్. 156

చ. అలయికదీఱ జాతసుఖులై నిజచంచుపుటాంచలాహతిన్
గళితములైన పక్వసహకారఫలంబులమాధురీరసం
బెలమి భుజించి తాను దనయింతియుఁ దృప్తివహించి యచ్చటం
గలుగువినోదముల్ మఱియుఁ గన్గొనుచున్ విహరించియొక్కచోన్. 157

ఉ. వాడినమోముతోఁ జెమటవానలఁ దోఁగిన చన్నుదోయితో
వీడినకొప్పుతోఁ బొడము వెచ్చని యూర్పులతోఁ గరాబ్జముం
గూడినచెక్కుతో వగలఁగూరెడుచిత్తముతో మరుండు వే
టాడఁగఁ జిక్కువడ్డమృగియై బెగడొందుచు నున్నయూర్వశిన్. 158

తే. సఖులు గావించునుచితోపచారములకుఁ, జెలులు ధైర్యంబు దెలిపెడుపలుకులకును
మనసుగొలుపక హా దైవమా యటంచు, విసువుకొనుచున్న యవ్వేలవెలఁదిఁ జూచి.

వ. కటకటంబడుచు శుకాంగన మనోహరున కిట్లనియె. 160

ఉ. అక్కట యీలతాంగి సకలావయవంబులుచూడ నెంతయున్
జక్కఁదనంబు లొచ్చెమగుచంద మొకించుకయైన లేదు ముం
దెక్కడఁజూడలేదు నిజ మిట్టివిలాసిని నేమికారణం
బొక్కొ మనోవ్యథం బొరలుచున్నది చూచితె ప్రాణనాయకా. 161

తే. నాథ యీయింతిజూచిన నామనంబు, జాలిగొనియెడు మీపదాబ్జంబులాన
వినఁదగుదునేని తెల్పుఁడువిశ్వమునను, మీరెఱుంగనికార్య మేమియును లేదు.

త్రైలోకవర్తి యనుచిలుక తనచెలికి నూర్వశివృత్తాంతముఁ దెల్పుట.

క. అని పలికిన ప్రియురాలిం, గనుఁగవ నుల్లాసరసవికాస మెసంగం
గనుగొని యిట్లనిపలికెన్, వినుమనిమాధుర్యరచనవిలసన్ముఖుఁడై. 163

సీ. పరమపావనమైన బదరికావనమున నిశ్చలంబుగఁ దపోనిష్ఠసలుపు
చున్న నారాయణయోగీంద్రు నియతి విఘ్నము సేయ గీర్వాణనాథుఁడంప
నమరాంగనలు వచ్చి హావభావవిలాసములు చూపుచును దనమ్రోల మెలఁగఁ
గాంచి నవ్వుచు నఖాగ్రంబులఁ దనతొడ చీఱి యం దభినవశ్రీయుతాంగి
తే. నివ్వరారోహఁ గల్పించి యవ్వినోద, మునకు లజ్జాభయంబుల మునుఁగుచున్న
యచ్చరలఁజూచి మీచేష్ట లతివలార, యిచట నేమగు మఱలిపొం డింద్రుకడకు.

క. అని తనయూరువున జనిం, చినదగుటన్ దరుణికూర్వశీనామముఁ దా
నొనరించి ముఖ్యరా లగు, ననిమిషసతులార మీకు ననుచు నొసంగెన్. 165

క. ఆకొమ్మఁ దమకుఁ బెద్దగ, గైకొని యేతెంచి రమరకాంతలు దివికిన్
లోకస్తుతసుందరియై, నాకంబునఁ బెంపుగనియె నాటంగోలెన్.

మ. ఇది యీయయూర్వశి పూర్వవృత్త మిపుడీహేమాంగి గంధర్వతా
పదశంజెందెఁ బురూరవున్ వలచి తత్ప్రస్తావముల్ చాలనా
రదుచే విన్నదియై యెఱుంగుదువె యారాజేంద్రునిం జూతుమే
కద నారాయణసేవకై యతఁడు రాఁగా నవ్వనిన్ జవ్వనీ.

వ. అనిపలుకుచున్న జీవితేశ్వరువచనంబు లాలించి యించుకతఁడు తూష్ణీ
విచారించి శిరఃకంపంబుసేయుచుఁ గీరభామిని యిట్లనియె.

క. అగునగు నెఱుఁగుదుఁ బ్రియకర, మగుమగువల కతనియంద మకలంకశ
న్నగునగుమొగమీయింతికిఁ, దగు దగు నిద్దఱకుఁ జెలిమి తమిఁ గ్రీడింప

మ. అను నీముచ్చట ప్రస్ఫుటాక్షరరవవ్యాహారమై కర్ణరం
జన గైర్వాణసుశబ్దమై వినఁబడం జంద్రాస్య లాశ్చర్యఖే
లనలోలద్వికచాంబికప్రభలులీలాచంద్రికల్ చల్లఁగ
న్గొని రాసన్నరసాలశాఖి నలరుంగొమ్మన్ శుకద్వంద్వమున్.

ఉ. కీరములన్ మనోజ్ఞరుచిఖేలన వర్ణవిశేషశోభితా
కారములన్ నవారుణముఖప్రథితాత్మగతానురాగవి
స్తారములన్ జనశ్రుతిరసాయనమంజులవాక్సుధాసుధా
పూరములన్ గనుంగొని రపూర్వముదంబున నూర్వశీసఖుల్.

వ. ఇవ్విధంబున.

మ. మణిమంజీరఝుళంఝుళన్నినదసంపన్నాంఘ్రివిన్యాసవా
రణకుంభప్రతిమానపీనకుచభారప్రోచ్చలన్మధ్యలై
గణికల్ తత్సహకారముం గదిసి శోభాచంక్రమాక్షిద్వయీ
ఘృణు లుడ్డీనచకోరికాచయజయశ్రీనొంద వీక్షింపుచున్.

వ. నిలిచి తత్తేజోవిశేషంబున కద్భుతం బందుచుం బ్రార్థనావచనపూర్వ
కీరోత్తముం గనుంగొని.

ఉ. కన్నుల పండువయ్యె నినుఁ గన్నఁ జెవుల్ కడుచల్లనయ్యె నీ
వి న్ననువొందునీపలుకు విన్నను నీకరుణార్ద్రదృష్టిపై
కొన్న వసంతలక్ష్మి నెలకొన్న లతావళు లయ్యె మేనులో
యన్న శుకప్రకాండ విను మన్నిటఁ బుణ్యశరీరి వెన్నఁగన్.

ఉ. కేళికినై శుకాకృతు లొగిన్ ధరియించి మెలంగునాజగ
న్మూలనిదానదంపతుల మువ్వురిలోపల నొక్కరో దయా
శీలత మస్మమనోరథము చేరియొసంగఁగ వచ్చినట్టి మా
పాలిటిభాగ్యదేవతలా పల్కఁదగున్ భవదీయవృత్తమున్. 176

వ. అని వినయభాషణంబులు పలుకుచున్న యన్నుల నవలోకించి కించిత్ప్రసారిత
నిజకటాక్షవీక్షణుం డగుచుఁ బక్షివరుం డిట్లనియె. 177

సీ. మానివాసము ముక్తిమానివాసం బైనబదరికావనసీమ భామలార
మామైత్రి యలకరామామైత్రిఁ బేరైన శుకతల్లజముతోడ సుదతులార
మాయింపు ఖేదముల్ మాయింపు భగవత్కథాప్రసంగంబులు తరుణులార
మానేత్రములకును మానేత్రజాదిలోకములు దృశ్యంబులు కాంతలార
తే. మానిజగతి దుస్సంగతి మాని జగతి, సత్ప్రచారతనుండుట సకియలార
మాహితప్రోక్తి వినుఁడు సమాహితమున, మీకు శుభవార్త పలికెద మెలఁతలార.

ఉ. ఊర్వశి పాకశాసననియోగమునన్ భువికేగు నచ్చటన్
సర్వగుణాభిరాము నృపచంద్రు బురూరవుఁ గాంచు నాతఁ డీ
పర్వశశాంకబింబముఖిపైఁ గడుఁ గూర్మివహించు మామకా
శీర్వచనంబు సిద్ధముగఁ జేకుఱు నిద్దఱకున్ సరాగముల్. 179

ఉ. చంద్రనిభాస్య కానృపతిచంద్రునితో సతమైనకూటమిం
జంద్రునియందు లీయమగు చంద్రికయుం బలెనుండఁ గల్గెడుం
జంద్రవిలాసమూర్తు లగుచక్కనిపుత్రులఁ గాంచు భూమిలోఁ
జంద్రకులంబు వర్ధిలు నిజంబుగ నూర్వశికారణంబునన్. 180

వ. అచిరకాలంబున నీమనోరథంబు సాఫల్యం బగునని యూర్వశినుద్దేశించి యిట్లనియె.

శా. మానారాయణమూర్తియూరువున జన్మంబందుటం జేసి నీ
పై నెయ్యంబున నింతయుం దెలిపితిన్ భాగ్యంబుచే నీకు నా
భూనాథాగ్రణి మేలువాఁడగును నీపుణ్యంబు లీడేఱు బా
లా నిశ్చింతతనుండు మింక వగపేలా నీకు మేలయ్యెడున్. 182

క. అనిపలికి తానుఁ బ్రేయసి,యును నవ్వలనరుగఁ దగుప్రయోజనముముదం
బునఁ దెలిపి పోయివచ్చెద, మనిచెప్పి సముద్గమించె నంబరవీథిన్. 183

తే. ఉభయపక్షప్రకాశత నొప్పుచక్ర, విభ్రమణలీల లెసఁగించు విషమజాడ్య
కరగతి నయంబు దనర శుకప్రకాండ, మవగుణములేని శశియన నరిగె దివిని. 184

తే. చిలుకమిథునంబు వెంట నాచెలులచూపు, లపు డదృశ్యావధికముగ నరిగి తిరిగె
సాధు లగుబంధువుల దవ్వు సాగనంపి, వచ్చు టుచితంబుగద గుణవంతులకును. 185

క. చిలుక సుధారసధారలు, చిలుక వచించిన హితోక్తి చెవిఁజేర్చుటచే
వెలవెల దోలంగి వేలుపు, వెలవెలఁదికి మోముదమ్మి వికసిత మయ్యెన్. 186

వ. అప్పుడు. 187

సీ. తడిగట్టినట్లుచందనకర్దమంబు వాడినతనూలతమీఁద నెనయ నలఁది
యరుణోదయముగాఁగ నబ్జరాగపుతాళి సొలసినకుచకోకములను జేర్చి
మకరంద మొలుకు కమ్మనిపూలు చెదరిన కొప్పు తుమ్మెదగుంపుఁగూర్చిచుట్టి
చీఁకటి కప్పుగాఁ జెలఁగు కాటుక కాంతనయనోత్పలముల నందముగఁదీర్చి

తే. విరహవేదన బడలిన వెలఁదియంగ, కముల కుపచార మదియె శృంగార మదియె
తానొనర్చిరి తెలిసి యేకక్రియాప్తి, నావయస్యల నేర్పు నేమనఁగవచ్చు. 188

క. అంగీకృతకాలోచిత, శృంగారవిలాసయగుచుఁ జెలికత్తెలతో
రంగగు నిజమందిరమున, కంగన యేతెంచెఁ గోర్కు లతిశయమందన్. 189

ఉ. ఇంద్రుఁ డనుజ్ఞ యిచ్చుపనియెయ్యదిగల్గునో భూమికేగ రా
జేంద్రునిదర్శనంబు ఘటియించుట యెట్లొకొ వాఁడు మన్మన
స్సాంద్రతరానురక్తికి వశంగతుఁడౌట కుపాయమేమొ ని
స్తంద్రతఁ జిల్కపల్కులు నిజంబగునో యది గాక తప్పనో. 190

వ. అని విచారింపుచు. 191

సీ. అభిలాష మీడేఱు ననుచు నమ్మికగాఁగ నాడినచిలుకవాక్యములవలనఁ
దఱుచైన కలలోని దర్శన స్పర్శన సంజల్పసంయోగసరణివలన
నతనిమూ ర్గనుఁగొన్న యమరశిల్పకులు వ్రాసినపటం బెద నుంచుకొనుటవలనఁ
దలఁచి కావించునోములసమాప్తిని, బుణ్యవతులు దీవించుదీవనలవలన

తే. వామలోచన యాత్మీయవామలోచ, నం బదరు టాదిగా శకునములవలనఁ
దెచ్చుకోలుదిటంబున దినములొక్కఁ, గతిఁ గడుపుచుండె మనసు తద్గతము చేసి. 192

క. భువిఁ బుణ్యము లొనరింతురు, దివిభోగము లందుకొఱకుఁ దిరముగ వ్రతముల్
దివినుండి చేసె నూర్వశి, భువిభోగముకొఱకు నిది యపూర్వము గాదే. 193

వ. అనిపలికినం బరమహర్షసమన్వితులై మహర్షు లవ్వలివృత్తాంతంబు దేటపఱు
పుమని యడుగుటయును. 194

శా. కద్రూసంభవదర్పభంజనమహాగాంధర్వ గాంధర్వసం
పద్ద్రాఘిష్ఠకవంశరావలహరీమాధుర్య మాధుర్యయో
షిద్ద్రుక్చారుచకోరికాప్రియముఖశ్రీరాజ శ్రీరాజమా
నద్రుస్ఫారతటార్కజావిహరణానందాత్మ నందాత్మజా. 195

క. పింఛాలలంకృతకచతా, పింఛాంచితనీలవర్ణబృందావనభూ
లాంఛితపదఘోషవధూ, వాంఛితపదమాగ్ధ్యజగదవనవైదగ్ధ్యా. 196

కవిరాజవిరాజితము:—

చరణరణన్మణినూపురధీధితిసంవృతకాళియభోగిఫణా
ఖురజరజఃపటలావృతదిక్తటఘోటనిశాటవిభంగరణా
విరహరహస్సమయాగతయోపసువృత్తకటీసహవిభ్రమణా
పరమరమాంగలతాశ్రయవిగ్రహభద్రతమాలతరుస్ఫురణా. 197

గద్య. ఇది శ్రీమంగళాచలనృసింహకృపాప్రసాదసంప్రాప్త విద్యావైభవ కనుపర్తి రాయనమంత్రితనూభవసుజనహితకృత్యనిత్య అబ్బయామాత్యప్రణీతం బైనకవిరాజ మనోరంజనం బనుమహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము. 198

చతుర్థాశ్వాసము.



శ్రీమద్బృందావనధా
మశ్రీమండలభాగధేయదృష్టాంతజగ
త్క్షేమంకరచరణాంబుజ
కోమలవిన్యాసరాజగోపవిలాసా ! 1

వ. అవధరింపుము సమస్తసద్గుణసాంద్రు లగుశౌనకాదిమునీంద్రులకు సామోదహృద
యజలజాతుం డై సూతుం డిట్లనియె నాసమయంబున. 2

క. మిత్రావరుణమునీంద్రులు, ధాత్రీస్థలి నంబురాశితటవనపుణ్య
క్షేత్రమునందుఁ దమోను, న్నేత్రు హరుగుఱించి తపము నిష్ఠసలుపుచున్. 3

సీ. ఆవిప్రవరులు కాయలుఁబండ్లు నాహారములుగాఁగఁ జేసి యాకలి యణంచి
యాబాడబులు దార్ఢ్య మతిశయిల్లఁగ మహాంభోమధ్యసీమలఁ బూనినిలిచి
యాద్విజవల్లభు లాత్మప్రకాశత చేఁ దమోగుణము నిర్జితము చేసి
యాకమలజకులఖ్యాతులుద్దీప్తచండాంశుబింబాభిముఖ్యము వహించి

తే. యమ్మహాగోత్రు లనిలశీతాతపాది, కములఁ దలఁకక నిశ్చలత్వమున నుండి
యవ్విబుధవర్యు లనిమిషంబైన దృష్టి, చేతసుమనస్కు లగుచుఁ జేసిరి తపంబు. 4

తే. అలఘువాగ్వైభవమున శేషాహిమూర్తు, లనుట కది వన్నె వెట్టిన యట్లుగాఁగ
నమ్మహాత్ములు మారుతాహారు లైరి, నిశ్చలం బైన తత్తపోనియతియందు. 5

వ. మఱియు నమ్మహర్షిపుంగవు లహింసా సత్యాస్తేయ బ్రహ్మచర్యదయార్జవక్షమా
...రశుచిత్వంబు లనుదశగుణంబుల నొప్పునియమంబున నిర్మలులయి
క్యదానేశ్వర పూజా వేదాంతశ్రవణ మతిలజ్జాజపవ్రతంబులను
...గ నియమంబునఁ గృతకృత్యులయి స్వస్తికాసన గోముఖా
...ంహాసన మయూరాసన కుక్కుటాసన సిద్ధాసనాది
...ల నభ్యాసికులయి యిడానాడిం బవనం బత్యంత
కుంభకంబున నిలిపి జాలంధరోడ్డియాణమూల

బంధత్రయాభ్యాసపరిపాకంబున రేచకపూరకంబులు విసర్జితంబులయి శబ్దాదివిషయంబులు నివర్తింప నున్నిద్రితయైన కుండలిశక్తియందు బ్రత్యఙ్ముఖం బయినపవనంబు ప్రవేశించి సమాగమమోచనంబు నొందుచు నయ్యుత్తమాంగస్థలంబున నతిరహస్యం బయినశృంగాటకకోటరంబున నమ్మారుతంబు మనస్సమేతంబయి నిలిచి యటమీఁదం ద్రివక్రాకారంబయిన సుషుమ్నామార్గంబునందు మందగమనంబున నడువఁ గుంభకనిష్ఠులయి యోగానలంబునం గరంగు సుధాస్థానస్రావకరసంబున నాప్యాయితశరీరు లగుచు నెట్టకేలకు నొయ్యనం బింగళానాడి రేచకంబు సేయుచు నేవంవిధంబయిన ప్రాణాయామంబున సిద్ధులయి యష్టాదశస్థానపవనదృఢంబును యోగకాలంబున మానసికంబుగ నిత్యకర్మంబులు నడుపుటయును బాహ్యదృశ్యంబులయందు నాత్మలక్ష్యంబుగనుటయు నాదియగు చిహ్నంబులు గల ప్రత్యాహారంబునం బ్రవీణులయి జానుజంఘకటిబాహుశిరస్సులను పంచమండలంబులం బంచభూతంబుల నిలిపి యందు విష్ణుశరుద్రమహేశబ్రహ్మనిష్ఠువుల ధ్యానంబు సేయుచు ధారణనిష్ఠ ననుష్ఠాతలయి యాధారాదిషట్చక్రంబుల సగుణవిచారంబును హృత్కమలాంతర్జ్యోతియందు చిత్తంబు లీనంబగుటయు భ్రూమధ్యచిత్కళాచింతనంబు నాదియగుధ్యానంబున నిరూఢులయి యద్వితీయంబయి సర్వపరిపూర్ణంబైన బ్రహ్మంబు తానయై యుండుసమాధియందుఁ బరమానందు లయి పరమశివోపాసనఁ జేయుచుండి రయ్యెడ. 6

గ్రీష్మఋతువర్ణనము.

మ. జగతిం దోఁచె నిదాఘ మంతఁ బ్రతిభాశ్లాఘ్యంబు సాంద్రీభవ
న్మృగతృష్ణాకృతకప్రవాహసలిలోర్మిస్వీకృతోదాఖిలా
షగతస్వాంతచరిష్ణు జంతునిచయాశామోఘ మభ్యర్చితా
ధ్వగపూర్వాఘము తిగ్మతోగ్రతపనద్రాఘిష్ఠఘృష్ణ్యోఘమై. 7

సీ. విసరెఁ బశ్చిమదిశావిర్భూతవాతంబు హోరనివడ నిప్పు లుప్పతిలఁగఁ
గాఁచె నెండలు మహోగ్రంబులై దిశల నుర్వీస్థలి పెటపెట వ్రేగుచుండ
నేర్చెఁ గార్చిచ్చు లుగ్రార్చిస్స్ఫుటంబులై యటవులఁ జిటచిటార్భటి నటింప
సెగసె గుప్పున సెగల్ నగకూటముల నినోష్ణవితప్తరవికాంతజంబు లగుచుఁ

తే. బొడవెఁ బెంధూళి శర్వరీభూతవితత, శక్తిసంస్తంభనక్రియోద్యుక్తసమయ
మంత్రసిద్ధవిసృష్టభస్మం బనంగ, సకలజనభీష్మమైన గ్రీష్మంబునందు. 8

చ. ఉడుగని బాడబాగ్ని సెగ కోర్చియు నోర్వఁగలేక వేసవిన్
జడమయుఁ డయ్యు నయ్యపరసాగరుఁ డుస్సున నూర్పు వేఁడిమిం
బడమటిగాడ్పు లుప్పతిలెఁ బారముగాక నిదాఘవేళలం
గడు సెగచేత మేహమయగాత్రజనుల్ తపియింపకుందురే. 9

క. వడగాడ్పు లెదుర్కొనఁగాఁ, బడమటికై యరుగుకమలబంధునివాజుల్
సుడివడివడిసెడి వెడవెడ, నడచెననం దడవుగాఁగ నడచె నహంబుల్. 10

ఉ. సన్నము లయ్యె రాత్రులు ప్రసన్నములయ్యెను మల్లెగుంపు లా
సన్నములయ్యె జాజులు విషణ్ణములయ్యెను బొందువేళ లు
త్పన్నములయ్యె గాడ్పులు విపన్నములయ్యెను జంతువుల్ సుసం
పన్నము లయ్యె నెండ లతిపన్నవసంతదినాంతరంబులన్. 11

సీ. శ్రీదేవి భూదేవి చెఱియొకచరణంబు నూరుదేశంబుల నుంచి యొత్త
సమయోచితంబుగా సరసంపుజోలలు దివ్యాంగనలు నిగ్గుదేరఁబాడ
సనకాదు లుపనిషత్సారసంస్తవకదంబోచ్చైశ్చర్నినదపాఠముజ్జగింప
సద్దుసద్దనుచు విష్వక్సేనుఁ డింద్రముఖ్యులను జేసన్న నవ్వలికినుప
తే. నమృతసాగరమధ్యశేషాహితల్ప, భాగమున సౌఖ్యనిరతిచేఁ బవ్వళించి
నిదురతమిఁ గన్నులరమోడ్చి నెఱిమొగిడ్చె విష్ణుమూర్తి తదాషాఢవేళయందు. 12

సీ. వాసితోసీరసంవాసితోదారసుధారసశైత్యాంబుపూరములను
వరదంతశఠఫలస్ఫురదంతరుద్భూతరసనిశ్వమిళితగోరసచయంబు
వేల్లదేలాచూర్ణతల్లజైకస్వాదుసంపన్నశర్కరాసలిలములును
గలితకుస్తుంబరలలితజీరణముఖ్యసౌవీరతప్తపిష్టద్రవంబు
తే. మొదలుగాఁ గలపానీయములను బథిక, వితతికి నిదాఘశాంతిగావింపఁ బక్షము
లందుఁ జలిపందిరులు వెట్టి రడుగడుగున, జగతిఁబుణ్యాత్ము లాగ్రీష్మసమయమునను.

ఉ. మోహకరస్తనోచ్చలనముల్ గనిపింపఁగ వేసవిం బ్రపా
గేహవిలాసినుల్ పసిఁడిగిండ్ల జలంబులు దేరఁ బాంథు లో
హోహోలసత్పయోధరము లున్నతపుంగలశంబులంగ భూ
దాహముఁ దీర్చుకొందుము గదా దయచేసిన నంద్రు నవ్వుచున్. 14

సీ. సరసపద్మాకరజలకేళులనుఁ బూటచలువలై తగుసన్నవలపములను
గులుకుపన్నీటఁ జొబ్బిలు సుగంధంబుల నమృణాళతాళవృంతానిలముల

ననుగుణవస్తుదధ్యన్నభోజనముల నిర్మలమధురపానీయములను
వలపుఁ గప్రపువిద్యముల వెన్నెలబయళ్ల సైకతములఁ జల్వచప్పరముల
తే. విరులపాన్పుల శశిశిలావేదికలను, గృతపరీరంభమధుపానకించిదవశ
యువతిఘనకుచకుంభశైత్యోదయముల,భోగులకు సౌఖ్యమొదవె నుష్ణాగమమున.

వ. అప్పుడు. 16

శా. వీతాచ్ఛాదనవిగ్రహప్రణిహితావిర్భూతచండాంశుగ
ద్యోతక్షాంతిగులై స్థిరాహితపదాగ్రోద్ధానసర్వాంగులై
జ్యోతిస్తల్లజదీప్తమండననిరీక్షోత్ఫుల్లచక్షుస్సరో
జాతోదన్ముఖులై తపంబు మునులిచ్చం జేసి రవ్వేళలన్. 17

క. తపమునఁ దీండ్రించుమహా, తపమునకుం దోడు తీవ్రతరమై భువిఁ ద
త్తపము వెలింగెను దివిజా, తపముఖులకు మిగులభయము దలకొనుచుండన్. 18

ఉ. కంజహితప్రచండరుగఖండనిదాఘము చంద్రచంద్రికా
పుంజముగాఁగఁ జిచ్చులకుఁ బొత్తగుఁ పశ్చిమవాయువుల్ మనో
రంజకచందనానిలపరంపరగాఁగ మునుల్ సహించి రి
చ్ఛం జలియింప కష్మహిమచందమొ వారలయోర్పుచందమో. 19

వ. అంత. 20

వర్షాకాలవర్ణనము.

స్రగ్ధర. ప్రావృట్కాలంబుదోఁచెన్ బ్రచురితభువనప్రాణిసంతానసంతా
పావారోగ్యప్రతాపోద్యమచటులనిదాఘాంతకృజ్జైత్రయాత్రా
దావజ్జీమూతసేనాస్తనితగుభగుభాదభ్రసంగ్రామభేరీ
రావైరావత్యసిప్రక్రమధగధగసంరంభగంభీరధాటిన్. 21

క. తొలువానకాలమున న, గ్గలమై ధరమీఁద రాలెఁ గరకప్రకరం
బలఘుతరస్తనితార్భటి, కులికి నిలువలేక పడినయురుగణ మనఁగన్. 22

ఉ. నిప్పులు రాల గ్రీష్మమున నిక్కినగాడ్పులు వార్షికంబునం
జప్పుడు సేయకే మరలసాగెఁ బ్రతీచికిఁ బ్రాచినుండి తా
రప్పటివిూంగుచేఁ బ్రజలనాపదఁ బెట్టి నిజాధికారముల్
దప్పినఁ జిన్నఁబోయి మరలం జనుచుందురుగాదె దుష్ప్రభుల్. 23

క. కమలాకరంబు లయ్యెను, గమలాకరములుఘనంబు ఘనమయ్యె నభం
బమరనభంబై వార్షిక, సమయంబున రసరసప్రశస్తి వహించెన్. 24

పృథ్వీ. తళత్తళలసచ్ఛవిం దనరె ధాటివిద్యుల్లతల్
పెళత్పెళమిళద్ధ్వనిం జెలంగెఁ బేర్చి గర్జార్భటుల్
ఝుళంఝుళ గళజ్జలోద్ధతి నెసంగె నంభోదముల్
ఘుళంఘుళ విశృంఖళప్రగతిఁ గాంచి మించెన్నదుల్. 25

సీ. నీరాళ్లఁ గొంది శంపారుచుల్ గనిపించె నభ్ర మభ్రమునిండ నాక్రమించె
వృష్టికుంభద్రోణవిస్ఫూర్తి వర్షించెఁ జాతకంబులు మింట సంభ్రమించె
నదులు కూలంకషోన్నతములై ప్రవహించె హాళికోద్యోగంబు లగ్గలించె
జాజితోఁటలు పుష్పసౌభాగ్యత వహించె జలజప్రకాశత సన్నగించె
తే. జనము మోదించె శాద్వలచ్ఛాయమించె, నీప మిగిరించె మల్లెమేల్నిర్గమించె
నెమలి నర్తించె భేకనాదము రహించె, భువిఁ దోలకరించె వానకందువ ఘటించె. 26

మ. జలసంజాతభవాండమండపగతక్ష్మాచక్రసింహాసన
స్థలధాత్రీధరశంభులింగములకున్ శంపాలతాదీపికల్
వెలుఁగన్ గర్జితమంత్రసూక్తులను ప్రావృట్కాలశైవుం డొన
ర్చెలసన్మేఘఘటాంబుధారల నవిచ్ఛిన్నాభిషేకక్రియల్. 27

మ. శరచాపోన్నతి సంస్కృతాంబరమణిచ్ఛాయాప్రకాశంబునన్
హరిసారంగచయప్రచారవిదితఖ్యాతిన్ మహాసారసు
స్థిరతన్ శంబరభంగరమ్యతనుభాతిన్ మీఱుసారస్వత
స్ఫురణంగాంచెను సార్వభౌమవిభవంబున్ వానకాలంబిలన్. 28

ఉ. వెచ్చనితీర్థమాడి నులివెచ్చపదార్థము లారగించి బ
ల్పచ్చడముల్ ముసుంగులిడి పైఁజలిసోఁకని కమ్మటిండ్లలో
ముచ్చముడింగి యింటిపని ముమ్మరమెల్లను దీర్చి ప్రక్కకున్
వచ్చినప్రోడయాండ్ర కురువంపుడు బల్చనుకొండలూన ఱొ
మ్మిచ్చి కవుఁగలించి సుఖియించిరి ప్రౌఢగృహస్థులజ్జడిన్. 29

సీ. పురుషుఁ డుత్పలపత్రములు పెఱుందున నుంచ నవని లాంగలరేఖ లమరెననుచు
ధవుఁడు మైపూఁపచన్గవనంట నెదనొక్క మెలఁగి కొండలమొగిల్మెసెననుచుఁ
జెలువుండు నడుసీమ తళుకుఁ జూపులఁ జూడ మిన్నులు తళతళ మెఱసెననుచు
విభుఁడు మర్మములంటి వెసఁగళల్ దొరగింపఁ బద్మాకరము నిండి పాఱెననుచు
తే. సరసు లొనరించు నర్మచేష్టలకు సొగసి, కలికిప్రౌఢ లభిప్రాయగర్భితముగఁ
బలుకుదురు వర్తమానముల్ దెలుపుకరణి, గగనగృహముల నన్వానకాలమునను. 30

చ. భయమమతులై హరాద్గుభగుభద్రటదుత్కటగర్జితార్భటిం
బ్రియవనితల్ చనుంగవలు బిట్టదరం బఱతెంచి కౌఁగిటన్
రయమునఁ జేర్పఁ దద్విభులు రంజిలి రయ్యెడ మేడలందు విం
తయి యలరించు నెవ్వరిని యత్నము సేయక వచ్చులాభముల్. 31

క. అవానకాలమున మి, త్రావరుణమునీంద్రు లధికతరనిష్ఠ మెయిం
గావించి రుగ్రతపము భ, యావహమై త్రిభువనముల నట్టిటు సేయన్. 32

సీ. తతజటామండలాంతస్సీమనిందుచో భాగీరథీజూటుఁ బ్రమథనాథుఁ
గండభాగంబులఁ గాల్వలై పాఱుచో దానధారాకటోత్కటగజంబు
దివ్యవిగ్రహముల దిగఁబాఱుచోట నిర్ఝరసానువైన గోత్రాధరంబుఁ
జరణాంబుజంబులఁ బొరయుచో వియదాపగాప్రసూపదుఁ ద్రివిక్రమసమాఖ్యుఁ
తే. బోల్పఁ దగి రమ్మహామునుల్ భూరిజలద, భవనిర్గళధారాళబహుళవృష్టి
జలము చేతఁ దద్వార్షికసమయమునను, వారినుహిమాతిశయ మనిర్వాచ్యమరయ. 33

ఉ. గండములాని పార్శ్వములఁ గ్రమ్మి నితంబము లాఁగి పాదము
ల్నిండి ఝురీచయంబు లవనీధరసీమలఁ బాఱుకై వడిన్
గండము లాని పార్శ్వములఁ గ్రమ్మి నితంబములాఁగి పాదముల్
నిండి యొసంగె వర్షభవనీరము మౌనుల పైఁ బ్రవాహమై. 34

శా. ఈచందంబున నమ్మహామునివరుల్ హృత్పద్మకోశాంతర
ద్యోచక్రోర్జితలింగశాంభవమహాజ్యోతిం బ్రపూర్ణంబుగా
లో చూపం దెలివిన్ సమస్తమును నాలోకించుటల్ సిద్ధవ
త్ప్రాచుర్యం బయినట్లు ప్రేఁగునఁ జలింపం జొచ్చె విశ్వంబొగిన్. 35

తే. జగతి ఘటచక్రసామ్యమై జగతి యయ్యె, నగములుపవచ్చిలాభగ్ననగములయ్యె
వనధులకలంకరూపజీవనధులయ్యె, లోకములకాతపముదురాలోకమయ్యె. 36

క. అట్టిమహోపద్రవమున, నట్టిట్టైకలఁగె జగము హరిహయునిమదిం
బుట్టెఁ దనయాధిపత్యం, బెట్టగునో యనువిచారమెంతయుభరమై. 37

క. ఏపగిదినైనవిఘ్నం, బాపాదింపంగవలయునత్యుగ్రకరం
బీపరమమునులతపమని, యాపురుహూతుండుమిగులనార్వేరమునన్. 38

వ. ఇట్లని తలంచె. 39

మ. అతిసౌందర్యము నాటపాటవగ యొయ్యారంబు వాక్ప్రౌఢియుం
రతిఁ జాపష్ఠికళల్ ఘటించి మనసుల్ రంజిల్లఁ గాఁ జేయు ప్రా

ధతయుం గల్గినయింతి దానొనిన నిష్ఠల్ వీడి మోహింతుర
య్యతిముఖ్యుల్ సెగపొంత వెన్న పురుషుండా బో వధూచేష్టకున్. 40

ఋషుల తపోవిఘ్నమునకై యింద్రుఁ డూర్వశిని బంపుట.

ఉ. అన్నిటజాణ యూర్వశి గదా సురభోగవతీజనంబులో
నన్నలినాయతాక్షి నట కంపిన నమ్మునులన్ భ్రమింపనో
పు న్నిజహావభావములఁ బొందగు నిప్పనియంచుఁ బిల్వఁబం
చె న్నిజదూతచే నమరశేఖరుఁ డయ్యరవిందలోచనన్. 41

తే. పిలువఁబంచిన నారాజబింబవదన, చిలుక యాడినమాటలు దలఁచుకొనుచు
సంతతము సంశయంబును సంభ్రమంబు, గదురమణిభూషణోజ్జ్వలగాత్రి యగుచు. 42

సీ. చరణమంజీరపుంజరవప్రమాణంబు భద్రేభగతివిలంబనము దెలుపఁ
గనరానినడుమునఁ గనిపించుజవజవల్ కుచకుంభభారంబుగుట్టు దెలుప
నవికారవచనవీక్షాదివిలాసంబు లుత్తమనాయికావృత్తి దెలుప
వనజగంధభ్రాంతిఁ వెనువెన్కఁగు తేఁటు లూగఁబద్మినీజాతి యగుట దెలుపఁ
తే. పురుషనికరంబు మీఁదను బుష్పశరుఁడు, తెగిప్రయోగంబుసేయ మూర్తిభవించి
వచ్చు మోహనమంత్రదేవత యనంగఁ, జనియె నూర్వశి సురరాజసన్నిధికిని. 43

మ. చని చింతామణిభద్రపీఠమున రాజశ్రీవిలాసోన్నతుల్
పెనుపొందన్ జగదేకవైభవమునం బేరోలగంబున్న యా
ఘనవాహుం బొడగాంచి మ్రొక్కి యెలమిం గైవారముల్ చేసి ని
ల్చిన సానుగ్రహాలోచనాంచలరుచుల్ చెల్వొంద వీక్షింపుచున్. 44

ఉ. ఆవనజాయతాక్షికిఁ బ్రియంబున నిట్లని పల్కె నింద్రుఁ డిం
దీవరనీలవేణి జగతీస్థలిఁ బావనకాననంబునన్
భావములం జలింపక తపంబొనరించుచు నున్నవారు మి
త్రావరుణాఖ్యమౌను లతిదారుణనిష్ఠ జగద్భయంబునన్. 45

క. మోచాఫలమధురాధర, నీచాతుర్యమున వారినియమప్రత్యూ
హాచరణము గావింపుము, నీచేతం గాని కాదు నిజ మటుసేయన్. 46

సీ. సుదతి నీకుచగురుల్ చూచినమునిసింహు లాశ్రయం బొనరించు టద్భుతంబె
వనితనీయావనవనము గాంచిన మౌనికుంజరుల్ రమియింపఁ గోరుట రుదె
కలికి నీకటిభూమి గగుఁగొన్న యతిరాజు లనురక్తినంటి పైకొనుట వెఱఁగె
రమణి నీమధ్యాంబరము గన్న ఋషిచంద్రు లవలంబనము సేయు టబ్బురంబె

తే. ప్రాప్య సద్యస్సుఖంబుల బాసి యేల, యిచ్చగింతు రతిప్రయాసేష్టదముల
గిరివిపినవాసభూప్రదక్షిణచిదంబ, రావలోకనముల నెవ్వరైనఁదరుణి. 47

మ. యతిరాజన్యతపోమహానలము చల్లారంగ సౌదామినీ
లతికాహంకరణాపహాసకరలీలాలాలసాపాంగసం
గతశోభాకలశాంబుధిస్ఫుటతరంగశ్రేణి పైకొల్పు మో
శతపత్రానన యిట్లు చేసిన జగజ్జాలోపకారం బగున్. 48

క. అనిపలికి కలికి నపుడ, య్యనిమిషపతి సబహుమానకానుజ్ఞతఁ దా
ననిపిన మహాప్రసాదం, బని మరలెన్ సభికవీక్ష లటు వెనుతగులన్. 49

చ. వెలఁది నృపాలుఁ జూతు ననువేడ్కయ కాని మహోగ్రు లమ్మునీం
ద్రులు తనయత్న మెట్టులగునో యని చూడదు పోవఁబూనెఁ దా
వలచిన చోటికే గుశుకవాణి సముద్రముపైన నీఁదుఁ బో
తలఁప నిరంకుశంబులు గదా జవరాండ్రతలంపు లెయ్యెడన్. 50

తే. ధరకు నరిగెడుపయనంబు తనకుఁగల్గ, టదినిధానంబు దొరకినయట్ల యగుచు
నతిశయంబైన సమ్మోద మావహింపఁ, జారులోచన నిజనివాసమున కరిగె. 51

క. నవరత్నభూషణాంబర, నవమాల్యసుగంధలేపనంబుల చేతన్
నవలా లసదభినవతా, నవలాలస యగుచు నటఁ జనంబయనం బై. 52

సీ. హంసకాశ్రయలీల నమరెఁ గొమ్మపదంబు లంబుజంబులు గావె కంబుకంఠి
ఘనసారలిప్తతఁ దనరెఁ గోమలి మేను శంపాలతిక గావె చంద్రవదన
కమ్మలసంగతిఁ గడువొప్పె సఖిచెవుల్ శ్రీకారములుగావె చిగురుఁబోఁడి
చిత్రపత్రముల రాజిలె నింతికుచములు జక్కవల్ గావె విశాలనయన
తే. యనుచుఁ దనుజూచి చతురోక్తులాడుప్రోడ, సఖులవచనంబులను ముఖచంద్రసహజ
దరహాసనచంద్రికలకు విస్తార మెసఁగ, నతివ సకలాభరణభూషితాంగి యగుచు. 53

క. మురజోపాంగవిపంచీ, స్వరమండలముఖ్యనాట్యసమయోచితబం
ధురవాద్యమేళములతో, నరుణాధరయరిగె మునులయాశ్రమమునకున్. 54

వ. ఆసమయంబున. 55

క. శరదాగమంబుగడచెన్, శరదాగమమావహిల్లె జగతిన్ వికస
చ్ఛరవిమలసైకతము లై, శరవిమలత నలరె నదులు సరసప్రౌఢిన్. 56

శా. భేరీశంఖమృదంగకాహళరవోపేతంబులై ధూపధూ
మార్భోరుసుగంధబంధురములై యశ్రాంతనైవేద్యవి

స్తారోదారములై ప్రదీపకళికాసాంద్రంబులై దేవతా
గారంబుల్ నవగాత్రులం దనరె విఖ్యాతిన్ శరద్వేళలన్. 57

ఉ. అంబరలంబిఖండవిశదాంబుధరాళి కొసంగె ధూసర
త్వం బెలమిన్ శరత్ప్రథమపక్షదినంబుల మంత్రసిద్ధహ
స్తాంబుజదత్తదీపితహుతాశనకుండగతాజ్యభోజ్యభూ
షాంబరపుష్పచందనఫలాదిమహాహుతిహోమధూమముల్. 58

సీ. నిద్రానుభవముద్ర నెలకొన్న నునుఁగెంపుచేఁ గన్నులకు వింత చెలువుఁదోఁప
బరివర్తనముల రాపడిన చందనచర్చ సుందరాంగంబున సొబగుమీఱఁ
జెమటచేఁ గరఁగి కించిద్దృశ్య మగుతిలకంబు నెన్నుదుట నందంబుగులుక
లంబితం బగుకుండలంపుటొత్తున నేర్పడినరేఖ హంసపీఠిక వెలుంగ

తే. మేలుకొని లేచి కూర్చుండెఁ బాలకడలి, నట్టనడుమ సహస్రఫణాఫణీంద్ర
భోగశయ్యాతలంబున భువనకర్త, కమలనాభుండు తచ్ఛరత్కాలమునను. 59

ఉ. కాముప్రయాణదుందుభులకై వడిఁ దచ్ఛరదాగమంబునన్
వేమఱు మ్రోసె దిక్కుల నవీనఫలోదయసస్యమంజరీ
హేమతిసంభ్రమద్విహరణార్థసముద్ధతి శాలిపాలికా
స్తోమఝుణంఝుణత్కటకశోభితహస్తచపేటనాదముల్. 60

వ. మఱియుఁ దత్సమయంబున సాధుజనంబునుం బోలి పంకరహితస్వచ్ఛజీవనంబైన స్రవంతీవితానంబును జంపకమహీరుహంబులగతి నానాశ్రితసారసంబులైన జీమూతఖండంబులును ననూపమభూములచందంబున మందీకృతశిఖిప్రకాశంబు లయిన ధరాధరంబులును వైద్యశాస్త్రంబువిధంబున గౌరాభ్రకగుణప్రకటంబయిన తారాపథంబును భాగ్యవంతునిమందిరంబుకై వడి శ్రీవిశేషాభిరామం బయినచంద్రికాపుంజంబును విష్ణువిగ్రహంబులరీతిం గమలాకరంబులయిన కొలంకులును గలిగి నితంబినీకదంబకనితంబబింబంబులకు నుపమానంబు సేయందగు నందంబులం దనరు సమున్నతసైకతంబులవలనను దానశీలునికీర్తివిస్ఫూర్తి నకలంకధావళ్యవికసనంబయిన కాశప్రచయంబులవలనను చాపాంధకారంబులం బరిహరించుటకు దృష్టాంతంబుఁ జూపు కరణిఁ దమఃపటలంబు నణంచుచు సుజనమందిరాంగణంబులం బ్రకాశించుకార్తికనియమదీపికాజాలంబులవలనను నక్తభోజనవ్రతనిష్ఠు లొనర్చు నన్వహమహారుద్రాభిషేకపూజావిధానవిశేషంబులం దనరి విదోషంబులయిన ప్రదోషంబులం గళ్యాణనిలయశబ్దార్థంబు ధ్వనిపరంబయిన నిజాభిధేయలీలం దెలుపుశివాలయచయంబులవలనను సకలసౌకర్యాలవాలం బయిన శరత్కాలంబు ప్రవర్తిల్లె. 61

ఊర్వశి మిత్రావరుణులయొద్దికి భూమికి వచ్చుట.

క. అత్తఱి నత్తరళేక్షణ, మత్తద్విపయాన యువతిమణి యూర్వశిలో
హత్తిన వేడ్కను ధరకు వి, యత్తలమార్గమున డిగ్గి యటచని యెదుటన్. 62

సీ. పంటముత్తైదువుగంటల మొలనూలు పడమటిదొరయేలు నిడుదప్రోలు
మీనై మెలంగుసామికిఁ జుట్టుకొల్లారు రతనంపుసరకుతోరపుబిడారు
వేల్పుపాతరకత్తెబిడ్డని చూరుబొక్క కుండపుట్టుగుజోగి కొన్నగ్రుక్క
ఱేఱేనిసిరికుబ్బరించు మ్రోఁతలప్రోవు తపసిదోసపుమంటదాఁచుతావు

తే. బల్లిటపుటేటియిల్లాండ్ర యల్లిబెల్లి, మేరదప్పకనిలిచిన నీరువెల్లి
నిట్టనేరేడుదిబ్బకుజుట్టువారు, తీరు చెన్నారు మున్నీరు తెఱవగాంచి. 63

వ. ప్రమోదమేదురహృదయసరసీరుహ యగుచుం జని యప్పారావారంబు తీరంబు
నందు. 64

చ. చెలులును దాను నూర్వశి ఋషిప్రవరాశ్రమసీమచేరి సం
చలదవలగ్నకీలితల సద్రశనావరకింకిణీధ్వనుల్
కలితకరాంఘ్రిపద్మకటకస్ఫుటవాదముతోడ నైక్యమై
చెలఁగ మెలంగుచున్ ధరకు జేరిన తీఁగమెఱుంగుకైవడిన్. 65

సీ. తనతనుమధ్యసౌందర్యరేఖకులోఁగి కొదమసింగంబులు గుహలుచేరఁ
దనమందయానమోహనలీలకును లజ్జనొంది మత్తేభముల్ క్రిందుచూడఁ
దనచంచలావలోకనచారుతకు నోడి సారంగనికరంబు పూరిగఱవఁ
దనమంజులస్వరోదారత కళుకొంది కోకిలంబులు కొనకొమ్మలెక్కఁ

తే. దనవినీలకచప్రశస్తతకుఁ జిక్కి, భృంగనిచయంబు గీపెట్టఁ బృథులజఘన
యల్లనల్లన నేతెంచి యధికనిష్ఠఁ, దపముగావించు నత్తపోధనులఁ గాంచి. 66

మ. పటవాసంబుల నంగరాగములఁ బుష్పస్తోమదామంబులం
బటుసౌరభ్యపరంపరల్ వొదువఁ దత్ప్రాంతంబునం జేరి సం
ఘటితస్వాంజలిఫాలురై మునులు దన్గన్నెత్తి వీక్షింపకుం
డుట భావించి ప్రయాససాధ్యమనుచున్ డోలాయమానాత్మయై. 67

వ. ఇంచుకతడవు విచారించి నిజవిలాసవిభ్రమవిద్యాప్రాగల్భ్యంబులఁజూపి యెట్లయి
నను రాగరసమగ్నులం జేయుదుంగాక యనుసహామికం దత్ప్రదేశంబున మందా
రకుందచందనమాలతీమధురికక్రముక ఖర్జూరనారంగనారికేళపున్నాగచాంపేయల
వంగమాతులుంగరంభాజంబీర జంబూప్రముఖనిఖిలతరుషండంబుల నజహద్వసంత

సాంతత్యంబులై ప్రకాశించు ప్రవాళదళలతాప్రతానకోరకలతాంతమంజరీపరాగ
మకరందశలాటుఫలగుచ్ఛప్రముఖసౌభాగ్యంబులం గన్నులపండువై కోయిలలయెలుం
గులఁ జిలుకలకలకలంబులఁ గొఱవంకలరవాంకంబులఁ బారావతంబులరుతంబులఁ
గేకులకేకారవంబులఁ దుమ్మెదలరొదలఁ గర్ణపర్వంబయి కబంధజాతసౌగంధికకు
ముదసముదయావంధ్యబంధురసుగంధిసంబంధిగంధవహకారణబంధుకృతోపచార
సుఖసమ్మోదితప్రాణినికరంబులయిన కమలాకరంబులఁ గరంబొప్పునప్పుణ్యాశ్రమం
బున విబుధవేశ్యాలలామంబు వయస్యలుం దానును విహారంబొనర్చిరప్పుడు. 68

సీ. మకరందనదులవెంబడి సంచరించుచో హంసాంగనలరేఖ యచ్చుపడఁగఁ
బొలుపొందు పల్లవపుంజంబు చిదుముచోఁ గలకంఠయువతులగరిమఁ దనరఁ
గలితసౌరభసుమాఘ్రాణంబు సేయుచో భ్రమరకాంతలవింత పరిఢవిల్ల
రసమనోహరఫలగ్రహణంబు సేయుచో శుకవిలాసినులపొందిక రహింప

తే. నమరలీలావతులు తద్వనాంతరమున, విహరణం బొనరింపుచు వేడ్కమీఱఁ
జేయుశృంగారచేష్టల శ్రీయొసంగె, మదనధాటి నిరాఘాటమహిమ యగుచు. 6)

చ. పరువడి మల్లెమొగ్గలను బాటలముల్ కలయంగఁ గోసి యొ
క్కరమణి దెచ్చియూర్వశికిఁ గానుకపట్టిన దంతకాంతిసుం
దరతయు మోవికెంపియుఁ గనంబడ నవ్వేఁ దదంగపుష్పవి
స్ఫురణల తారతమ్యములు పోలిక కేలికబంటువాసిగన్. 70

తే. ముదితయొక్కతె సంపెంగమొగ్గతావి, కొనుటకై నాసికాద్వారమునకుఁ జేర్పఁ
గోరి సౌందర్యభిక్షకై చేరఁబోలు, వాకిటికినంచు నవ్విరి వనితలెల్ల. 71

తే. తరుణిసంపెఁగపువ్వులదండగూర్చి, కబరికాభృంగవితతిపైఁ గదియఁజుట్ట
వింతయై యొప్పె నొప్పుటవిస్మయంబె, శత్రువులు మిత్రులైన సౌజన్యగుణము. 72

ఉ. శుకచంచూపుటఘాతరేఖలఁ గడున్ సొంపొందుశాఖావలం
బకజంబీరఫలద్వయంబు గని కొమ్మా చూచితే ప్రాథనా
యకునిం గూడిన బాల చన్గవకు సామ్యంబయ్యె నౌనంచు నొ
క్కకురంగేక్షణ చూపెఁ దోడిచెలికిం గందర్పుఁ దర్పింపఁగన్. 73

క. శ్రవణావతంసములుగా, నవరించిరి వకుళముకుళచయ మింతులు క
న్గవ తలఁదిరుగక యుండం, దవిలి మరుం డిడినశాసనంబులనంగన్. 74

చ. మఱఁదల రావె యంచు నొకమానిని యొక్కతెఁ జీరి వచ్చున
త్తఱి విరిచెండ్లు చన్నుఁగవ దాఁక వడిన్ వయివం దటాలునం

దెఱవ కవుంగిలించి వెనుతియ్యక చన్గవఁ దత్కుచద్వయం
బఱిమఱి నొత్తె నవ్వి రహహా సరికిన్ సరియంచు నంగనల్. 75

చ. విరులకు నొక్కయిందుముఖి వేడుకతో నిజశాఖ వంచుచోఁ
బురుషమహీజ మయ్యెగురుఁబోఁడిపయింట చెఱంగుపట్టి త
ద్గురుకుచముల్ బయల్పడఁగఁ ద్రోచె నచేతనమయ్యు మాయురే
పురుషులు చేతనుల్ మమతఁ బొందరె చక్కనియింతిఁ జూచినన్. 76

మ. అరవిందాక్షులు దీఁగయుయ్యెలల నొయ్యారంబుగా నూఁగఁ జొ
చ్చిరి పాదాబ్జము లవ్వనీకిసలయశ్రేణిం దలల్దన్న సుం
దరశోభానఖపఙ్క్తి చక్కఁగమిపై దండెత్త మంజీరపుం
జరవం బభ్రధునీమరాళముల వాక్స్తంభంబు గావింపఁగన్. 77

శా. పాదాక్రాంతములయ్యె రాగగుణసంపత్పల్లవవ్రాతముల్
మోదంబొప్ప నుయాల లూఁగుచుఁ బదంబుల్ ప్రాంతవృక్షాళికిన్
మీఁదం జూపు మెఱుంగుబోండ్ల కుచితంబే కా విటీకోటికిం
బాదాక్రాంతము గౌట రాగగుణసంపత్పల్లవవ్రాతముల్. 78

పుష్పాపచయవర్ణనాదికము.

సీ. అలివేణి కెంగేల నంటమాకందంబు పికవాణిపాడినఁ బ్రేంకణంబు
పొలఁతుక కలికిచూపులఁ జూడఁ దిలకంబు చెలిపదాబ్జంబుఁ జేర్చిన నశోక
మలసగామిని ముద్దుపల్కు పల్కిన గోఁగు నలినాక్షిహాసనం బొనర్పఁ బొన్న
కనకాంగి యూర్పుసోఁకిన సిందువారంబు చానమోమెత్తినఁ జంపకంబు
తే. కుసుమకోమలియెదఁ జేర్చుకొనినఁ గ్రోవి,యువతిపుక్కిటిమధువు పైనుమియఁ బొగడ
తమి నలరి పూచెఁ బో యచేతనము లయ్యుఁ,బురుషులనెంతచెలులకుమరులుకొలుప.

వ. మఱియునయ్యరవిందలోచనానిచయంబు పుష్పాపచయంబు స్వచ్ఛందవిహారణకుతూ
హలాధీనమానస లయియొనర్చుచుం దమలోన. 80

రగడ. తరుణి తరుణిసుమాళి యబ్రపుఁదావిఁ దా విలసిల్లె నిత్తఱి
నరయ నరయత మాని చేకొన రమ్మర మ్మని పిలిచె బిత్తరి
కదలి కదలి నటింప దళములఁ గానఁగా నరుదయ్యె నందము
ముదిత ముదితమిళిందమాఁ గదె మొల్ల మొల్లపువిరిమరందము
తనరు తనరుచిగరుడరత్నమతల్లి తల్లియ నా వెలుంగుచు
వనిత వనితరుశాఖఁగేరము వ్రాలె వ్రాలెదువేడ్కఁ బొంగుచుఁ

బొగడఁ బొగడఁగ నొప్పఁ జూడుము పూని పూని కరంబు గొమ్మది
నగము నగమును బోలె నున్నది నాతి నాతిలకంబు సుమ్మది
వరస వరసహకారపాళి సువర్ణవర్ణపరాగజాతముఁ
గురువ గురువగు వలపునద్దెస గుప్ప గుప్పన వీచెవాతము
కోక కోకనదస్తనాంఘ్రి ముకుందకుందనిదానలాభమె
నీకు సీకురువేరు లిట్లొడినిండ నిండన నింతలోభమె
వలపు వలపున దమ్మియని శశివదనవదనము సారెఁ జేరఁగ
నలికి నలికిభ్రమించె నగ్గజయాన యానవలాలు గేరఁగ
తా లతాలఘుడోల నూఁగుచుఁ దన్నుఁ దన్నగ మది చలించెను
మేలమే లలితాంగ్విప్రౌఢిమ మెచ్చు మెచ్చుగ నందగించెను
అతివ యతివర్ణితములై చెన్నారు నారుచిరంపుమల్లెలు
హితమహితమతి నొసఁగి కైకోనవింతవింతలె నీకుఁ జెల్లెల
యక్క యక్కలకంఠకులరవ మందమందత చెలఁగె వింధము
నిక్కు నిక్కుజరాజి దట్టపునీడ నీడగ్గఅనె యుందము
జాతిజాతి సుగంధమిచట నెసంగసంగతమయ్యెఁ జా విపి
గోతు గోతులితాబ్జ త్రుంచవె గోర గోరకములు ప్రియాళివి
లలన లలనవపాటలీపటలంబు లంబుజగంధిపొదపొద
గలయఁ గలయవి యెల్లఁ గోయగఁ గానఁ గానవె యటకుఁ బొదపొద
కాంత కాంతపుగొజ్జఁగుల నిదె కంటిఁ గంటికి నింపుగా నివి
వింతు వింతులఁ గాననీకొడి నిచ్చ నిచ్చకువేయఁ గానివి
కమ్మ కమ్మరొ చూతు సంపెంగలను గలనునుగాంతవృత్తులు
కొమ్మకొమ్మకుఁ బూనిక్క నిగిడెదఁ గొమ్మ కొమ్మలె పొన్నగుత్తులు
కలసి కలసితచంచలతవనకమలకమలత నాటఁజూపెడు
నలరునలరుల తీఁగయదె నటనాఁగ నాగముగెలువ నోపెడు. 81

వ. అని యన్యోన్యసంభాషణతత్పరలై చెలంగి మెలంగుచుండి రప్పుడు. 82

సీ. స్వేదాంబుకణికలచేఁ గుచంబులకు దృష్టాంతమయ్యెఁ బయోధరాభిధాన
మపరంజిపసిఁడిచాయలఁ గుల్కుతనువల్లికలయందు బడలికల్ గానుపించె
వడదాఁకి కసుగంది వదనేందుబింబముల్ కెందమ్మిచాయల నందగించె
నలసభావములైన యంఘ్రివిన్యాసముల్ విహరణోత్సాహంబు విడుపుఁ దెలిపెఁ

తే. బ్రాంతసరసీరుహాకరాంభస్తరంగ, పవనముల మీఁద హృదయము పరువులెత్తె
వేల్పు వెలయాంద్ర కారామవిహృతివలన, సంభవించినఘనపరిశ్రాంతివలన. 83

జలకేళీవర్ణనము.

క. వనకేళియలంతఁ దీర్పఁగ, వనకేళియ యుచితమనుచు వనితలు వలుకన్
వినిహితకరమని సఖిపై, వినిహితకరయగుచు మరలె వెలఁదుక యచటన్. 84

సీ. సరసాతిశయసార సరసానుభవధీర తరసారఝుంకార కరమదాళి
కలనాదకృతతాళ కలనాయుతమరాళ లలనాపురుషజాల లలితకేళి
రటదాగమాభంగ నటదాతతతరంగ ఘటదాకృతిరథాంగ పటలశాలి
పవనార్భకవినోద జవనాట్యకృన్మోద భువనాద్భుతామోద కువలయాళి
తే. ప్రకటనికటతటస్ఫుట పటుపటీర, విటపిపరిమళ మిళిత నవీనమృదుల
కదళికాతరువిగళిత కలితశశిర, జఃపులినపాళి యొక్కకాసారమాళి. 85

వ. మఱియును. 86

తే. భువనములు దనలోపలఁ బొదలుచుండ, రాజహంసరథాంగవిరాజి యగుచు
నబ్జభూషితమై యొప్పె నక్కొలంకు, హరునిపోలిక తనయందు నచ్చుపడఁగ. 87

ఉ. హల్లకపాళిపేర వికచాబ్జదళంబులపేరఁ జక్రవా
కొల్లసనంబుపేరఁ జెలువొందెడు హంసకులంబుపేర సం
ధిల్లు శయాంబక స్తనగతిస్ఫురణల్ నయనాభిరామమై
చెల్లఁగఁ దద్వినోదసరసీరమసొంపువహించె నెంతయున్. 88

తే. ఇందిరామందిరమునకు మందిరమఁట, పుట్టినిల్లఁట పుష్పవద్భోగినులకు
నాయుధాగారమఁట మాధవాత్మజునకు, సరసిమహిమంబు వర్ణింప శక్యమగునె. 89

ఉ. అట్టి సరోవరంబుఁగని యవ్వనితల్ జనితానురాగలై
యిట్టి కొలంకుఁ జూచి మును పెన్నఁ డెఱుంగ మటంచు నెమ్మదిం
బుట్టిన తద్విహారరతబుద్ధిఁ జొకాటపురేవెలుంగురా
మెట్టులమీఁద బాదములు మెట్టుచు నందెలు ఘల్లుఘల్లనన్. 90

తే. అలివ లవలంబితాన్యోన్యహస్తకమల, లగుచు సలిలంబులోపల దిగి నిజాంగ
లలితలావణ్యముక్తాఫలప్రదీప్తి, చే నలంకరణంబు చేసిరి కొలంకు. 91

మ. జలజాతోత్పలహల్లకప్రముఖపుష్పశ్రేణి నెట్లాడుచున్
జలపూరంబులఁ జల్లులాడుచు నుదంచచ్చంచరీకాళి న
గ్గలికం జోపుచు హంససారసరథాంగవ్రాతముం దోలుచున్
సలిలక్రీడ లొనర్చి రంగనలు సింజత్కంకణోదారలై. 92

సీ. వెలయించెఁ గ్రొత్తచెంగలువపువ్వులగముల్ రమణీమణులహస్తరాగలక్ష్మి
సమకొల్పె నభినవచక్రవాకసమృద్ధి పువ్వుఁబోఁడులకుచాభోగమహిమ
యొసఁగఁజేసె నపూర్వబిసరుహసామగ్రి బింబాధరలయాస్యబింబసుషమ
పొదలించె వింతతుమ్మెదగుంపులను దటిల్లోచనాకచభారమేచకంబు
ఆ. సహజమయిన సరసిసౌభాగ్యమునకు సౌ,భాగ్యమొదవఁజేసెఁ బద్మముఖుల
యంగములవిలాసమవని శ్రీ శ్రీ జేయు, ననెడిమాట నిశ్చయంబుగాఁగ. 93

సీ. ఈముద్దుమోముల కెనయౌనె తనలోనితమ్ములు పంకజాతమ్ము లనుచు
నీవాలుఁగన్నుల కెనయౌనె తనలోని కైరవంబులు దివాభీరు లనుచు
నీచన్నుఁగవలకు నెనయౌనె తనలోని చక్రపక్షులు విలక్షణము లనుచు
నీవళిరేఖల కెనయౌనె తనలోని ఘనతరంగములు భంగంబు లనుచు
తే. నీశిరోజములకు నెనయౌనె తనలోని భ్రమరములు సువర్ణసమవిరోధు
లనుచు దద్వీటీవిహారవిలోచన,వ్యాజమునఁ గలంక మందెఁ గొలఁకు. 94

సీ. కచవిలాసము చూచికాదె చలించె శైవాలముల్ మదభృంగజాలములును
ఘనకుచోన్నతి చూచికాదె జంకె సరోజకుట్మలానీకముల్ కోకములును
గనుచూపువగఁ జూచికాదె తలంకె నిందీవరములు నండభూవరములు
కరరక్తిమము చూచికాదె కంపమునొందె నవహల్లకములు కెందమ్మిగములు
తే. ననుచు నిజవిహారణరభసాతిరేక, లుఠదభంగురభంగవిలోలతత్త
దాకృతులు చూచి పలుకుదు రబ్జముఖులు, చతురభాషలు జలకేళిసమయమునను.

క. అంభోరుహాకరమున వి,జృంభణమున సీఁదుటకు ధరించిన శుంభ
త్కుంభప్లవంబు లనఁ గుచ, కుంభంబులు దనరముద్దుగుమ్మలు వరుసన్. 96

క. జలముల మునుఁగుచుఁ దేలుచు, మెలఁగఁగ జవరాండ్ర ముద్దుమేనులు వొలిచెన్
జలదంబులోన నెడనెడ, లలితగతిందోఁచుచంచలాలత లనఁగన్. 97

సీ. గుత్తంపుగుబ్బలు గుఱిచేసి వైచెఁ బయోజకుట్మలముల నొకతె నొకతె
కలుకువాల్గన్నులు గుఱిచేసి వైచె నీలోత్పలావళులచే నొకతె నొకతె
కోమరారుబాహువుల్ గుఱిచేసి వైచెఁ గొంచక మృణాళంబుల నొకతె నొకతె
క్రొన్ననకెమ్మోవి గుఱిచేసి వైచె హల్లకనికాయంబున నొకతె నొకతె
తే. తగవు దప్పని జగడ మీతరుణులందు, సూటిపడె మేలుమే లని జోకఁ జెలులు
సరసమాడంగ విరుల వసంతమాడి, రాలతాంగులు పంకేరుహాకరమున. 98

చ. లలనలముద్దుమేనుల నలందిన నిర్మలచంద్రసారసం
కలితపటీరపంకనవగంధరసంబును బూని వింతగా
వల పుదయించు తత్సరసివారి నపూర్వముదాప్తిఁ దేలుచుం
జెలఁగె మరాళదంపతులు చిత్రగతిం గలనాదవైఖరిన్. 99

తే. ఇవ్విధంబునఁ గొంతప్రొద్దిందువదన, లంబుజాకరకేళివిహారలీల
మెలఁగి చాలించి వెలువడి రలమరుండు, పదును వెట్టి వెడల్చునంబకము లనఁగ.

క. అనురాగరసార్ద్రములై, యెనసి తొలంగని విటాలి హృదయములగతిన్
వనితలతనువుల నంటెన్, ఘనరససంప్లుతములైన కనకాంబరముల్. 101

చ. తడిసిన వల్వెపయ్యెదలు దాకొని పైపయి నంటి యుండఁగా
నుడువ నగోచరం బగు వినూత్నవిలాసత నొప్పె నప్పుడ
ప్పడఁతుల గుబ్బచన్గవలు ప్రౌఢకవీంద్రులచే రచింపఁగాఁ
బడుమృదుగూఢపాకరసబంధురకావ్యవచస్సమంబులై. 102

సీ. అంగనాకచనీరజావతీర్ణంబులై వర్షోపలముల భావమునఁ బొలుచు
మదవతీవదనేందుమండలావృతములై తారకావళివినోదమునఁ దనరుఁ
గామినీకుచహేమకలశస్థితంబులై ముక్తాఫలంబుల మురువుగాంచు
లలితవతీగాత్రలతికాశ్రయంబులై నవకోరకంబులనయముఁ దెలుపు

తే. వెల్లివెట్టిన లావణ్యవిభవవాహి, సీసముద్భూతబుద్బుదానీక మనఁగఁ
దగిన జలబిందువితతి కాంతలమనోహ, రాంగకంబుల జలకేళికాంతమునను. 103

శా. సౌవర్ణాంబరముల్ ధరించి మణిభూషాజాలముల్ దాల్చి మే
ల్పూవుందండలఁ గీలుగంట సిగ లొప్పు ల్మీఱఁగా వైచి నె
త్తావుల్ గ్రమ్మెడు చందనం బలఁది కాంతల్ నవ్యశృంగారలీ
లావిభ్రాజితలై సుశీతలరసాలచ్ఛాయ నాసీనులై. 104

వ. ఉండి రయ్యెడ నయ్యూర్వశి వశీకరణార్థంబుగా సంగీతప్రసంగం బెసంగించు
నుత్సాహంబున. 105

చ. గవిసెనఁ బాయఁగాఁ దివిచి కైకొని సారెలు చక్కనొత్తి మా
ర్దవఘణితిన్ శ్రుతుల్ గలియఁ దంత్రులు చక్కఁగ మేళగించి చ
న్గవపయి నొక్కకాయ యొకకాయ నిజాంకమునందు నుంచి ప
ల్లవమృదులాంగుళీహతి కలక్వణితంబుగ వీణ మీటుచున్. 106

సీ. బంగారుజలపోఁత రంగుమీఱినకాయ కుచమండలంబుపైఁ గొమరుమిగుల
సరసాంగుళులు సారెసారె సారెలమీఁద నారోహణావరోహణతఁదనర
నేర్పరింపఁగరాక యేకమై జంత్రగాత్రంబుల నాదామృతంబు దొరఁగ
భావానుభవలీలఁ బైకొన్న మదిసొక్కు గనుచూపువింతచేఁ గానఁబడఁగ
తే. మంద్రమధ్యమతారకాసాంద్రసరిగ, మపదనిస్వరానుస్వరమాధురీధు
రీణగీతప్రబంధప్రమాణఫణితి, వీణ వాయించె గానప్రవీణ యగుచు. 107

తే. వెలఁదికుచకుంభములతోడ వీణకాయ, పడఁతివీణాస్వరముతో విపంచిరవము
చేసె సహవాస మనుగుణస్నేహ మనఁగ, నందమూఁగద యీడుజోడైనచెలిమి. 108

చ. మలయజగంధి తాళపరిమాణమనోహరరాగగీతికా
కలనినదంబు జంత్రమున గాత్రమునం జెలగింపు నింపుచే
శిలలు ద్రవించెఁ జిత్రములు జీవకళల్ ధరియించె దారువుల్
పొలుపుగ నంకురించె మృగముల్ మదిఁజొక్కువహించె నెంతయున్. 109

శా. ఆగాంధర్వనినాదవైభవము బ్రహ్మానందమై యందమై
భోగేచ్ఛాంకురకందమై శ్రుతిసుఖోద్భూతామృతస్యందమై
వాగర్థైకరసానుభూతి కుతుకస్వచ్ఛందమై యొప్పుచున్
రాగాంభోనిధి ముంచి యెత్తె మునిచంద్రస్వాంతకంజంబులన్. 110

ఉ. చల్లఁదనంపుసొంపు వెదచల్లుచు వెన్నెలతేటవోలె వి
ద్యుల్లతికాంగి గానరసముద్గతమై ముని మానసాంతరా
లోల్లసనప్రవృత్తిఁ జెలువొంది కరంగఁగఁ జేసె నింపు సం
ధిల్లఁ దదీయధైర్యరజనీకరకాంత శిలోచ్చయంబులన్. 111

తే. రాగమా యిది మదికనురాగ మనుచుఁ, బదములా యివి ప్రేమ కాస్పదము లనుచుఁ
దాళమా యిది రతికినుతాళమనుచు, యోగు లద్భుతరసభంగయోగు లగుచు. 112

శా. ధ్యానానందనిమీలనంబు లగునేత్రద్వంద్వముల్ విచ్చి య
మ్మౌనుల్ గాంచిరి చెంగటన్ నిజసఖీమధ్యంబునం బొల్చు శం
పానైగన్నిగగాత్రి నీలచికురన్ బంధూకరాగాధరన్
మీనాక్షిన్ దృఢతుందిలస్తనిదరస్మేరాననాంభోరుహన్. 113

వ. కాంచి యక్కళావతీతిలకంబు చక్కఁదనంబునకు నక్కజం బగునాశ్చర్యంబు
నొందుచు. 114

చ. పలుకుల ముద్దు సెమ్మొగము బాగు పిఱుందులసోయగంబు చ
న్నులగమకంబు కన్నులవినోదము చేతులయొప్పిదంబు చె
క్కులబిగి కౌనులేఁత వగ కొప్పువిలాసము మోవికెంపు మై
చెలువము దీనిసొమ్ముగ రచించెఁ జుమీ యజుఁ డింతవింతగన్. 115

ఉ. తావిపసిండికమ్మి వనితామణి మేను కళంకులేని రా
కావిధుబింబ మంగన మొగంబు సుధారసమూరు కెంపులీ
లావతి మోవి యిట్టిటుఁ దొలంగని జక్కవ లింతిచన్ను లా
రా వలరాయఁ డైనను విరాళిఁ గొనుం గద దీనిఁ జూచినన్. 116

క. తెలుపక తెలుపుచు నున్నది, జలజానన మోము పూర్ణచంద్రుఁ డగుట కో
మలహాసచంద్రికాధర, లలితసుధాదృక్చకోరలక్షణములచేన్. 117

సీ. ఘనసారసారసాంగత్యంబు నొల్లని గజనిమ్మపండ్లచక్కందనంబు
ముక్తామణులగూఢముగ నణంచుకయున్న కుంభికుంభములవిజృంభణంబు
చేరఁబోయినసుశృంగారరసాకృతి గనుపించుకొండలగౌరవంబు
చకితస్వభావచాంచల్యపత్రకములై భ్రమియించు చక్రవాకములసొబగు

తే. పోల్పఁదగు టెట్లు కలితకర్పూరమై ప్ర, కాశమౌక్తికహారమై కదిసి చూడ
సరసమై విస్తరళపత్రసహితమై యె,సంగునీయంగనామణిచన్నుఁగవకు. 118

ఉ. అంబుజగర్భుఁ డింతియధరాంగుళిహాసశిరోరుహాదు లం
దంబగు కెంపు విద్రుమకదంబము మౌక్తికముల్ సురేంద్రనీ
లంబులు నాదిగాఁగ నుపలంబులె కూర్చి రచించె దీని చి
త్తంబును నట్లసేయఁడుగదా మదిలో ననుమాన మయ్యెడున్. 119

మ. అనురాగంబున నట్టిరూపవతి తానై కౌఁగిటం జేర్చి పై
కొని కించిచ్చలితస్తనాగ్ర యగుచుం గొక్కోకశాస్త్రార్థయు
క్తిని బంధావరతిప్రసంగకలనం గ్రీడించునాభాగ్య మె
వ్వనికిం గల్గు నదృష్టలభ్యములు గావా సుందరీసౌఖ్యముల్. 120

వ. అని విచారింపుచు. 121

సీ. భస్మాంగరాగకల్పనఁ దొఱంగి లతాంగి వలిగుబ్బ మొనల మై యలమఁ దివురు
నాసాగ్రదృష్టివిన్యాసంబు చాలించి నాతిమర్మంబులు నాటఁజూచు
నాదసంశ్రవణసన్నహనంబు మఱచి తన్వీమృదూక్తి వినుటకు వీనులొగ్గుఁ
దొరగు బ్రహ్మపదామృతరస మానుట మాని మానిని కెమ్మోవి యానఁగోరుఁ

తే. కేవలం బగుకుంభకక్రియ సడల్చి, కొమ్మముఖపద్మసురభి మూర్కొనఁదలంచుఁ
గరణపంచక మిట్లు తద్గతముఁ జేసి, మునియుగం బాత్మనిష్ఠ వీడ్కొని కరంగి. 122

తే. మగువతనుసీమ నాపాద మస్తకముగఁ, దిరుగ మౌనులచూపులఁ దియ్యవింటి
గడుసుమన్నీఁడు చనుగట్ల నడిమియిఱుకు, గనుమనరికట్టె నిట్టటుఁ గదలనీక. 123

ఉ. పయ్యెదజాఱువాఱఁగు పయ్యెదఁ జిక్కటమై బిగించి యా
యయ్యల కాసగొల్పఁ జెలి యయ్యలఘుస్తనపాళిమీఁదఁ జే
వెయ్యను బుద్ధిపుట్టె మఱివె య్యను కొన్న విరక్తి గల్గునే
తియ్యనివింటిదంట యొఱదియ్యని వాఁడికటారి యెట్టిదో. 124

సీ. అంకంబులయ్యె నీలాలకచెక్కుల్ల మకరదళంబులు మన్మథునకుఁ
జాపంబులయ్యెఁ గంజాతపత్త్రేక్షణభ్రూవల్లికాద్వయి భావజునకు
బాణంబులయ్యెఁ జంపకమోహనాంగియపాంగమాలికలు పంచాశుగునకు
నళిబలంబయ్యె సీతాంశుబింబాననబలుకొప్పు శంబరభంజనునకు

తే. నమ్మునీంద్రులమీఁద నహంకరించి, దండువెడలెడు పుష్పకోదండపాణి
కమరె సాధనసంపత్తి యలఘుమహిమ, పొలఁతియంగకలీలావిభూతివలన. 125

ఉ. ఆవల రాయరాహుతుఁ డహంకృతి పచ్చనిఱెక్కపక్కెరన్
రీవివహించు తేజిని వడిం దుమికింపుచు నుగ్రమూర్తియై
కేవున నార్చి తూఱి నఱకెన్ యతిహృద్ధృతి ఖండఖండముల్
గా వరకేతకీకుసుమగర్భదళోజ్జ్వలఖడ్గధారచేన్. 126

తే. ఇట్లు మదనవ్యథాభిన్నహృదయు లగుచు, నున్న మిత్త్రావరుణమౌను లన్నిలింప
సుందరీమణి మోమునఁ జూడ్కి నిలిపి, యెద్దియేనియుఁ బలుక నూహించునపుడు. 127

ఉ. పంకజనేత్ర యమ్మునులభావ మెఱింగి తరంగితప్రమో
దాంకవిలోలలోచనదృగంచలయై గళితోత్తరీయయై
పొంకపుఁ జన్నుదోయి వలపుల్ గొలుప న్నవరత్నకింకిణీ
కంకణమంజులధ్వనులు ఘల్లన సిబ్బితితోడ మందహా
సాంకురలక్ష్మిఁ జత్తము బయల్పడ డిగ్గన లేచి నిల్చినన్. 128

క. ఆవగ యబ్బురపడి మో, హావేశతఁ జూడఁజూడ యతివరులమనో
భావము లానందావి, ర్భావంబులఁ జొక్కి వీర్యపతనం బయ్యెన్. 129

వ. తదనంతరంబ. 130

మిత్రావరుణు లూర్వశిని శపించుట.

క. తెలివొంది యాత్మనిష్ఠా, చలనమునకు వగచి తాపసజనోత్తము లీ
లలనకతంబున విఘ్నం, బొలసెఁ దపంబునకు ననుచు నొదవెడు నలుకన్. 131

క. మానవమానవతీస్థితి, తోనుండుము భూమి ననుచుఁ దొడరి శపింపన్
మానిని శాపవిముక్తికిఁ, గా నెంతయు వేఁడుకొనినఁ గరుణాన్వితులై. 132

క. కతిపయదినములఁ భువిలోఁ, నతిసంతోషముననుండి యంతట నమరా
వతినుండఁగలవు పూర్వ,స్థితినంచు ననుగ్రహంబు చేసిరి మౌనుల్. 133

వ. అంత నక్కాంత చింతారహితస్వాంతయై యమ్మునీంద్రుల వియోగంబునఁ బ్రస్ఖలితశుక్రంబు కుంభక్షిప్తంబుగావించి వారలచేత ననుజ్ఞాతయై చని పురూరవుని తోడి సంబంధం బపేక్షించి తిరుగుచుండఁ గుంభగతం బయినమిత్రావరుణుల తేజంబువలన మహామహిమప్రాశస్త్యండై యగస్త్యండును, నిమినృపాలశాపనష్ట శరీరుండై పునర్దేహప్రాప్తికిఁ బ్రహ్మనియోగంబున మిత్రావరుణతేజఃప్రవిష్టుం డయిన మునిశ్రేష్ఠుఁ డగువసిష్ఠుండును సంభవించి రట యూర్వశిం దోడ్కొని పోవుటకై నాట్యమేళకర్త లగుటగంధర్వు లచటికి వచ్చి యమ్మగువయభిప్రాయం బెఱింగి యిప్పుడఁతి హృదయం బిప్పుడు మరల్పవశంబుగాదు మఱికొన్నిదినంబుల కయినం దోడ్కొనిచన నుపాయం బిప్పుడ చేయవలయు నని యూహించి యత్తరుణిం గనుంగొని నీవు పురూరవునిపొందునకయి బద్ధానురాగంబున నున్నదానవు నీకోర్కె విఫలంబు చేయంగూడదు గావున నిన్నొకటి యర్థించెద మంగీకరింప వలయు నతనిసఖ్యం బనుసంధించునపుడు నీవు క్రీడార్థంబుగాఁ బెంచిన జోడు తగళ్లను జోరమృగాద్యుపద్రవంబులం బొరయకుండ నిరంతరంబు సంరక్షించు నట్లును వివస్త్రతాకారంబుగాని యాకారంబున నెప్పుడు నీకడ మెలంగునట్లును సమయంబు చేసి యొడం బఱుచునది యని యియ్యకొలిపి యయ్యింతి వీడ్కొని చని రంత. 134

హేమంత ఋతువర్ణనము.

క. హేమంతము నవయౌవన, సీమంతవతీకుచాద్రిసీమాంతరవి
శ్రామసుఖయువనిరాకృతి, సామంతం బగుచుఁ దనరు జగతిన్ సుగతిన్. 135

తే. చలికి బెగడొంది మేరువుచాటుఁ జొచ్చి, యెట్టకేలకుఁ గాని రాఁ డినుఁడు వెడలి
వెడలి పరువెత్తి యపరాత్రి వెనుక కేగు, నితరజనముల శీతార్తి యెన్న నేల. 136

తే. మాసములలోనఁ దనమూర్తి మార్గశీర్ష,'మనుభగవదుక్తికిది సాక్షి యయ్యె ననఁగఁ
బాడిపంటలు బలిసి సౌభాగ్యమహిమ, లోచనానంద మయి యుండె లోకమునను.

చ. చలిచలి యంచు మానవులు సంకుచితాంగకులై వణంకుచుం
బొలఁతులగుబ్బచన్గవలపొంతల డాఁగియు మారుతంబుపై
నొలయని యిండ్లనీగియుఁ గటూష్ణపదార్థము లారగించియుం
గళితపుఁ బచ్చడా లిరియఁ గప్పియుఁ గుంపటుల న్మెలంగువ
హ్నుల సెగఁగాఁగియున్ గడపుచుందురు ప్రొద్దులు సీతుకందువన్. 138

సీ. తతహంసమాలికాతల్పభాగంబులపై జోడువాయక పవ్వళించి
యగరుగంధపుఁబూతఁ దగుగుబ్బచన్నుల సెగలూరఁ గౌఁగిళ్లఁ బిగియఁజేర్చి
తమిదోఁచు నంతరుష్ణము దెల్పునూర్పులు మోముఁదమ్ములు గ్రమ్మముద్దు లొసఁగి
సలవంగనవజాతిఫలమిళద్వీటియుతాధరసీధువు లాననిచ్చి

ఆ. ప్రచురనర్మమర్మరుచిరలై శ్యామాజ,నంబు సలుపుసురతనాట్యసుఖము
రసికులకు మనోభిరంజనం బయి యొప్పె, భువిని హిమదినైకభోగ్య మగుట. 139

వ. తదనంతరంబ. 140

శిశిర ఋతువర్ణనము.

క. పన్నీటిజడికి నామని, వెన్నెలల కబోధవేళ వీడ్కొలుపు పయో
జోన్నతికి ధాన్యలక్ష్మీ ప్రసన్నంబగునెళవు శిశిరసమయము దోఁచెన్. 141

సీ. జగదేకమాత నీశ్వరిఁ గన్నవరగోత్ర మాశ్రమస్థలముగా నమరు నెద్ది
సత్యవతీపరాశరులకూటములకై కల్పించె నహరంధకార మెద్ది
జైవాతృకునికరచ్ఛాయాకలాపంబు తనమూర్తిమయముగాఁ దనరు నెద్ది
పన్నీరు పేరిటఁ బరఁగి భోగులకు వేసవివేళ సౌఖ్యం బొసంగు నెద్ది

తే. యట్టినీహార మఖిలదిగంతరములఁ, బర్వె నీరంధ్రమై కకుప్పాలకావ
రోధయావతయవనికారుచిరధవళ, పటపటుత్వంబు దనయందుఁబట్టువడఁగ. 142

క. వరతుహినబిందుసాంద్రో, దరము లగుచు నాగవల్లిదళములు దనరున్
సురతాంతశ్రమజలకణ, భరితశ్యామాకపోలఫలకాభము లై. 143

శా. సంకేతంబుల జారులం గలసి తత్సంయోగజశ్రాంతితో
లంకె న్నిల్పెడుప్రేమబంధముల రేల్ గౌఁగిళ్ల నిద్రించి ని
శ్శంకం జేరుదు రిండ్లు రేపకడలం జారాంగనల్ ఛాదితా
శాంశోద్యచ్ఛిశిరాగమాధికహిమాద్వ్యావృత్త్యదృశ్యక్రియన్. 144

క. ఉండున్ ఘనఘనసారక,రండము క్రియ భూనభోంతరాళవ్యాప్తా
ఖండహిమపాండిమమున న,జాండకటాహంబు తదహరాదులయందున్. 145

ఉ. ఆయెడ నప్పురూరవుఁ డుదగ్రపరాక్రముఁ డష్టదిఙ్మహీ
నాయకలోకమౌళినటనవ్యకిరీటకిరీటభావభా
గ్గేయనిజైకశాసనవిఖేలనుఁడై యపశత్రుపక్షని
ర్ద్రాయితఖడ్గజిహ్వాగవతంసకుఁడై జగమేలుచున్నెడన్. 146

వ. ఒక్కనాఁడు. 147

పురూరవుఁడు మాఘస్నానముచేయ నేగుట.

క. ద్వాదశి నభ్యంగము ప్రా, మాదికమున సంఘటించె మనుజపతి కమ
ర్యాదాప్తి వచ్చుఁగాదె ప్ర, మాదం బొకవేళ బుద్ధిమంతులకయినన్. 148

ఉ. ఆదురితంబుచే నృపతి యాననసీమ వికారభావము
త్పాదకమైన నాప్తు లగుబ్రాహ్మణముఖ్యులతోడఁ దెల్పినన్
ద్వాదశిపుణ్యకాలమునఁ దైలమునం దలయంటికొంట దో
షోదయమయ్యెఁ గానఁ గల దొక్కయుపాయము దీనిఁ మాన్పఁగన్. 149

శా. ప్రారబ్ధాఘపరంపరాదహనకుంభద్రోణివద్వార్షికా
ధారాపాతము సంచితోగ్రదురితధ్వాంతచ్ఛటాచ్ఛేదన
ప్రారంభస్ఫుటభాస్కరోదయము ఘోరాగామికాంహోంబుము
గ్వారధ్వంసకలాగవాశుగము మాఘస్నాన ముర్వీశ్వరా. 150

తే. అర్కుఁ డించుక యుదయించు నపుడు గ్రుంకు,లిడఁ బవిత్రులఁ జేయుదు నిలసురాపు
నైనఁ బ్రహ్మఘ్నునైన నటంచు మ్రోయు, సలితదేవత మాఘమాసంబునందు. 151

మ. కలుగున్ స్నానము భాగ్యవంతులకు గంగారంగదుత్తుంగభం
గలసత్పాండిమతోఁ గళిందతనయాకల్లోలమాలాసము
జ్జ్వలనైల్యం బెదిరింప గర్భితసరస్వత్యూర్మిగౌరంబుతో
నలరం బొల్చు త్రివేణి సార్కమకరోద్యన్మాఘమాసంబునన్. 152

క. కావున మాఘస్నానముఁ, గావింపుము భోగమోక్షఘంటాపథమై
భూవల్లభ సంకల్పఫ,లావాప్తి యొసంగఁ జేయు నతిశీఘ్రమునన్. 153

చ. అని మఱియుం దదీయసుకృతాతిశయంబు సవిస్తరంబుగా
వెనుకటిసత్కథల్ దెలుప వీనులవిందుగ నాలకించి మే

లనుచుఁ బురూరవుండు సకలాఘవిభంగకు గంగకుఙ్ రయం
బునఁ జని మాఘమాసదినముల్ గ్రమియింపుచునుండె నిష్ఠతోన్. 154

క. స్నానంబుల నియమాను,ష్ఠానంబుల సిద్ధయోగసల్లక్ష్యాహరి
ధ్యానంబుల నానావిధ, దానంబుల హర్షపూరితస్వాంతుండై. 155

వ. ఉండి యొక్కనాఁడు 156

సీ. ఏకాంతవసతిఁ బద్మాసనాసీనుఁడై తనువు ఋజూన్నతస్థాయిఁ జేసి
పరఁగుప్రాణాయామపరిశుద్ధిఁ బవను భ్రూమధ్యశృంగాటకాంబరముఁ జేర్చి
శబ్దాదివిషయముల్ సడలి డెందమువాతనిలయనిశ్చలదీపకళికవోల
నేకాగ్రత రహింప నీక్షణంబులు నాసికాగ్రవిన్యస్తంబు లై సెలంగ
తే. నాదబిందుకళాస్ఫూర్తి పాదుకొనఁగ, లోను వెలి యనుభేదంబు గానఁబడక
సర్వపరిపూర్ణ మగువిష్ణుశబ్దవాచ్య, సిద్ధవస్తువు ధ్యానంబు సేయుచుండె. 157

శా. ఆయానంద మమందమై యమృతవర్షాసారసంసేచన
ప్రాయంబై లభితస్వపూర్వసుఖసారంబై యనిర్వాచ్యవి
ద్యాయోగానుభవైకమై వెలయ నంతర్జ్యోతి నారాయణుఙ్
ధీయుక్తం బగునిర్వికల్పకసమాధిం బూని భావింపుచుజన్. 158

క. నియమసమాప్త్యవసానస,మయమున ననిలంబు మొదవిమట్టునకు శనైః
క్రియఁ జేర్చి ముకుళితాక్షి,ద్వయ మల్లన విచ్చి చూచి ధరణిపుఁ డెదుటన్. 159

తనకుఁ బ్రత్యక్షమైనవిష్ణుని రాజు స్తుతించుట.

సీ. కమలాంచితంబులై కనుపట్టి నయనపక్షోనాభివివరముల్ సొంపుమీఱ
నబ్జారిహితదీప్తతాసమానంబులై వదనహస్తప్రభావాప్తు లమర
ఘనవిరాజద్ద్యుతికలితంబులై శరీరాంబరధ్వజలీల లతిశయిల్ల
సుమనోవిభాసితస్తుత్యంబులై ధైర్యపరిపాకమాళిసంపదలు దనర
తే. నపుడు ప్రత్యక్షమయ్యె సుధాంశువంశ, రాజమాళికి నాదినారాయణుండు
జన్మజన్మాంతరసహస్రసంచితాత్త, సుకృతపరిపాక భాగ్యవిస్ఫురణఁజేసి. 160

దండకము:—శ్రీమద్రమాభద్ర మాతంగకుంభోపమాన స్తనన్యస్త కస్తూరికా చిత్ర
పత్త్రాంకురాలంక్రియాం కచ్ఛలోద్భాసియంతః కళంకప్రభాస్తోకరాకాకురం
గాంకబింబాకృతిన్ సారసౌరభ్యధావళ్యపాటీరపంకైకచర్చామిళచ్చారుదోరంతర
స్ఫూర్తి వర్తిల్లఁగాఁ దత్కురంగాంకబింబంబుతో సాహచర్యంబు వాటించు తారా
వళుల్ వోలె ముక్తాఫలోదారహారావళుల్ సొంపుమీఱంగఁ దత్తారకావారకాం

తుల్ ప్రకాశించునవ్వేళ సంపుల్లదుల్లాసలక్ష్మి న్విరాజిల్లు నీలోత్పలారామమో
నాఁగ నిద్దంపునెమ్మేనినైల్యం బతుల్యస్థితి న్మీఱ నయ్యుత్పలారామసాంగత్యముం
గాంచు లీలాసుధాసారకాసారమై విగ్రహారణ్య లావణ్య సంపత్తి యొప్పారఁ
గాఁ దత్సుధాసార కాసారభాగంబునం దట్టమై తెట్టువల్ గట్టియున్నట్టి నెత్త
మ్మిపుప్పొళ్లభాతిన్ నితంబంబుపై వర్ణితోద్దీర్ణ సౌవర్ణపీతాంబరాడంబరం బొప్ప
నత్తమ్మిపుప్పొళ్లచెంతన్ నితాంతంబు వింతై వెలుంగొందు రంగత్తరంగంబులం
బోలి యొప్పారు నంచద్వళీరేఖ శోభిల్లఁగాఁ దత్తరంగాళిపైఁ బొల్చునశ
ద్బాలశైవాల వల్ల్యాకృతిన్ రోమరాజీస్వరూపంబు గన్పట్ట నబ్బాలశైవాల
వల్ల్యగ్ర భాగంబునందేలి కల్పించు నాకంబుకంబున్ విడంబించు రేఖాత్ర
యీరమ్యకంఠం బకుంఠద్యుతిన్ సీటువాటింపఁ దత్కంబుసామీప్య దేశంబునన్
మంజు భాషామిషప్రస్రవన్మాకరందంబుతో లోచనచ్ఛద్మ సంఫుల్లపత్రాభిరూప్యం
బుతో నొప్పుపద్మంబనన్ సుందరంబైన నెమ్మోము సమ్మోహనశ్రీలఁ బెంపారఁ
దత్పద్మసౌరభ్యపారంపరాస్వాదనాసక్తిపై మూగు బత్తేటిమొత్తంబుడంబుం దలం
పించు నీలంపుఛాయల్ వెదల్చల్లు నోయారంపుంగేశబంధం బవంధ్యప్రమో
దంబు సంధింప నత్తేఁటి మొత్తంబు నిర్వంకలన్ లీలఁ గ్రీడించు రాయంచతానంచు
నెంచన్ వినోదించుచున్ గ్రేవలం గేవలంబైన లావణ్య తారుణ్యసంపత్తి ను
ప్పొంగు దివ్యాంగనాశ్రేణిపాణిద్వయి న్వీచునిస్తుల్యధావళ్యవచ్చామరస్తోమ మందం
బునొందంగ నాయంచలంచద్గతి న్గాయునవ్యక్తమాధుర్యధుర్యస్వనంబోయనం జా
మరగ్రాహిణీ హేమరాజన్మణీకంకణక్రేంకృతుల్ పొంకమై మ్రోయఁగాఁ దత్స్వర
ప్రాప్తికిన్ వ్యాప్తివాటిల్లు నట్లాపకంఠద్రుమారూఢహేలాపికవ్రాతకంఠోదితంబైన
యప్పంచమాఖ్యస్వరంబుం బలెం జెంగటన్ వచ్చువైమానికస్త్రీలసంగీతముల్ రంగు
రత్తుల్ వహింపంగ నప్పంచమంబుం బ్రమాణించి యామీఁదటన్ దైవతాంచన్నిషాద
శ్రుతుల్ నింపఁగా లక్ష్యముల్ దెల్పుచందాన హేషావిశేషంబులం బృంహితంబుల్
చెలంగించునుత్తుంగరంగత్తురంగంబులన్ భద్రమాతంగయూథంబులం జక్కఁగా నెక్కి
వెన్వెంట దిక్పాలకశ్రేణి యేతేర నేవంవిధాకారశృంగారలీలాలసద్వైభవశ్రీలచే
నందమై లోచనానందమై చిత్కళానందమై యొప్పురూపంబుతో నిట్లు ప్రత్యక్షమై
నట్టి యాదేవతాచక్రవర్తిన్ లసద్దివ్యమూర్తిన్ జగద్గేయకీర్తిన్ హృతబ్రాహ్మణార్తిన్
నమద్యోగిబృందున్ దరస్మేరశోభాజితజ్యోత్స్నితాచంద్రముక్తాసుకుందున్ ము
కుందున్ ముకుందాది నానానిధానప్రధానాభిధానాలకానాథముఖ్యస్ఫురద్రత్న
కోటీరరుగ్రాజినీరాజనాభాజనాంఘ్రిద్వయీభాసమానున్ సమానాసమానాంగసౌ

భాగ్యనీశావినీలాలకాఫాలకాశ్మీరరేఖాంకితప్రస్ఫురత్కంబుజిత్కంధరున్ గంధ
రాక్షేపకృత్కోమలశ్యామలచ్ఛాయికాబంధురున్ బందురక్షాకృపామంథరున్
మంథరున్ మంథరగ్రావధారంధరానుగ్రహోద్భూత చింతామణిశ్రీసుధాకామధుగ్దే
వతాసింధురున్ సింధురాజన్య రాజత్తరంగోపరి స్ఫూర్జితాహీంద్ర భోగస్థలానల్ప
తల్పున్ నిజాకల్ప తేజోభిరామున్ జగత్కల్పనాకౌశలున్ సిద్ధసంకల్పుసంకల్పసంసి
ద్ధిగాఁజూచుచున్ జన్మసాఫల్యమయ్యెం గదా నేఁటి కంచున్ బ్రమోదించుచున్.

తే. అట్లు ప్రత్యక్షమైన రమాధినాథుఁ, గాంచి యానందరససమాక్రాంతహృదయ
కమలుఁడై మేనఁ బులకాంకురములు నిండ, నతులతరభక్తి సాష్టాంగనతు లొనర్చి. 163

వ. ఇట్లని స్తుతియించె.

సీ. భూచక్రధూర్వహ భోగిభోగశయాన యానాయితేనసూతానుజాత
జాతరూపమయప్రశస్తనాభీపద్మ పద్మాలయాలయబాహుమధ్య
మధ్యవిలాససంపజ్జితమృగరాజ రాజహంసాంబకరాజమాన
మానసదహరశుంభజ్జ్యోతిరాకార కారణోత్పన్నావతారవార

తే. వారణాధీశదైన్యాంధకారసూర్య, సూర్యమంపవచస్తుత్యసుప్రభావ
భావభవకోటిసుందరశ్రీవిచిత్ర, చిత్రకాయమహాసురామిత్రుమిత్ర. 164

సీ. తరుణేందుధరమిత్ర దాసవసీచైత్ర కమలాకళత్ర జగత్పవిత్ర
భరితమంధరగోత్ర భ్రాజితాయుతమిత్ర రక్షితాదితిపుత్ర రమ్యగాత్ర
శయనీయవటపత్ర సౌవర్ణనేత్ర పాపలతాలవిత్ర దోర్బలవిచిత్ర
పోషితవైధాత్ర భువనహితక్షాత్ర పరిహృతభవగోత్ర వరచరిత్ర

తే. వికసితశ్వేతశతపత్ర విమలనేత్ర, చండభండనభూజైత్ర దండయాత్ర
నిగమశాస్త్రాగమస్తోత్ర నికరపాత్ర, యంబకశ్రోత్రరాజఫణాతపత్ర. 165

పాదభ్రమకకందము:—

దానవజలేజవనదా, భానుతతవిభాకరైక భావితతను భా
మానాథ వివిధనామా, యానసరసహారహీరహాసరసనయా. 166

ఓష్ఠ్యకందము:—

ప్రాపై మాపైఁ బ్రేమన్, మాపాపముఁ బాపి ప్రోవుమా నుము భవ్యా
భ్రాపమ్యభావిభావా, భూపా భ్రూవిభ్రమా ప్రభూపా మాపా. 167

నిరోష్ఠ్యమహాస్రగ్ధర:—

కరఖేలచ్చక్రధారాఖరకరకరవినిర్ఖండితోద్దండచండా
సురరాట్చక్రాంధకారశ్రుతితురగజటాజూటరంగత్తరంగో

త్కఱగంగానీరహైరాకరణచణరణత్కాఱంచనాంచిత్తులాకో
ట్యురుకాంతిచ్ఛన్నగోత్రార్యదకజజిశిరోయుక్తరాజత్కిఱీటా. 168

ద్వ్యక్షరకందము:—

మామానినీన నేనా, నేమమున ననూననామ నిన్నెన్నను నా
నామునిమనోన్మనిమన, నామనమున నమ్మినాను ననోన్నముమనా. 169

కందము - గోమూత్రికాబంధము:—

మురహరసుఖకరలీలా, పరమకృపాధామ విజయభాహాగర్వా
పురహరసఖ సురపాలా, వరసుకృతాధార వినయవాహాఖర్వా. 170

నాగబంధము - చంపకము:—

జలరుహనాభ శూలధరసారసగర్భసమేతవైభవా
సలలితరూపనీల ఖలజాలహరప్రభభూరిభోగదా
విలసితపాదశైలధరవీరవరద్విపమోహవారణా
జ్వలదరివాసఖేలకరసారశుభప్రదగీతవారణా. 171

ఛత్రబంధము - కందము:—

ధీరవరద సామరనుత, సారసనయన యెనయైనసరణి మకరహా
హారకమణిరదసురసా, సారసుదరసాతనురమసాదరవరదా. 172

స్రగ్ధర - అష్టదళపద్మబంధము:—

హారీనిష్ఠావిబల్యాద్యభినుతసమరోగ్రాఘసుశ్రీవరాహా
హారావశ్రీసుఖగ్రాహకరతిముఖతాల్యావనస్థాసురీహా
హారీసుస్థానవల్యాయతవిపినసమగ్రాటకప్రాక్షరోహా
హారోక్షప్రాకటగ్రాహ్యాసితయశసకల్యాబలిష్ఠానిరీహా. 173

చక్రబంధము - శార్దూలము:—

వక్షశ్శ్రీమణిసుప్రదీప్తమనుసేవ్యా యచ్ఛనీలాంగదా
యక్షాగోచర కన్గొనంగ మఱి భాగ్యంబబ్బె నాకిడ్డు నీ
దక్షోపాధిఁ బవిత్రుఁ జేయు మనువొంద న్నన్ననాతంకదా
దాక్షిణ్యావహగేయ నాకు దరియుం దా పొక్కఱసీవేకదా. 174

సర్వతోభద్రబంధశ్లోకము:—

నభోగోదదగోభోన, భోప్రమాక్షక్షమాప్రభో
గోమాశయాయాశమాగో, దక్షయాననయాక్షద. 175

ఆంధ్రగీర్వాణ భాషాశ్లేషకందము:—

దేవరమే లారసికా, యేవరసస్నానకమది నేననయము నీ
తావమరుస్నాకదనం, దావాలాయమనుమాట దప్పువినవయా. 176

కందద్వయరుగ్మవతీ కమలవిలసిత గర్భక్రౌంచపదవృత్తము:—

శ్రీమహిమాని శ్రేయససీమా చిరశుభకరవిలసితగుణఖేలా
సామజసంరక్షానుతసామా సరసిజభవసురసముదయపాలా
తామరసాప్రస్థానకధామా దరనినదచకితదనుసుతజాలా
తామసదూరా ధామసుధామా తరుణసజలజలధరనిభనీలా. 177

ఆపద్యములోనే గర్భకందము:—

శ్రీమహిమాని శ్రేయస, సీమా చిరశుభకరవిలసితగుణఖేలా
సామజసంరక్షానుత, సామాసరసిజభవసురసముదయపాలా. 178

ద్వితీయకందము:—

తామరసాప్రస్థానక, ధామా దరనినదచకితదనుసుతజాలా
తామసదూరా ధామసు,ధామాతరుణసజలజలధరనిభనీలా. 179

ఆపద్యములోనే గర్భరుగ్మవతీవృత్తము:—

శ్రీమహిమాని శ్రేయససీమా, సామజసంరక్షానుతసామా
తామరసాప్రస్థానకధామా, తామసదూరా ధామసుధామా. 180

ఆపద్యములో గర్భకమలవిలసితము:—

చిరశుభకరవిలసితగుణఖేలా, సరసిజభవసురసముదయపాల
దరనినదచకితదనుసుతఖేలా, తరుణసజలజలధరణిభనీలా. 181

మ. అజరుద్రాదులు మిమ్మెఱింగి నుతిసేయన్ లేరు నేనెంతవాఁ
డ జగద్రక్షణదక్ష నిన్నుఁగొనియాడ స్నిస్వభావంబు దా
సజనానుగ్రహనిష్ఠితం బగుట నాజన్మంబు సాఫల్యమం
ద జడుండంచు నిరాకరింపక ప్రసన్నుండౌట సర్వేశ్వరా. 182

చ. అని వినుతించురాజుఁ గరుణామృతశీతలదృష్టిఁజూచి యి
ట్లను మదుపాస్తిసిద్ధి ననఘాత్ముఁడవైతివి గాన వంశపా
వన నినుగారవింప నిటవచ్చితి మెచ్చితి నిచ్చితిన్ మనం
బునఁ గలకోర్కులెల్లఁ బరిపూర్ణసుఖంబున నుండు మెమ్మదిన్. 183

తే. అనుచు నిజపాంచజన్యగర్భామృతంబు, తనువుపైఁ జల్లి దోషముల్ దలఁగఁజేసి
పలికె వెండియు నాశ్రితపారిజాత, మారమాభర్త సౌమ్యకుమారుతోడ. 181

శా. వైవర్ణ్యంబు దొలంగి షోడశకళాస్వచ్ఛేందుబింబోపమ
శ్రీవర్తిల్లెడు నీదుమోము మరునాక్షేపించు సౌందర్యలీ
లావిస్ఫూర్తి యెసంగు దివ్యవనితాలాభంబు గల్గున్ సుపు
త్రావిర్భూతి ఘటించు నేలుదు వనేకాబ్దంబు లీరాజ్యమున్. 182

క. తుది ననపాయమహాసుఖ, సదనం బగుమత్పదమున సంతసమున నుం
డెద వంచు నానతిచ్చి ప్ర, మదమున వేంచేసె మరలి మాధవుఁ డంతన్. 183

శా. ఆచక్రందన మాదయారసపుఁజూపాకోమలస్మేర మా
వాచామాధురి యానిసర్గసరళత్వం బాత్మలో నెంచుచున్
భూచక్రేశ్వరుఁ డేగె నంబురుహనాభుం డాశ్రితానీకర
క్షాచింతామణిగా యటంచు సముదాశ్చర్యంబుతో వీటికిన్. 184

క. తనరాకను రాకను జంద్రునిరాకను బొంగునమృతతోయధిగతి నూ
తనశృంగారరసోన్నతి, వినుతింపఁగ నొప్పుపురి ప్రవేశించి తగన్. 185

తే. అన్నరేంద్రుండు రాజ్యభోగానుభూతి, నుల్లమున నుల్లసిల్లుచు నుండె ననుచుఁ
బలుకఁ దరువాతికథ వచఃప్రౌఢిఁ దెలుపు,మని మునీంద్రులు సంప్రీతి నడుగుటయును.

పుష్పమాలికాబంధము: చంపకము:—
శమదమధామమానస లసద్వసనావృతనూతనాతసీ
సుమసమకోమలాంగ శుచిశుభ్రశుభాకరధీరసారకీ
ర్తిమహిమ సామగేయకృతకృత్య కృపానిధి రాధికాధిపా
సమదమహోమురారిచరచక్రచరాచరవారధారణా. 187

ఖడ్గబంధము: కందము:—
వీనఘనయాన కనకన, వీనమణిస్థగితమకుట విజయోద్యోగా
గానకళాద్భుతయాగభు, గానతపదకమలసజ్జనామర్త్యనగా. 188

గోమూత్రికాబంధము: ఉత్సాహము:—
తారహారహీరభూరిధామకీర్తికారణా
చారునైల్యసాంద్రదేహజైత్రశౌర్యఖేలనా
క్రూరవారవీరవైరిగోమహార్తివారణా
మేరుతుల్యవీంద్రవాహమిత్రకార్యపాలనా. 189

గద్య. ఇది శ్రీమంగళాచల నృసింహకృపాప్రసాద సంప్రాప్త విద్యావైభవ కనుపర్తి
రామనమంత్రితనూభవ సుజనహితకృత్య నిత్య అబ్బయామాత్యప్రణీతం బయిన
కవిరాజమనోరంజనం బనుమహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము.

పంచమాశ్వాసము.



శ్రీహరినీలసముజ్జ్వల
దేహద్యుతిజాల వినతదిక్పాలచతు
ర్వ్యూహస్ఫుటలీలజగ
న్మోహన గోపాలరణితమురళీలోలా. 1

వ. అవధరింపుము సమస్తసద్గుణసాంద్రు లగుశౌనకాదిమునీంద్రులకు సామోదహృదయజలజాతుండై సూతుం డిట్లనియె నట నూర్వశీసౌగంధికగంధి యవ్వసుంధరారమణుసంబంధంబునకై సంధిల్లుప్రేమబంధంబున నంతంతకు నగ్గలించుదురంతచింతాభరపరిశ్రాంతి నెంతయు నలసి సొలసి బాహులతాద్వయావలంబితాంసభాగోభయపార్శ్వగతప్రాణసఖీయుగళాధీన శరీర యై యపాటవమాంద్యగమనంబున వనాంతరంబులఁ బరిభ్రమించుచు హృదయాంతరాళంబున ననస్తమితస్థితి నశ్రాంతప్రకాశమానంబై తపింపజేయు విప్రలంభప్రద్యోతనద్యోతంముద్యమంబువలనం గాలనిరూపణంబు దెలియక నిమేషంబులు మాసంబులుగా గ్రహింపుచు నకలంకమీనాంకబిరుదాంకగీతికలు నిశ్శంక నంకించి పొంకంబుగాఁ బలుకు చిలుక గొరువంక కోయిలమూఁకల కలకలంబుల కులుకుచు వికసితకుసుమవిసరపరిచ్యుతపరాగపటలసాంద్రస్థలంబులు నిదాఘమధ్యందినాతపతప్తసికతాతలంబులుగా నడుగిడ నలుకుచు మరందంబులకై ముసరుమిళిందమ్ముల నందమ్ముదై యమందపరిమళానందకందమ్ము లగుకెందమ్ములందనరు నరవిందాకరబృందమ్ములగు చందమ్ములం గని సధూమాంగారకుండమ్ములుగా విచారించి తొలంగుచు మరుత్పరంపరాకంపమానవిశాలరసాలసాలప్రవాళజాలలీలాఖేలనంబులు శంబరాంతకుండు శాంబరీవిడంబనంబున బహుముఖంబుల జళిపించు కౌక్షేయకవిక్షేపంబులుగాఁ దలంచి కలంగుచుఁ దిరిగి తిరిగి వింధ్యపర్వతప్రాంతంబునఁ జైత్రరథోపమానం బగునొక్కవిచిత్రోద్యానంబు చేరి భద్రోపమానస్వచ్ఛతరచ్ఛాయాతరుచ్ఛాయాతలంబునం గూర్చుండి

నిట్టూర్పులు నిగుడించుచు సాందోళితమానసయై యిట్లని వితర్కించె. 2

ఉ. ఆనరనాథచంద్రునిసమాగమసిద్ధికి నింద్రుపంపు భా
గ్యానుగుణంబుగాఁగ హృదయంబున నమ్మిటువచ్చి వానిమో
మైనను జూడనైతి నకటా నికటావృతశంబరాహితా
నూనవరూథినీకలకలోద్ధతి కెవ్విధి నోర్తు దైవమా. 3

చ. వలచితినంచుఁ బోయి జనవల్లభు నేనయి పల్కరించినం
జులకదనంబు గాదె ననుఁ జూచి యనాదరణంబు నేసినన్
నిలుచుటయెట్లు ప్రాణములు నేర్పున నాపయిఁ బ్రేమ వానికిం
గలుగఁగఁజేసి కూర్చునుపకారులు నాకిఁక నెవ్వ రక్కటా. 4

క. మనసియ్యక యలయించుసు, దనువలచినరంభనైనఁ దావలచినచోఁ
జెనఁటికినైనను వశుఁడై, చనువిచ్చును బురుషుఁ డెంతసరసుం డైనన్. 5

శా. సౌందర్యంబును యౌవనంబు సిరియున్ సారస్యమున్ వైభవా
నందంబుం గలనాయకుండు వశుఁడై నైసర్గికప్రేమయొ
ప్పం దాఁబైకొని నర్మమర్మవచనోపశ్లేషపుంభావయా
చ్ఞం దన్ వేఁడ రమింపఁగల్గుట గదా సౌఖ్యంబు వామాక్షికిన్. 6

క. సరివలపులైన కూటమి, సరసంబై సుఖమొసంగు జవ్వని కైనం
బురుషునికైనను గూరిమి, యరగొఱఁదగు కలయి కది నిరర్థక మరయన్. 7

ఉ. ఇక్కడి కేల వచ్చు జగదేకనిజాతపవారణాబ్జస
మ్యక్కిరణాపరూపితసమస్తదిగంతనృపాతపత్త్రిభుం
డక్కుసుమాస్త్రమోహనశుభాంగుఁడు వచ్చిన వచ్చుఁగాక నా
యక్కఱ వానికేటి కరుదా యొలజవ్వను లంతవానికిన్. 8

వ. అని తలంచి నిట్టూర్పు నిగిడించుచు. 9

తే. ముందు విరహాగ్నిసంతాప మందుచున్న, యపు డకారణబంధుఁడై యరుగుదెంచి
సరసహితవాక్సుధాధారఁ జల్లఁజేసి, నట్టిశుకమాళి నిఁకఁ గాంచు టెట్లొ యనుచు. 10

క. కాంచనగాత్రి తలంచిన, యించుకతడవునకు శుక మహీనాశుకమై
చంచలగరుదంచలమరు, దంచితరవమెసఁగఁ దోఁచె నంబరవీథిన్. 11

శా. రాకారమ్యనిశాకరోదయమునన్ రంజిల్లునీలోత్పలా
నీకంబుం బలెఁ దద్విలోకనసముత్సేకంబులై సాద్భుత
వ్యాకోచస్థితి నేత్రముల్ మెఱయఁగా నాళీకదంబంబు నా
శీకాభాస్యయుఁ బూర్వసౌహృదయనాళీకాంతరంగంబులన్. 12

క. ఉత్కంఠాతిశయంబుల, నుత్కంఠాభిముఖు లగుచు నుడుపోదయనం
దత్కైరవదళనయనలు, దత్కైరవరాగ మనుసుదర్శనపరతన్. 13

వ. ఉన్నంత. 14

సీ. భగవత్కథానులాపప్రసంగతఁ దనశుకనామము మహార్థశోభితముగ
వైమానికుల జెప్పవడనికన్నులు తనతనులీలఁ జూచి సార్థకమునొంద
నరవిందరాగరాగాననద్యుతి తనకరుణారసవ్యాప్తిగతి వెలుంగఁ
జాంచల్యరహితవీక్షావిలాసము తనగాంభీర్యగుణసూచకంబుగాఁగఁ

తే. జిలుకఱేఁడు నభోంతరసీమనుండి, డిగ్గి చనుదెంచి వ్రాలెఁ బటీరగంధు
లున్నవనిశాఖిశాఖపై నొఱపుమేని, పసిమిగారుడమణిపరంపరలసీన. 15

వ. అప్పుడు. 16

ఉ. పెన్నిధిఁ గన్నపేదగతిఁ బెంపున నుర్వశి హర్షసారసం
పన్నవికాసమానముఖపంకజయై తగలేచి మ్రొక్కినన్
మన్ననతో శుభం బొసఁగుమాటల దీవనలిచ్చి కెంపురా
వన్నియు మోముపుల్గు మృదువాక్ఫణితిం జెలితోడ నిట్లనున్. 17

క. నీలాలక జాలింబడ, నేలా యిఁక నీదుకోర్కె లీడేరఁగ భూ
పాలావతంస మిచటికి, వాలాయము వచ్చు మేలువాఁ డగునీకున్. 18

వ. మఱి యొకయుపాయం బెఱింగించెద సకలావయవసంపూర్ణసరససౌందర్యసౌభాగ్య
సముదారంబగునీయాకారంబు పటంబున స్ఫుటంబుగా వ్రాయించి యారూపంబప్పు
రూరవునికిన్ దృగ్గోచరం బగునట్లుచేసినం బ్రేమాంకురం బతనిహృదయంబున నుద
యంబై పూర్వానురాగనిదానం బగునాగమిష్యమాణవసంతసమయంబునన మ్మహీకాం
తుండు వనాంతరంబునకువిహారోత్సుకస్వాంతుండై యేతెంచి నిన్నుఁ గాంచి
శోభావైభవ పరాభూతచంచలంబులగుతావకదృగంచలంబులకు సహాయంబుగా
విజృంభించి జళిపించు నించువిలుతుని ఖడ్గాంచలధగద్ధగలచే సంచలితమానసుండై
నీతోడికూటమి వాటించు ననేకసమవేకసమం బగుస్నేహమోహంబులఁ గ్రీడిం
చెద రని చెదరనిమనస్తాపంబు దీఱనూఱడించి యారాజకీరంబు ముదితాముదితవా
రంబై మేఘద్వారంబుననుండిన ప్రచారంబున నరిగెఁ దదనంతరంబ శిల్పకళావిశేషం
బున వలంతియగు బొలంతియొక్కతె యన్నెలంతరూపంబు శృంగారరసానురూపకం
బుగా లిఖయించి యవ్విచిత్రపటంబు గైకొని నిజమాయాబలంబుల నెవ్వరు నెఱుంగ
కుండ నమ్మహీజానిరాజధాని యుపాంతంబున భూకాంతునివిహారస్థానం బగునుద్యా

నంబునం జేరి తదంతర్విరచితకనకమణిఖచితకేళీగృహద్వారపార్శ్వభాగమృగాంక శిలామయవితర్దికోపరిస్థలంబునకు నూతనాలంకారంబుగాఁ దదీయతపనీయకుడ్యంబా ధారంబుగా నిలిపి చనియె నంత. 19

క. వనపాలకు లప్పటముం, గని యారా యింతతీరుగల ప్రతిమల నెం
దును జూడ మీద కెవ్వరు, గొనివచ్చిరొ మదికి వెఱఁగుగొలిపెడు మిగులన్. 20

క. ఏలికకుఁ గానుకి త్తము, చాలన్ దయచేయు ననుచు సరససుగంధ
శ్రీలెసఁగు విరులు కోసి ప్ర, వాళపుటంబులను బొదివి వఱలెడువేడ్కన్. 21

తే. చిత్రపటపూర్వకముగ విచిత్రపుష్ప, పత్రపుటములు గొనివచ్చి ప్రభునిసన్ని
ధానమునఁ బెట్టి మ్రొక్కి-న దద్విలాస,మునకు నరుదంది యెక్కడి దనుచు నడుగ.

ఆ. సామి వారితోఁటలో మిద్దెముంగలి, యరఁగుమీఁద నుండె నాద కెవఁడు
దెచ్చిపెట్టినాఁడొ దేవరా యెఱుఁగము, కానరాదు వింతమానిసడుగు. 23

క. అని జాతీయపుమాటలు, తనతో నాడంగ మొగముదమ్మిఁ దదాక
ర్ణనహాస్యరసముఁ జిత్రముఁ, గనుఁగొను నద్భుతరసంబుఁ గలసివెలుంగన్. 24

వ. ఉద్యానపాలకుల నుచితవస్త్రప్రదానంబుల నాదరించి వనావనక్రియకు నాజ్ఞాపించి పనిచి క్రమ్మఱ నప్పటం బభిముఖంబుగా నునుచుకొని యద్దివ్యవిలాసినీరూపంబు సాపేక్షవీక్షణంబుల నుపలక్షింపుచు. 25

ఉ. క్రమ్మఱఁ గ్రమ్మఱ న్విభుఁడు గన్గొనుఁ దచ్చరణాంగుళప్రపా
దమ్ములు జానుజంఘలు నితంబము నాభ్యుదరావలగ్నపా
ర్శ్వమ్ములు వెన్నుఁజన్నులుఁ గరంబులుఁ గంఠము మోవిఁ జెక్కు-లా
స్యమ్మును ముక్కుఁ జూపు బొమలాచెవులా నుదు రాప్రవేణియున్. 26

ఉ. చూడఁగఁ జూడఁగా మదికిఁ జొక్కు-దవన్ భ్రమఁ జెంది నిక్కపుం
జేడియఁగాఁ దలంచి యెదఁ జేర్చుకొనం దమకించు నేలమా
టాడవు కోమలీ యని ప్రియంబునఁ బల్కుఁదలంచు నారతి
క్రీడల మంత్రవాది యొనరించిన శాంబరియందు మగ్నుఁడై. 27

వ. ఇట్లని తలంచు. 28

ఉ. ఎవ్వతెరూప మొకొ్క యిది యింతవిచిత్రవిలాసరేఖ యే
జవ్వనులందుఁ జూడ మిది చక్కఁదనంబులఁ గుమ్మ కాముచే
త్రొవ్విరితూపు రత్నములకుప్ప మెఱుంగులతేటఁ బ్రోవు హా
యవ్వనజాతలోచన నిజాకృతిఁ జూచునుపాయ మెద్దియో. 29

క. ఎవ్వనికి వలచునో యెల, జవ్వని తద్రూపలిఖితచారుపటం బె
ట్లవ్వనిఁ జేరెనొ హరుచే, నొవ్వనిమరుశక్తి యనిఁ జనుంగద దానిన్. 30

చ. అరయఁగ నాలతాంగి లిఖితాంగ మచేతనమయ్యు డెందమున్
గరఁగఁగ జేయుచున్నయది కన్గొనినంతనె హంసయానమున్
సరసమృదూక్తులుం గులుకుచల్లెడుచూపులు గల్గియొప్పు న
త్తరుణిసచేతనాంగము నెదంగదియించిన సౌఖ్య మెట్టిదో. 31

వ. అని యనేకప్రకారంబుల మదనవికారం బొదవించువిచారంబున నక్కాంతవృత్తాం
తంబు దెలియుటకై వితర్కించుచు. 32

సీ. పటముచెంత నయో సుపర్వాంగనోత్తమా యని వ్రాసియున్నదివ్యలిపివలన
క్షితిపకన్యాశ్రేష్ఠ చిత్రసంగతిపటం బునుప విచిత్రమై యుంటవలన
జనలోకశిల్పకుల్ గని నిర్జరీలేఖ యనినిశ్చయించినయందువలనఁ
బ్రాసంగికమున నారదుఁడు మున్నప్సరోజనము వర్ణించి పేర్కొనుటవలన
తే. భావిసంబంధమున కభిప్రాయమైన, తలఁపుగోలుపు ఋణానుబంధంబువలన
నతనిమదిదోఁచెఁ దచ్చిత్రితాంగలీల, యూర్వశీకాంతరూపు గానోపుననుచు. 33

క. ఏరీతినయిన నాలల, నారత్నముతోడి పొందొనర్పవలయు నం
చారాజశేఖరుఁడు మది, నారనితమి సాత్త్వికోదయముగా నుండెన్. 34

క. అంత నతాంతనితాంతల, తాంతవనాంతర్నిశాంతహరిదంతసమా
క్రాంతరవకాంతముదితా, నంతశకుంతము వసంత మాగతమయ్యెన్. 35

వసంతఋతువర్ణనము.

తే. ప్రాదళమ్ముల్ మలినాంబరమ్ము విడిచి, కట్టెఁ గెందలిరాకుచెంగావివలువ
వనరమాదేవి మాధవస్వామిరాక, కపుడు వాసకసజ్జిక యగుటఁ జేసి. 36

సీ. తలిరుజొంపము పేరఁ బులకాంకురము లూనుఁ బువ్వులపేర లేనవ్వునవ్వు
నలరుఁదేనియపేర హర్షాశ్రువులు నించు నళిపాళిపేరఁ గొప్పులవరించుఁ
బుప్పొడిపేర సొంపుగ గందవొడిపూయుఁ జిల్కపల్కులపేరఁ జెలులఁజీరు
ఫలరాజిపేర దీప్తమణిభూషలుదాల్చుఁ బరభృతధ్వనిపేరఁ బాటపాడుఁ
తే. జిరసమాగతమాధవవరసమాగ, మోదితావ్యాహతౌత్సుక్యమున వనీర
మారమణి మేలుపడినకోమలులచేష్ట, లట్టులౌఁగద ప్రాణనాయకులయెడల. 37

ఉ. నూతనపుష్పితక్రమమనోహరయావనరేఖఁ బల్లవ
వ్రాతము గూడి కొమ్మలు విరాజితలీల నెసంగున త్తఱిన్

నూతనపుష్పితక్రమమనోహరయావనరేఖఁ బల్లవ
వ్రాతముఁ గూడఁ గొమ్మలు విరాజితలీల నెసంగి రెంతయున్. 38

క. అమరె వసంతత్యాగము, లమితములై విప్రతతికి నభిమతఫలముల్
సుమహితసారాశనముల్, క్రమమున నభ్యాగతాళులకు నొనగూడన్. 39

శా. కాలజ్ఞానవచోద్విజప్రతతి వేడ్కం బుష్పవద్గణ్యన
వ్వేళం గాంచి కుహూకుహూర్తిఁ బలికెన్ వేకృష్ణపక్షస్థితిన్
లాలిత్యాకృతి యొప్ప శ్రుత్యనుగతిన్ నానావనీసీమలం
బ్రాలేయద్యుతిరేఖ నష్టమగునప్పట్లన్ యథార్థంబుగన్. 40

సీ. మాధవాగమనసంభ్రమరణత్తూర్యముల్ వనరమాకంకణక్వాణనములు
శంబరాంతకవందిజయశబ్దములు పాంథకాంతాశ్రుతిద్వయీమంతుదములు
దంపతీమానసస్తంభనమంత్రముల్ పంచమశ్రుతితంత్రిబాంధవములు
బాలికాగణనాదపౌనరుక్తములు భృంగాంగనాగీతికోపాంగకములు
తే. వల్లికానర్తకీనాట్యవాదనములు, నగశతాంగాగ్రఘంటాఘణంఘణములు
రసికమానసాహ్వానపారంపరములు, చెలఁగెఁ గలకంఠకంఠకూజితము లపుడు. 41

మ. లతకూనల్ గడుఁబెంపుమీఱి ఋతువేళాపుంరతిక్రీడ సం
తతిగల్గన్ ఫలగర్భభారములఁ జెందంబోలుఁ గాకున్న లం
బితరోలంబకదంబసీలిమము గన్పింపం గతంబేమి న
వ్యతరాంతర్మకరందదుగ్ధసుమగుచ్ఛాంచత్కుచాగ్రంబులన్. 42

ఉ. ఈచిగురాకువంటిది సుమీ తనప్రేయసిమోవి యంచునీ
పూచినమాధవీలతికపోలికగా చెలియంగమంచు నీ
రాచిలుకల్ జయించుఁగద రామవచోగతి యంచు వన్యముల్
చూచి వధూటులం దలఁచి సొక్కుచు నుందురు పాంథులత్తఱిన్. 43

సీ. తనుసుఖంబిచ్చు శీతలతరుచ్ఛాయావిశేషముల్ బాలికాశ్లేషములును
వీక్షణప్రీతిగావించు జాంబీరసమాజముల్ యువతివక్షోజములును
గర్ణపర్వమొనర్చు కలరవాదికకంఠరణితముల్ మదవతీమణితములును
ఘ్రాణతృప్తియొసంగు ఘనపుష్పసురభిసంబంధముల్ వనితాస్యగంధములును
తే. నాలుకకు నింపుపుట్టించు నవఫలరస, పూరములు యావతాధరసారములును
సరసులకు నిట్టు లవ్వనుల్ జవ్వనులును, జేయువేడ్కలు వింతలై చెల్లెనపుడు. 44

సీ. తాళీఫలస్ఫూర్తిఁ దనరెడుపీఁగుఁజన్గొండల జవజవల్ మెండుకొనఁగ
నాయముల్ గరఁగంగ నాడునర్మోక్తిహెచ్చరికల గుసగుసల్ సందడింప

నోరుచెక్కిటనటు నొక్కుచు బడిబడి నిడుచుంబనముల చప్పుడు చెలంగ
సమరతిప్రతివేగసంప్రాప్తికై చేయు సచపేటహుంకృతిస్వనము లడర
తే. వయసు గడుసుదనంబున వర్తమాన, కాలమహిమను సిగ్గుసిగ్గరితనంబు
దాల్పఁగఁ బ్రగల్భ లంగజోద్ధతి రమింపు, సొంపుమధువేళ భోగుల కింపొనర్చె. 45

శా. పన్నీటం జలకం బమర్చి చలువల్ పైఁదాల్పఁగా నిచ్చి ద
ధ్యన్నాహారము గంధలేపము విరుల్ తాంబూలముల్ సొంపుమీ
ఱ న్నవ్యవ్యజనాతపత్రచరణత్రాణాదులన్ భాగ్యసం
పన్నుల్ విప్రుల కర్చగా నొసఁగి రవ్వైశాఖమాసంబునన్. 46

వ. అట్టి వసంతకాలంబునందు. 47

చ. ఘనుఁడు పురూరవుండు త్రిజగత్పరిపూరితకీర్తి రాజ్యపా
లన మొనరింపుచుం దనతలంపున నుర్వశిచిత్రరూపభా
వనప్రతిబింబలక్ష్మియొదవంగఁ దదీయనిసర్గరూపద
ర్శనమునకై యుపాయము విచారము సేయుచునుండె నయ్యెడన్. 48

మ. ఒకనాఁ డానృపశేఖరుండు తపనీయోద్యత్సభామండపా
ధికశోభామణిభద్రపీఠమున నుద్దీప్తిన్ సుఖాసీనుఁడై
సకలామాత్యసుహృత్పురోహితవయస్యప్రౌఢవిద్వత్కవీం
ద్రకళావద్వనితాద్యనేకపరివారస్ఫూర్తి వర్తిల్లఁగన్. 49

క. పేరోలగమున నుండఁగఁ, జారులు దేశాంతరములఁ జరియించి రయం
బారఁ జనుదెంచి మ్రొక్కిన, వారల మన్నించి మనుజవల్లభుఁ డెలమిన్. 50

చారులు పురూరవునకు విచిత్రవనవృత్తాంతముం దెల్పుట.

వ. లోకవార్తావిశేషసంశ్రవణకుతూహలసూచనాలక్షణంబు లయినకటాక్షవీక్షణంబు
లం గనుంగొనిన నయ్యింగితం బెఱింగి పునఃప్రణామం బాచరించి వినయవచనచమ
త్కారు లయినచారు లిట్లని విన్నవించిరి. 51

క. భూవల్లభ కురుకోసల, సౌవీరవరాటలాటసౌరాష్ట్రకళిం
గావంతివిషయనగరీ, నీవృచ్ఛయవార్త లరసి నీసన్నిధికిన్. 52

ఉ. వచ్చితి మోనృపాలక భవత్పరిపాలనధర్మ మెట్టిదో
యెచ్చటఁ జూచినన్ బ్రజ లభీష్టపదార్థసమృద్ధిసౌఖ్యముల్
నిచ్చలు గాంచి పుణ్యము లనేకవిధంబుల నాచరింపుచున్
సచ్చరితస్థితిన్ మెలఁగుచందము కన్నులపండు వయ్యెడున్. 53

ఉ. రేయి నిగూఢవృత్తిని జరింపుచు విందుము లౌక్యవాక్యముల్
పాయక సర్వకాలమును బావనకీర్తి పురూరవుండ దా
నీయవనీతలంబునకు నేలికగావలె ధర్మశాలి జే
జే యని వేయునోళ్ల నుతిచేయనివారలు లేరు భూవరా. 54

తే. నీయశఃపుంజగగనధునీప్రపూర్తి, విగతపంకౌఘ మైనయీజగమునందు
నన్నివార్తలు మంచివై యమరుఁగాక, యితరవార్తలు గలవె నరేంద్రచంద్ర. 55

ఉ. చూచితి మొక్కవింత యొకచో జనవల్లభ చిత్తగింపు విం
ధ్యాచలమాళ్యపాంతగహనాంతరపద్ధతి వచ్చుచుండ దృ
గ్గోచరమయ్యె మాకు బహుకుందతమాలరసాలసాలజం
బూచలపత్రపూగముఖభూరుహషండము నేత్రపర్వమై. 56

శా. నానాదేశములందుఁ జూతుముగదా నారంగజంబీరజం
బూనింబామ్లకదంబకుందకదళీపున్నాగచాంపేయతా
ళీసీపక్రముకాదిపాదపలసల్లీలావనంబుల్ తదు
ద్యానశ్రీకి సమాన మౌనె యొకయింతైనన్నరేంద్రోత్తమా. 57

తే. అమరతరువుకు సంతానమనిన పేరు, నగవిభంజనుతోఁటకు నందకాఖ్య
మదనసంహరువనికిఁ గుమారసంజ్ఞ,యగుట తద్వనసంతతి యగుటనేమొ. 58

సీ. ఆశాఖ లౌన్నత్యవైశాల్యసాంద్రతాచ్ఛాదితాశాఖలు జనవరేణ్య
యాపల్లవములు మోహనమంత్రమూర్తిభవత్పల్లవంబులు వరగుణాఢ్య
యాసుమనోరాజి యామోదముదితాభ్రచరసుమనోరాజి శౌర్యధుర్య
యాలతల్ జితయౌవనారంభబాలికాజనతనూఖేలతల్ వినుతచరిత
తే. యాపరాగంబు లుత్పాదితాధ్వనీన,హృదయసుమచాపరాగంబు లింద్రవిభవ
యావనం బాశ్రయిష్ణునానావిహంగ, మృగకుటుంబావనంబు ధాత్రీకళత్ర. 59

మ. కలకంఠాంచితకంఠపంచమకుహూకారంబులుం గీరకో
మలవాచానినదంబులుం గలరవామందధ్వనుల్ శారికా
కలనాదంబులు చంచరీకచయఝుంకారంబులున్ దట్టమై
చెలఁగుం దద్వనసీమ మన్మథజయశ్రీగీతికారావమై. 60

తే. అట్టిశృంగారవనము సొంపమరఁ గాంచి, యద్భుతంబంది మఱియును నచటగల్గు
వింతలెల్లను గనుఁగొనువేడ్కఁ దద్వ,నాంతరము సొచ్చి విహరించునవసరమున. 61

క. మణిరశనాగుణకింకిణి,గణహంసకకంకణానుకరణరవంబుల్
కిణికిణికిణికుణుకుణుకుణు,ఝుణఝుణఝుణ మనుచు నొకదెసన్ వినఁబడియెన్. 62

క. విని నిలిచి మఱియుఁ నాలిం,చిన వీనుల సోఁకె నమృతశీతలమధుర
స్వనవాగ్వైఖరి వనితా,జనసంచారప్రకారసంసూచక మై. 63

వ. అట్లాలించి. 64

చ. ఇది విజనస్థలం బిచట నిట్లు మెలంగెడువారు దేవతా
సుదతులొ రాజకన్యకలొ చూచినఁ దప్పగునేమొ యంచు మా
హృదయములందు శంక జనియించిన నవ్వలఁ బోక క్రమ్మఱన్
మొదలిటి త్రోవపట్టి వనముల్ నగముల్ పురముల్ గ్రమించుచున్. 65

క. దేవరసందర్శనమున,కై వచ్చితి మనుచుఁ బలుక నవనీరమణుం
డావనము చూచువేడుక, భావంబునఁ బొడమ నటకుఁ బయనంబయ్యెన్. 66

శా. తప్తస్వర్ణసువర్ణరత్నఘృణిసాంద్రం బై మరుద్వేగవ
త్సప్తిస్ఫూర్జితమై ఘణంఘణరవాంచద్ఘంటికాబద్ధ మై
వ్యాప్తోదారవిభాగజాహితపతాకౌన్నత్యమైయొప్పు న
ద్దీప్తస్యందనమెక్కి భూషణమణీదేదీప్యమానాంగుఁ డై. 67

పురూరవుఁడు చత్రవనముం జూడనేగుట.

క. చారులు చూపుపథంబునఁ, జారుతరాటోపచతురచతురంగయుతిన్
స్ఫారి వెడలె నమ్రశిర,స్స్వారి పురూరవుఁడు వైభవాడంబరుఁ డై. 68

వ. అప్పుడు. 69

ఉ. కోమలగంధవాహ మనుకూలగతిం బ్రసరించెఁ బుణ్యకాం
తామణిపూర్ణకుంభయుగధౌతదుకూలఫలప్రసూనము
ఖ్యామలవస్తుపుంజ మెదురయ్యె సువర్ణపయోవిహంగముల్
వామదిశాగతిన్ మెలఁగె పల్లభునుల్లము పల్లవింపఁగన్. 70

వ. అట్లు చనిచని పురోభాగంబున. 71

చ. సకలధరాధురంధరభుజాభుజగేంద్రుఁ డతండు గాంచె హా
టకతటకూటకోటినికటప్రకటభ్రమరాంబుభృద్వితా
నకశకలప్రకాండకుహనాగహనద్విపయూథనిగ్రహో
త్సుకజవనోత్పతద్ధరికిశోరవిశాలము వింధ్యశైలమున్. 72

తే. కాంచి యంచితమోదవికాసమాన,మానసాంభోజుఁడై యసమానలీల
మానవేంద్రశిరోమణి మఱియు మఱియుఁ,దద్విశేషావలోకితోత్సాహమునను. 73

సీ. కరిణీకరోత్కీర్ణఝరిణీకసిక్తాభ్రచరిణీకుచోపరిచ్ఛన్నశాటి
జలజాతరాగాద్యుపలజాతమయదరీస్థలజాతతప్రభాసాంద్రమూర్తి
నటనాధిగతశిఖిస్ఫుటనాదహృదయసంఘటనార్తతాబిలంగతభుజంగి
శిఖరాంతరప్రయాయిఖరాంశుసాన్నిధ్యసుఖరంజితాబ్జినీస్ఫురితసరసి
తే. కిసలయఫలలసదసమకుసుమవిసర,సరసతరతరువిహరణపరపరభృత
నికరమధుకరకలరవశుకకులముఖ, విహగముఖరవముఖరి యవ్వింధ్యశిఖరి. 74

మ. అని వర్ణింపుచు నవ్విభుండు తదగప్రాంతాటవీపద్ధతిం
జనియెన్ మేఖలకన్యకాతటవతీసంఫుల్లసౌగంధికా
భినవాంభోజపరాగసౌరభమిళత్ప్రేంఖత్తరంగౌఘమ
గ్ననితాంతాగతశైత్యమాంద్యపవమానస్పర్శజానందుఁడై. 75

తే. ఇవ్విధంబున నవ్విభుం డేగి యెదుటఁ, గాంచె నవమల్లికావల్లికామతల్లి
కావలీనర్తనోపదేష్టాయమాన,మృదుపవనమై వెలింగెడు తదుపవనము. 76

వ. కాంచి హృదయంబున నుదయం బగువీక్షణాపేక్ష నాక్షమావల్లభుండు శతాంగావతరణంబు చేసి నిజబలంబు నచ్చట నిలువ నియమించి మృదులతరపాదుకాకీలితపదకమలుండై సమానవయస్కుండును నసమానగుణసంపన్నుండును నతిప్రియసఖుండును నగు చతురమతి యనుమంత్రితనూభవుండు తనతోడన రా నతనికరాంబుజం బవలంబనంబు చేసి భద్రదంతావళప్రతిమానయానంబున మూర్తిమంతుం డయినవసంతుం డన నయ్యుద్యానంబు ప్రవేశించి నిజాగమనోత్సాహంబున వనదేవత లుప్పరిగలపయినుండి పెల్లుగఁ జల్లులాజలచందంబున నందంబయి వృక్షాగ్రంబులనుండి పవనవిక్షేపవశంబున జలజలరాలు విరులవర్షంబునకు హర్షంబు నొందుచు మంగళగీతపఠనంబులతోఁ గర్పూరదీపికారాజి నీరాజనంబు లొసంగు కొమ్మలవిధంబునం గొమ్మలు చరత్కలకంఠవధూమధురస్వనభాస్వరంబు లయి తరళాయమానతరుణారుణపల్లవసల్లలితనిజోపశాఖాశిఖరంబు లయి కనుపట్టు నయంబునకుఁ బ్రియంబందుచు నడుగులకు మడుగులు పఱచినకరణి జరణన్యాసంబునకు నుల్లాసవికాసకరంబయి వనమేదిని మేదురంబుగాఁ గప్పి యొప్పుపుప్పొడివింతకు సంతసింపుచు మింటనంటం బెరిఁగి తఱచుగాఁ బూచిన రసాలాదిసాలంబులకొమ్మల ముసురుకొని మసలుచు రసంబులు మెసఁగు భృంగవిసరంబుల నఱ్ఱులెత్తి కనుంగొని యదభ్రశుభ్రేతరాభ్రవిభ్రమభ్రాంతి విచ్చలవిడిం బురివిచ్చి హెచ్చి మెచ్చొదవ నచ్చటచ్చట నాట్యంబులు సలుపుమయూరవారంబుల సొంపునకు నింపందుచుఁ

బరిపక్వబహువిధమధురఫలరసాహారవిశేషం బునందోఁచుకయువడి నత్యంతమాధుర్య మంజుమనోహరంబు లయినవచనరచనాచమత్కారంబుల శృంగారకథాప్రసంగం బులుసేయు కలికిచిలుకలవినోదంబునకు మోదంబు నొందుచు రతిసుందరీకందర్పుల క్రీడామందిరంబులపొందిక శ్రవణానందఝుంకరణగాంధర్వబంధురంబు లయిన మిళిందబృందమ్ములసందడి సంచలించు పరువంపువిరులగమిం దొరుఁగు నమందమక రందబిందుసందోహమ్ము సోనల నలరారు పుష్పవల్లికల మొల్లంపుటల్లికల నుల్లసిల్లు చల్లఁదనంబునం బొదలు పొదరిండ్ల యందంబునకు నానందంబు నొందుచు మఱి మఱియుఁ దద్విశేషంబులు గనుంగొని కొనియాడుచు సఖుండును దానును జనిచని ముందట. 77

ఉ. కాంచనశైలధీరుఁ డటఁ గాంచె నటత్తటకాంచనద్రుశా
ఖాంచలవాతచంచలనవాంబుజసంగితరంగమాలికా
సంచయడోలికాభ్రమణసంభ్రమలోలమరాళబాలికా
ప్రాంచితకేలికాకలితహంసము నొక్కసరోవతంసమున్. 78

క. కాంచి ప్రమోదించి నయం, బెంచి సఖునితోడ ననియె నిక్కొలను విలో
కించితె కిలికించితసుఖ,దాంచిత యగురవికి నేతదబ్జిని దినమున్. 79

సీ. ఇందిందిరాలకబృందసంపదఁ జూపి బేడిసతళుకుకన్నెలుఁ జూపి
చక్రవాకస్తనసౌభాగ్యములు చూపి యరుణోత్పలాధరస్ఫురణ చూపి
యతులమృణాలబాహావిలాసము చూపి సౌగంధికాంగవాసనలు చూపి
లీలాతరంగవళిప్రకాశత చూపి యరవిందచరణసుందరతఁ జూపి
తే. యింపు పుట్టించుచున్నది హృదయమునకు, నిక్కొలఁకు వింతచూచితివే వయస్య
కలితయౌవనరూపరేఖావిలాస, విభ్రమోదార యగుప్రౌఢవేశ్య వోలె. 80

క. కువలయపుష్కరములతో, భువనములు నిజోదరమునఁ బొలుపొందఁగ స
త్కవివచనవర్ణితం బయి, శివులీల నెఱసి సరసి చెన్నువహించెన్. 81

తే. ఇప్పయోజాకరంబున నొప్పుమీఁఱు, తమ్ములెల్లను బారిజాతమ్ములయ్యె
నరయ నిందుల జలపూర మమృతమయ్యె, నతిశయశ్లేషత స్వభావగతి వహింప. 82

క. వరవర్ణిని యగుపద్మిని, పరివృతబహుళాళి యయ్యెఁ బట్టపగ లినుక్
సరసతఁ గలసి వలపునం, బరఁగెడు గురియే వరాబ్జవాసనలింకన్. 83

ఉ. అనుచుందత్సరసీరుహాకరము డాయఁబోవఁ దత్తీరభూ
మిని నెత్తావియనంటులం దొరుఁగు నమ్మేల్కప్రపుంధాళి పైఁ

రుచిరాంగుళీవలయరేఖాలక్ష్యమాణాంఘ్రినూ
లంగనాజనవనాంతక్రీడ సూచింపుచున్. 84
రని యా, భూజాని లసద్రసాలభూజానీక
శికాంతపు,రాజగతి వసించి యున్నరాజనిభాస్యన్. 85
చంద్రకళసొంపున హారమణివ్రజంబులోఁ
కోపలము చందమునం జెలికత్తెపిండులోఁ
విలాసమున నందముగుల్కెడు సర్వశీపయో
ప్కచష్టితివిమోహితపూరుషుఁ గాంచె ముందరన్. 86
విలోలా,లోచనుఁ డయి ముందు తావిలోకించినలీ
విభవం, బీచెలువదిగా యటంచు నెంతయు వేడ్కన్. 87
భకుచయందము చందము డెందముం దమిన్
య డాయఁ జనుముచ్చట నచ్చట నిల్చి శంకతో
ంగొనఁగ నత్తఱి బిత్తరి చూచె మోముక్రొ
ల్ తళుకు నిద్దపుటద్దపుసొంపు నింపఁగన్. 88
మణుఁడు నొండొరు, సురుచిరగతి నదరిపాటఁ జూచినచూపుల్
కించి యేసిన,శరముల క్రియ మానసములు జల్లనిపించెన్. 89
యరూపాభిరాము నతనిఁ,గాంచి కాంచిలతాలంబిఘంటికాచి
గాకోటిరవ మెసంగ,సారసారంగలోలదృగ్జాల యగుచు. 90
ంకితమతిన్ శశికాంతశిలావితర్దికన్
బ్బలు నటింపఁగఁ గొను వడంక వేడ్కతో
యనన్ మొలవఁ జెంత నికుంజముచాటుకేగె స
నం జకితహంసికలీల సఖీసమేత యై. 91
ఁదుబొంకము, నడుమునొబగు వెన్నుచెన్ను నవకపుజిగి కీ
నికన్నుల, కడరించెఁ బ్రియంబు మగువ యటు మరలునెడన్. 92
టిమాటున కేగి నిలిచి,యింతచక్కనిపురుషుని నెందుఁగాన
ఁబరూరవుండే యటంచుఁ,దోఁచుచున్నది యని వాంఛతోడమఱియు.
పనికుంజాం,తరసంధులఁ గానవచ్చు ధరణీశ్వరుసుం
లోకింపుచు, మరువేదన కగ్గమగుచు మది నిట్లనియెన్. 94
కాంతి బిసరుహంబులఁగూర్చి విరచించెనో వీనిచరణయుగము
కల్ రోలంబములఁ గూర్చి కల్పించెనో వీనికచభరంబు

క్రొత్తముత్తెపునిగ్గు పుత్తడిపైఁగూర్చి చేసెనో వీనివిలాసమూర్తి
తనరుబింబమృదుత్వ మొనరఁ గెంపునఁగూర్చి కావించెనో వీనికావిమోవి
తే. యిట్లు సౌందర్యరససార మేర్చికూర్చి, తనచమత్కారమునకు నిదర్శనముగ
వీని సృజయించెఁ గాఁబోలు విశ్వగురుఁడు, గాక కల్గునె యిట్టియాకారగరిమ. 95

క. మరునిం జూడమె కుసుమా,కరునిం గనుఁగొనమె యమృతకరునిన్ నలకూ
బరునిన్ వీక్షింపమె యీ, సరసునిఁ బోలుదురె రూపసౌభాగ్యమునన్. 96

తే. అకట యిటువంటి భువనమోహనవిలాస,మూర్తి ప్రియుఁడు గానోఁచనిముద్దుగుమ్మ
చక్కఁదనమును జతురత జవ్వనంబు, నడవిఁగాసినవెన్నెలయట్లుగాదె. 97

పురూరవుం డూర్వశికడకుఁ జెలికానిబంపుట.

మ. అని యూహింపుచు నున్నచో నరవరుం డచ్చోట నాసీనుఁడై
తనమిత్రుం గని పల్కె నిట్టియతిసౌందర్యాంగి నేభూములన్
వినియుం జూచి యెఱుంగ మమ్మరుఁడు నువ్విళ్ళూరఁడే దీనిఁ జూ
చిన నిక్కోమలి వర్తనంబు దెలియం జిత్తంబునం గోరెదన్. 98

క. అనవుడుఁ బతితలఁపు మదిం, గనియంగనచంద మరసి క్రమ్మఱ నేతెం
తు ననుచు నయ్యూర్వశియు, న్ననికుంజంబునకు మంత్రినందనుఁ డరిగెన్. 99

క. అరుదెంచునతనిరాకడ, నరపాలుననుగ్రహంబునకు మూలముగాఁ
బరమామోదము నొందుచు, హరిణాక్షి బహూకరింప నాసీనుండై. 100

వ. మృదుమధురభాషణంబుల నవ్విలాసినితో నతం డిట్లనియె. 101

ఉ. ఉత్తమనాయికాగుణము లొప్పుచున్నవి నిన్నుఁ జూడ నో
మత్తమరాళయాన సురమానినివో నరభామవో ఫణా
భృత్తరుణీశిరోమణివొ యెవ్వరు నీవు నిమిత్తమేమి నీ
విత్తరుభూములందిరుగ నెయ్యది పేరు నిజంబు దెల్పుమా. 102

శా. మావృత్తాంతముఁ దెల్పెద న్వినుము రామా మానుకీయాంసపే
శీవిన్యస్తకరాబ్జుఁడై యపుడు ప్రౌఢింబొల్చి యంతంత రాఁ
గా వీక్షించితివోఁ గదా యతఁడు లోకస్తుత్యకీర్తిప్రతా
పావార్యుండు పురూరవుండు జనలోకైకాతపత్త్రుం డిలన్. 103

మ. తత్ప్రపితామహుం డఁట సుధాజలరాశి పితామహుండు రా
జత్ప్రభుఁ డైనచంద్రుఁ డఁట సౌమ్యుఁడు తండ్రఁట సంప్రదాయమే

తత్ప్రతిభన్ రచించు నఁట ధాత్రిఁ బురూరవుతోడ సాటికిన్
సత్ప్రభుతావిశేషమునఁ జర్చలు సేయఁగ నెవ్వ రంగనా. 104

సీ. ధరణీశునకుఁ బట్టుధవళాతపత్త్రంబు నీడకు లోనుగా నిలుచుచనువు
రాజుఁగూర్చుండెడి రత్నసింహాసనం బొరసి చెయ్యానుక యుండుచనువు
జననాథునకు వీచుచామరంబుల గాడ్పు తుదలు మైఁ బొలయంగఁ గదియుచనువు
నధిపుతో నేకాంత మాడువారల విన్నపముల కౌఁగాదని పలుకుచనువుఁ

తే. గలిగి వర్తింతు నెప్పుడు గారవమున, రాజరాజైన యప్పురూరవుని మ్రోల
ననుఁగుఁజెలికాఁడ నెంతయు నతని కేను, జతురమతి యంద్రు నా పేరు చంద్రవదన.

తే. అమ్మహారాజుసఖ్యసౌఖ్యానుభూతి, గల్గు టెవ్వారికైన భాగ్యమునఁ జుమ్ము
మనసుగలవారి కతనిసంబంధ మేను, ఘటనసేయంగఁ జాలుదుఁ గమలవదన. 106

వ. అని పలుకుచున్నంత. 107

చ. హృదయము ఝల్లుఝల్లు మనియెం బులకాంకురపాళి నెమ్మెయిం
బొదలెఁ బ్రమోదబాష్పజలపూరము కన్నులనిండె నార్ద్రసం
పద వహించెఁ గంతువిడి పట్టు పురూరవురాకఁ దెల్పు త
న్మృదువచనాక్షరంబు లెలమిం జెవి సోఁకినయంత నింతికిన్. 108

తే. అట్లు రాగప్రవాహమగ్నాంతరంగ, యగుచు మందాక్షసంకుచితావలోక
నాంచలంబుల నిజవయస్యాలలామ, చూడఁ దద్భావ మెఱిఁగి యాప్రోడవనిత. 109

వ. అమ్మంత్రికుమారునితో ని ట్లనియె. 110

సీ. అనఘాత్ముఁ డైన నారాయణయోగీంద్రునూరుదేశంబున నుద్భవిల్లె
సకలకళ్యాణభాజన మై వెలింగెడు నమరావతీస్థలి నధివసించెఁ
బ్రౌఢిగాంధర్వాప్సరఃకళావతులకు నాయకురాలితనంబు గాంచె
నృత్యసంగీతసాహిత్యపాండిత్యాప్తి మేటివేల్పులచేత మెప్పువడసె

తే. నుర్వశియనంగ నొప్పు నీయుత్పలాక్షి, యరయ నీయింతిచెలికత్తియలము మేము
ధారుణీస్థలి నొకనిమిత్తమున నిట్లు, సంచరింపంగవలసె నీచంద్రముఖికి. 111

చ. విను మిఁక దాఁపనేల నయవిశ్రుతుఁడైన పురూరవక్షితీ
శునిగుణముల్ జగజ్జనవచోరచనశ్రుతిరంజనంబుగా
విని విని దర్శనంబునకు వేడుకనొందుచు నున్నమాఘన
స్తని కతఁ డిందు వచ్చుట నిదానముగాదె యభీష్టసిద్ధికిన్. 112

క. అని సాభిప్రాయంబుగ, వనజానన పలుక మనుజవరు విహృతినెపం
బున నిక్కుంజసమీపం, బునకుం గొనివత్తు వినయమునఁ గనుఁగొనుఁడీ. 113

క. ఇయ్యంతి కోర్కె సఫలం, బయ్యెడు నని యనునయించి యధిపతి కడకుం
జయ్యన నరిగి మృదూక్తులఁ, దొయ్యలివృత్తాంత మతనితోఁ జెప్పుటయున్. 114

ఉ. ఆపలుకుల్ సుధారససమంచితసారములై చెవుల్ సొరన్
భూపతి యాత్మహర్షరసపూర్తికి నేమనవచ్చుఁ బూర్వసం
తాపదశాకృశశ్లథకనత్కటకాంగదముద్రికాదిర
త్నోపలభూష లంగములయుబ్బునఁ బొల్చెను బిక్కటంబులై. 11

తే. ఉల్లమునకు నిండారులై వెల్లివిరియఁ, బొందునానందరసవార్ధిబుద్బుదంబు
లనఁగ దట్టంబులై పులకాంకురంబు, లవయవంబులఁ బొడమంగ నవ్విభుండు. 11

మ. చిరకాలంబుననుండియున్ హృదయరాజీవాంతరాళంబునన్
హరిజుం డేసినచిల్కుటమ్ముగతి సమ్యక్కీలితం బైన ని
ర్జరబింబోకవతీలలామవిషయేచ్ఛాబద్ధసంకల్ప మీ
శ్వరుఁ డీడేర్పఁ దలంచె నేఁటి కనుచున్ సన్మిత్రుతో నిట్లనున్. 1

ఉ. ఈచపలాక్షిరూపము సుమీ మునుచిత్రపటంబునందు నేఁ
జూచి విరాళినొందుట కిశోరమృగేక్షణ యీలతాంగి దృ
గ్గోచరమయ్యె నిచ్చట నకుంఠితభాగ్యగతిన్ విలంబమే
లా చతురత్వ మేర్పడ విలాసినిపొందు ఘటింపఁజేయుమా.]

వ. అనినం జతురమతి యమ్మహీపతి కి ట్లనియె.

మ. జగతీనాథకులావతంస వినుమా సంకల్పసిద్ధుండ వీ
వగుటన్ నీదుమనోరథంబు సఫలం బౌ సంశయం బేల బా
ళిగ నిచ్చోఁ గలవింతలెల్లఁ గనుపోల్కన్ దత్సమీపంబునం
దగురీతిన్ విహరింపుచుండ నవలా తానే నినుంజేరెడున్.

చ. అనవుడు సంతసించి మనుజాధిపుఁ డాప్తసహాయుఁడై బుగు
ల్కొనియెడు తావులం బొలుచు క్రొవ్విరితేనియ లాని ఝుంకృతి
ధ్వను లొనరించుతుమ్మెదకదంబముచేఁ జెలువొందుపూఁబొదల్
గనుఁగొనుచు న్నిలింపగణికాస్థితకుంజముచెంత కేగినన్.
సిగ్గును వేడ్కయున్ బెరసి చీఁకటివెన్నెలలై మొగంబులోఁ
జగ్గొకవింతసేయ నృపుసన్నిధి నొఁదలవాంచి నీకుఁ దా
మొగ్గితి నంచుఁ దెల్పుగతి మ్రొక్కె లతాంగి పతాకయుగ్మస
మ్యగ్గరుడోపలాంకవలయాంకితహస్తఘటల్లలాట యై.

వ. అప్పుడు. 123

చ. పొలతుకగుబ్బచన్నుఁగవపొంగున కయ్యెద చాలదయ్యెఁ దో
య్యలికనుదోయివిప్పునకు నాననబింబము చాలదయ్యె న
వ్వెలఁదిదరస్మితామృతపువెల్లికిఁ జెక్కులు చాలవయ్యె నా
చెలియనురాగ మెంతయని చెప్పుదు నాథునిఁ గాంచునయ్యెడన్. 124

సీ. నయనోత్పలముల కానంద మబ్బెనెకదా యాస్యాబ్జమునకు వైకాస్య మొదవె
హర్షాశ్రుహిమపూర మగ్గలించెనె కదా కచతమంబునకు శృంగార మొదవె
తనువల్లికకుఁ జల్లఁదన మబ్బెనేకద్దా కుచకోకములకుఁ బైకొనియె నుబ్బు
పులకాంకురంబులు పొరలి పాఱెనెకదా చెక్కుటద్దములకు జిగిరహించె

తే. నిష్కళంకకళాపూర్ణనృపతిచంద్ర, దర్శనవిశేషమున సముత్సాహరసత
రంగితము లయ్యె నతివసర్వాంగకముల, పూర్వమైత్రి ఘటించు టద్భుత మనంగ.

వ. అప్పు డవ్విభుం డవ్విలాసిని విలాసవిశేషంబున కద్భుతం బందుచు డెందంబున
ని ట్లని తలంచె. 126

తే. అతివకనుదమ్ము లింతిముఖారవింద, మతివహస్తాంబుజములు తన్వంగిచరణ
కంజములు కొమ్మ నెమ్మేనికమలసురభి, చాటుచున్నవి పద్మినీజాతియగుట. 127

సీ. సరసీరుహము లోకచక్షుర్హితోదార మని మొగంబునుబోలు ననఁగఁ దగునె
జక్కవల్ రాజితాచలచిత్రపత్రంబు లని చన్నుఁగవఁబోలు ననఁగఁ దగునె
యవనీతలంబు రత్నాకరమేఖల మని పిఱుందును బోలు ననఁగఁ దగునె
పికములు మాధవప్రియమంజులరవంబు లని పల్కులను బోలు ననఁగఁ దగునె

తే. సోమునకు నోడి దోషాప్తి జోడుపీడి, చక్రఘాటి నణంగి ప్రశస్తవర్ణ
సంపదఁ దొఱంగి యివి యెట్లు సాటివచ్చుఁ, గంబుకంఠిమనోజ్ఞాంగకంబులకును.

ఉ. ఏమితపంబుఁ జేసెనొ సుమీ యళు లిచ్చెలికేశబంధ మై
తా ముదయించినందుకు నిదర్శనమాఁగద సుప్రసూనపుం
ఖామలగంధబంధురరసాతిశయానుభవంబు గల్గునే
కా మఱి పూర్వజన్మమునఁ గల్గినవృత్తి భవాంతరంబునన్. 129

ఉ. దూరపుఁబొందులన్ సుఖము దోఁపక పుష్పరసంబు పేరఁ గ
న్నీరిడుచున్న యక్కుముదినిం గరుణించి లతాంగిముద్దుమో
మై రహిఁదాల్చి చంద్రుఁ డెద నంటఁగఁ జేర్చిన సానురక్తి నిం
పారెడు శోణకోణరుచిరాయతనేత్రయుగచ్ఛలంబునన్. 130

తే. అతివనునుగౌనదృశ్యవశ్యాదికళలఁ, దనరి మృగరాజజయలీలఁ దగిలియున్న
సుందరతనొంది పెంపు మిన్నంది యట్లు, లేమిచే ముష్టిపట్టుట కేమిగతమొ. 131

క. కనఁబడునఁట సగుణస్థితిఁ, గనరాదఁట నిర్గుణాప్తిఁ గలదో లేదో
కనకాంగినడుముపోలిక, యెనయఁ జిదంబరరహస్య మెవ్వఁ డెఱుంగున్. 132

వ. అని తలంపుచు మోహావేశంబున. 133

క. అపు డయ్యింతిం గనుఁగొని, యపరిమితానందహృదయుఁ డై యి ట్లనియెన్
గపురంపుఁజలువపలుకులు, చపలాంబకవీనులకు రసాయనములుగాన్. 134

సీ. ఉవిద నీకొప్పు నీలోత్పలంబులగుంపు భామ నీకన్నులు పంకజములు
లలన నీనాస తిలప్రసూనము మధూకములు నీచెక్కిళ్లు కమలగంధి
తెఱవ నీముద్దువాతెఱ పాటలము మల్లెమొగ్గలు నీదంతములు మృగాక్షి
వెలఁది నీపాలిండ్లు విరిచెండ్లు బంధూకములు నీకరంబులు ముద్దుగుమ్మ
తే. నెలఁత నీమేను సంపెంగ నీపదములు, హల్లకము లింతి సుమనోలతాంగి నిన్నుఁ
బుష్పగమి చేత నిర్మించెఁ బో విధాత, చాన నీపొందు పుష్పపూజాఫలంబు. 135

సీ. కులుకువెన్నెలనవ్వు చిలుకు చెక్కిళ్లకుఁ దళుకుముత్యంపుఁ గమ్మలమెఱుంగు
కెంపుసంపద పెంపు నింపు లేమోవికి వీటికారసరాగవిభ్రమంబు
ఖంజనప్రతిమానరంజనం బగుచూడ్కి కంజనరేఖాసమాశ్రయంబు
మురిపెంపుసంపెంగ విరిపెంపుగలమేని కమలకాంచనదుకూలానుభూతి
తే. గలిగినైసర్గికమున నుత్కర్ష మెసఁగ, వెలఁది నీరూపుచూడ్కికి విందులొసఁగెఁ
గలిమిగలచోట మఱియును గలిమి గలుగు, ననినజనవాక్యమునకు దృష్టాంతముగను.

సీ. చంద్రసారమె గాదు చంద్రసారముఁ గూర్చి చేసెఁ గాఁబోలు నీచిన్నినవ్వు
కమలలీలయ కాదు కమలలీలయుఁ గూర్చి కల్పింపఁబోలు నీకన్నుదోయి
సరసహేమమె కాదు సరసహేమముఁ గూర్చి విరచింపఁబోలు నీవిమలమూర్తి
సత్ప్రవాళమె కాదు సత్ప్రవాళముఁ గూర్చి యొనరింపఁబోలు నీయోష్ఠబింబ
తే. మంబురుహసూతి సృజనకాలంబునందుఁ, గాక యిట్టియదృష్టపూర్వైకమోహ
నాంగసౌభాగ్యమమర నరాహిరాజ, కన్యలకుఁ గల్గనేర్చునె కమలవదన. 137

సీ. వనిత నీచూపులవాఁడికి నోడి మన్మథమార్గణములు సూనంబులయ్యె
సుదతి నీచిఱునవ్వుసొగసున కోడి వెన్నెల కౌముదీవచనీయమయ్యె
లలన నీస్వనమంజులతకు నోడి పికస్వనంబులు పంచమత్వంబు నొందె
యువతి నీనడకల కోడి హంసీపదన్యాసమౌదాసీన్య మనుభవించె

తే. నిట్లు నీచక్కఁదనముతో నీడుగాక, పరిభవమునొంది యున్న శంబరవిరోధి
సాయకాదులు నన్నేమిసేయఁజాలు, నింక నీదయ గలిగిన నిందువదన. 138

క. అనుమాన మేల నిఁక నే, నినుమానఁగఁజాల నీవు నెఱజాణవు పై
కొనుమా ననుఁ జల్లఁగఁ గను, గొను మాననకమల మెత్తి కువలయనయనా. 139

వ. అని పలికిన. 140

క. కనుఁగవమెఱుఁగులు గ్రక్కఁ, న్ననజానన ఱెప్పలెత్తి వరుఁ జూచె జరీ
లున మరుఁ డోఱవెఱికి తళు, క్కనఁ గా జళిపించుచంద్రహాస మనంగన్. 141

వ. ఇట్లు కనుంగొని. 142

ఉ. రాజనిభాస్య పల్కె నలరాజకుమారకుమారుతోడ నో
రాజకుమార ముందు సురరాజకుమారకుఁ జూతు వాహినీ
గ్రాజకుమారుఁ జూతు ధనరాజకుమారునిఁ జూతుఁ గాని నీ
రాజదలేఖ్యమూర్తి సరిరా జగమందు వసింప రెవ్వరున్. 143

శా. నీలావణ్యము నీగుణాతిశయము న్నీభావము న్నీవచో
లాలిత్యంబును నీప్రతాపమును జాలన్ విన్నదానన్ మరు
త్పాలాస్థానమునందు నారదుఁడు దెల్పన్ మోహవిభ్రాంతనై
భూలోకేశ్వర నాఁటనుండియును నీపొందాత్మలోఁ గోరుచున్. 144

మ. వినుమయ్యింద్రునిపంపున న్మునితపోవిఘ్నార్థమైవచ్చి ని
న్ననుఁగోనె ట్లొనఁగూడునో యనుచుఁ గాంక్షన్ దైవము న్వేఁడుకొం
చు నిమేషం బొక యేఁడుగాఁ గడపుచున్ క్షోణీశ యీ కైవడి
న్వనవాసంబులు సేయునాకు నినుఁ గానంగల్గె భాగ్యంబునన్. 145

చ. విరహమునం గృశింపుచును వెన్నెలయెండలనెండి కంతుపూ
శరములవానలం దడిసి చందనశైలపుఁజల్లగాడ్పుని
బ్బరపువడన్ శ్రమంపడి తపం బొనరించుచు నున్నదాన నో
నరవర నీకునై యిటలు నావల పే మని యింకఁ దెల్పుదున్. 146

వ. అని మఱియును. 147

మ. హృదయేశా ననుఁ జూడు నీకొఱకు నే నిట్లైతి నంచున్ సగ
ద్గదదీనోక్తులచేఁ గపోలఫలకాంతా శ్రూరుబిందుచ్ఛటల్
వదనగ్లాని యొసంగ నుస్సురనుచున్ వామాక్షి చూపెన్ మనో
జదశాయాసకృశాంగవల్లి పలికెన్ సమ్మోహముం జేయుచున్. 148

వ. అప్పు డప్పడంతిం జూచి యతండు రాగరసమగ్నుం డగుచు నిట్లనియె. 149

ఉ. నీమొగ మేను నామొగము నీవు నెఱుంగకముందు ముందుగా
నేమి ఋణానుబంధమొ సుమీ సరిమోహము లగ్గలించె నో
హేమలతాంగి యింక మఱి యేటికి నమ్మిక మాట పల్కెదం
గాముఁడు సాక్షిగాఁగఁ గలకాలముఁ గూడి సుఖింత మింపుగన్. 150

క. నావుడు సంతసమంది క, ళావతి యిట్లనియె నోయిలావల్లభ మ
ద్భావంబున కనుకూలుఁడ, వై వర్తింపంగవలయు నది విను మనుచున్. 151

క. వేడుకకై తాఁ బెంచిన, జోడుతగళ్లను సువర్ణసూత్రాంచితఘుం
టాడోలనఘణఘణనిన, దాడంబరకంధరంబు లై తగువానిన్. 152

వ. చెలికత్తియలచేతఁ దెప్పించి యప్పతికిఁ జూపి యి ట్లనియె. 153

మ. అవనీనాయక పీనిదుష్టమృగచోరాద్యాపదల్ పొందనీ
క విమర్శింపుచు నెల్లప్రొద్దు వయతోఁ గాపాడుచుండన్ వివ
స్త్రవికారస్థితి లేక నాకడ వసించన్ మాటపట్టిచ్చెదే
ని వినోదంబుల జోడువాయ కెపుడున్ నీతోడఁ గ్రీడించెదన్. 154

పురూరవుఁ డూర్వశిని నిజపురంబునకుఁ దెచ్చుట.

తే. అనుచు సమయంబుచేసె న ట్లాలతాంగి, వనితల తలంపు లెఱుఁగ నెవ్వరివశంబు
జనపతియు నట్లకా యని సమ్మతించె, వనజముఖులకుఁ బురుషులు వశులుగారె. 155

వ. ఇ ట్లన్యోన్యస్నేహానుగుణంబు లగుమాటల నాడుకొనిన యనంతరంబ యమ్మహీ
కాంతుం డక్కాంతం దోడ్కొని పురంబున కరుగుతలంపున మరలి వనంబు వెలు
వడి నిజబలంబులం గలుపుకొని యూర్వశీసహితంబుగాఁ గనకరథారూఢుం డయి రో
హిణీయుక్తుం డగుచంద్రుండునుం బోలె మహేంద్రవైభవంబున రాజధానికిం జని
సామంతసచివప్రముఖపరిజనంబులఁ దగురీతి బహూకరించి తత్తద్గృహంబుల కనిపి
నిజనికేతనంబు ప్రవేశించి యుండె నప్పుడు పరిచారికాజనంబులు తత్సమయోచి
తంబు లయినరాజోపచారంబులు సేయుచుండి రయ్యెడ. 156

ఉ. కంకణనిక్వణంబు ఘులుఘుల్లున మ్రోయఁ గపోలపాళితా
టంకరుచు ల్వెలుంగ నుదుటం జెఱుచెమ్మట గ్రమ్మ హారముల్
కుంకుమగంధపుస్వలపు గుబ్బలపై నటియింప నొక్కయే
ణాంకనిభాస్య భూపతికి నంటె సుగంధపునూనె యత్తఱిన్. 157

చ. మగువకరాబ్జతాండవచమత్కృతిచేఁ దలయంటుచున్నచో
సొగసగు నూర్పుతావి పయిసోఁకినఁ గంకణనాదఝంకృతిన్
మొగమనుతమ్మికిన్ వలచి ముక్కునుసంపెఁగ మొగ్గ కల్కిపై
కెగయుచు వ్రాలుచుండె మనుజేంద్రుని పెన్నెఱిగుంపుఁదుమ్మెదల్. 158

మ. పరఁగన్ భూవిభుమేన నల్గిడి తలం బ్రామెన్ సుగంధద్రవం
బరవిందాస్య నతానతాగ్ర కుచకుంభాలోలహారావళుల్
స్మరసామ్రాజ్యపదాభిషేకమునకుం బైపంచు బంగారుగిం
డ్లరహిం జాఱుసుధాసుధారలన లీలాఖేలనమ్రాంగి యై. 159

తే. కదిసి జలకంబువోసి రక్కాంతినిధికిఁ, గామినులు కమ్రకరకంజకలితకనక
కాచకంకణకమనీయకలరవంబు, కర్ణహితముగఁ గాంచనకలశములను. 160

సీ. తడియొత్తె నొక్కసుందరి రాజమౌళికి లాలితధౌతదుకూలమునను
కట్ట నొసంగె నొక్కలతాంగి యధిపతి కసమానమృదులదివ్యాంబరంబు
సిగవైచె నొక్కరాజీవాక్షి విభునకు వికచప్రసూనమాలికలు చుట్టి
ధూపం బిడియె నొక్కతొయ్యలి నృపునకుఁ జందనాగరురజస్సారమునను

తే. దిద్దె నుదుటను గస్తూరితిలక మొకతె, యలఁదె నొక్కతె నెమ్మేన మలయజంబు
వీవన ధరించి చల్లఁగా విసరె నొకతె, చంద్రవంశాబ్ధిసంపూర్ణచంద్రునకును. 161

వ. తదనంతరంబ. 162

సీ. గారెలు బూరెలు కండమండెంగ లప్పంబులు మొదలైనభక్ష్యములును
సరసాన్నమును బాయసమ్ము సూపము శాకములు మొదలైనట్టి భోజ్యములును
పడిదెంబు లానవాల్ పరిపక్వఫలములు సురసముల్ మొదలైన చోష్యములును
బహువిధంబుల నొప్పు పచ్చళ్లు తేనియల్సిగరులు మొదలైన లేహ్యములును

తే. నారికేళోదకంబు పానకము చల్ల, నీరు మొదలైన యట్టిపానీయములును
ననఁగ బేరైనపంచపదార్థములును, భూరమణుఁ డిష్టసహితుఁడై యారగించె. 163

ఉ. కారపుఁగూరలున్ మిగులఁ గాఁగినచారులు నెయ్యిపప్పు పొం
గారినయానవాలు పరమాన్నము కమ్మనిపిండివంట క
ర్పూరమువంటి నెయ్యి కడుఁ బొత్తిగవార్చిన యన్న ముప్పునన్
గూరిన యల్లమావుపెరుఁగున్ భుజియించె నృపాలుఁ డయ్యెడన్. 164

తే. ఉప్పు పులుసు తీపి యొగరు కారము చేఁదు, ననఁగఁ దగినరసము లాఱునుల్బ
ణముల నుల్బణములు సమములు నగుపదార్థముల భోజనంబు ప్రహితమయ్యె.

వ. భోజనాంతరంబున. 166

తే. పండుటాకులు కపురంపుబాగములును, ముత్తియపుసున్నము లవంగములును నేల
కులును జాపత్రియూనిగాఁగూర్చి యపుడు, జనవిభుఁడొనర్చెఁదాంబూలచర్వణంబు.

సీ. నవరత్నఖచితమైన కిరీటమాణిముత్యములచౌకట్లుకుందనపుఁజిలుక
తాళితోసరిపెసల్ తారహారములు పచ్చలభుజకీర్తులు జాతికెంపు
రవలతాయెతులు వజ్రపుఁగంకణములు మెఱుంగులరాకట్టుటుంగరములు
ధగధగల్గులుకు నండంపుమేఖల ఘలుఘలుమ్రోయునందె లంగకములందు

తే. వెలుఁగఁ గటితటి సిద్దంపువలువగట్టి, తగటుదుప్పటి వలెవాటు దనరవిరుల
సరులు మైపూఁతగందంబు పరిమళింప, ధరణివిభుఁడొప్పె నూత్నకందర్పుఁ డనఁగ.

వ. ఇవ్విధంబున నవ్విభుండు సకలాలంకారమనోహరాకారుండై క్రీడామందిరంబునఁ
బీఠమర్దకవిటవిదూషకప్రముఖప్రియజనంబులతో నిష్టగోష్ఠీవినోదంబులంబ్రొద్దు
పుచ్చుచు నుర్వశీసంభోగాపేక్ష క్షపాకాలంబునకై నిరీక్షింపుచుండె నయ్యుర్వ
శియు శుద్ధాంతమందిరంబున సఖీసహస్రసంసేవితయై మజ్జనభోజనాదు లనుభవిం
పుచు గంధపుష్ప దుకూలాభరణాద్యనుభవంబుల నుల్లాసవికాసమానయగుచుఁ
బురూరవస్సమాగమోత్కంఠ నిమిషంబులు యుగంబులుగాఁ గ్రమింపుచుండె
నప్పుడు. 169

సూర్యాస్తమయాదివర్ణనము.

చ. అపరమితోన్నతం బగుబలాఢ్యుహజారపుపైఁడిమేడపై
విపులసరోజరాగమయవిస్ఫుటహాటకకుంభమోయనన్
అపరధరాధరేంద్రశిఖరాగ్రతలంబు నలంకరించెఁ దా
నపుడు పతంగబింబము జపారుణకాంతిరమావిడంబమై. 170

తే. అస్తమయవేళ నినునియం దాత్మలీల, నావహించిన శ్రీవాసుదేవమూర్తి
ఱొమ్ముకౌస్తుభరుచులు పైఁగ్రమ్మినట్లు, సూర్యబింబంబు బంధూకశోణమయ్యె. 171

సీ. వరుణశుద్ధాంతయావ్వతచారుసీమంతసిందూరరజముతోఁ జెలిమిచేసి
వనధిరాజోద్యానవనవాటికాతరుకిసలయశ్రేణితోఁ గ్రీడసల్పి
పాశభృత్కేళికాపద్మాకరోత్ఫుల్లహల్లకవ్రజముతో నసఁగిపెనఁగి
ప్రాచేతసోజ్జ్వలప్రాసాదములఁబొల్చుకురువిందమణులతో సరసమాడి

తే. నిండుకొనియె సమస్తదిఙ్మండలమున, సాంధ్యరాగంబు తాండవసంభ్రమభ్ర
మన్మహానటపటుజటామకుటఘటిత, ఫణిఫణామణిగణఘృణిప్రచుర మనఁగ. 172

ఉ. తమ్మి నయమ్ము దప్పఁ గుముదమ్ము ముదమ్మున నొప్పఁ జక్రవా
కమ్ములు జోడువిప్పఁ దమకమ్మునఁ బొంఘులపై మరుండు పూ
టమ్ములు గుప్పఁ జీఁకటి భయమ్ముగ దిక్కులఁ గప్ప భాస్కరుం
డమ్మెయి నస్తమించె నుదయమ్మయి మించె నుడుప్రభావళుల్. 173

సీ. కల్పించెఁబో నీలకైరవమాల్యసంబంధముల్ ధమ్మిల్లబంధములను
విరచించెఁబో మనోహరకురంగీమదతిలకముల్ వరఫాలఫలకములకుఁ
గలిగించెఁబో నీటుకాటుకరేఖలయందము నయనారవిందములకుఁ
గదియించెఁబో లసత్కాలాగురువిలేపయోగముల్ ఘనకుచాభోగములకుఁ

తే. జేసెఁబో నీలివన్నియచీరముసుఁగు, వేయునదుపాయములు మృదుకాయములకు
నంధకారంబకారణబంధు వగుచు, జారులను జేరఁ జనునభిసారికలకు. 174

క. తమిమించె నంతకంతకుఁ, దమిమించెను చిన్నవయసుదంపతులమదిఙ్
దమకింపుగఁ గలయుటకై, దమకింపుచు మరుఁడు సేయుతహతహవలనన్. 175

తే. అరికి నరియయ్యె నవ్వేళ నదియుచితము, గాక తమ్ములకహితమ్ముగాఁగ మిత్త్రు
నకును మిత్త్రత గాఁగఁ దానడచె నెట్టి, తగవు దోషాఖ్యవర్తించుఁ దామసులకు. 176

మ. సమయాధోరణశేఖరుండు తిమిరస్తంబేరమోత్తంసముం
బ్రమదంబారఁగ నిల్పి సాంద్రతరతారావారముక్తామణీ
సముదీర్ణస్థితి నొప్పువిష్ణుపదపుఙ్ జాడోలు పైనెత్త వే
గమె వాహ్యాళికి వెల్వడం గల శశాంకస్వామికిఙ్ ముందటన్. 177

క. పాండిమముదోఁచె నైందవ, మండలధరగర్భభరసమంచిత యగునా
ఖండలదిగ్భామినిముఖ, మండలమున లోధ్రకుసుమమాలాద్యుతియై. 178

తే. ఉదయపర్వతసంగతి నొప్పి ధవళ, కిరణబింబము నైజరక్తిమ వహించె
నాత్మనిర్లిప్తుఁ డయ్యు దేహాప్తివలనఁ, గర్మఫలభోక్తవలెఁ దోఁచుకరణిగాఁగ. 179

చ. చలువవెలుంగు వేల్పులరసాయనపుందొన పాలవెల్లిలో
మొలచినముద్దుపాపఁడు కుముద్వతివేడుకకాఁడు తమ్మిలోఁ
గిలిగలచంద్రబింబముఖికిఙ్ సయిదోడు చకోరభోజనం
బులనెఱదాత చందురుఁడు పూర్వదిశాస్థలి నొప్పె నయ్యెడన్. 180

తే. అంతకంతకు రాగంబు నపనయించి, శుచివహించి సత్సంగతి సొంపుగాంచి
విష్ణుపదమాశ్రయించి యాద్విజవిభుండు, సుగతి గైకొని జగములు పొగడఁదనరె.

సీ. కకుబంతకుడ్యభాగములపైఁ బ్రసరించి పాలసున్నపుగచ్చుపగిదిఁ దనరి
చంద్రకాంతగ్రావచయముపైఁ బ్రసరించి సెలయేటిజాలు వెంపొలయఁజేసి
క్రీడించువిటవిటీశ్రేణిపైఁ బ్రసరించి రతిహెచ్చరికమందు రహివహించి
యలచకోరంపుగుంపులమీఁదఁ బ్రసరించి యాఁకటిపంటకొల్చై యొసంగి
తే. భువనహితచారుచంద్రికల్ భూనభోంత,రాళమున నిండుకొనియె హేరాళముగను
హారహీరతుషారమందారగంధ, సారఘనసారధవళవిస్తార మగుచు. 182

క. చూపట్టె నిర్మలజ్యో, త్స్నాపూరిత మగుచు భువన మంతయు సర్వ
వ్యాపకుఁడు శంభుఁ డనియెడి, యాపలుకవ్వేళ దృష్టమయినవిధమునన్. 183

శా. మార్తాండౌషధసేవచేతను జగన్మర్త్యుండు ప్రాలేయశీ
తార్తింబాసి తదీయవైకృతివిదాహం బొందఁ దద్బాధని
ర్వర్తింపం గ్రియచేసె యుక్తిచెలువారం బూర్ణచంద్రోదయ
స్ఫూర్తిం గాలభిషగ్వరుండు పయిపై జ్యోత్స్నారుచుల్ దేరఁగన్. 184

ఉ. కూరిమిసెచ్చెలుల్ సొగసుగుల్కెడుగిన్నెల నించి చెంతలం
జేరి యొసంగ ఘల్లుమని చేతులకంకణనాద మొప్ప నొ
య్యారముతోడ నందుకొని యోష్ఠపుటంబులఁ బీల్చికొంచు హా
లారసపానలీలలఁ జెలంగిరి వారలతాంగు లయ్యెడన్. 185

ఉ. కారణమేమిలేకయె వికావికనవ్వును నిర్ణిమిత్తమె
వ్వారలనైన నుం బిలిచి వాదుకుఁబోవు నిరర్థకంపుహుం
కారముతోఁ జెలంగు సరికన్నుబొమల్ ముడివెట్టు పట్టియా
స్వైరము సేయు సీధురసవిభ్రమయైనమృగాక్షి యత్తఱిన్. 186

సీ. ఒకటాడఁబోయి వేఱొకటాడు మాటలుఁ బదములఁదొట్రుపా టొదవు నడలు
సొక్కుచూపులకెంపు సొంపారు కన్నులు మదఘూర్ణితములైన మానసములుఁ
జనుదోయిగన్పడ జాఱుపయ్యెదకొంగు లలికంబులకువ్రాలు నలకచయము
శ్రమబిందువులచేఁ గరంగుకస్తురిబొట్టు లవశతదూఁగాడునంగలతలుఁ
తే. గలిగి మధుపానజనితవికారపార,వశ్యలాలసగాత్రలై వేశ్య లపుడు
విటులభావంబులకు నొకవింత వెడ్క, యొసఁగఁగాఁ జేసి రన్నిశావసరమునను. 187

సీ. బతిమాలినను బయల్పడనీనియంగముల్ సొరిది ముచ్చటదీఱఁ జూచిచూచి
ప్రార్థించినను నోరనంటనియ్యనిమోవి కసిదీఱఁ గంట్లుగాఁ గఱచికఱచి
వేఁడుకొన్నను గేలు వేయనియ్యనిగుబ్బ లాసదీఱఁగఁ బట్టి యలమియలమి
యడుగుకొన్నను మొగంబిడనీని చెక్కిళ్లఁ బ్రేమదీఱఁగ ముద్దుపెట్టిపెట్టి

తే. వారుణీరసపానవికారమత్త, ఖండితావార్యరతిసౌఖ్యకలన గాంచి
పల్లవులు మెత్తు రత్తఱిఁ బ్రాణబంధు, వగుట నిదియాసవాహ్వయం బయ్యెననుచు.

వ. అట్టినిశాసమయంబున నప్పురూరవుండు. 189

సీ. ఘనతరస్తంభసంఘటితమాణిక్యముల్ దీప్తదీపావళీస్థితి వెలుంగ
వాతాయనాయాతవాతపోతంబులు చామరవిక్షేపసౌఖ్య మొసఁగ
నపరంజిమెఱుఁగు నిద్దపుఁగీలుబొమ్మలు పరిచారికలరీతిఁ బనులుసేయ
ముత్యాలపంజరమ్ములఁ గీరశారికల్ శృంగారకథలు వచింపుచుండ
తే. వజ్రసోపాననీలకవాటచంద్ర, కాంతకుట్టిమమరకతఖచితకుడ్య
పుష్పరాగవితర్దికాస్ఫూర్తినధిక, సుందరంబైన కేళికామందిరమున. 190

చ. పగడపుఁగోళ్లు వజ్రములపట్టెలు నైకపుఁబట్టుపట్టెడన్
జిగిబిగినైన యల్లికవిచిత్రపటావృతహంసతూలికన్
మిగుల రహించుపానుపున నించినజాజులు గానరాఁ బయిన్
దగువలిపంపురాజదుపధానము గల్గినశయ్యమీఁదటన్. 191

తే. పవ్వళించినఁ దన్మనోభావ మెఱిఁగి, ప్రౌఢనెచ్చెలు లుర్వశిఁ దోడితెచ్చి
యమ్మహారాజుసన్నిధి కనిపి రపుడు, మణితులాకోటినిక్వణక్వణన మెసఁగ. 192

క. లోలాక్షి ప్రోషయయ్యును, బాలికయునుబోలె సత్రపామందగతిన్
డోలాయమానమానస, యై లోపలికరిగె మోహమట్టిద కాదే. 193

క. వచ్చినఁ గనుఁగొని గొబ్బున, గ్రుచ్చి కవుంగిటను జేర్చి కోర్కులు మదిలోఁ
హెచ్చఁగ శయ్యకుఁ దార్చి శ,రచ్చంద్రనిభాస్యమనసు రంజిలఁ బల్కెన్. 194

సీ. తరుణి నీముఖచంద్రదర్శనాపేక్షఁ జూపులకుఁ బున్నమ యొక్కప్రొద్దు లాదవె
నతివ నీమధురవాగమృతపారణవాంఛ శ్రుతులకు నిరశనవ్రత మొసంగె
నాతి నీపరిరంభణస్వర్గభోగేచ్ఛ దేహంబునకుఁ దపస్స్థితి ఘటించెఁ
జాన నీపొందుబ్రహ్మానందగతిరతి నెమ్మది కద్వైతనిష్ఠ పొదమె
తే. నని తదాసక్తి నయనకర్ణాంగమాన,సములు నీయందఁ జేర్చు నామమత దెలిపి
మొగముచూపి భాషింపుచుఁ బిగువుకౌఁగి,లిచ్చి కలసి కావింపు మభీష్టసిద్ధి. 195

ఉ. చన్నులు పద్మకోశములు చక్కనిచేతులు పల్లవాకృతుల్
సెన్నుదు రర్ధచంద్రరమణీయము ముష్టికరప్రమాణతన్
జెన్నగు మధ్య మంగములచే భరతాభినయం బెఱుంగనౌ
చున్నది నిన్నుఁ జూచినఁ దలోదరి యాటకు జాణవౌటనో. 196

సీ. నీదులావణ్యాంబునిధిలోనఁ జూపులు మునిఁగి తేలవు చూడ ముద్దుగుమ్మ
నీదుచన్గొండల నెత్తమ్ములకుఁ బ్రాఁకి దిగలేదు భావమోయిగురుఁబోఁడి
నీకటాక్షశరార్తి నెమ్మేను మ్రాన్పడి తెలివినొందదుగదే జలదవేణి
నీయధరామృతశ్రీ యానఁదవిలి నాలుకదాహమణఁగదు లోలనయన
తే. నీవు కౌఁగిటఁ జేర్చి మన్నింపకున్న, భామ నీచక్కఁదనమె నాపాలిటికిని
జాలియున్నది విరహాగ్ని పాలుపఱుప, నించుపలుకానిగుణదోష మెంచనేల. 197

వ. అని మఱియు నర్మమర్మవచనప్రసంగవశంబునఁ గురంగనయనయంతరంగంబు రాగ
రసతరంగితంబయి కరంగం బలుకుచుఁ గౌఁగిలించునప్పుడు. 298

ఉ. ఆయతమోహనాంగు మెఱుఁగారెడుకన్నులకోద్దిఁ జూచి యా
హా! యిటువంటి నీచెలిమి యబ్బక యీవఱదాఁక నూరకే
పోయె నయో దినంబులని పొక్కుచుఁ జేర్చె లతాంగి బాష్పధా
రాయుత మైనమో మతనిరాజితహారభుజాంతరంబునన్. 299

ఉ. భూదయితుండు కౌఁగిటను బొందుగఁజేర్చ సుఖించి పూర్వరా
గోదితతాప మప్పతికి నొయ్యనఁ దెల్పుచు వెచ్చనూర్చి త
త్సాదరణోక్తి వెండిఁ బ్రియమందఁగ మోదములోన ఖేదముల్
ఖేదములోన మోదము సఖీమణి మోమునఁ దోఁచు వింతయై. 200

వ. తత్సమయంబున. 201

తే. అంబుజాక్షి నితంబబింబాంబరంబుఁ, దివిచి లేఁగొను నివిరి మోదించె నతఁడు
హైమవేదికఁ దనరు సింహాసనంబుఁ, గొనిన కైవడి మి న్నందికొనినరీతి. 202

తే. విభుఁడు తమకించి కటిచీర వీడఁదివియ, నంబరము లేక యును విలాసాంగిమధ్య
మంబరం బున్నయట్లుండె నదరి చెదరు, నాయముల సిగ్గు నిలుపలే దాయెఁగాని.

వ. అయ్యవసరంబున. 204

మ. కృతసంపర్కమనోజ్ఞహారలతికాశ్రీరోమరేఖాసితా
సితమై బంగరుతాళి మేల్పసిమితోఁ జెన్నొందుశోభాసమ
న్వితకాంతాకుచమధ్యమం బనుత్రివేణీసంగముం జొచ్చి భూ
పతిసంకల్పము కాంచె మన్మథపరబ్రహ్మైక్యతానందమున్. 205

వ. విభునివిలోకనంబు లరవిందదళాయతనేత్రకౌనునం
దభినతసౌఖ్యలీలల విహారము సల్పి కటిస్థలంబుపై
రభసము తోడ వ్రాలె నొనరన్ సుకృతానుభవంబు చెల్లిన
న్నభముననుండిభూతలమునంబడుమానవుతోడ నుద్దియై. 206

వ. అప్పుడు. 207

తే. తరుణినడుమున ఖేచరత్వము వహించు,వనితకటియందు భూచరత్వంబు దాల్చు
రమణినాభిఁ బాతాళచరత్వమభ్యసించు నవ్విభుచూపు లచ్చెలువఁ గదిసి. 208

సీ. ఎదురుకోలుఘటించె నితరేతరప్రఫుల్లాంబకాంభోజదృగంచలములు
వాద్యఘోష మొనర్చె పరరత్నకింకిణీకంకణకిణిఝుణత్కారణరవము
మంగళసూత్రసంపద దెల్పెఁ బతిచేయు లలితాంగికంఠావలంబనంబు
తలఁబ్రాలముత్తియంబులయంద మొందె జల్లలరాలు కచపుష్పసముదయంబు
తే. పలుకులగ్నాష్టకము లయ్యె గళరవములు, పొత్తులభుజింపువేడుక పొలపుదాల్చెఁ
బక్వబింబాధరామృతపానలీల, తన్మిథునకేళిపరిణయోత్సవమునందు. 209

సీ. గమకముల్ చూపి ధైర్యము గలంగించిన గుబ్బల నఖపఙ్క్తిఁ గోలఁదిఁ గ్రుమ్మి
నోరూరఁ జేయుచు నాఁడిబెట్టిన మోవి క్రొవ్వాఁడిపల్మొనలనొక్కి
మకరరేఖలఁ బొల్చి మదనవేదనఁగొల్పు కొమరుఁజెక్కులఁ జపేటములఁబెట్టి
యాలంబనరసాప్తిఁ జాలసుక్కించిన గాత్రంబు భుజములఁ గట్టివైచి
తే. ముందు విరహాంబురాశిలో ముంచిముంచి, యలఁతఁబెట్టిన యలివేణియంగకములఁ
జలముసాధించె నారాజచంద్రుఁ డిట్టు, లెంత చేసిన వారికి నంత గాదె. 210

తే. పడఁతిపాదప్రపాదసంస్పర్శనంబు, పద్మకచ్ఛపలాభంబుపగిదిఁ దోఁచె
దోఁచదే శంఖసీలముల్ దొరకినట్లు, రతిగళకచాప్తియారాజరాజునకును. 211

సీ. యుగపత్ప్రచుంబితాన్యోన్యవీటీసుగంధాధరపుటచూత్కృతాభిరామ
మేకదాసంవీక్షితేతరేతరముఖవ్యాకోచనిర్నిమేషాంబకంబు
సాంగత్యకూజితాంచత్పరస్పరకంఠమణితస్వనావ్యక్తమధురిమంబు
సమకాలగాఢబద్ధమిథోభుజాజహదంకపాళీమిళదవయవంబు
తే. సహనటద్వంద్వసమరతిసమయచటుల, జవపునపునరాఘాతశబ్దరచిత
తాళమానంబు తత్సురతంబు మిగుల, సౌఖ్యకరమయ్యె నన్నెఱజాణలకును. 212

ఉ. ఎక్కడనంటినం గళలయిక్కువ లెక్కడముద్దువెట్టినన్
మక్కువచే గగుర్పొడుపు మర్మములెట్లు నఖాంకురంబులన్
నొక్కిన గాటపుందమియు నొవ్వనివైమఱ పెద్దిపల్కినం
జక్కెరవిల్తుమంత్రములు చానకు నానృపుతోడికూటమిన్. 213

వ. అప్పుడు. 214

సీ. మనసిజబాణముల్ దొనలఁ జేరె ననంగ లీలఁ గన్నులు ముకుళీభవించెఁ
కందర్పచాపవిక్రమ మణంగెననంగ భ్రూలతావిభ్రమంబులు దొలంగె

విరివిల్తుమూఁకలు విఱుగుచూపె ననంగఁ గ్రొమ్ముడివీడి ముంగురులు చెదరె
దర్పకతూర్యనాదము లణంగె ననంగ మణిభూషణధ్వనుల్ మట్టుపడియె
తే. నావిలాసిని నవసురతావసాన, సమయజగ్లాని సౌమ్యభావము వహించె
వర్తమానపరాభవావస్థ నున్న, చిలుకతేజీవజీరునికలకతోడ. 215

ఉ. ప్రాయపుదంపతుల్ బెగడుపాటున నొండొరుఁ గౌఁగిలించి యా
హా యిదె తెల్లవారెఁగద యంచుఁ బునారతివాంఛ నర్మవా
చాయుతిఁ దావులంటుచు వెసం దమిరేఁచి రమింపఁ గొక్కురో
కోయని తామ్రచూడములు కూయఁదొడంగె నడంగెఁ జీకటుల్. 216

చ. అపుడు తమంబుచొప్పుఁ దెలియన్ సమయోచితవేషధారియై
తపనునియాజ్ఞఁ గైకొని ముదంబున వేగున కేగుదెంచు దూ
తపగిదిఁ జూడనొప్పె నుదితంబయి తూర్పున వేగుచుక్క యా
నెపమునన్ తదాఖ్య ధరణిం బ్రతిపాదితమాట దానికిన్. 217

సీ. సురతవిముఖతచేసోలుపద్మినికి శంకిని మహోత్సాహంబుఁ గీలుకొలిపి
వగలఁ గుందెడుచక్రవాకంబులకుఁ జకోరంబులయుల్లాసరస మొసంగి
స్వపరజాగ్రద్వధూచాతుషంబులకు దీపములశోణద్యుతి పాదుకొల్పి
వసివాడుదేరియున్నసరోజరాజికిఁ గుముదసౌభాగ్యంబుఁ గుదురుపఱిచి

తే. యానిదురమబ్బు శంకిని కావిచార, దశచకోరకములకు నాథవశిమంబు
దీపికల కానిమీలనస్థితికుముద్వ,తికినిఁ గల్పించె సమయమాంత్రికవరుండు. 218

మ. జలజాతాహితుతో రతిం బెనఁగుచో సయ్యాటపున్ రాపుచే
ట్లలఁ జెల్లాచెదరైనహారగుళికాజాలంబు తా వేకువం
దొలఁగం జూచుచు నేఁటి పుచ్చుకొనియెం దోడ్తో నిశాలీనకుం
తల యన్నట్లపరూపతం బొరసె భ్రాంతస్సాంద్రతారావళుల్. 219

ఉ. వీచెఁ బ్రభాతవాత మరవిందవనంబుల మేలుకొల్పుచుం
దోఁచె విటీవిటావలికిఁ దుందుడుకుల్ విడలేనికూర్ములన్
సాఁచె మయూఖమాలి కరశాఖలు పూర్వనగంబుచెంతఁ జె
య్యాఁచె మనోభవుండు విరహార్తుల నొంచుట మాని శాంతుఁడై. 220

ఉ. సరసీకేళిగృహంబునం గుముదినీసంభోగలీలన్ నిశా
కరుఁ డాత్మప్రతిబింబసంభమున వేడ్కల్సల్పి తాఁజోడువా

సరుగఁ ఖిన్నతనొందెఁ గైరవిణి తా నంతంతకున్ వెల్లనై
జరిగెం బొం దెడలైనదంపతులకుం జాలాట యాశ్చర్యమే. 221

క. దధిమథనఘుమఘుమధ్వని, యధికంబై వల్లవీగృహంబులఁ జెలఁగెన్
మధుకరవేణీకంకణ, మధురఝణత్కారమిళితమసృణం బగుచున్. 222

సీ. వనవాటికలయందు వరవిహంగవిహంగసమాజకూజితకలరవంబు
ప్రాసాదములయందుఁ బాఠకోద్గీతభూపాళాదిగీతికాబహుళరవము
గోస్థానములయందు గోపకాహ్వానోత్సుకారంభసురభికాంభారవంబు
నళినాకరములందు నవనవోత్ఫుల్లారవిందబృందచలన్మిళిందరవము
తే. స్నానఘట్టంబులందు మజ్జనవిధాన, నిరతవిశ్వంభరామరనికరపఠిత
సుప్రసిద్ధాఘమర్షణసూక్తరవము, శ్రావ్యమైయొప్పె నయ్యుషస్సమయమునను. 223

తే. వనజబంధుండు దనుఁ జేరవచ్చునపుడు, ప్రథమదిక్సీమ రాగసంపద వహించె
ననఘు లగువారు దనయింటి కరుగుదేరఁ,గోరి యనురాగ మందనివారు గలరె. 224

మ. నలినీపుణ్యఫలంబు కోకమిథునానందాలవాలంబు ది
గ్వలయాలంకరణంబు మోక్షపదవీఘంటాపథం బంబర
స్థలమాణిక్యము బ్రహ్మవిష్ణుశివతేజఃపుంజ మాపాసకో
జ్జ్వలనిక్షేపము భానుబింబము ప్రకాశం బయ్యెఁ బ్రాచీదిశన్. 225

సీ. కమలాసనమున సాకల్పహేమాంగుఁడై యాత్మమండలములో హరి వెలుంగఁ
బెంపుతో మాఠరపింగళోద్దండారిపారిపార్శ్వకకోటి బలసికొలువ
సౌరసూక్తముల సంస్తవము గావింపుచు వాలఖిల్యాదులు మ్రోల నిలువ
గరుడాగ్రజుఁడు హరిద్ధరిసప్తకంబును ఛాత్కారరవముతోఁ జబుకుసేయ
తే. హృద్యగంధర్వమర్దళవాద్యరంజ,కాప్సరోనాట్యసంరంభ మతిశయిల్ల
రుచిరరత్నవిమానసంరూఢుఁ డగుచు, నుదయగిరిశృంగమునఁ బొల్చె నుష్ణకరుఁడు.

తే. పూర్వపశ్చిమదిగ్భాగముల నలంకృ,తంబులై సూర్యశశిమండలంబు లపుడు
హరుని తేరికి బండికండ్లైననాఁటి, చంద మిటువంటిదని తెల్పె జగములకును. 227

వ. అట్టిప్రభాతకాలంబునందు. 228

ఉ. చెక్కులచుంబనాంకములు చెందొగచాయల మోవిమీఁది ప
ల్నొక్కులు నిద్రదేరెడుకనుంగవ పీడినకీలుగంటునుం
జిక్కులు వడ్డహారములు సిబ్బెపుగుబ్బల గోటినాటులా
చక్కెరబొమ్మకున్ రతిరసస్ఫుటచిహ్నము లొప్పె వేకువన్. 229

సీ. ఎడఁబాయలేమి ననిచ్ఛతో లేచుచు మోహాప్తి నిడుకొన్నముద్దుసొగసు
మఱుఁగుగా నవ్వల మరలవీడిన నీవి ముడిగొల్పి పయ్యెదయిడినసొబగు
పిఱుఁదుపై వ్రాలెడు నెఱికురు లసదుగాఁ గొని కేలఁబొదివిన కొప్పువింత
పదముల జాళువాపావాలు దొడివి చప్పు డెఱుఁగరాకుండ నడుచుహొయలు
తే. కని కరంగెడువిభుని నెమ్మనము నపుడు, ముదితరాగరసాంబుధి ముంచి యెత్తె
మరలి చూచిన సురతజాగరపుఁగెంపు, నిగ్గుఁ గనుచూపుచే శయ్యడిగ్గి చనుచు. 230

సీ. చెలువకౌఁగిటినొక్కుచే నెద నేర్పడ్డ నవరత్నహారచిహ్నములతోడఁ
బూఁబోఁడిచుంబనంబులఁ జెక్కులంటిన తాంబూలరసరక్తిమంబుతోడఁ
గొమ్మ కన్నులనద్దుకొనుటచే గళమునఁ గనుపట్టుకజ్జలాంకములతోడ
ముదితపల్లొత్తుల మోవిపైఁ జెలువొందు సరసంపుఁగెంపులవరుసతోడ
తే. మెలఁత మొనగోటినాటుల మిగుల నంద, గించు సందిళ్ళచంద్రరేఖికలతోడ
మొదలిచెలువంబునకు వింతమురిప మెసఁగఁ, గేళిసదనంబు వెడలి భూపాలకుండు.

వ. స్నానసంధ్యాద్యనుష్ఠానంబులు నిర్వర్తించి నిత్యోచితదానంబుల మహీసురసంతర్ప
ణంబు గావించి షడ్రససంపన్నంబు లయినభక్ష్యభోజ్యచోష్యలేహ్యపానీయంబులం
దృప్తుండయి కిరీటకుండలగ్రైవేయకేయూరకంకణోర్మికామేఖలాంగదాదిదివ్యమణి
ఖచితజాంబూనదాభరణమనోజ్ఞదుకూలాదుల నలంకృతుండయి సామంతమంత్రి
పురోహిత సేనానాయకవిద్వత్కవివందిమాగధవిలాసినీపరిచారికాదులు నిజాధి
కారానుగుణంబుగాఁ గొలువుసేయరాజ్యభారధురంధరుండయి యుండె నయ్యుర్వ
శియు శుద్ధాంతమందిరంబున సఖీసహస్రసంసేవితయై మజ్జనభోజనాదు లనుభవిం
చుచు నుచితంపువిధంబున మెలంగుచుండె నవ్విధంబున నయ్యుర్వశీపురూరవ
స్సు లిష్టోపభోగంబుల నిరతసురతక్రియాసౌఖ్యంబులం దేలుచు. 232

క. షేడల మెలఁగుచుఁ బొన్నల, నీడలఁ జెలఁగుచు నటద్వనీతటపుళిన
క్రీడలఁ దనరుచు నింపగు,జాడల నలరుదురు వారసతియుం బతియున్. 233

ఉ. ఒక్కనిమేషమైన నొకరొక్కరిమోములు చూడకుండినన్
మిక్కిలి జాలినొందుదురు మేనులుజీవము లొక్కరూపుగా
మక్కువలం దలంపుదురు మాటికి వెన్నవలెం గరంగుచున్
సొక్కుదు రొండొరున్ దనువుసోఁకిన వారలమోహ మెట్టిదో. 234

మ. జననాథాగ్రణికిన్ లతాంగికి యథేచ్ఛక్రీడలన్ నిత్యనూ
తనహర్షాప్తియె కాని నెమ్మది విషాదం బింతయున్ లేదు లే

దననేఁగా కల దొక్కవేళ భరితప్రాంచన్మణీహారపుం
జనిరోధాంతరితోపగూహముల నిచ్చున్ ముచ్చటల్ దీఱమిన్. 235

క. ఇవ్విధమున నవ్వేఁలుపు,జవ్వనియును నవ్విభుండు సరివలపులతో
నివ్వటిలం బువ్విలుతుని, యవ్వింతలఁ గొంత కాలమట్లు మెలఁగఁగాన్. 236

ఇంద్రునిపంపున గంధర్వులూర్వశికై భూలోకమునకు వచ్చుట.

ఉ. అంతట నొక్కనాఁడు దివిజాధిపుఁ డయ్యమరావతీసభా
భ్యంతరసీమయందుఁ గొలువై బలువైభవమొప్ప నృత్యమ
త్యంతనిరూఢి నప్సరసలాడఁగ జూచుచు నుండె నండ య
క్కాంతల నందఱం గలయఁగన్గొని యుర్వశి గానరామికిన్. 237

తే. తగవిచారించి యచటిగంధర్వవరులఁ, బిలిచి నాఁడూర్వశిని ధరాస్థలికినంపి
తిమిగదా నాఁటనుండియుఁ దిరిగిరాక,యుండఁ గారణమేమి భూమండలమున. 238

క. అనవుడు గంధర్వులు త, ద్వనితావృత్తాంత మెల్లఁ దనతోఁ దెలుపన్
బని యేయుపాయమున నై, నను గోమలిఁ దోడితెండు నాకంబునకున్. 239

ఆ. అని యనుజ్ఞసేయ నవనికి నేతెంచి, యుర్వశియు నృపాలుఁ డున్నయట్టి
చెలిమిఁగాంచి యెడలు సేయుటకై వేళ, గాంచి యుండి రప్రకాశవృత్తి. 240

ఉ. ఆయెడ నొక్కనాఁటినిశియందుఁ దటాంతనికుంజపుంజపు
ష్పాయతదివ్యగంధమిళితాగతవాతపరంపరన్ సుఖ
శ్రీ యెసఁగంగ నొక్కనదిచెంతను సైకతవేదికాస్థలిన్
బ్రేయసియున్ బ్రియుండు గడుఁబ్రేమలఁ గొందలిరాకుశయ్యపై. 241

వ. ఉన్నయెడ. 242

క. కుసుమశరశాస్త్రవిద్యా, రసికతఁ జౌషష్టికళలఁ బ్రౌఢిమఁజూపెన్
ముసిముసినగవులు మొగమునఁ, బ్రసరింపఁగ యువతి యుపరిరతులం బతికిన్. 243

కవిరాజవిరాజితము:—

ముడిచినపువ్వులు జల్లలరాలఁగ మూపునవ్రేలెడుక్రొమ్ముడియున్
గడుసుజనుంగవ జవ్వడువన్ గడుగంపము నొందెడుహారములున్
నడుము వడంక మృదుధ్వని నుత్పతనంబులు సల్పెడు బల్పిఱుఁదుం
బొడగని సొక్కె విభుండు కళావతిపూరుషభావరతిక్రియలన్. 244

క. సమకాలసుఖజలోదయ, శమితస్మరయుద్ధతంత్రసన్నాహములన్
రమణియు రమణుఁడు సొక్కన,నమరంగనుమూఁగుచున్న యాసమయమునన్. 245

తే. సమయభంగంబునకు నిదిసమయమనుచు, దవిలి తఱిచేచి యున్నగంధర్వవరులు
వారి కనతిదూరంబున వరసఖీజ, నోపకంఠంబునను గట్టియున్నయట్టి. 246

ఉ. మేషయుగంబుఁ బట్టుకొని మెల్లనె పోనవి భీతిఁ గూయఁ ద
ద్ఘోషము వీనుసోఁకిన దిగుల్గొని గొబ్బున లేచి తీవ్రసం
భాషల లెమ్ములెమ్ము నరపాల తగళ్ల మరల్పు దొంగలన్
భీషణశక్తిఁ దోలు మని ప్రేయసి వల్కఁగ నిద్రమబ్బునన్. 247

తే. లేవకుండిన రోషంబు లేదునీకు, దెగడి నేమొఱవెట్టంగ మగతనంబు
దక్కి వినియును విననిచందమున నున్నఁ, వాఁడ వెంతైననిటువంటివారు గలరె. 248

క. కూరిమి బిడ్డలవలెఁ బ్రియ, మారఁగ నేఁబెంచుకొన్న యట్టితగళ్ళం
జోరులపాల్పఱచితి నీ, వీరత్వము నమ్మి యింకవేయననేలా. 249

మ. అని యక్కోమలి దూఱనాడుపరుషవ్యాహార మేపాటి సోఁ
కెనొ కర్ణంబుల వ్రేటువడ్డపులిభంగిం దిగ్గునన్ లేచి య
జ్జననాథుం డదె పోకుపోకు మనుచున్ శాతాసివిక్షేపసం
జనితోద్యద్ద్యుతి యంధకార మణగించందూడె వేగంబునన్. 250

క. నిద్రాభంగవికారము, రౌద్రావేశమును విస్మరత యొదవింపం
దద్రాజమౌళి జఘనజ, హద్రాజితవస్త్రుఁడగుచు నరిగె నెఱుఁగమిన్. 251

వ. అట్లు కదిసి. 252

క. దాకొని వడిగంధర్వుల, పైకిన్ లంఘించి వ్రేసెఁ బటుహస్తనట
ద్భీకరకరవాలమున భ,యాకులతఁ దగళ్ల విడిచి యవ్వల జరుగన్. 253

తే. తస్కరులమీఁద నుఱుకుచో ధరణివిభుఁడు, వీరరసమున భైరవాకారుఁ డయ్యె
నంతమాత్రమె కాదు వీతాంబరత్వ, కారణమునను భైరవాకారుఁ డయ్యె. 254

తే. అట్లు గంధర్వులను దోలి యూపొటేళ్లఁ, బట్టితెచ్చిన విభుఁగాంచి ప్రమద ప్రమద
మంది యెదఁజేర్చుకొనఁ బోయి యతనిమేనఁ, జీర లేమికిఁ గలుషితచిత్త యగుచు.

క. ఆలింగన మొసఁగని జవ, రాలంగని తెలిసి వేగ మంబరము కటిన్
జాలిఁ గట్టెడు నానృప, మౌళిం గలకంఠి వికలమతిఁ గనుఁగొనుచున్. 256

చ. పలికె నరేంద్రుతోఁ గుముదబంధుకులోత్తమ హీనుభంగి యి
ట్లలుకువలేక వస్త్రరహితాకృతి నాకడ నిల్వఁ బాడియే
యల సమయోక్తియుం దలఁపవైతివి పీడనిపొందు వీఁడుకో
వలసెఁ గదా యిఁకం గలలవంటివిగా వె ఋణానుబంధముల్. 257

క. నావలనఁ గొంతగలుగదు, నీవచనము దప్పె నింక నిన్న ననేలా
దైవకృతం బటువంటిది, భూవర నాకొఱకు వగలఁబొందకు మింకన్. 258

తే. పోయివచ్చెద దయయుంచుమీయటంచు, జనియె నుర్వశి చెలులుఁ దానునుయథేచ్ఛఁ
బ్రియునివలవంత మనసునఁ బెట్టదయ్యె, వారకాంతలవలపు లెవ్వరికిసతము. 259

తే. అపుడు కెలన నున్న యట్టిగంధర్వులు, కోమలాంగిఁ దోడుకొనుచుఁ జనిరి
ముదితశాపదోషమును మునుముచు లను, గ్రహము చేసినట్లు రహితమయ్యె. 260

క. అంతటఁ జింతాక్రాంత, స్వాంతుండై వంతనొందె వసుధాకాంతుం
డెంతయు నకటా వలచిన, యింతిం బాసినవిచార మింతనవశమే. 261

వ. అప్పుడు. 262

సీ. సింహాసనోపరిస్థితి యొల్లక లతాంగి తనుమధ్యసీమయందమె తలంచు
భూచక్రపరిపాలనోచితక్రియ మాని తఱలాక్షి పిఱుఁదుచందమె తలంచుఁ
ఘనకుంభకుంభివాహనకేళి చాలించి కలికిపాలిండ్లపొంకమె తలంచుఁ
జాపాస్త్రధారణాసక్తి లేక నెలంత భ్రూకటాక్షవిలాసములె తలంచుఁ
తే. గనకసంపద లార్జించుకాంక్ష విడిచి, యతివనిద్దంపుమేనిచాయలె తలంచు
నధిపుఁ డిబ్భంగి రాజ్యభోగాభిలాష, వదలి యేప్రొద్దుఁ దన్మయావస్థనొందు. 263

క. అసురసురని సొలయున్ రా,జసురేంద్రుఁడు మలయపవనుచలికసరునకున్
బిసరుహశరుశరవిసరపు, ముసురునకుం దడిసి కిసలములవిసరునకున్. 264

ఉ. కన్నులనీరునించుఁ బులకంబులు దాల్చు వహించుఁ గంపమున్
విన్నఁదనంబు నొందుఁ గడువిస్వరతం బలవించు ఘర్మబిం
దూన్నతిఁ జెందు ఱిచ్చవడి యుండును మూర్ఛిలు నంతనింతిపై
గొన్నటులైన లేచు వగఁగుందుచు భూపతి సాత్త్వికాప్తిచేన్. 265

వ. ఇవ్విధంబున నవ్విభుండు విరహవ్యాకులితచిత్తుండై పురంబు చొరనొల్లక యుర్వశి నన్వేషింపుచుండ నమ్మహీభర్తవర్తనం బరయుటకయి వచ్చి యచ్చేడియ యతని దైన్యం బవలోకించి యూఱడించుటకయి సరస్వతీతటినీతటంబున సఖీసమేత యయి పొడచూపిన. 266

ఉ. గుండియ జల్లు జల్లనియెఁ గోమలిఁజూడగఁ జూచినంతలోఁ
నిండె జలంబు కన్నులను నీకొఱకై యిటులున్నవాఁడ నో

యండజయానయంచుఁ దనయార్తత దెల్పుచుఁ బల్కుఁ బల్కులో
మెండుగఁదోఁచె గద్గదిక మేదినినాయకుకూర్మి యెట్టిదో. 267

తే. ఇట్లు కరుణంబు నొంది యయ్యింతిఁ గదిసి, వర్తులోత్తుంగదృఢకుచద్వంద్వలిప్త
చందనద్రవ మెదకాఁక చల్లఁజేయ, గాటముగఁ గాంక్షకొలఁదినిఁ గౌఁగిలించి. 268

వ. ఇట్లనియె. 269

ఉ. నామది నిన్ను జీవముగ నమ్ముటకా పగదానికై వడిం
గాముని కప్పగించితివి కట్టిఁడిదాన యజుండు నీమనం
బేమిటఁ జేసెనో యెఱుఁగ నింతదలంచినదాన వక్కటా
యేమిటి కింత నన్ను భ్రమియించితివే పయిపూఁతకూర్ములన్. 270

తే. మానవతి నీవు కట్టిఁడిమనసుదాన, వగుట నే నేల తెలియలే నైతి మున్ను
హృదయసీమాబహిర్గతాగేంద్రకఠిన, చణభవత్కుచకుంభముల్ చాటుచుండ. 271

క. కులుకుచు జిలిబిలిపలుకులు, పలుకుచు రసమొలుకుచూపు వదనాబ్జముపైఁ
జిలుకుచుఁ బలుమోననొక్కుల, నలుకుచు రతివేళఁ జొక్కుచుందువుతరుణీ. 272

క. వదలెను క్రొమ్ముడి వదలియు, వదలనిలజ్జాభరంబు వడికూటములం
గదలెను నడుమున గదలియుఁ, గదలనిచనుదోయి దలఁచి కరఁగెద రమణీ. 273

చ. పిలుపులయింపు ముద్దుగొను పెంపుఁ జనుంగవయుబ్బరింపుఁ జె
క్కుల చెమరింపు మైపులకగుంపు వదల్పనికౌఁగిలింపుఁ గ
న్నులయదలింపుఁ గీలుజడనొంపుఁ దలంపునవేడ్కనింపు నీ
కలయిక సొంపు నేమఱవఁగాఁగలనా కలనైనఁ గోమలీ. 274

మ. అని దైన్యోక్తుల దూఱుప్రాణవిభు నూఱార్చెన్ లతాతన్వి చుం
బనదానంబుల దంతబాహులతికాబంధంబులం జల్పితా
నునయాలాపములన్ జపాకుసుమకాంతుల్గుల్కు కెమ్మోవిక్రొ
న్ననమాధుర్యరసంపువిందులఁ గృతానందంబు లాపొందులన్. 275

వ. ఇట్లయ్యిందువదన రాజకందర్పు డెందం బానందంబు నొందఁజేసి యిట్లనియె. 276

మ. తగునే రాజకుమార మన్మథమనస్తాపంబుచే నింత నె
వ్వగలం బొందఁగ ధైర్యశాలివిగదా వారాంగనాస్నేహమో
హగుణంబుల్ చపలాయితాయతము లెంతైనన్ సతంబేలగున్
వగరే లోకులు నీమనం బిటులుమగ్నంబైన రాగాంబుధిన్. 277

ఉ. నీకడ నిన్నినాళ్లవలె నేవసియింపఁగరాదు దేవతా
లోకమునన్ సురేంద్రసభలో నిఁక నిచ్చలుఁ గొల్వుసేయుటన్
నాకడ కీవిభావరి సనన్ మఱి మీఁదటిరేయి రమ్ము సౌ
ఖ్యాకరవృత్తిఁ గూడఁగ నుపాయ మగుం జను మిప్పు డింటికిన్. 278

వ. అని మఱియుఁ బ్రియాలాపంబుల నూఱడించి యుర్వశి గంధర్వులం గలసి దేవలోకంబున కరిగెఁ బురూరవుండును నక్కలికిపలికినపలుకున కర్థంబు విచారించి యీరేయి గడపి తనకడకు వచ్చునది యని యాదేశించుటను దరుణిగర్భధారిణిగా నెఱింగి యొకదినంబు మితంబుసేయుట మనుష్యమానంబున సంవత్సరం బని తెలిసి ప్రతిష్ఠానంబున కరిగి యథోచితంబుగా రాజ్యపాలనంబు సేయుచు నుర్వశీవిరహితం బగుట భోగంబులయం దాసక్తిలేక వలసి వల్లమి ననుభవించుచుండె. 279

తే. అహములెల్లను దద్వధూహావభావ, మహురభివ్యక్తకృతముదావహములుగను
నిశలు దత్కుచపరిరంభనిర్భరసుఖ, కారణస్వప్నదశలుగాఁ గడపుచుండ. 280

క. ఏఁడయ్యె నొకదినంబొక, యేఁడై యరుగంగ మానవేంద్రున కదివె
క్కేఁడు లనితోఁచ రెండవ, యేఁడు ప్రవేశించె నతని కెలమియొసంగన్. 281

వ. అటనుర్వశియుం బురూరవఃకళాభరితప్రదీపితం బయిన గర్భంబువలన శుభముహూర్తంబున నవమోహనాకారుం డగునాయు వనుకుమారుం గాంచి గారవంబునఁ బెనుచుచుండె. 282

తే. అప్పు డతఁ డుర్వశీదర్శనాభిలాష, బుద్ధినేగుచుఁ గనకాద్రిప్రాంత వనవి
హారపరత సఖీయుక్త యగుచు వచ్చి, మెలఁగుచున్నట్టి యవ్వేల్పు మెలతఁ గాంచె.

క. ఆరమణియుఁ బ్రియ మగునుప,చారంబులఁ బ్రీతుఁ జేసి జనవల్లభుతోఁ
గూరిమి నిట్లను విను మొక, నేరుపు ననుఁ గలిసియుండ నీకెఱిఁగింతున్. 284

శా. నేగంధర్వుల యాజ్ఞచేఁ మెలఁగుచున్కిం జేసి నీతోడిసం
యోగక్రీడలఁ దొంటియట్ల మెలఁగన్ యుక్తంబుగా దింకనీ
వాగంధర్వుల వేఁడికొమ్ము వినయం బారంగ నట్లైన సం
భోగార్థంబుగ నీకు నిచ్చెదరు నన్ భూపాలచూడామణీ. 285

తే. అనుచుఁ బల్కిన నట్లకా కనుచు నాతఁ, డొక్కవిజనస్థలంబున నొక్కరుండు
పొసఁగఁ గూర్చుండి గంధర్వపుంగవులను, భక్తియుక్తి నుద్దేశించి ప్రస్తుతించె. 286

సీ. సంగీతరసవిలాసమునఁ గేశవశివబ్రహ్మల మెప్పించుప్రౌఢులార
చక్కఁదనంబున శంబరారికినైనఁ జాలమిపుట్టించుసరసులార

యణిమాదికములైన యష్టవిభూతుల సిద్ధులైనట్టి ప్రసిద్ధులార
యఖిలరాగంబులయందు హవిర్భాగభోక్తలై పెంపొందుపుణ్యులార
తే. కోరి మిమ్ము భజించెద గారవమున, నాకు మీరు ప్రసన్నులై నామనోర
థంబు లీడేర్పరయ్య గంధర్వులార, ధామధామాస్యవిజితగాంధర్వులార. 287

వ. అని మఱియు ననేకప్రకారంబులం బ్రస్తుతించిన దివ్యజ్ఞానసంపన్ను లయిన గంధర్వు లతని స్తవంబునఁ బ్రీతులయి యతనికిఁ బ్రత్యక్షంబయిన నతం డుర్వశి నిమ్మని యడిగిన వార లమ్మచ్చకంటి నిచ్చుట యుక్తంబుగా దనుతలంపున వయోరూపలక్షణాదుల నుర్వశింబోలియున్న యగ్నిస్థాలి యనునీలవేణి నిచ్చిన యవ్వసుంధరారమణుండు గంధర్వమాయామోహితుండయి యుర్వశియకా తలంపుచు నయ్యంగనం గయికొని దానితోఁ గొన్నిదినంబులు సురతసుఖం బనుభవింపుచునుండి యవ్వెలంది చేష్టితంబులు వేఱొక్కభంగి యగుటకు సంశయింపుచుం దనమనంబున. 288

ఉ. ఆసరసోక్తు లానగవు లానెనరూనినచూపు లామహో
ల్లాసరసాప్తి యాముఖవిలాసత యాహృదయానుగుణ్యలీ
లాసురతక్రియల్ మదిఁ దలంచిన నిచ్చెలియందుఁ గల్గవే
మో సుగుణాభిరామ యగునుర్వశిగాఁ దిది నిక్కమారయన్. 289

క. వంచించిరి గంధర్వు, లటంచుఁ దరుణి నచట నునిచి యాత్మపురికి నే
తెంచి ధర యేలుచుండె గు,ణాంచిత నుర్వశిఁ దలంచి యసురుసురనుచున్. 290

తే. అంతఁ ద్రేతాయుగము చొచ్చె నప్పు డతని, బుద్ధికామ్నాయములు కర్మబోధకంబు
లగుచుఁ ద్రివిధంబులై తోఁచ యాగవిధులు, తదనుగుణముగ నొనరించుతలపుతోడ.

సీ. వెడలియగ్నిస్థాలి కడకేగి యవ్వనంబున శమీగర్భసంభూతమైన
యశ్వత్థమును గాంచి యందరణులు రెండు గొని క్రిందనొక్కటి యునిచిమీఁద
నొకటి చేతులఁబట్టియురవడిఁ ద్రచ్చుచు నొనరఁ బూర్వారణి యుర్వశియును
దగనుత్తరారణి దానును నడుమఁ బుత్రుండుగాఁ దలఁపుచోఁ దొడరిమంత్ర
తే. ముచ్చరించుచు నుండ నం దుదయమయ్యె, హవ్యవాహుండు తనయుఁడై యప్పురూర
వక్షితీశున కిహపరావార్యసౌఖ్య, గరిమఘటియింపఁ జేయఁ దాఁ గర్తయగుచు.

వ. అట్లు సంజాతుండయిన వీతిహోత్రుని శాస్త్రోక్తప్రకారనిర్మితయాగశాలాంతకుండంబులం బ్రతిష్ఠించి వసిష్ఠాదు లయినమునిశ్రేష్ఠులు విశిష్టప్రకారంబునం దదనుష్ఠానంబు నడిపింప గోభూహిరణ్యరత్నాంబరాదినానావిధదానంబులఁదృప్తులం జేసి దీనార్థివ్రాతంబుల నభీష్టవస్తువులం దనిపి పరమేశ్వరుండు ననంతుండును నాశ్రితవత్సలుండును,

నఖిలజగత్కర్తయు నగు శ్రీమన్నారాయణస్వామిం గుఱించి యనేకయాగంబు
లొనర్చి సంతం బురందరప్రముఖదేవత లతనికిం బ్రసన్నులయి యభీష్టవరంబు
లొసంగి యుర్వశీకాముకుం డగుట నతనియభిప్రాయంబు దెలిసి యవ్విలాసిని
నతని కిచ్చి నరసురలోకంబుల యథేచ్ఛావిహారంబులం జరియించు నట్లు దివ్యత్వం
బొసంగి రంత. 293

తే. ధరణినాహవనీయంబు దక్షిణాగ్ని, గార్హపత్యంబు నన విభక్తములు చేసి
త్రివిధమున హోమవిధులు వర్తిల్లఁజేసెఁ, గర్మపరులకు సులభంబుగా నతండు. 294

క. తనకు వశంగతురాలై, యనవరతము, చెలులుఁ దాను నరమర లేక
త్యనుకూలత నయ్యుర్వశి, చనువున మెలఁగంగ మదనసౌఖ్యాన్వితుఁడై. 295

తే. పచ్చకపురంబువంటి సుపర్వభోగి, నీలలామంబుచనువు దక్కఁగాఁ గొనియెఁ
బంతమున నానృపాలుఁడు భాగ్యవంతు, డెంతఁదలఁచిన సఫలమా నిదినిజంబు. 296

సీ. వేదశాస్త్రపురాణవిదితమై గణుతింపఁ దగుసదాచారవర్తనమువలన
న్యాయార్జితములైన నవరత్నకనకసామజహయప్రముఖసంపదలవలన
మందారసుమహారిచందనామోదదివ్యాంగనాసురతభోగాప్తివలన
శ్రీవాసుదేవాంఘ్రిచింతనామృతధారఁ బొరయుబ్రహ్మానందపూర్తివలన
తే. గరిమధర్మార్థకామమోక్షము లనంగఁ, దగినపురుషార్థములు నాల్గుఁ దమకుఁ దామె
సిద్ధమైయుండ సంకల్పసిద్ధుఁ డనఁగఁ, ధారుణీచక్రమేలెఁ బురూరవుండు. 297

వ. అయ్యుర్వశీపురూరవస్సులకు నగ్రసుతుండయి జనియించిన యాయువునకు సహో
దరులయి క్రమంబున శ్రుతాయువును సత్యాయువును జయుండును విజయుండును
ననేవురు పుత్త్రు లుదయించిరి. తత్కుమారషట్కంబువలనఁ గ్రమక్రమంబునఁ
బుత్రపౌత్రాభివృద్ధియయి చంద్రవంశపారంపర్యంబు జగద్విదితం బయి వెలసె నని
సూతుఁడు శౌనకాదులకుం దెలిపిన నామహర్షులు పరమహర్షరసభరితహృదయు
లయి యతనిం బ్రశంసించిరి. 298

క. కవిరాజమనోరంజన, మవునన వక్తకును శ్రోత కతిశుభదంబై
భువి నాచంద్రార్కము కీర్తి వెలుంగఁ బురూరవశ్చరిత్రము దనరున్. 299

శా. శ్రీకాంతాకుచకుంభలిప్తసరసశ్రీగంధసత్సౌరభా
శ్రీకాంతాతతబాహుమధ్యరుచిరశ్రీవత్సవాణీధవ
శ్రీకంఠస్తుత శక్రవాయుతనయశ్రీదాదిసంసేవితా
శ్రీకారప్రతిమానకర్ణయుగళా శ్రీరాజగోపాలకా. 300

క. చక్రహితకన్యకాతటి, చక్రోత్పలపత్రఘటనచతురనతసుధీ
చక్రధరాచక్రధరా, చక్రధరాకీర్తిమగ్నచక్రధరార్ధా. 301

పృథ్వీవృత్తము:—
గదాకరముదాకరద్యుతివికస్వరా సుస్వరా
సదాశివపదాశివస్తనితశ్లాఘ్య కాభిఖ్యకా
గదాగ్రజపదాగ్రజత్రిపథగావనా పావనా
విదాహితమదాహితప్రకటవిక్రమాశుక్రమా. 302

గద్య. ఇది శ్రీమంగళాచల నృసింహకృపాప్రసాద సంప్రాప్త విద్యావైభవ కనుపర్తి రామనమంత్రితనూభవ సుజనహితకృత్య నిత్యాబ్బయామాత్యప్రణీతం బయిన కవిరాజమనోరంజనం బనుమహాప్రబంధంబునందు సర్వంబును బంచమాశ్వాసము.

కవిరాజమనోరంజనము సంపూర్ణము.

చెన్నపురి: శ్రీ 'రామ' ప్రెస్సున ముద్రితము—1929.